
'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 270

గురువారం 13-6-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మరో గెలుపుతో ముందుకు

అమెరికాపై గెలిచి 'సూపర్‌-8' దశకు భారత్‌ అర్హత - 12లో



సంస్కరణలు కొనసాగుతాయ్‌

వికసిత భారత్‌ దిశగా అడుగులు వేస్తామన్న నిర్మలా సీతారామన్‌ - 13లో



నేడు ఇటలీకి మోదీ

జీ–7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ఇటలీకి బయల్దేరనున్నారు.

వివరాలు 6లో ▸



ఒడిశా సీఎంగా మాఝీ ప్రమాణం

నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గిరిజన బీజేపీ నేత మోహన్‌ చరణ్‌ మాఝీ ఒడిశా రాష్ట్ర నూతన సీఎంగా ప్రమాణం చేశారు.


వివరాలు 6లో ▸



వయనాడ్‌? రాయ్‌బరేలీ?...

వయనాడ్‌, రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానాల్లో ఏది వదులుకోవాలో తేల్చుకోలేకపోతున్నానని కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పారు.

వివరాలు 6లో ▸



స్పీకర్‌ ఎవరికో?!

అందరి కళ్లూ లోక్‌సభ స్పీకర్‌ పదవిపైనే ఉన్నాయి. ఎన్డీఏ కీలక భాగస్వామి టీడీపీతో పాటు జేడీ(యూ) ఆ పదవిపై కన్నేశాయి.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్‌

నేటి నుంచి స్కూళ్లు పునఃప్రారంభం



వేసవి సెలవుల అనంతరం రాష్ట్రంలోని పాఠశాలలు గురువారం తెరుచుకోబోతున్నాయి. మొత్తం 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయి. కేంద్రీయ విద్యాలయాలు ఈ నెల 21న, నవోదయ విద్యాలయాలు 30న ప్రారంభం కానున్నాయి.

వివరాలు 5లో ▸

15 నుంచి విస్తారంగా వర్షాలు



ఈ నెల 15 నుంచి రుతుపవనాలు చురుకుదనాన్ని సంతరించుకోనున్నాయి. కోస్తాంధ్రలోని మిగిలిన ప్రాంతాలకు, ఒడిశా, వాయవ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. ఫలితంగా ఈ నెల 15 నుంచి రాష్ట్రంలో విస్తారంగా వానలు కురవనున్నాయి.

వివరాలు 12లో ▸

రైల్వే సిగ్నల్స్‌ను ట్యాంపర్‌ చేసి.. రెడ్‌ సిగ్నల్‌ వేసి దోపిడీ



కావలి–శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తులు రెండు రైళ్లలో దోపిడీకి పాల్పడ్డారు. రైల్వే సిగ్నల్స్‌ను ట్యాంపర్‌ చేయడం ద్వారా రెడ్‌ సిగ్నల్‌ వేసి రైళ్లను నిలిపి దోపిడీకి పాల్పడ్డారని రైల్వే పోలీసులు చెప్పారు.

వివరాలు 5లో ▸

సీఎం ముఖ్యకార్యదర్శిగా రవిచంద్ర



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా సీనియర్‌ ఐఏఎస్‌ అధికారి ముద్దాడ రవిచంద్రను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌ కుమార్‌ ప్రసాద్‌ బుధవారం ఉత్తర్వులిచ్చారు. తక్షణం బాధ్యతలు తీసుకోవాల్సిందిగా రవిచంద్రను ప్రభుత్వం ఆదేశించింది.







రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, మంత్రిగా పవన్‌కళ్యాణ్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్‌ నజీర్‌. చిత్రంలో ప్రధాని మోదీ

కొలువుదీరిన కొత్త మంత్రివర్గం

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు

- ఉదయం 11.33 గంటలకు ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్‌ అబ్దుల్‌ నజీర్‌
- మంత్రులుగా ప్రమాణం చేసిన పవన్‌ కళ్యాణ్‌, లోకేశ్‌
- మరో 22 మంది మంత్రులుగా ప్రమాణం
- హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్‌ షా సహా పలువురు కేంద్ర మంత్రులు
- చిరంజీవి, రజనీకాంత్‌ సహా పలువురు సినీ ప్రముఖులు హాజరు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నూతన మంత్రి వర్గం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, మంత్రులుగా మరో 24 మంది బుధవారం ఉదయం ప్రమాణస్వీకారం చేశారు. గన్నవరం ఐటీ పార్కు వద్ద కేసరపల్లిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముందుగా చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం పవన్‌ కళ్యాణ్‌, నారా లోకేశ్‌ సహా టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, రజనీకాంత్‌, చిరంజీవి సహా పలువురు సినీ స్టార్లు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రధాన వేదికపై ప్రధాని మోదీ, గవర్నర్‌ అబ్దుల్‌ నజీర్‌ దంపతులు, చంద్రబాబు దంపతులు ఆశీనులయ్యారు. వేదికకు ఎడమ వైపు

మిగతా 2వ పేజీలో ▸

సీనియర్లకు నిరాశే

గంటా, కళా, అయ్యన్న, గోరంట్ల, జ్యోతులకు మంత్రివర్గంలో దక్కని చోటు

ప్రత్తిపాటి, సోమిరెడ్డి, కోట్ల, పరిటాలకు నో ఛాన్స్‌

- జూనియర్లు, కొత్త వారి వైపు మొగ్గు చూపిన చంద్రబాబు
- 24 మందిలో తొలిసారి మంత్రులుగా 17 మంది
- ఎన్నికలకు ముందు పార్టీలో చేరి మంత్రి అయిన పార్థసారథి
- ఎమ్మెల్యేగా గెలిచినా సుజనా చౌదరికి మొండి చేయే

13లో

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సగం కూడా దక్కలేదు



- వైఎస్‌ జగన్‌ మంత్రివర్గంలో వారికి 17 మంత్రి పదవులు
- బాబు కేబినెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 12 మంత్రి పదవులే
- సొంత సామాజిక వర్గానికే బాబు ప్రాధాన్యం.. రెడ్డి వర్గానికి నిరాశే..
- కమ్మకు 5, కాపులకు 4, రెడ్డి వర్గానికి కేవలం మూడే

- వివరాలు 13లో

అటు ప్రమాణం.. ఇటు విధ్వంసం

రాష్ట్రవ్యాప్తంగా రెచ్చిపోయిన టీడీపీ శ్రేణులు



శంకరనగరంలో టీడీపీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడిన నాగసునీల్‌రెడ్డి

- ప్రభుత్వ భవనాల పేరు మార్పు
- శిలాఫలకాల ధ్వంసం.. విగ్రహాల కూల్చివేత
- ప్రభుత్వ ఆఫీసులపై టీడీపీ జెండాలు
- వైఎస్సార్‌సీపీ జెండాదిమ్మెల ధ్వంసం
- నెల్లూరు జిల్లా శంకరనగరం సర్పంచ్‌పై మారణాయుధాలతో టీడీపీ దాడి
- సర్పంచ్‌ సహా ఆరుగురికి గాయాలు
- వీరిలో ముగ్గురికి తీవ్రగాయాలు
- సర్పంచ్‌ ఇంట్లో సామగ్రి ధ్వంసం

5లో



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి. చిత్రంలో ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, రఘునాథరెడ్డి, మోపిదేవి వెంకటరమణ, గొల్ల బాబూరావు, గురుమూర్తి, తనూజరాణి

యథేచ్ఛగా హింసాకాండ.. ఇదేమి రాజ్యం?

వైఎస్సార్‌సీపీ ఎంపీల ధ్వజం.. ఏపీలో అరాచక శక్తుల స్వైర విహారం

- ఆటవిక పాలనకు బాబు నాంది
- ప్రమాణ స్వీకారానికి ముందే దాడులకు ఉసిగొల్పారు
- ప్రమాదంలో ప్రజాస్వామ్యం.. కేంద్రం తక్షణం జోక్యం చేసుకోవాలి
- రాష్ట్రపతి, ప్రధాని, హోంమంత్రి, ఎన్‌హెచ్‌ఆర్సీ కార్యాలయాలకు లిఖితపూర్వకంగా ఎంపీల ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో కొద్ది రోజులుగా అరాచక శక్తులు సాగిస్తున్న హింసాకాండను చూస్తుంటే టీడీపీ కార్యకర్తలా? గూండాలా? అన్న ప్రశ్న తలెత్తుతోందని వైఎస్సార్‌సీపీ ఎంపీలు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేయడంతోపాటు ఇళ్లు, ఆస్తుల విధ్వంసాలకు పాల్పడటం ఆటవిక చర్యగా అభివర్ణించారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం

మిగతా 5వ పేజీలో ▸

49 మంది మృత్యువాత

కువైట్‌లో ఆరు అంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం

- మరో 50 మందికి గాయాలు.. పనికోసం వచ్చి అగ్నికి ఆహుతి
- మృతుల్లో 42 మంది భారతీయులే
- ఒకే భవనంలో 200 మందికిపైగా కార్మికుల నివాసం
- వారి వసతి కోసం భవనాన్ని అద్దెకు తీసుకున్న ఎన్‌బీటీసీ గ్రూప్‌
- బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించిన ప్రధాని మోదీ

6లో



కువైట్‌ మాంగాఫ్‌ ప్రాంతంలోని ఆరు అంతస్తుల భవనంలో చెలరేగుతున్న మంటలు

పగిడిపల్లిలో రైల్‌ ఓవర్‌ రైల్‌ బ్రిడ్జి!

- సికింద్రాబాద్‌–కాజీపేట మార్గంలో రూ.180 కోట్లతో నిర్మాణం
- క్రాసింగ్‌ కోసం రైళ్లు నిలపాల్సిన అవసరం లేకుండా ఏర్పాటు
- ఐదున్నర కిలోమీటర్ల అదనపు లైన్‌.. అందులో 1,400 మీటర్లు ఎలివేటెడ్‌ కారిడార్‌




సాక్షి, హైదరాబాద్‌: క్రాసింగ్‌ సమయంలో ఇతర రైళ్లను ఆపేయాల్సిన పరిస్థితి ఉండటాన్ని ఈ మధ్య సీరియస్‌గా తీసుకున్న రైల్వేశాఖ.. 'రైల్‌ ఓవర్‌ రైల్‌ బ్రిడ్జి'ల నిర్మాణంపై దృష్టి సారించింది. గత ఏడాది దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని విజయవాడ సెక్షన్‌ పరిధిలో గూడురు–మనుబోలు మధ్య 2.2 కిలోమీటర్ల నిడివితో ఇలాంటి వంతెనను నిర్మించారు. తాజాగా సికింద్రాబాద్‌–కాజీపేట మార్గంలో పగిడిపల్లి స్టేషన్‌ సమీపంలో ఈ తరహా బ్రిడ్జి నిర్మించాలని నిర్ణయించారు. సికింద్రాబాద్‌ నుంచి నడికుడి మీదుగా గుంటూరు వైపు వెళ్లే రైళ్లు.. కాజీపేట మార్గాన్ని క్రాస్‌ చేసేచోట నిర్మించనున్నారు. వంతెన ఒక్కటే కాకుండా దానికి అనుసంధానంగా కొంత మేర అదనపు ట్రాక్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. మొత్తంగా రూ.180 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు.

రెండు మూడు మార్గాల సమస్య తీరేలా..

ప్రస్తుతం సికింద్రాబాద్‌–కాజీపేట మధ్య, నడికుడి మీదుగా సికింద్రాబాద్‌–గుంటూరు మధ్య నిత్యం 450 వరకు రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. అందులో 150కిపైగా గూడ్స్‌ రైళ్లు ఉంటున్నాయి. సికింద్రాబాద్‌ నుంచి గుంటూరు వైపు వెళ్లే రైళ్లు పగిడిపల్లి స్టేషన్‌ దాటిన తర్వాత కాజీపేట మార్గాన్ని క్రాస్‌ చేసి మళ్లాల్సి ఉంటుంది. దీంతో ఏదైనా రైలు నడికుడి వైపు క్రాస్‌ చేయాలంటే.. సికింద్రాబాద్‌–కాజీపేట మార్గంలోని రైళ్లను ఎక్కడో ఓ స్టేషన్‌లో కాసేపు నిలిపేయాల్సి వస్తోంది. ఇక భవిష్యత్తులో సికింద్రాబాద్‌–గుంటూరు మార్గాన్ని రెండు లైన్లకు విస్తరించనున్నారు. ఆ మార్గంలో ప్రయాణికులు, గూడ్స్‌ రైళ్ల సంఖ్య పెరగనుంది. ఇది సికింద్రాబాద్‌–కాజీపేట, సికింద్రాబాద్‌–గుంటూరు లైన్లను అనుసంధానించే మార్గం కావటం విశేషం. ప్రస్తుతం సరుకు రవాణా రైళ్లకే పరిమితమైన ఈ మార్గంలో భవిష్యత్తులో ప్యాసింజర్‌ రైళ్లను తిప్పాలనే ప్రతిపాదన ఉంది. అప్పుడు పగిడిపల్లి వై జంక్షన్‌ వద్ద రైల్వే ట్రాఫిక్‌ బాగా పెరగనుంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని.. క్రాసింగ్‌ వద్ద రైళ్ల జామ్‌ కాకుండా రైల్‌ ఓవర్‌ రైల్‌ బ్రిడ్జి (ఆర్‌ఓఆర్‌బీ)కి ప్లాన్‌ చేశారు. ప్రస్తుతం ప్రతిపాదించిన రైల్‌ ఓవర్‌ రైలు బ్రిడ్జికి సంబంధించిన మార్గం మొత్తం ఐదున్నర కిలోమీటర్లు ఉంటుంది. ఇది సికింద్రాబాద్‌–కాజీపేట మార్గంలో బీబీనగర్‌ స్టేషన్‌ దాటిన తర్వాత.. పగిడిపల్లి స్టేషన్‌కు 600 మీటర్ల ముందు మొదలవుతుంది. ప్రస్తుత లైన్‌కు అదనంగా మరో లైన్‌ అక్కడ మొదలవుతుంది. అది పగిడిపల్లి స్టేషన్‌ దాటిన తర్వాత గుంటూరు వైపు మళ్లుతుంది. సికింద్రాబాద్‌–గుంటూరు లైన్‌లోని బొమ్మాయిపల్లి స్టేషన్‌ సమీపంలో ప్రధాన లైన్‌కు కలుస్తుంది. ఈ ఐదున్నర కిలోమీటర్ల లైన్‌లో 1,400 మీటర్ల మేర ఎలివేటెడ్‌ మార్గం ఉంటుంది.

అలసత్వంతో అరాచకం

- మైనారిటీలు, వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై యథేచ్ఛగా అల్లరిమూకల దాడులు
- పౌరుల ప్రాణాలు, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్‌ యంత్రాంగం వైఫల్యం
- లక్షిత దాడులు, హింసాకాండను అరికట్టి బాధితులను సత్వరమే కాపాడండి
- విధ్వంసకారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి



- ఫిర్యాదులు అందిన వెంటనే ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయాలి
- బాధ్యులను గుర్తించేందుకు సిట్‌ ఏర్పాటుకు ఆదేశించండి
- నిగ్గు తేల్చేందుకు ఇద్దరు విశ్రాంత జడ్జీలతో కమిటీని నియమించాలి
- కేంద్ర హోంశాఖ, సీఎస్‌, డీజీపీని ఆదేశిస్తూ ఉత్తర్వులివ్వాలని అభ్యర్థన
- హైకోర్టులో వైవీ సుబ్బారెడ్డి 'పిల్‌'పై నేడు ధర్మాసనం విచారణ

10లో



చంద్రబాబు ప్రమాణస్వీకారం అనంతరం రాష్ట్ర మంత్రివర్గంతో ప్రధాని మోదీ గ్రూప్ ఫొటో

కొలువుదీరిన కొత్త మంత్రివర్గం

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్ర మంత్రులు, రాజకీయ, సినీ ప్రముఖులు కూర్చోగా, కుడివైపు ప్రమాణస్వీకారం చేసిన మంత్రులు కూర్చున్నారు. చంద్రబాబుతో ఉదయం 11.33 గంటలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించారు. అనంతరం చంద్రబాబును వేదికపైనే ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆలింగనం చేసుకుని అభినందనలు తెలిపారు. ఆ తర్వాత కేంద్ర మంత్రులు, సినీ ప్రముఖుల వద్దకెళ్లి చంద్రబాబు నమస్కారం చేశారు. చంద్రబాబు తర్వాత జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రమాణం చేశారు. అనంతరం పవన్ ప్రధాని, చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలపడంతోపాటు తన సోదరుడు, మెగా స్టార్ చిరంజీవికి పాదాభివందనం చేశారు. ఆ తర్వాత వరుసగా నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, సత్యకుమార్, నిమ్మల రామానాయుడు, ఎన్ఎండీ ఫరూక్, ఆనం రామనారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, డి. బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, గుమ్మడి సంధ్యారాణి, బీసీ జనార్ధన్‌రెడ్డి, టీజీ భరత్, ఎస్ సవిత, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి మంత్రులుగా ప్రమాణం చేశారు. చంద్రబాబు సహా 24 మంది దైవ సాక్షిగా ప్రమాణం చేయగా, ఎన్ఎండీ ఫరూక్ అల్లా సాక్షిగా ప్రమాణం చేశారు. ప్రమాణస్వీకారం తర్వాత చంద్రబాబు మంత్రివర్గ సభ్యులతో ప్రధాని మోదీ గ్రూప్ ఫొటో దిగారు. ఆ తర్వాత చంద్రబాబు ఆయన్ను ప్రత్యేకంగా సన్మానించి వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు. అనంతరం పవన్ కళ్యాణ్ వేదికపై తన సోదరుడు ఉన్నారని చెప్పగా ప్రధాని మోదీ చిరంజీవి వద్దకు వెళ్లి షేక్ హ్యాండ్ ఇచ్చి పలకరించారు. మోదీ, చిరంజీవి, పవన్ కళ్యాణ్ చేతులను పైకి లేపి సభికులకు అభివాదం చేయడం విశేషం. చంద్రబాబు రజనీకాంత్‌ను చూపించగా మోదీ ఆయనకు నమస్కరించి పలకరించారు. వేదికపై ఉన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ, ఇతర కేంద్ర మంత్రులకు మోదీ అభివాదం చేశారు. ప్రమాణం చేసిన తర్వాత పలువురు మంత్రులు తనకు పాదాభివందనం చేయబోతుండగా ప్రధాని వారించారు. కార్యక్రమం ముగిసిన తరువాత ఆయన ఒడిశాకు పయనమయ్యారు.

హాజరైన ప్రముఖులు వీరే

ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, జితన్ రామ్ మంజి, చిరాగ్ పాశ్వాన్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, కేంద్ర సహాయ మంత్రులు జయంత్ చౌదరి, అనుప్రియా పాటిల్, రామ్‌దాస్ అథవాలే, రాజ్యసభ సభ్యుడు ప్రఫుల్ పటేల్, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై, తమిళనాడు మాజీ సీఎం పన్నీర్ సెల్వం తదితరులు కూడా హాజరయ్యారు.





చంద్రబాబు ప్రమాణస్వీకారానికి హాజరైన కేంద్రమంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, బండి సంజయ్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, మెగాస్టార్ చిరంజీవి, సూపర్‌స్టార్ రజనీకాంత్ దంపతులు, ఎంపీ పురందేశ్వరి, టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ తదితరులు



మెగాస్టార్ చిరంజీవి, మంత్రి పవన్‌కళ్యాణ్‌తో కలిసి ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తిరుపతి జిల్లా నారావారిపల్లిలో ఖర్జూరనాయుడు, అమ్మణ్ణమ్మ దంపతులకు 1950 ఏప్రిల్ 20న జన్మించారు. వయసు 74 సంవత్సరాలు ఎస్వీ యూనివర్సిటీలో పీజీ చేశారు. భార్య భువనేశ్వరి, కుమారుడు లోకేశ్ ఉన్నారు. 1975లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజకీయ జీవితం ప్రారంభించారు. 1978లో తొలిసారి చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1980 నుంచి 1983 వరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 1989లో కుప్పం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. అప్పటి నుంచి కుప్పం నుంచి వరుసగా గెలుపొందుతున్నారు. 1995 నుంచి 1999 వరకు, తిరిగి 1999 నుంచి 2004వ సంవత్సరం వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. బుధవారం నాలుగో సారి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

పవన్ కళ్యాణ్



సినీ హీరో అయిన పవన్ కళ్యాణ్ 1971 సెప్టెంబర్ 2న బాపట్లలో జన్మించారు. 2008 – 2011 మధ్య ప్రజారాజ్యం పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా పనిచేశారు. కామన్ మేన్ ప్రొటెక్షన్ ఫోర్స్, ట్రస్టు ద్వారా సేవలందించారు. 2014 మార్చి 14న జనసేన పార్టీ స్థాపించారు. 2019లో బీఎస్పీ, వామపక్షాలతో పొత్తు పెట్టుకొని ఎన్నికల్లో పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో గాజువాక, భీమవరం నియోజకవర్గాల నుంచి అసెంబ్లీకి పోటీ చేసి ఓటమి చెందారు. 2024 ఎన్నికల్లో పిఠాపురం నుంచి జనసేన అభ్యర్థిగా విజయం సాధించారు.

నారా లోకేశ్



చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతుల కుమారుడైన నారా లోకేశ్ 1983 జనవరి 23న జన్మించారు. తెలుగుదేశం పార్టీలో జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. 2017 మార్చి 30న ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2017 నుంచి 2019 వరకు చంద్రబాబు మంత్రివర్గంలో ఐటీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. 2019 ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి, తొలిసారిగా మంగళగిరి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఇటీవలి ఎన్నికల్లో రెండోసారి మంగళగిరి నుంచి పోటీ చేసి విజయం సాధించారు.

నాదెండ్ల మనోహర్



నాదెండ్ల మనోహర్ ఎంబీఏ చదివారు. తల్లిదండ్రులు నాదెండ్ల భాస్కరరావు, లలితాంబ. భార్య డాక్టర్ మనోహరం. ఇద్దరు పిల్లలు మిథుల్, లలిత్. మనోహర్ 2004, 2009 ఎన్నికల్లో తెనాలి నుంచి కాంగ్రెస్‌పార్టీ తరఫున రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఉప సభాపతిగా 2009 జూన్ 9న పదవి బాధ్యతలు స్వీకరించారు. 2011 జూన్ 4న సభాపతిగా బాధ్యతలు స్వీకరించారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫునే పోటీ చేసి ఓడిపోయారు. 2018 అక్టోబరు 12న జనసేన పార్టీలో చేరారు 2019 ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా తెనాలి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఇటీవలి ఎన్నికల్లో జనసేన, టీడీపీ , బీజేపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు.

టీజీ భరత్



కర్నూలు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన టీజీ భరత్ పారిశ్రామికవేత్తగా, రగ్బీ రాష్ట్ర అధ్యక్షుడిగా గుర్తింపు పొందారు. 1976 ఆగస్టు 5న జన్మించిన తుంబలం గుత్తి భరత్ అమెరికాలో ఎంబీఏ పూర్తి చేశారు. భార్య శిల్ప, ఒక కుమారుడు, కుమార్తె సంతానం. భరత్ తండ్రి గతంలో రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు టీజీ భరత్ ద్వారా ఆ కుటుంబానికి రెండోసారి మంత్రి పదవి లభించింది. భరత్ 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కర్నూలు నుంచి పోటీ చేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి హాఫీజ్ ఖాన్ చేతిలో ఓడిపోయారు. ఇటీవలి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు.

బీసీ జనార్దన్ రెడ్డి



బీసీ జనార్దన్‌రెడ్డి(64) 2014లో నంద్యాల జిల్లా బనగానపల్లి నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాటసాని రామిరెడ్డి చేతిలో ఓటమి చెందారు. తాజా ఎన్నికల్లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017లో దూర విద్య ద్వారా బీఏ పూర్తి చేసిన జనార్దన్‌రెడ్డికి భార్య ఇందిరా రెడ్డి, ముగ్గురు సంతానం ఉన్నారు.

అనగాని సత్యప్రసాద్



అనగాని సత్యప్రసాద్ 1972 జనవరి 10న రంగారావు, నాగమణి దంపతులకు జన్మించారు. బీఎస్సీ కంప్యూటర్స్ చదివి, స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. సత్యప్రసాద్ 2009లో రేపల్లె నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2014, 2019, 2024లో వరుసగా విజయం సాధించారు.

ఎన్ఎండీ ఫరూక్



టీడీపీలో అత్యంత సీనియర్ నాయకుడైన ఎన్ఎండీ ఫరూక్ (74) 1981లో మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీ చేసి రాజకీయ అరంగేట్రం చేశారు. 1985లో నంద్యాల నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొంది ఎన్టీఆర్ కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. 1994లో రెండో సారి ఎమ్మెల్యేగా ఎన్నికై శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 1999లో మూడోసారి గెలుపొంది చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2009, 2014 ఎన్నికల్లో నంద్యాల ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. 2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడటంతో గవర్నర్ కోటాలో 2017లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2017–18లో మండలి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2018–2019 మధ్య ఆరోగ్య శాఖ, మైనారిటీ శాఖల మంత్రిగా పనిచేశారు. ఆయనకు భార్య షాహినాజ్ బేగం, ఆరుగురు సంతానం ఉన్నారు.

కొలుసు పార్థసారథి



ఏలూరు జిల్లా నూజివీడు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కొలుసు పార్థసారథి 2004లో తొలిసారిగా కృష్ణా జిల్లా ఉయ్యూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొంది, వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో పశు సంవర్ధకశాఖ మంత్రిగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో పెనుమలూరు నియోజకర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొంది కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో విద్యా శాఖ మంత్రిగా పనిచేశారు. 2014లో వైఎస్సార్‌సీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పెనుమలూరు నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ఇటీవలి ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీలో చేరి నూజివీడు నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఆయన తండ్రి కేపీ రెడ్డయ్య మచిలీపట్నం నుంచి 1991, 1996లో ఎంపీగా ఎన్నికయ్యారు.

కొల్లు రవీంద్ర




ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన నడకుదిటి నరసింహారావు అల్లుడు అయిన రవీంద్ర బీఏ, ఎల్ఎల్‌బీ చదివారు. ఆయనకు భార్య నీలిమ, ఇద్దరు కుమారులు సంతానం. మామకు వారసుడిగా 2005లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. తెలుగుదేశం పార్టీ డివిజన్ అధ్యక్షుడి నుంచి పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎదిగారు. 2014లో చంద్రబాబు ప్రభుత్వంలో ఎక్సైజ్, చేనేత, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తాజా ఎన్నికల్లో మచిలీపట్నం నుంచి శాసనసభకు ఎన్నికై, మరోసారి మంత్రిగా ఎంపికయ్యారు.

వంగలపూడి అనిత



పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఎంఏ ఎంఈడీ చదివారు. ఉపాధ్యాయినిగా పనిచేస్తూ 2013లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2014లో పాయకరావుపేట నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2019 ఆమెకు పాయకరావుపేట టికెట్ లభించలేదు. పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్తగా, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేశారు. ఇటీవలి ఎన్నికల్లో మళ్లీ పాయకరావు పేట నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు.

ఆనం రామనారాయణరెడ్డి



నెల్లూరుకు చెందిన ఆనం రామనారాయణరెడ్డిది రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం. బీకాం, బీఎల్ చదివిన రామనారాయణరెడ్డి 1984లో నెల్లూరు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలుపొంది, ఎన్టీఆర్ ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 1985లో రాపూరు నుంచి మరోసారి ఎన్నికై, టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1989లో రాపూరు నియోజకవర్గంలో టీడీపీ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి, 1999, 2004లో రాపూరు నుంచి గెలుపొందారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆత్మకూరు నుంచి విజయం సాధించి, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆత్మకూరు నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. కొద్ది రోజులకే టీడీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీలో చేరి వెంకటగిరి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరి, ఇటీవలి ఎన్నికల్లో ఆత్మకూరు నుంచి విజయం సాధించారు.

పొంగూరు నారాయణ



పొంగూరు నారాయణ ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ చేశారు. నెల్లూరులో ట్యూషన్ మాస్టర్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత నారాయణ పేరుతో విద్యా సంస్థలు నెలకొల్పారు. 2014లో చంద్రబాబు కేబినెట్‌లో మంత్రి పదవి లభించింది. అప్పట్లో నారాయణను ఎమ్మెల్సీని చేశారు. 2019 ఎన్నికల్లో నెల్లూరు సిటీ నుంచి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇటీవలి ఎన్నికల్లో అదే నెల్లూరు సిటీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు.

నిమ్మల రామానాయుడు



నిమ్మల రామానాయుడు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం ఆగర్తిపాలెంలో 1969లో జన్మించారు. ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ చేశారు. ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థి సంఘ నాయకునిగా ఎన్నికై విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేశారు. రైతు వేదిక అధ్యక్షుడిగా, జిల్లా రైతు జేఏసీ చైర్మన్‌గా, ధర్మారావు ఫౌండేషన్ చైర్మన్‌గా సేవలందించారు. 2014 ఎన్నికల్లో పాలకొల్లు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లోనూ టీడీపీ నుంచి గెలుపొందారు. ఇటీవలి ఎన్నికల్లో మూడోసారి పాలకొల్లు నుంచి గెలుపొంది హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నిలిచారు.

గొట్టిపాటి రవికుమార్



గొట్టిపాటి రవికుమార్ బీఈ (టెక్స్‌టైల్స్) చదివారు. తల్లిదండ్రులు జయంతి, డాక్టర్ శేషగిరిరావు. భార్య ఝూన్సీ. రవికుమార్ 2004లో మార్టూరు నుంచి కాంగ్రెస్ టిక్కెట్‌పై పోటీ చేసి తొలిసారిగా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అనంతరం అద్దంకి నియోజకవర్గం నుంచి 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2014లో వైఎస్సార్‌సీపీలో చేరి ఆపార్టీ తరఫున గెలుపొందారు. అనంతరం టీడీపీలో చేరారు. 2019, 2024 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి గెలుపొందారు.

కందుల దుర్గేష్



1962లో జన్మించిన దుర్గేష్ విశాఖ ఆంధ్ర యూనివర్సిటీలో ఎంఏ ఎకనామిక్స్ పూర్తి చేశారు. 1984 నుంచి 86 వరకు తూర్పు గోదావరి జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా పనిచేశారు. 2004 నుంచి 2012 వరకు రాజమండ్రి సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, పీసీసీ మెంబర్‌గా పనిచేశారు. 2007 నుంచి 2013 వరకు ఎమ్మెల్సీ పదవి చేపట్టారు. ఇటీవలి ఎన్నికల్లో నిడదవోలు నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు.

వాసంశెట్టి సుభాష్



వాసంశెట్టి సుభాష్ 1977 జూన్ 17న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం శ్రీరామపురంలో జన్మించారు. బీఎస్సీ, ఎల్ఎల్‌బీ చదివారు. రియల్టర్, బిల్డర్‌గా పేరుపొందారు. తండ్రి వాసంశెట్టి సత్యం రెండు సార్లు అమలాపురం మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. తల్లి కృష్ణకుమారి ప్రస్తుతం అమలాపురం 11 వార్డు కౌన్సిలర్ ఉన్నారు. సుభాష్ ప్రస్తుతం కోనసీమ శెట్టి బలిజ యువజన సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ సహాయ కార్యదర్శిగా పనిచేశారు. ఈ ఎన్నికల్లో రామచంద్రాపురం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా విజియం సాధించారు.

కొండపల్లి శ్రీనివాస్



కొండపల్లి శ్రీనివాస్ ఎంఎస్ కంప్యూటర్ సైన్స్ చదివారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా అమెరికా, యూఏఈ, ఈజిప్ట్ తదితర దేశాల్లో పనిచేశారు. ఆయన తాత కొండపల్లి పైడితల్లి నాయుడు రెండుసార్లు బొబ్బిలి లోక్‌సభ సభ్యుడిగా, ఒకసారి విజయనగరం జెడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. తండ్రి కొండపల్లి కొండలరావు రెండుసార్లు గంట్యాడ ఎంపీపీగా పనిచేశారు. చిన్నాన్న కొండపల్లి అప్పలనాయుడు 2014లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ ఎన్నికల్లో శ్రీనివాస్ విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా తొలిసారి బరిలోకి దిగి, విజయం సాధించారు.

గుమ్మడి సంధ్యారాణి



గుమ్మడి సంధ్యారాణి కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి విజయనగరం జిల్లా సాలూరు (ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా) నియోజకవర్గ ఇన్‌చార్జిగా 1999లో రాజకీయాల్లోకి వచ్చారు. 2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓటమి చెందారు. 2014 ఎన్నికల్లో అరకు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 2015లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2021 వరకూ ఎమ్మెల్సీ పదవిలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో సాలూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆమె తండ్రి జన్ని ముత్యాలు 1972 – 78 మధ్య కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నారు.

పయ్యావుల కేశవ్



1994లో రాజకీయ ప్రవేశం చేశారు. 1994లో కేశవ్ ఉరవకొండ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 1994, 2004, 2009, ఉరవకొండ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2019లో మరోసారి ఉరవకొండ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థిగా ఉరవకొండ నుంచి విజయం సాధించారు.

కింజరాపు అచ్చెన్నాయుడు



కింజరాపు అచ్చెన్నాయుడు (53) శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడ గ్రామంలో దాలినాయుడు, కళావతమ్మ దంపతులకు జన్మించారు. డిగ్రీ చదువు మధ్యలోనే ఆపేశారు. 1996లో హరిశ్చంద్రపురం నియోజకవర్గం నుంచి తొలిసారిగా టీడీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009 వరకు హరిశ్చంద్రపురం ఎమ్మెల్యేగా కొనసాగారు. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2009లో టెక్కలి నుంచి పోటీచేసి ఓడిపోయారు. 2014, 2019 ఎన్నికల్లో టెక్కలి నుంచి గెలుపొందారు. 2014 నుంచి 2019 వరకు మంత్రిగా పనిచేశారు. ఈ ఎన్నికల్లోనూ టెక్కలి నుంచి టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించారు.

ఎస్.సవిత



ఎస్.సవిత కొన్నేళ్లుగా టీడీపీలో కొనసాగుతున్నారు. 2019కు ముందు టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. సవిత తండ్రి ఎస్.రామచంద్రారెడ్డి 1983, 1988లో ఎన్టీఆర్ కేబినెట్‌లో కీలక మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. తండ్రి బాటలోనే రాజకీయాల్లో వచ్చిన సవిత తొలిసారిగా ఈ ఎన్నికల్లో శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు.

సత్యకుమార్ యాదవ్



వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు వాసి అయిన సత్యకుమార్ యాదవ్ విద్యార్థి దశలో ఏబీవీపీలో పనిచేశారు. అనంతరం బీజేపీ నాయకుడు చల్లపల్లి నరసింహారెడ్డి ద్వారా అప్పటి బీజేపీ జాతీయ నాయకుడు వెంకయ్యనాయుడుకు చేరువయ్యారు. ఆయన కేంద్ర మంత్రిగా పనిచేసిన కాలంలో వ్యక్తిగత సహాయకుడిగా, ఓఎస్డీగా సేవలందించారు. అప్పటినుంచి కేంద్ర రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతి అయిన తర్వాత సత్యకుమార్‌ను పార్టీ అధిష్టానం బీజేపీ జాతీయ కార్యదర్శిగా నియమించింది. కర్ణాటక, కేరళ, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు బీజేపీ ఇన్‌చార్జిగా పనిచేశారు. ఈ ఎన్నికల్లో సత్యసాయిజిల్లా ధర్మవరం నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీ చేసి గెలుపొందారు.

డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి



ఎంబీబీఎస్ చదివిన డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రకాశం జిల్లా కొండపిలో ప్రభుత్వ వైద్యాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సమయంలో కొండపి నియోజకవర్గం ఎస్సీ రిజర్వేషన్ కిందకు రావడంతో మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు సహకారంతో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 2009 ఎన్నికల్లో టీడీపీ తరఫున కొండపి అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 2014, 2019, 2024 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి వరుస విజయాలు నమోదు చేశారు.

మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి



అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం చిన్న మండెం మండలానికి చెందిన మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి రాజకీయ కుటుంబానికి చెందినవారు. ఆయన తండ్రి నాగిరెడ్డి ఎమ్మెల్యేగా ఉండగా 1991లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో 1992లో జరిగిన ఉప ఎన్నికల్లో నాగిరెడ్డి సోదరుడి కుమారుడైన నారాయణరెడ్డి కాంగ్రెస్ తరఫున పోటీచేసి గెలుపొందారు. 1994లో రెండోసారి గెలిచారు. రామ్‌ప్రసాద్‌రెడ్డి 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2014లో సమైక్యాంధ్ర పార్టీ తరఫున పోటీ చేసి ఓటమి చెందారు. ఈ ఎన్నికల్లో అనూహ్యంగా టీడీపీ టికెట్ దక్కించుకొని రాయచోటి నియోజకవర్గం నుంచి గెలుపొందారు. తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై , మంత్రి పదవి కూడా దక్కించుకొన్నారు.

ఆ ఒక్క మంత్రి పదవి ఎవరికో?

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 25 మంత్రి పదవులకు 24 మందికి చాన్సు ఇచ్చిన చంద్రబాబు ఒక్క పదవిని మాత్రం ఖాళీగా ఉంచారు. రాష్ట్రంలో ఉన్న ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం సీఎం కాకుండా 25 మంత్రి పదవులు భర్తీ చేసే అవకాశం ఉంది. అయితే ఇప్పుడు 24 మందినే మంత్రులుగా ప్రకటించడంతో మిగిలిన ఒక్కటి ఎందుకు వదిలారనే విషయం చర్చనీయాంశమైంది. బీజేపీకి రెండు మంత్రి పదవులు ఇవ్వాల్సి ఉండగా ఒక్కటే ఇచ్చారని, మరొకటి ఖాళీగా ఉంచారని ప్రచారం జరుగుతోంది. సుజనా చౌదరి పేరును పలు అభ్యంతరాల నేపథ్యంలో ఆఖరి నిమిషంలో తీసివేశారని చెబుతున్నారు. అదే నిజమైతే ఏకాభిప్రాయం కుదిరాక ఆయనను మంత్రివర్గంలోకి తీసుకోవచ్చంటున్నారు. లేకపోతే బీజేపీలోనే మరొకరికి అవకాశం కల్పించవచ్చనే ప్రచారం జరుగుతోంది. అదీ జరగని పక్షంలో టీడీపీలోనే మరొకరికి మంత్రి పదవి లభించే అవకాశం ఉందని అంటున్నారు. త్వరలోనే దీనిపై స్పష్టత రావచ్చు.

కొల్లేరులో కోలాహలం

తొలకరి చినుకులతో మొదలైన పక్షుల కళ



కొల్లేరు బుచ్చిగాళ్లు (కింగ్‌ఫిషర్ పక్షులు) తిరిగొచ్చేశారు. ఈలలు వేసుకుంటూ చిన్న చిలువ బాతులు వచ్చేశాయి. కంకణాల పిట్టలు.. సూదితోక బాతులు.. ఒంటికాలి జపం చేసే ఎర్ర కాళ్ల కొంగలు.. నల్లరెక్కల ఉల్లంకి.. వల్లంకి పిట్టలు.. గొంతుకింద సంచుల్ని సవరించుకుని గూడ బాతులు.. బంగారు ఉల్లంకి.. బ్రాహ్మణి బాతులు.. చిన్న నీటి కాకులు సైతం గుంపులు గుంపులుగా వస్తుండటంతో కొల్లేరులో కోలాహలం మొదలైంది.

- అరుదైన ఫ్లెమింగో పక్షుల రాక
- పెరుగుతున్న పెలికాన్‌ల స్థిర నివాసాలు

కైకలూరు: ఆసియా ఖండంలోనే అతి పెద్ద మంచి నీటి సరస్సు కొల్లేరు తీవ్ర ఎండలకు బీటలు వారింది. ఫలితంగా చేపలు, పక్షులకు ఆహారం కరువైంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఈ ప్రభావం పక్షులపై పడింది. ఇక్కడి పక్షులన్నీ ఆహారం కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాయి. నైరుతి రుతుపవనాల పలకరింపుతో వాతావరణం చల్లబడి.. వర్షాలు కురవడంతో కొల్లేరులో పచ్చని వాతావారణం కనిపిస్తోంది. దూర ప్రాంతాలకు వలస వెళ్లిన పక్షులు తిరిగి సొంతిళ్లకు చేరుకుంటున్నాయి.

ఆకట్టుకుంటున్న ఆటపాక పక్షుల కేంద్రం

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆటపాక పక్షుల విహార కేంద్రం పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధికెక్కింది. ఇక్కడ 289 ఎకరాల్లో పక్షుల విహార చెరువును నెలకొల్పారు. ప్రధానంగా పెలికాన్ (గూడ బాతు) పక్షుల సంతానోత్పత్తి కేంద్రంగా మారడంతో పెలికాన్ ప్యారడైజ్‌గా దీనికి నామకరణం చేశారు. అటవీ శాఖ పెలికాన్ పక్షుల నివాసాలకు కృత్రిమ ఇనుప స్టాండ్లను అమర్చింది. దీనికి తోడు పక్షి నమూనా మ్యూజియం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటోంది. ఇటీవల ఆటపాక పక్షుల కేంద్రం వద్ద అటవీ శాఖ మరమ్మతులు చేపట్టింది. ప్రస్తుతం నీటి కొరత వల్ల బోటు షికారు నిలిచింది. మరికొద్ది రోజుల్లో బోటు షికారును పునరుద్ధరిస్తామని సిబ్బంది చెప్పారు.

ఫ్లెమింగోల సందడి

కొల్లేరుకు ఏటా మే నెలలో ఫ్లెమింగో పక్షులు విచ్చేస్తున్నాయి. పులికాట్, నేలపట్టు ప్రాంతాల నుంచి ఇవి కొల్లేరుకు గుంపులు గుంపులుగా ఆహారం కోసం వస్తున్నాయి. కొద్దిరోజులు విహరించి తిరిగి గమ్యస్థానాలకు తరలివెళుతున్నాయి. ఏటా వైట్ పెలికాన్ జంట కొల్లేరుకు వస్తోంది. సాధారణ పెలికాన్ బూడిద రంగులో ఉంటే.. వైట్ పెలికాన్ లేత గులాబీ రంగులో ఆకర్షణీయంగా ఉంటుంది. గత ఏడాది కొల్లేరులో నిర్వహించిన ×ఏషియన్ వాటర్ బర్డ్స్ సెన్సస్¥ అధ్యయనంలో వివిధ జాతులకు చెందిన 105 రకాల పక్షి జాతులు.. 81,495 పక్షులను గుర్తించారు. వీటిలో మొదటి స్థానంలో కోయిల, రెండో స్థానంలో పెలికాన్ పక్షులు ఉండగా.. అరుదైన పిన్‌టైల్ స్నిప్ (సూది తోక పుర్రెది) పక్షి ఒకటి. పిట్రిన్‌వాగ్ టైల్ (పసుపు తల జిట్టంగి) పక్షులు నాలుగు కనిపించాయి. కొల్లేరు బుచ్చిగాళ్లగా పిలవబడే కింగ్ ఫిషర్ పక్షులు సైతం కనువిందు చేస్తున్నాయి.

పక్షుల రక్షణకు ప్రాధాన్యత



కొల్లేరులో విహరించే స్వదేశీ, విదేశీ పక్షుల రక్షణకు అటవీ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఆటపాక పక్షుల విహార కేంద్రంలో కృత్రిమ ఇనుప స్టాండ్ల సంఖ్యను పెంచుతున్నాం. పర్యాటకులు, చిన్నారులను ఆకట్టుకోవడానికి పక్షుల చిత్రాలను గీయించాం. కొల్లేరుకు ఫ్లెమింగో పక్షులు సైతం ఆహారం నిమిత్తం వచ్చాయి. కొల్లేరు అభయారణ్య రక్షణకు అటవీ శాఖ అన్ని చర్యలూ తీసుకుంటోంది.

– జీవీవీ జయప్రకాష్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, కైకలూరు

వలస పక్షుల స్థిర నివాసం

కొల్లేరు సరస్సు స్వదేశీ, విదేశీ పక్షులకు నెలవు. మొత్తం 182 జాతుల పక్షులు విహరిస్తాయని అంచనా. సైబీరియా, నైజీరియా, ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి ప్రాంతాల నుంచి పక్షులు కొల్లేరుకు ఏటా విచ్చేస్తాయి. సాధారణంగా పెలికాన్ పక్షులు ఏటా అక్టోబర్‌లో వచ్చి.. మార్చి నాటికి సంతానోత్పత్తి అనంతరం తిరిగి వెళతాయి. అటువంటిది కొల్లేరులో పక్షులకు అనువైన వాతావరణం ఉండటంతో అనేక పక్షులు కొల్లేరులోనే స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇక్కడి పరిస్థితులతో పెలికాన్ పక్షుల స్థిర నివాసాలు పెరుగుతున్నాయని కైకలూరు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.వెంకన్న చెప్పారు.



కొల్లేరులో పక్షుల కృత్రిమ ఆవాసాలు

కృష్ణా బేసిన్‌లోని జలాశయాలు ఖాళీ

- ఆల్మట్టి నుంచి పులిచింతల వరకు కనిష్ట స్థాయిలో నీటి నిల్వ
- రుతుపవనాల ప్రభావంతో పశ్చిమ కనుమల్లో వర్షాలు
- 'ఆల్మట్టి'లోకి ప్రారంభమైన వరద ప్రవాహం



సాక్షి, అమరావతి: కృష్ణా నదీ పరివాహక ప్రాంతం(బేసిన్)లో జలాశయాలన్నీ ఖాళీ అయ్యాయి. కర్ణాటకలోని ఆల్మట్టి డ్యామ్ నుంచి రాష్ట్రంలోని పులిచింతల ప్రాజెక్టు వరకూ అన్ని జలాశయాల్లోనూ నీటి నిల్వ కనిష్ట స్థాయికి చేరింది. నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల పశ్చిమ కనుమలు, బేసిన్‌లో చెదురు మదురుగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా నది ప్రధాన పాయలో వరద ప్రవాహం ప్రారంభమైంది. ఆల్మట్టి డ్యామ్‌లోకి బుధవారం 7,490 క్యూసెక్కులు చేరుతున్నాయి. ప్రస్తుతం ఆల్మట్టి డ్యామ్‌లో 24.68 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ఇది నిండాలంటే 105.04 టీఎంసీలు అవసరం. ఇక ఆల్మట్టి దిగువన ఉన్న నారాయణపూర్ డ్యామ్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 37.64 టీఎంసీలు. ప్రస్తుతం 24.2 టీఎంసీలు ఉన్నాయి. నారాయణపూర్ డ్యామ్ నిండాలంటే ఇంకా 13.42 టీఎంసీలు అవసరం. అంటే.. 118.46 టీఎంసీలు చేరితేగానీ ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లు నిండవు. ఆ రెండు జలాశయాలు నిండాక గేట్లు ఎత్తి దిగువకు వరద జలాలను విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ డ్యామ్‌కు దిగువన తెలంగాణలో ఉన్న జూరాల ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు. ప్రస్తుతం జూరాలలో 7.65 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. మరో 2.01 టీఎంసీలు చేరితే అదీ నిండుతుంది. ఇక శ్రీశైలం ప్రాజెక్టులో 34.52 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. శ్రీశైలం నిండాలంటే 181.29 టీఎంసీలు అవసరం. రెండు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు అయిన నాగార్జునసాగర్‌లో 122.85 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ఈ ప్రాజెక్టు నిండాలంటే 189.2 టీఎంసీలు అవసరం. సాగర్ దిగువన రాష్ట్రంలో ఉన్న పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ డెడ్ స్టోరేజీ స్థాయిలో 0.77 టీఎంసీలున్నాయి. అది నిండాలంటే 45 టీఎంసీలు అవసరం. కృష్ణా నదికి ప్రధాన ఉప నది అయిన తుంగభద్రపై నిర్మించిన మూడు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర డ్యామ్‌లో 5.29 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. తుంగభద్ర నిండాలంటే ఇంకా 100 టీఎంసీలు అవసరం.

విశాఖలో సెయిలర్స్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం

సాక్షి, విశాఖపట్నం: భారత నౌకాదళ సెయిలర్స్ కోసం సాగర్ పేరుతో ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూట్ విశాఖలో ప్రారంభమైంది. నావికుల శిక్షణ కోసం ఐఎన్ఎస్ విశ్వకర్మ బేస్‌లో ఉన్న సెయిలర్స్ ఎనెక్స్ ఇన్‌స్టిట్యూట్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. సాగర్ పేరుతో ఆధునికీకరించిన ఈ భవనాన్ని తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ బుధవారం ప్రారంభించారు. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో అప్‌గ్రేడ్ చేసిన సాగర్‌లో పురుషులతో పాటు మహిళా సెయిలర్స్, అగ్నివీర్‌లకు, యుద్ధ నౌకల్లో విధులు నిర్వర్తించే వారి కోసం ఏర్పాట్లు చేసినట్లు ఈఎన్‌సీ చీఫ్ అడ్మిరల్ పెందార్కర్ తెలిపారు. భారత దేశ రక్షణ కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న సెయిలర్స్‌కు ఆహ్లాదకరమైన వాతావరణంలో మోటివేషన్ అందించడంతో పాటు విశ్రాంతి తీసుకునేలా సాగర్ నిర్మాణం సాగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నౌకాదళాధికారులు పాల్గొన్నారు.



సెయిలర్స్ కోసం ఏర్పాటు చేసిన సాగర్

నౌకాదళ సిబ్బందికి 'ఏఐ' క్యాప్సుల్ కోర్సు

సాంకేతిక పరిజ్ఞానంలో నౌకాదళ సిబ్బంది ప్రతిభా పాటవాలు మెరుగు పరిచేందుకు తూర్పు నౌకాదళంలో విధులు నిర్వర్తిస్తున్న వారికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్యాప్సుల్ కోర్సును అందించారు. గీతం యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఐఎన్ఎస్ కళింగలో ఈనెల 10 నుంచి 3 రోజుల పాటు ఏఐ అప్లికేషన్స్‌తో పాటు మెషిన్ లెర్నింగ్ గురించి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇంటరాక్టివ్ సెషన్స్ ద్వారా సందేహాలు నివృత్తి చేయడంతో వివిధ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్స్‌లో ప్రయోగాత్మక వివరణలు అందించారు. శిక్షణలో పాల్గొన్న తూర్పు నౌకాదళ సిబ్బందికి ధ్రువపత్రాలు అందజేశారు.

తిరుమలకు చంద్రబాబు

తిరుమల: సీఎం నారా చంద్రబాబు నాయుడు బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలసి తిరుమల చేరుకున్నారు. ఆయనకు గాయత్రి నిలయం విశ్రాంతి భవనం వద్ద టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్ పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు.



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న టీటీడీ జేఈఓ

హైదరాబాద్‌లో 'ఒలింపస్' ఆర్ అండ్ డీ కేంద్రం

- హెచ్‌సీఎల్ టెక్‌తో కలిసి ఏర్పాటు చేయనున్న అమెరికా సంస్థ
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్‌షోర్ సెంటర్‌ను నెలకొల్పేందుకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఒలింపస్ కార్పొరేషన్ సంసిద్ధత వ్యక్తం చేసింది. హెచ్‌సీఎల్ టెక్‌తో కలిసి ఈ మేరకు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అమెరికా పర్యటనలో ఉన్న ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒలింపస్ కార్పొరేషన్ గ్లోబల్ సీనియర్ ప్రెసిడెంట్ సయ్యద్ నవీద్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఒలింపస్ కార్పొరేషన్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఆండ్రీ రాగన్, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద వైద్య పరికరాల తయారీ కంపెనీలలో ఒకటైన ఒలింపస్ కార్పొరేషన్ భారత్‌లో పెట్టుబడుల కోసం హైదరాబాద్‌ను ఎంచుకొని ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం సంతోషకరమని అన్నారు. దేశంలోనే మెడికల్ హబ్‌గా పేరున్న హైదరాబాద్‌లో ఒలింపస్ కార్పొరేషన్ తమ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఈ కేంద్రం హైదరాబాద్‌లోని ఏఐజీ హాస్పిటల్‌తో కలిసి సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టులను నిర్వహిస్తుందని తెలిపారు. ఒలింపస్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఆండ్రీ రోగన్ మాట్లాడుతూ హెచ్‌సీఎల్ టెక్‌తో కలిసి ఈ ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడపాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. మంత్రివర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం బుధవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ పదాధికారుల సమావేశం నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రులు బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాష్, ఎంపీ సీఎం రమేశ్‌తోపాటు జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు పాల్గొన్నారు. కాగా, బీజేపీ నుంచి రాష్ట్ర మంత్రి పదవిని దక్కించుకున్న సత్యకుమార్ యాదవ్‌ను నాయకులు ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలోనూ బీజేపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు.

మనల్ని మనం చూసుకోవడంలో ఒక భాగం. ధ్యానం ద్వారా మన శక్తి నిల్వలను రీచార్జ్ చేసుకోవడం. ధ్యానం అనేది మనల్ని దాటివుండే శక్తితో మనల్ని అనుసంధానిస్తుంది.

– బ్రహ్మకుమారీలు

సాక్షి

గురువారం, 13 జూన్ 2024

మందలింపు మాటలు

పెంచి, పోషించిన పెద్దవాళ్ళకు పిల్లలను మందలించే హక్కు ఎప్పుడూ ఉంటుంది. రెక్కలొచ్చిన పిల్లలు పెద్దల మాట వింటారా, లేదా అన్నది మాత్రం వేరే విషయం. గడచిన పదేళ్ళుగా దేశాన్ని ఏలుతున్న బీజేపీకి సైద్ధాంతిక తల్లివేరు లాంటి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ప్రభుత్వ పెద్దలపై తాజాగా చేసిన వ్యాఖ్యలను చూసినప్పుడు ఆ పోలికే గుర్తుకువస్తోంది. ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సాగిన భీకర విద్వేష ప్రచారాన్ని ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ సోమవారం ఘాటుగా విమర్శించారు. మత ప్రాతిపదికన సమాజంలో చీలికలు తీసుకువచ్చేలా మాట్లాడడాన్ని తప్పుపడుతూ అధికార, ప్రతిపక్షాలు రెంటికీ తలంటి పోశారు. ఎన్నికలనేవి పోటీయే తప్ప యుద్ధం కాదంటూ హితవు పలికారు. అలాగే, కల్లోలిత రాష్ట్రం మణిపుర్‌లోని పరిస్థితిని ప్రస్తావిస్తూ, ప్రాధాన్యతా అంశంగా ఆ సమస్యను పరిష్కరించాల్సిన అవసరాన్ని ఎత్తిచూపారు. గత వారం ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆరెస్సెస్ ఛీఫ్ తొలిసారిగా చేసిన బహిరంగ వ్యాఖ్యలు ఇవే కావడం గమనార్హం. అదే సమయంలో ఆరెస్సెస్ అనుబంధ పత్రిక 'ఆర్గనైజర్' మితిమీరిన ఆత్మవిశ్వాసంతో ఎన్నికల ఫలితాలలో బోర్లాపడ్డందున బీజేపీ నేతలు ఇప్పటికైనా వాస్తవాలు గుర్తెరగాలని రాయడం విశేషం. ఈ వ్యాఖ్యలే ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి.

భాగవత్ నేరుగా మోదీ పేరు ప్రస్తావించకున్నా, ఆ మాటలు ఎవరిని ఉద్దేశించి అన్నవో అర్థం చేసుకోవచ్చు. అలాగే, క్షేత్రస్థాయిలోని జనం మాట వినకుండా, గాలి బుడగలో ఆనందంగా గడిపేయడమే బీజేపీ స్వయంగా మెజారిటీ సాధించలేని దుఃస్థితికి కారణమంటూ 'ఆర్గనైజర్' వ్యాసంలో ఆరెస్సెస్ జీవితకాల సభ్యుడు రతన్ శారద పేర్కొన్నారు. జనంలో రాకుండా, సోషల్ మీడియాలో పోస్టులు పంచుకుంటూ, సమస్తం మోదీ పేరుతో జరిగిపోతుందని భావించారన్న ఆయన చురకలు బీజేపీకి పెద్దగా రుచించని ఘాటైన మాటలే! నిజానికి, తాజా ఎన్నికల్లో విజయానంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ, తమ పార్టీ ఆరెస్సెస్‌ను మించి ఎదిగిందనీ, వ్యవహారాలు నడపడానికి దానిపై ఇక ఎంత మాత్రమూ ఆధారపడి లేమనీ అనడం ఆశ్చర్యకరం. బహుశా దానికి పరోక్షంగా ప్రతిస్పందనే భాగవత్ మాటలు, 'ఆర్గనైజర్'లో వ్యాసమూ అయినా కావచ్చు. మోదీ సైతం ఒకప్పుడు ఆరెస్సెస్ ప్రచారకుడిగా ప్రజాజీవితం ప్రారంభించిన వారే. ఆ భావజాలంతో ఎదిగినవారే. ఆయన ఎదుగుదలలో, సైద్ధాంతిక అజెండాలో, గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ పైన దేశ ప్రధానిగా ఆయన ముందుకు నడవడంలో ఆ మాతృసంస్థ పాత్రను విస్మరించలేం. రాజకీయ పార్టీ బీజేపీ అయినా, దానికి పునాది స్థాయిలో పట్టు నిలిపి, గుట్టుమట్లు తెలిపినది ఆరెస్సెస్ అనేదీ జగమెరిగిన సత్యమే. ఇప్పుడు పునాదిని మరిచి, పై మాటలు మాట్లాడడం హాస్యాస్పదం.

భాగవత్ చేసిన మణిపుర్ ప్రస్తావన కూడా సరైన సమయానికే వచ్చింది. ఎన్నికల కోసం దేశమంతటా కాళ్ళకు బలపం కట్టుకొని తిరిగిన ప్రధాని సందర్శించనిది మణిపురే. ఏడాది గడిచినా చల్లారని మంటలతో ఆ రాష్ట్రంలో పరిస్థితి ఇప్పటికీ నివురుగప్పిన నిప్పులానే ఉంది. గత వారం జిరిబామ్‌లో జరిగిన హింసాకాండ, రాష్ట్ర ముఖ్యమంత్రి క్యాన్వాయ్‌పై తాజాగా జరిగిన దాడి అందుకు నిదర్శనాలు. పరస్పరం నమ్మకం కోల్పోయిన మెజారిటీ మెయితీలు, మైనారిటీ కుకీల మధ్య ఘర్షణను నివారించడానికి భారీ ఎత్తున భద్రతా బలగాలను దింపడం తప్ప, అసలైన రాజకీయ పరిష్కారం కోసం బీజేపీ ప్రయత్నించలేదన్నది నిష్ఠురసత్యం. ఒక వర్గానికి కొమ్ముకాస్తూ, తానే సమస్యగా మారినప్పటికీ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను ఆ పార్టీ కదపనే లేదు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో తమకు అఖండ విజయం సాధించి పెట్టిన బీరేన్‌ను స్థానికంగా పార్టీ పట్టు నిలిపే నేతగా అది భావిస్తూ ఉండివుండవచ్చు. కానీ, రాహుల్ 'భారత్ జోడో యాత్ర'కు ఇంఫాల్ నుంచి అనుమతి నిరాకరణ సహా రాష్ట్రంలో మారని పరిస్థితుల వల్ల మొన్నటి ఎన్నికల్లో రాష్ట్రంలోని రెండు లోక్‌సభా స్థానాలనూ కాంగ్రెస్‌కే కోల్పోవాల్సి వచ్చింది. అందుకే, ఇది బీజేపీ చెవి ఒగ్గి వినాల్సిన పాఠం.

ఇక, ఎన్నికల ప్రచార వేళ ఇష్టారాజ్యపు వ్యాఖ్యలతో సమాజంలో విభజన తెస్తే, భవిష్యత్తులో దేశాన్ని నడపడమెలా అన్న భాగవత్ ప్రశ్న సహేతుకమైనదే. కచ్చితంగా అన్ని పక్షాలూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సినదే. కానీ, కొంతకాలంగా అదుపులేని మాటలు అనేకం అధికార పార్టీ నుంచి వస్తున్నా ఉపేక్షించడం, ఆరెస్సెస్ సంఘ్‌సేవక్‌లను పక్కనబెట్టి బీజేపీ సొంత కార్యకర్తలతో ఎన్నికల పోరు సాగించిన తర్వాత... అదీ పార్టీకి సొంత మెజారిటీ రానప్పుడే ఈపాటి వివేకం మేల్కొనడమే ఒకింత విడ్డూరం. బీజేపీ, ఆరెస్సెస్‌ల మధ్య సఖ్యత తగ్గిందన్న వాదనకు ఇది ఊతం. అయితే, గతంలో 1998, 2004ల్లో వాజ్‌పేయ్ ఎన్డీఏ ప్రభుత్వాలకు సారథ్యం వహించినప్పుడూ అనేక విధానాలపై రెంటి మధ్య భిన్నాభిప్రాయాలు నెలకొన్నమాట మర్చిపోలేం. మిత్రపక్షాలపై ఆధారపడి పాలన సాగించాల్సిన సంకీర్ణాల కాలంలో నలువైపుల నుంచి అభిప్రాయాలు రావడం సహజం. వాటిలో మంచిచెడులను గుర్తించి నడుచుకోవడం సుస్థిర సర్కారుకు తొలి మెట్టు. మైనారిటీలకు వ్యతిరేకంగా కమలనాథుల వ్యాఖ్యలను ఎన్నికల సంఘమే పెద్దగా పట్టించుకోకున్నా, మాతృసంస్థ ఆలస్యంగానైనా మేల్కొని సుద్దులు చెప్పడమే తటస్థులకు కాస్తంత ఊరట. గత పదేళ్ళలో మోదీ మేనియాలో నోరు విప్పే వీలు లేకుండాపోయిన పలువురు ఇకపై గొంతు సవరించుకుంటారు. సొంత ఇంటి భాగవత్ మొదలు ఎవరు మాట్లాడినా గాయపడ్డ బీజేపీకి పుండు మీద కారం రాసినట్టే ఉండవచ్చు. కానీ గాయం మానాలంటే... మందు చేదుగా, ఘాటుగా ఉందని అనడం సరికాదేమో!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.సప్తమి రా.8.51 వరకు, తదుపరి అష్టమి **నక్షత్రం:** పుబ్బ తె.4.46 వరకు(తెల్లవారితే శుక్రవారం), తదుపరి ఉత్తర, **వర్జ్యం:** ఉ.11.21 నుండి 1.08 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.49 నుండి 10.41 వరకు, తదుపరి ప.3.02 నుండి 3.54 వరకు, **అమృతఘడియలు:** రా.9.54 నుండి 11.40 వరకు.

సూర్యోదయం : 5.29
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

ఆధునిక జాతీయవాదమే గెలిచింది!

విశ్లేషణ



టంకశాల అశోక్

ఏ జాతికైనా ఒక జాతీయవాదం ఉండాలనే మాటలో సందేహం లేదు. కానీ ఆ జాతీయవాదానికి ఆధారం ఏమిటన్నది ప్రశ్న. ఫ్యూడలిజం, రాచరికం కాలమేలినపుడు ఒక ప్రధాన భాష, నిర్దిష్టమైన భౌగోళిక సరిహద్దులు అందుకు పనికొచ్చాయి. జాతీయవాదానికి మతం ఆధారం కావాలనేది సంఘ్ పరివార్ సిద్ధాంతం. మత ఆధారిత జాతీయ వాదాన్ని భారతీయులు స్వాతంత్ర్యోద్యమ సమయంలో గానీ, 1947 నుంచి నేటి వరకు గానీ అమోదించలేదు. మోదీ తిరిగి అధికారానికి వచ్చి ఉండవచ్చుగాక. కానీ బీజేపీ సంపూర్ణమైన మెజారిటీ పొందలేకపోయింది. అంతిమంగా ప్రజలు తమకు కావలసింది ఆధునిక, ప్రజాస్వామిక, అభివృద్ధికర జాతీయవాదం తప్ప, మత ఆధారిత జాతీయవాదం కాదని తేల్చి చెప్పారు.

లోక్‌సభ ఫలితాలు చెప్పిన పాఠాలలో ముఖ్యమైనది ఒకటి చర్చకు రావటం లేదు. మత ఆధారిత జాతీయవాద నిర్మాణం జరగాలనే దృష్టి సరైనది కాదనీ, ప్రజాస్వామ్యాన్ని, అభివృద్ధిని ఆధారం చేసుకుంటూ జాతీయ వాద నిర్మాణం జరగాలనే ఆధునిక దృష్టి మాత్రమే సరైనదనీ ప్రజలు తీర్పు చెప్పారు. ఏ జాతికైనా ఒక జాతీయవాదం ఉండాలనే మాటలో సందేహం లేదు. అటువంటి జాతీయవాదానికి ఆధారం కావలసింది ఏమిటన్నది ప్రశ్న. మతం ఆధారం కావాలనేది సంఘ్ పరివార్‌కు వందేళ్ల క్రితం 1925లో ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడినప్పటినుంచి గల సిద్ధాంతం. అదే సిద్ధాంతాన్ని ఆ సంస్థ రాజకీయ విభాగాలైన జన సంఘ్, బీజేపీలు ప్రభుత్వాధికారం ద్వారా ముందుకు తీసుకుపోయే ప్రయత్నం చేశాయి. నరేంద్ర మోదీ మొదట గుజరాత్ ముఖ్యమంత్రిగా, తర్వాత ప్రధానిగా ఆ ప్రయత్నాలను ఉధృతంగా సాగించారు. ఈ క్రమంలో 2014, 2019 ఎన్నికలు గెలవటంతో, ఇక దేశ ప్రజలు మత ఆధారిత జాతీయవాదాన్ని బలపరుస్తున్నారనే భావన బీజేపీలో, సంఘ్ పరివార్‌లో బాగా ఏర్పడసాగింది. ఈ 2024లో కూడా (సంపూర్ణ మెజారిటీతో) గెలిచినట్లయితే ఇక తమ తరహా జాతీయ వాద సిద్ధాంతానికి ఎదురులేదని నమ్మేవారు. వాస్తవానికి అటువంటి అజెండాను ఈ ఎన్నికల తర్వాత మరింత బలంగా ముందుకు తీసుకుపోయేందుకు వారు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు కూడా. కానీ, ఎన్నికలలో ప్రజలు అందుకు విరుద్ధమైన తీర్పునిచ్చారు.

ప్రపంచంలో మధ్య యుగాల కాలంలో ఫ్యూడలిజం, రాచరికం, మత వ్యవస్థలు కాలమేలినపుడు, నెమ్మదిగా జాతిభావనలు కూడా వచ్చినప్పుడు, జాతీయవాదానికి ఆధారంగా మతం, ఒక ప్రధాన భాష, నిర్దిష్టమైన భౌగోళిక సరిహద్దులు తప్ప మరొకటి కనిపించలేదు వారికి. జాతులు కేంద్రంగా గల ఆయా రాజ్యాలలో వైవిధ్యత తక్కువ. ఫ్రెంచ్ విప్లవం, రెనైజాన్స్, పారిశ్రామిక విప్లవాల వంటివి గానీ, ఆధునికతకు అనుగుణమైన సామాజికాభివృద్ధి సిద్ధాంతాలు గానీ అప్పటికి లేవు. బ్రిటిష్ వలస పాలనలో ఉండిన భారతదేశం విషయానికి వస్తే, ఇక్కడ అత్యధిక ప్రజలు హిందూ అనే ఒక మతానికి చెందిన వారైనా, రాచరికాలు, ఫ్యూడల్ వ్యవస్థలే రాజ్యమేలుతుండినా, 1857 నాటి ప్రథమ భారత స్వాతంత్ర్యోద్యమం అనంతరం మరొక 15–20 సంవత్సరాలు గడిచేసరికి దేశంలో ఆధునిక భావనలు ప్రవేశించసాగాయి. అది ఎందుకు, ఏ విధంగా ఏ వర్గాలలో అనే వివరాలను పక్కన ఉంచితే, అటువంటి ఆధునిక, ప్రజాస్వామిక భావనల ప్రతిఫలితమే 1885లో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు. తర్వాత గాంధీజీ రంగ ప్రవేశంతో ఈ భావనలు మరింత ఆధునికం, ప్రజాస్వామికం అయ్యాయి. ఆ సరికి ప్రపంచ దేశాలు కూడా ఆధునిక, ప్రజాస్వామిక, అభివృద్ధి దశలోకి ప్రవేశించాయి. ఆ మొత్తం ధోరణులకు భిన్నంగా, మరికొన్ని సంవత్సరాలు గడిచే సరికి సావర్కార్, ఆర్‌ఎస్‌ఎస్‌లు మత ఆధారిత జాతీయ వాదనను ముందుకు తెచ్చారు.



యధాతథంగా మత ఆధారిత జాతీయ వాదాన్ని భారతీయులు స్వాతంత్ర్యోద్యమ సమయంలో గానీ, 1947 నుంచి నేటి వరకు గానీ ఏదశలోనూ అమోదించలేదు. మధ్యలో జరిగిందేమంటే, రాజ్యాంగంలో, చట్టాలలో చెప్పుకున్న తరహా పరిపాలన, అభివృద్ధి, ప్రజాస్వామిక విధివిధానాలలో కాంగ్రెస్ తదితర పార్టీలు పదే పదే విఫలమైనందువల్ల మాత్రమే బీజేపీ అనే మరొక పార్టీకి ఆ శూన్యంలోకి ప్రవేశించే అవకాశం లభించింది. ఆ విధంగా ప్రత్యామ్నాయ రూపంలో వచ్చిన పార్టీ సందర్భవశాత్తు ఒక మతతత్వ పార్టీ అయింది. తమ సిద్ధాంతం ప్రకారం మత ఆధారిత జాతీయవాదాన్ని నిర్మించేందుకు ప్రయత్నించింది. ఎన్నికలలో గెలిచే కొద్దీ, అటువంటి వాదానికే ప్రజామోదం లభిస్తున్నట్లు నమ్మసాగింది. కానీ, నిజానికి, అంతకన్న ముందటి పార్టీల వైఫల్యం వల్ల ఏర్పడిన శూన్యంలో తనది అతిథి పాత్ర మాత్రమే.

ఈ స్థితి గురించి అర్థం చేసుకోవలసిన విషయాలు కొన్నున్నాయి. ఒకవేళ బీజేపీ నాయకత్వం ఒక ప్రభుత్వంగా, తమ కన్న ముందటి ప్రభుత్వాలు విఫలమైన లోటుపాట్లను తీర్చి ప్రజలను సంతోషపెట్టగలిగి ఉంటే, అదే తమ ప్రాథమిక బాధ్యత అని గుర్తించి ఉంటే, హిందుత్వ భావనను అందుకు సమాంతరంగా ముందుకు తీసుకుపోయే ప్రయత్నం చేసి ఉంటే, ఆ లక్ష్యానిది రెండవ ప్రాధాన్యతే తప్ప మొదటి ప్రాధాన్యత కాదనుకుని ఆ ప్రకారం ముందుకు వెళ్లి ఉంటే, ఏమి జరిగేదో చెప్పలేము. వాజ్‌పేయి, అద్వానీల హయాం వరకు బహుశా అదే విధమైన వ్యూహంతో వ్యవహరించినట్లు ఇపుడు వెనుకకు తిరిగి చూస్తే అనిపిస్తుంది. కానీ వారికీ, మోదీకీ స్పష్టమైన తేడా లున్నాయి. వారి వ్యక్తిత్వాలు రూపు తీసుకున్న పరిస్థితులు, గుజరాత్ కాలం నుంచి మోదీ వ్యక్తిత్వం రూపు తీసుకున్న పరిస్థితులు వేరు.

'హిందూ హృదయ సామ్రాట్' అనే బిరుదును గుజరాత్ ముఖ్యమంత్రిగా సంపాదించుకున్న మోదీ (ఆ బిరుదు తన కన్న ముందు బాల్ ఠాకరే, కేశూభాయ్ పటేల్‌లకు ఉండేది), దేశాన్ని ఒక మత ఆధారిత జాతీయవాద రాజ్యంగా మార్చివేసే బాధ్యతను ప్రధానమంత్రిగా తన భుజాలపై వేసుకున్నారు. అది కూడా వీలయినంత వేగంగా చతురోపాయాలను ప్రయోగించి అయినా సరే. వాజ్‌పేయి, అద్వానీ వంటి వారికి భిన్నంగా తన నేపథ్యం, వ్యక్తిత్వం, స్వభావం అటువంటివి. అందువల్ల పద్ధతులూ భిన్నమైనవే. ఆ ప్రకారం పదేళ్ళలో ఏమేమి జరిగాయో, చివరకు మొన్నటి ప్రచార సమయంలో ఏమి జరిగిందో తెలిసిందే గనుక ఇక్కడ జాబితాలు అక్కరలేదు. అంతిమంగా ప్రజలు తమకు కావలసింది ఆధునిక, ప్రజాస్వామిక, అభివృద్ధికర జాతీయవాదం, అటువంటి వ్యవస్థలే తప్ప, మత ఆధారిత జాతీయవాదం కాదని తేల్చి చెప్పారు. మోదీ తిరిగి అధికారానికి వచ్చి ఉండవచ్చుగాక. కానీ సాక్షాత్తూ రామాలయమే గల ఫైజాబాద్ నియోజక వర్గంలో ఓటమి, అయోధ్య డివిజన్‌లోని మొత్తం ఐదు అసెంబ్లీ స్థానాలలో పరాజయం, కాశీపురాధీశుడినని నమ్మిన మోదీ మెజారిటీ సగానికి పైగా పడిపోవటం, హిందుత్వకు గుజరాత్ తర్వాతి ప్రయోగశాల అని చాటిన ఉత్తరప్రదేశ్‌లో సీట్లు సగానికి తగ్గిన పరాభవం చెప్తున్నదేమిటి? హిందూ మెజారిటీ దేశానికి కూడా కావలసింది ఆధునిక ప్రజాస్వామిక జాతీయవాదమే తప్ప, మతవాద ఆధారిత జాతీయవాదం కాదు. అంతెందుకు, ఈ 10వ తేదీన జరిగిన యూరోపియన్ యూనియన్ ఎన్నికల ఫలితాలను చూడండి. మితవాద పార్టీల బలం కొంత పెరిగిన మాట నిజం. కానీ ఆ పార్టీల అజెండాలో ఉన్నవి ఇతర అంశాలే తప్ప మతం కాదు.

మరొక విశేషాన్ని గమనించాలి. మోదీ నాయకత్వాన బీజేపీ బలం పెరుగుతుండిన దశలో కొందరు మేధావులు 'నిమ్న వర్గాల హిందూయిజం' (సబ్ ఆల్టర్న్ హిందూయిజం) అనే సూత్రీకరణలు చేశారు. ఆ వర్గాలు ఆ పార్టీకి ఓటు చేశాయి గనుక వారిలో హిందుత్వ వ్యాపిస్తున్నదని వారి మాట. ఇపుడు ఇందులోనే ఆ వర్గాలు వ్యతిరేకంగా ఓటు చేశాయి. ఇందుకు వారి వివరణ ఏమిటో చూడాలి. వారు గుర్తించవలసిందేమంటే, పైన చెప్పుకున్నట్లు, ఈ వర్గాలు గత ప్రభుత్వాల వైఫల్యం వల్ల కలిగిన జీవిత సమస్యలతో బీజేపీకి ఓటు చేశారు. ఆ పార్టీ విఫలమవుతున్నట్లు అర్థమై ఇపుడు దూరమవుతున్నారు. నిమ్న వర్గాల మత విశ్వాసాలు గానీ, జాతీయతా భావనలు గానీ ఏవిధంగా ఉంటాయో ఈ ఫలితాల వెలుగులో అర్థం చేసుకోవలసి ఉంటుంది. అదే విధంగా తిరిగి అధికారానికి వచ్చిన తర్వాత అమలు చేయదలచిన అల్ప సంఖ్యాక వర్గాల వ్యతిరేక చట్టాలు, ఆ వర్గాలపై మరింత విజృంభించాలనుకున్న సంఘ్ పరివార్ ప్రణాళికల విషయంలో పునరాలోచనలు అవసరమవుతాయి.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వెళ్లాలయితే!



ఇది అద్భుతం. రఫీ సాబ్ ఇంటినే మ్యూజియంగా మలిచారు. దీనిగురించి నాకు ఇంతకుముందు తెలీదు. (గాయకుడు మహమ్మద్ రఫీ హోమ్-మ్యూజియం ముంబయిలోని బాంద్రాలో ఉంది.)

– ఎస్.వై.ఖురేషి, కేంద్ర మాజీ ఎన్నికల ప్రధాన అధికారి

ఉండాల్సిన సంస్కారం



ఒడిశా ముఖ్యమంత్రి అభ్యర్థి, బీజేపీకి చెందిన మోహన్ చరణ్ మాఝీ... మాజీ ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్‌కు చెందిన నవీన్ పట్నాయక్‌ను కలిశారని వార్త. ఎంత అందమైన విషయం. ఇప్పటి రాజకీయ వాతావరణంలో లేకుండా పోతున్నది ఇదే. నవీన్ బాబుకు తగిన గౌరవం.

– కుమార్ గౌరవ్, రాజకీయాల ఉత్సాహి

దర్శనాలు తగ్గాయా?



ఆరు నెలల క్రితం, అయోధ్య రామ మందిరం కారణంగా బీజేపీ తేలిగ్గా 400 స్థానాలు గెలుచుకోగలనని అనుకుంది. ఇప్పుడేమో అయోధ్యకు వెళ్లే విమానాలు రద్దవుతున్నాయి. (హైదరాబాద్- అయోధ్య విమానాన్ని స్పైస్‌జెట్ రద్దు చేసిన నేపథ్యంలో.)

– మినీ నాయర్, రచయిత్రి

మద్దతెంత?



ఎన్నికల కమిషన్ గణాంకాల ప్రకారం, సుమారుగా 65 కోట్ల మంది భారతీయులు 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటేశారు. ఇందులో సుమారు 37 శాతం మంది బీజేపీకి ఓటేశారు. అంటే 23 కోట్ల మంది. ఇది మొత్తంగా దేశ జనాభా 140 కోట్లలో. ప్రతిపాదనలు మీకు మీరే చేసుకోండి.

– సందీప్ థాపర్, బ్రిగేడియర్ (రిటైర్డ్)

కొత్త చరిత్ర



నరేంద్ర మోదీ ప్రభుత్వంలో యాదవుల ప్రాతినిధ్యం అత్యున్నత స్థాయికి చేరుకుంది. చరిత్రలో ఏనాడూ కేంద్ర మంత్రి మండలిలో ఇంతమంది యాదవులు (4) మంత్రులుగా లేరు. భూపేంద్ర యాదవ్ (పర్యావరణం, అడవులు; కేబినెట్) అన్నపూర్ణ దేవి(మహిళా, శిశు సంరక్షణ; కేబినెట్), రావు ఇంద్రజిత్ సింగ్ (గణాంకాలు, ప్లానింగ్, కార్పొరేట్ ఎఫైర్స్; స్వతంత్ర హోదా), నిత్యానంద రాయ్(హోం; సహాయ) మంత్రులుగా ఉన్నారు.

– దిలీప్ మండల్, సంపాదకుడు

పట్టించుకోరా?



పశ్చిమ బెంగాల్‌లో 2021 శాసనసభ ఎన్నికల తర్వాత బేగమ్ (మమతా బెనర్జీ)... బీజేపీ కార్యకర్తలను క్రూరంగా వేటాడారు. ఇప్పుడు కూడా అలాగే చేస్తున్నారు. అయినా (మోహన్) భాగవత్‌గానీ, ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్లుగానీ దీని మీద మాట్లాడగా విన్నారా? బదులుగా భాగవత్ తన పశ్చిమ బెంగాల్ పర్యటనలో బేగమ్ ఆతిథ్యం స్వీకరించారు. ఇదీ ఆర్‌ఎస్‌ఎస్!

– సాస్వతీ సర్కార్, ప్రొఫెసర్

మద్దతుంటుంది కానీ...



ఒక ప్రత్యేక వర్గాన్ని, ముఖ్యంగా అమాయకులను లక్ష్యంగా చేసుకుని జమ్ము కశ్మీర్‌లో జరిగిన తీవ్రవాద సంఘటనలు విషాదకరం, ఖండనార్హమైనవి. తీవ్రవాద శక్తులను నిర్మూలించడానికి ప్రభుత్వం, భద్రతా బలగాలు చేపట్టే చర్యలకు బీఎస్పీ మద్దతు నిస్తుంది. కానీ ఈ పేరుతో రాజకీయాలు చేయకూడదు.

– మాయావతి, బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు

ఇన్ బాక్స్

కార్పొరేట్ స్కూళ్ల దోపిడి

నూతన విద్యాసంవత్సరం ప్రారంభం అవ్వడంతో అడ్మిషన్ల పేరుతో కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల పిల్లల తల్లిదండ్రులను దోచేస్తున్నాయి. పుస్తకాలు, యూనిఫాంలు తమ దగ్గరే కొనాలనే నిబంధన విధించి కేవలం అడ్మిషన్ల కాలంలోనే కోట్లాది రూపాయలను కొన్ని స్కూళ్లు సంపాదిస్తున్నాయి. అంతేకాక అడ్మిషన్ ఫీసు, డొనేషన్ల పేరుతో చేసే దోపిడీ ఇందుకు కొన్ని రెట్లు ఎక్కువ ఉంటోంది. ఎల్‌కేజీ, యూకేజీ ఫీజులే సుమారు రూ. 50 వేల నుంచి లక్ష వరకూ ఉంటున్నాయంటే ఈ సంస్థల దోపిడీ ఎంతో అర్థమవుతుంది. ప్రభుత్వాలు ఎన్ని జీవోలు, నిబంధనలు రూపొందించినా తమ రూల్ తమదే అన్నట్లు ఈ విద్యా సంస్థలు వ్యవహరిస్తున్నాయి. కొన్ని స్కూళ్లయితే ఒకేసారి మొత్తం అడ్మిషన్ ఫీజు, పాఠశాల ఫీజు కట్టాలంటున్నాయి.

కొన్ని స్కూళ్లు టెస్టులు పెట్టి మేనేజ్మెంట్ నిర్ణయించిన మార్కులు వస్తేనే సీట్లు ఇస్తున్నాయి. లేదంటే అడ్మిషన్ లేనట్టే. అడ్మిషన్ టెస్ట్ పెట్టదలచుకుంటే పెద్ద క్లాసుల వారికి పెట్టాలి. కానీ ముక్కుపచ్చలారని ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు పెట్టడం ఏమిటి? ఇంకో దారుణం ఏమిటంటే అసలు అప్లికేషన్ ధరనే వందలూ, వేల రూపాయలుగా నిర్ణయించడం. తెలంగాణలో ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ళల్లో ఫీజుల నియంత్రణ చేస్తామని ఎన్నికల ముందు పలికిన కాంగ్రెస్... అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదు. పేద, మధ్య తరగతి తల్లిదండ్రుల కష్టార్జితాన్ని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు జలగల్లా పట్టి పీల్చుతున్నాయి. ప్రభుత్వ అసమర్థత, అవకాశవాదాలతో ఈ విద్యాసంస్థలు ఆడిందే ఆట అయ్యింది. ఫీజుల నియంత్రణ కోసం టీఆర్‌ఎస్ ప్రభుత్వం 2017లో ప్రొఫెసర్ తిరుపతిరావు నేతృత్వంలో కమిటీ వేసింది. ఏడాదికి 10 శాతం ఫీజులు పెంచుకోవాలని ఆ కమిటీ సిఫార్సులు కూడా చేసింది. అయితే ఆ కమిటీ నివేదిక ఇప్పటికీ ప్రభుత్వ పరిశీలనలోనే ఉండిపోవడం గమనార్హం. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు మొత్తం సీట్లలో 25 శాతం పేద పిల్లలకు ఇవ్వాలి. కానీ ఈ స్కూళ్లు అసలు పట్టించుకోకపోవడం విచారకరం.

– ముంజంపల్లి దేవేందర్, ఏబీవీపీ నాయకుడు

ఎంపీని కానిస్టేబుల్ కొట్టడం దేనికి సంకేతం?

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

హిమాచల్ ప్రదేశ్ మండీ లోక్ సభ స్థానం నుండి నూతనంగా ఎన్నికైన ప్రముఖ సినీ తార కంగనా రనౌత్‌ను చండీగఢ్ విమానాశ్రయంలో సెక్యూరిటీ విధులను నిర్వహిస్తున్న కుల్వీందర్ కౌర్ అనే సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చెంప మీద కొట్టడం దేశ ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. ఎందుకు కొట్టావు అని సదరు ఎంపీ అడిగినప్పుడు రైతు చట్టాల వ్యతిరేక ఉద్యమానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలకు ఈ చెంప దెబ్బ అని దురుసుగా సమాధానం చెప్పడం అనేక అనుమానాలకు దారితీస్తోంది. ఆ కానిస్టేబుల్ సోదరుడు కిసాన్ మజ్దూర్ సంఘ్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉండడం, ఆమ్ ఆద్మీ సపోర్టుగా ఉండడం బట్టి చూస్తే- కంగనా రనౌత్‌పై దాడి యాదృచ్ఛికంగా జరిగింది కాదనీ, ఇది ఒక ప్రణాళికా బద్ధంగానే జరిగిందనే భావన కలుగక మానదు. నూతనంగా ఎన్నికైన కేంద్ర ప్రభుత్వం ఈ విషయంపై సమగ్రమైన విచారణ జరిపి, దేశ ప్రజలకు వాస్తవ విషయాలు తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.



కంగనా రనౌత్ కుల్వీందర్ కౌర్

రైతు వ్యతిరేక చట్టాల ఉద్యమం పేరుతో రైతుల ముసుగులో ఖలిస్థాన్ వేర్పాటు వాదుల మద్దతుదారులు రిపబ్లిక్ డే రోజున ఎర్రకోటపై ఖలిస్థాన్ జెండాను ఎగరవేయడం, శాంతి భద్రతలను పరిరక్షించడానికి వచ్చిన అనేక మంది పోలీసుల తలలు పగలగొట్టడం వంటి దృశ్యాలు దేశ ప్రజల స్మృతి పథంలో ఇప్పటికీ స్థిరంగానే ఉన్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ప్రతిపక్షాలు తమ రాజకీయ స్వార్థం కోసం రైతు చట్టాల వ్యతిరేక ఉద్యమకారులను రెచ్చగొడుతున్నాయనీ, పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశంలో అనేక చోట్ల హింస చెలరేగి శాంతి భద్రతలకు భంగం వాటిల్లుతుందనీ నిఘా వర్గాలు హెచ్చరించడంతో పోలీసులు సందర్భోచితంగా సంయమనం పాటించారు. దీంతో దేశానికి పెద్ద ముప్పే తప్పింది.

ప్రభుత్వ విధానాలపైనా, దేశంలో జరుగుతున్న అనేక సంఘటనలూ, ఉద్యమాలపైనా అనేకమంది వ్యతిరేకంగా, అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తుంటారు. అలాగే ఒక పౌరురాలిగా కంగనా కూడా రైతు ఉద్యమంపై వ్యాఖ్య చేశారు. ఈ చెంప దెబ్బ ఆ వ్యాఖ్యలు చేసినందుకే కొట్టానని కౌర్ చెప్పిన సమాధానం నమ్మశక్యంగా లేదు. సిక్కు తీవ్రవాద భావాలు కుల్వీందర్ కౌర్ మనసులో ఎవరైనా నాటి ఉండవచ్చునేమో! ఈ కోణంలో ఎందుకు ఆలోచించకూడదు? 1984 అక్టోబర్ 31న భారత ప్రధాన మంత్రి ఇందిరా గాంధీని కాల్చి చంపిన ఆమె అంగరక్షకులైన సత్వంత్ సింగ్, బియాంత్ సింగ్‌లు సిక్కులు అనే విషయం మరవకూడదు. నాడు వారు 'ఖలిస్థాన్' వేర్పాటు వాద భావజాలాన్ని తలకెక్కించుకుని ఆ ఘాతుకానికి ఒడిగట్టారు.

సిక్కు వేర్పాటు వాద నాయకుడు హర్దీప్ సింగ్ నిజ్జర్ 2023 జూన్ 18న కెనడాలో హత్యకు గురైన తర్వాత, కెనడా, అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఇటలీ వంటి దేశాలలో ఖలిస్థాన్ వేర్పాటు వాదుల మద్దతుదారులు భారతదేశానికి వ్యతిరేకంగా, హిందువులకు వ్యతిరేకంగా ప్రకటనలు గుప్పించారు. కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో... నిజర్ హత్య వెనుక భారత ప్రభుత్వ నిఘా వర్గాలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనికి మద్దతుగా అమెరికా దౌత్యవేత్తలు మాట్లాడడం, భారత ప్రభుత్వం ఇందుకు ఆధారాలు చూపించాలని కౌంటర్ వేయడం వంటి వాటి నేపథ్యంలో ఈ సంఘటనను పరిశీలించాలి.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

సమస్యలే దీవెనలు!

ప్రతి వ్యక్తికీ జీవితంలో సమస్యలు ఎదురవుతూనే ఉంటాయి. వానిని ధైర్యసాహసాలతో ఎదుర్కోవాలి. సమస్యల నుండి దూరంగా పరుగెత్తటం లేక వాటినిగూర్చి ఇతరులను నిందించటం సరికాదు.

మన సమస్యలకు కారణం ఏమిటి అని ఆలోచించినప్పుడు... మన కర్మలే అని జవాబు వస్తుంది. సమస్యలను ఎదుర్కోవడానికి దైవ సహాయం అవసరం. ముందుగా వాటిని ఎదుర్కోగలం అనే ఆత్మ విశ్వాసం కలిగి ఉండాలి. క్లిష్ట పరిస్థితిల్లోనూ ధైర్యంగా నిలబడాలి. సమస్యలను తీర్చుకోలేక సంసారాన్ని విడచి, అడవిని ఆశ్రయించటం వల్ల ప్రయోజనం ఉండదు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

నిరంతరం కృషి చేసినప్పుడే జయం లభిస్తుంది. బాధలు భరించటమే పరిపూర్ణతకు మార్గం. చెకుముకి రాళ్లను తీసుకొని ఒకదానితో ఒకటి గట్టిగా రాపిడి చేసినప్పుడే నిప్పురవ్వలు జనిస్తాయి. సమస్యలను మారు రూపంలో ఉన్న దీవెనలుగా భావించాలి. సమస్యలు ఉత్పన్నమైనపుడే నీవు వానిని ఏ విధంగా అధిగమించగలవో తెలుసుకొనే అవకాశం లభిస్తుంది. వాటి మూలంగా మనసు భగవంతునివైపు మరలగలదు.

జీవిత ప్రయాణంలో సుఖ దుఃఖాలు ఎల్లప్పుడూ ఉంటాయి. ఇప్పుడు లభించిన సుఖం రేపటికి ఉండదు. అదే విధంగా దుఃఖం కూడా చిరకాలం ఉండదు. సుఖ దుఃఖాలు నిరంతరం ఒకదాని తర్వాత ఒకటి వస్తూ పోతుంటాయి. వాటిని అతిథులుగా పరిగణించాలి. అతిథులు మనతో తాత్కాలికంగా కలసి ఉంటారు. నీవు నీ దృష్టిని (మనసును) భగవంతునిపై లగ్నం చేస్తే ఈ సుఖ, దుఃఖాలు నీకు ఏవిధమైన నష్టం చేయలేవు. రావడం, పోవడం వాటి సహజ లక్షణం. వాటి చావుదెబ్బలనుండి రక్షించుకోవాలంటే భగవంతుని లేక గురువును శరణు వేడాలి.

క్లుప్తంగా...

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే బాలరాజు పరామర్శ



శ్రీను కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న తెల్లం బాలరాజు తదితరులు

టి.నరసాపురం: వైఎస్సార్‌సీపీ ఓటమికి బాధపడుతూ మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ, తాను ఎప్పుడూ అండగా ఉంటామని ఏలూరు జిల్లా పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడినంత మాత్రాన మనోధైర్యాన్ని కోల్పోవద్దని సూచించారు. మండలంలోని పుట్రేపు గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలైందని మనస్తాపానికి గురై గుర్రం ధనరాజు కుమారుడు శ్రీను ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ కుటుంబాన్ని బాలరాజు బుధవారం పరామర్శించి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. బందంచర్లలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో–కన్వీనర్ నల్లూరి బాలకృష్ణ కుటుంబాన్ని కూడా పరామర్శించి వారికి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు.

రాజన్న కుటుంబానికి ఎమ్మెల్సీ దువ్వాడ పరామర్శ



రాజన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న దువ్వాడ

టెక్కలి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమితో మనస్థాపానికి గురైన టెక్కలి మండలం అక్కవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వంజంగి రాజన్న ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ తరఫున అండగా ఉంటామన్నారు.

టీడీపీ నేతపై అదే పార్టీ నేతల దాడి



కేశవరెడ్డి

పుంగనూరు (చిత్తూరు జిల్లా): పుంగనూరులో తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని స్థానిక మండల కార్యాలయంలో తిలకిస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు కేశవరెడ్డిపై ఆ పార్టీకి చెందిన వారే బుధవారం దాడి చేశారు. బాధితుడు కేశవరెడ్డి మీడియాతో మాట్లాడుతూ తనకు పుంగనూరు నియోజకవర్గ నాయకులతో సమన్వయం కుదరకపోవడంతో పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో టీడీపీ తరఫున ప్రచారాలు చేసినట్లు తెలిపారు. ప్రమాణ స్వీకారోత్సవాన్ని చూసేందుకు వచ్చిన తనను తమ పార్టీ వారే ఈడ్చుకొచ్చి తన్ని, చొక్కా, పసుపు టవలు చించివేశారని ఆరోపించారు. దీనిపై చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తానన్నారు.

వైఎస్సార్‌సీపీ ఓటమితో మరో బలవన్మరణం



హనుమంతరాయప్ప (ఫైల్)

గుడిబండ: శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ మండలం మందలపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హనుమంతరాయప్ప(41) ఆ పార్టీ ఓటమిని తట్టుకోలేక బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సారి కూడా జగన్ సీఎం అవుతారని బలంగా విశ్వసించాడు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చినప్పట్నుంచి ఎక్కడో ఏదో జరిగిందంటూ తీవ్ర ఆందోళనకు లోనవుతున్నాడు. ఈ మనోవేదనతో బుధవారం పొలంలోని చెట్టుకు ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. మృతుడికి భార్య హనుమక్క, ముగ్గురు పిల్లలున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి భరోసా ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులు, వైఎస్సార్ విగ్రహాలపై దాడులు ఆపండి: షర్మిల

సాక్షి, అమరావతి: ఎన్నికల ఫలితాలు తరువాత జరుగుతున్న ప్రతీకార చర్యలను ఇకనైనా ఆపాల్సిందిగా కూటమి ప్రభుత్వాన్ని ఏపీసీసీ చీఫ్ షర్మిల కోరారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబుకు, మంత్రులకు శుభాకాంక్షలు చెబుతూ ఆమె బుధవారం బహిరంగ లేఖ రాశారు. మెజారిటీతో అధికారంలోకి తెచ్చిన ప్రజల ఆశయాలకు, నమ్మకాలకు అనుగుణంగా.. సంక్షేమం, అభివృద్ధి, శాంతిభద్రతలను మిళితం చేసి ఇకపై ప్రజారంజక పాలన అందిస్తారని ఆశిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల మీద, ఇటు డాక్టర్ వైఎస్సార్ విగ్రహాల మీద జరుగుతున్న దాడులు తనను కలచివేశాయని తెలిపారు. ఇలాంటి దాడులు, శాంతిభద్రతలకే కాదు, రాష్ట్ర ప్రగతికి విఘాతం కలిగిస్తాయని హెచ్చరించారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టి ముందుకు తీసుకెళతారని ప్రజలు ఈ తీర్పు ఇచ్చారని, దానికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.

అటు ప్రమాణం.. ఇటు విధ్వంసం

రెచ్చిపోయిన టీడీపీ శ్రేణులు.. ప్రభుత్వ భవనాల పేరు మార్పు



తిరుపతిలోని తుడా కార్యాలయంపై ఉన్న వైఎస్ఆర్ పేరును తొలగిస్తున్న టీడీపీ నేతలు

- యథేచ్ఛగా శిలాఫలకాల ధ్వంసం
- విగ్రహాల కూల్చివేత
- ప్రభుత్వ ఆఫీసులపై టీడీపీ జెండాలు
- వైఎస్సార్‌సీపీ జెండాదిమ్మెల ధ్వంసం

సాక్షి నెట్‌వర్క్: ఒకవైపు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, జనసేన, కూటమి శ్రేణులు మరింత రెచ్చిపోయి విధ్వంసాలకు దిగాయి. పలు ప్రభుత్వ కార్యాలయాల పేర్లు మార్చేశారు. ప్రగతి పనుల శిలాఫలకాలను ధ్వంసం చేశారు. విగ్రహాలను నేలకూల్చారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై టీడీపీ జెండాలు కట్టారు. వైఎస్సార్‌సీపీ జెండాదిమ్మెల్ని ధ్వంసం చేశారు. అనంతపురం రూరల్ మండలం కాటిగానికాలువ గ్రామంలో రైతుభరోసా కేంద్రం (ఆర్బీకే) శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో కొందరు టీడీపీ కార్యకర్తలు



అనంతపురం జిల్లా కాటిగానికాలువలో ఆర్బీకే శిలాఫలకాన్ని సుత్తితో ధ్వంసం చేస్తున్న మహిళ

కాటిగానికాలువ రైతుభరోసా కేంద్రంలోకి కేక్ తీసుకొచ్చి కట్ చేశారు. అనంతరం బయటకు వచ్చి అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఒక మహిళ చేతికి సుత్తి ఇచ్చి పగులగొట్టించారు. తర్వాత ఇద్దరు కార్యకర్తలు ఆ శిలాఫలకాన్ని బయటకు తీసుకెళ్లి పూర్తిస్థాయిలో ధ్వంసం చేశారు. సచివాలయ భవనంపైకెక్కి టీడీపీ జెండా కట్టారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని ప్రభుత్వ కార్యాలయ భవనంపై కట్టిన టీడీపీ జెండాను పీకేయించారు. ఈ ఘటనపై మహిళా పోలీసు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన కేసులో వీడియో ఆధారంగా అదే గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, రామాంజనేయులు, చంద్రమౌళినాయుడుపై కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. అలాగే కొందరు బెదిరింపులకు దిగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఎవరైనా బెదిరిస్తే బాధితులు నేరుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. బెదిరించేవారిపట్ల పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు.

- కాకినాడ జిల్లాలోని పెద్దాపురం మండలం ఉలిమేశ్వరం గ్రామంలో విధ్వంసానికి పాల్పడ్డారు. మంత్రివర్గ ప్రమాణస్వీకారాన్ని ప్రజలు చూసేందుకు పంచాయతీ అధికారులు రైతుభరోసా కేంద్రంలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాజీ సభ్యుడు పేకేటి దొరబాబు, తదితరులు అక్కడున్న ఆర్బీకే ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. కార్యాలయంలోని కరపత్రాలు, అధికారిక పత్రాలను తగులబెట్టారు. ఇదెక్కడి దౌర్జన్యం అంటూ సర్పంచ్ భర్త ఆకుల వీరబాబు నిలదీశారు. దీంతో దొరబాబు, వీరబాబు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సీఐ రవికుమార్, ఎస్‌ఐ వెలుగుల సురేష్ అక్కడికి చేరుకుని రెండు



శ్రీకాకుళం జిల్లా ఆర్.హెచ్.పురంలో వైఎస్సార్ విగ్రహాన్ని కూల్చి పొదల్లో పడేసిన దృశ్యం

వర్గాలను చెదరగొట్టారు. పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు.

- చిత్తూరు జిల్లా నింద్ర మండలంలోని అగరం గ్రామ పంచాయతీలో సచివాలయం భవనం ప్రారంభోత్సవం నాడు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అప్పటి మంత్రి రోజా పేరిట ఉన్న శిలాఫలకాన్ని పగులగొట్టారు. ఈ విషయమై బుధవారం స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు.
- తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) కార్యాలయానికి ఉన్న డాక్టర్ వైఎస్సార్ పేరును దౌర్జన్యంగా తొలగించారు. ఆ స్థానంలో ఎన్టీఆర్ పేరు ఏర్పాటు చేశారు. కార్యాలయం లోపల ఉన్న వైఎస్సార్ ఫొటో అక్కడి నుంచి తొలగించారు.
- కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని ఈడేపల్లిలో శిశు విద్యామందిర్ వద్ద ఉన్న 45వ డివిజన్ సచివాలయానికి పసుపు పచ్చని నూతన బోర్డు ఏర్పాటు చేశారు. ఆ డివిజన్ టీడీపీ నాయకుడు పి.వి.ఫణికుమార్‌తో కలిసి నాయకులు, కార్యకర్తలు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి పవన్‌కళ్యాణ్, ఎంపీ వల్లభనేని బాలశౌరి చిత్రాలతో తయారు చేసిన సచివాలయం బోర్డు ఏర్పాటు చేశారు. బోర్డు ఏర్పాటుకు సచివాలయ సిబ్బంది సహకరించారు. ఫణికుమార్ కేక్ కట్ చేశారు.
- శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రం నెల్లూరులోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీలో వైఎస్సార్‌సీపీ జెండాను, స్థూపాన్ని, శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఘటనా స్థలాన్ని నెల్లూరు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్‌కే జమీర్‌అహ్మద్, పలువురు పార్టీ నాయకులు పరిశీలించారు.
- చిత్తూరు జిల్లా కుప్పం మండలం కొత్తయిండ్లు గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ధ్వంసం చేశారు. మొదటి నుంచి టీడీపీకి పట్టున్న గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను గెల్చుకున్న వైఎస్సార్‌సీపీ వర్గీయులు జెండా ఎగురవేసారు. అప్పటి నుంచి వైఎస్సార్‌సీపీపై అక్కసు వ్యక్తంచేస్తున్న టీడీపీ నాయకులు మంగళవారం రాత్రి జెండా పీకేసి స్థూపాన్ని ధ్వంసం చేశారని స్థానికులు తెలిపారు.
- శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం ఆర్.హెచ్.పురంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని మంగళవారం రాత్రి కూల్చివేశారు. గ్రామంలో టీడీపీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించిన అనంతరం విద్యుత్ సరఫరా నిలిపేసి సుమారు 15 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించి పొదల్లో పడేశారు. దీనిపై కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు.
- ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలో తెలుగుదేశం, జనసేన నాయకులు బుధవారం గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు కార్యకర్తలు సచివాలయం–2 భవనం ప్రారంభ సమయంలో ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్ల వద్ద బాణసంచా కాలుస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ మణికుమార్ చెప్పారు.
- తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపుసావరం గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతల విజయోత్సవ ర్యాలీ శృతితప్పింది. మోటారు సైకిళ్లపై ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు గ్రామంలోని జక్కంపూడి గ్రామ మోహన్‌రావు మల్టీపర్పస్ సెంటర్ గేట్లు తెరుచుకుని గ్రౌండ్‌లోకి ప్రవేశించారు. అక్కడున్న ఫ్లెక్సీలను చించేశారు. కళ్యాణ మంటపం గోడపై మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తదితరుల పేర్లున్న శిలాఫలకాన్ని లక్ష్యంగా చేసుకుని కొందరు రాళ్లు విసిరారు. దీంతో పలు కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయి. శిలాఫలకం పాక్షికంగా దెబ్బతింది.



కాకినాడ జిల్లా ఉలిమేశ్వరంలో టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన ఆర్బీకే శిలాఫలకం

వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతల దాడులు

కౌన్సిలర్‌పైన, మరో కౌన్సిలర్ భర్తపైన దాడి

పుంగనూరు/లింగసముద్రం: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం పూర్తికాగానే బుధవారం చిత్తూరు జిల్లా పుంగనూరులో టీడీపీ నేతలు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కౌన్సిలర్‌పైన, మరో కౌన్సిలర్ భర్త పైన దాడిచేసి కొట్టారు. కౌన్సిలర్ కొండవీటి నటరాజ ఇందిరా సర్కిల్‌లోని తన ఆఫీసులో కూర్చుని ఉండగా మాజీ కౌన్సిలర్ దేశాది ప్రకాష్ తన అనుచరులతో కార్యాలయంలోకి చొరబడ్డారు. దుర్భాషలాడుతూ నటరాజపై దాడిచేసి తీవ్రంగా కొట్టారు. నటరాజ తీవ్రంగా గాయపడ్డారు. మరో కౌన్సిలర్ సాజిదా భర్త గౌస్‌బాషా షామియానాలు, ఫ్యాన్లు , పాత్రలు అద్దెకు ఇచ్చే షాపు నిర్వహిస్తున్నారు. గౌస్‌బాషా షాపులో లేని సమయంలో తెలుగుదేశం నాయకులు స్టాండ్ ఫ్యాన్ తీసుకెళ్లి ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న గౌస్‌బాషా షాపునకు వచ్చి ఫ్యాన్ తీసుకెళ్లింది ఎవరని అడగడంతో టీడీపీకి చెందిన సద్దామ్, సుహేల్‌బాషా షాపులోకి చొరబడి దుర్భాషలాడుతూ ఆయనపై దాడిచేశారు. ఈ దాడులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై బాధితులు మాట్లాడుతూ తెలుగుదేశం వారు అకారణంగా తమపై దాడులు చేసి, ఆస్తులు ధ్వంసం చేసి భయభ్రాంతులను చేస్తున్నారని చెప్పారు. వారివల్ల తమకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు రక్షణ కల్పించాలని కోరారు.



పుంగనూరులో ఫ్యాన్‌ను ధ్వంసం చేస్తున్న టీడీపీ నేతలు

లింగసముద్రంలో వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపై రాళ్ల దాడి

చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా టీడీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహిస్తూ.. వైఎస్సార్‌సీపీ నేతల పట్ల కవ్వింపు చర్యలకు దిగి దాడులకు యత్నించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం మొగిలిచర్లలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ప్రదర్శనగా వెళ్తూ వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్ల ఎదుట బాణసంచా కాలుస్తూ కవ్వింపు చర్యలకు దిగారు. అక్కడితో ఆగకుండా రాళ్ల దాడికి పూనుకున్నారు. విషయం తెలుసుకున్న గుడ్లూరు సీఐ సుబ్బారావు, ఎస్సై ఎం.బాజీబాబు అక్కడకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి అక్కడ నుంచి పంపించివేశారు. కందుకూరు డీఎస్పీ శ్రీనివాసరావు మొగిలిచర్ల గ్రామానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. కవ్వింపు చర్యలకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్టు డీఎస్పీ చెప్పారు.



మొగిలిచర్లలో పోలీస్ పికెట్

దాడులు ఆపకపోతే.. బాధ్యత మీదే

చంద్రబాబు, పవన్‌కు మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ హెచ్చరిక

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడానికే అధికారంలోకి వచ్చారా?



దగ్ధమైన గడ్డివామిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలపై దాడులు ఆపాలని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత కొట్టు సత్యనారాయణ సూచించారు. లేకపోతే అన్నిటికీ మీరే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలంలోని మాధవరం గ్రామంలో కూటమి కార్యకర్తలు గడ్డివాములు తగలబెట్టడంతో నష్టపోయిన పాడి రైతులు గోపిశెట్టి వెంకన్నదొర, లక్కాకుల రామాంజనేయులు, వల్లూరి శ్రీనివాస్ తదితరులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. '2019లో మేము అధికారం చేపట్టిన తర్వాత ఇలాంటి ప్రతీకార చర్యలెక్కడా జరగలేదు. రాజకీయాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందించాం . కానీ ఇప్పుడు టీడీపీ, బీజేపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడకముందే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. మాధవరంలో వెంకన్నదొర, వీరాంజనేయులు, శ్రీనివాస్‌లు తమ పాడి పశువుల కోసం వేసిన గడ్డి వాములును ముగ్గురు వ్యక్తులు పెట్రోల్ పోసి తగలబెట్టడంతో రూ.10 లక్షలు మేర నష్టపోయారు. ఈ దాడులను చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రోత్సహిస్తున్నారా?' అని కొట్టు సత్యనారాయణ ప్రశ్నించారు. కాగా, ఈ ఘటన వల్ల సమీపంలోని చర్చి గోడ బీటలు వారడంతో పాస్టర్ డి.ప్రభాకర్‌కు కొట్టు సత్యనారాయణ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం జగన్నాథపురం గ్రామ సచివాలయం–1 వద్ద టీడీపీ, జనసేన కార్యకర్తలు ధ్వంసం చేసిన శిలాఫలకాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడానికా ప్రజలు అధికారం కట్టబెట్టింది? అని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ను ప్రశ్నించారు. సచివాలయాలు, ఆర్బీకేలు తదితరాల ద్వారా పరిపాలనను ప్రజలకు చేరువ చేశామన్నారు. కానీ ఇప్పుడు వాటిని కూడా ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

యథేచ్ఛగా హింసాకాండ.. ఇదేమి రాజ్యం?

▶ మొదటి పేజీ తరువాయి

చేయక ముందే ఇలాంటి దారుణాలు జరిగాయంటే రాబోయే ఐదేళ్లు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చన్నారు. టీడీపీ గూండాల దాడులపై రాష్ట్రపతి, ప్రధాని, హోంమంత్రి, ఎన్‌హెచ్ఆర్సీ కార్యాలయాల్లో బుధవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందచేసిన అనంతరం వైఎస్సార్ సీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, మోపిదేవి వెంకటరమణారావు, బీద మస్తాన్‌రావు, రఘునాథరెడ్డి, బాబూరావు, తనూజరాణి, గురుమూర్తిలతో కలిసి పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. టీడీపీ మూకల దాడులకు సంబంధించి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి ఏమన్నారంటే..

చంద్రబాబుది ఆటవిక పాలన

టీడీపీ అధినేత చంద్రబాబుది ఆటవిక పాలనకు నిదర్శనంగా నిలుస్తోంది. ఏపీలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిన విషయాన్ని ప్రజలు గుర్తిస్తున్నారు. టీడీపీ గూండాల అకృత్యాలను రాజ్యాంగ వ్యవస్థల దృష్టికి తీసుకెళ్లాం. రాష్ట్రంలో చట్టాలు, స్వేచ్ఛ, న్యాయ పాలన లేదు. అన్యాయం రాజ్యమేలుతోంది. కనీసం ఫిర్యాదు తీసుకునేందుకు కూడా అధికారులు జంకడం చంద్రబాబు పాలన ఎలా ఉంటుందో బోధపడుతుంది. ప్రమాణ స్వీకారం కంటే ముందే రాష్ట్రాన్ని అత్యంత భయానక వాతావరణంలోకి నెట్టారు. ఇప్పటి వరకూ ఎన్నో ఎన్నికలు జరిగాయి. ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి, వెళ్లాయి కానీ ఇలాంటి దుష్ట సంప్రదాయాలకు నాంది పలికింది చంద్రబాబే.

ముందే దాడులకు పురిగొల్పి..

ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి మొదలైన దాడులు ఫలితాల తర్వాత తీవ్రరూపం దాల్చాయి. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలు, మద్దతుదారుల ప్రాణాలు, ఆస్తులను లక్ష్యంగా చేసుకొని టీడీపీ గూండాలు స్వైర విహారం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం అంటేనే గూండాగిరీ అని రుజువు చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ముందే దాడులకు పురిగొల్పి చంద్రబాబు బాధ్యత నుంచి తప్పించుకునే ఎత్తుగడ వేశారు. వీటిని అరికట్టాల్సిన పోలీసు వ్యవస్థ నీరుగారిపోయింది. బాధితుల ఆక్రందనలు తమ కుటుంబ సభ్యులవిగానే భావించి ఈ రక్త చరిత్రను అరికట్టాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉంది.



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి పక్కన మిథున్ రెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి తదితరులు

మూడుసార్లూ బీజేపీ అండతో పీఠం

1999, 2014, 2024లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మూడుసార్లూ బీజేపీ సహకారం వల్లే పీఠం దక్కించుకున్నారు. హింసాకాండకు రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బీజేపీ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. భావితరాలకు హింసా సంస్కృతిని నేర్పడం ఎవరూ హర్షించరు. అధికారం అంటే బాధ్యత అని గుర్తుంచుకోవాలి. అధికారం అంటే రౌడీయిజం గూండాయిజం కాదు. బడుగు, బలహీన వర్గాలు, నిరుపేదలపై టీడీపీ సాగిస్తున్న దౌర్జన్యకాండ సభ్య సమాజం తలదించుకొనేలా ఉంది. యూనివర్సిటీలు, వీసీలపై దాడులు తగవు. అమానవీయ ఘటనలకు పాల్పడడమే కాకుండా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారు. మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త రాజ్‌కుమార్‌పై లోకేష్ మనుషులు చేసిన దాడిని సోషల్ మీడియాలో అందరూ చూశారు. బంగారం లాంటి రాష్ట్రం తగలడుతుంటే బాధగా ఉంది. ఏపీలో ఘటనలకు కేంద్రం కూడా తలవంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మీడియాపైనా అణచివేత ధోరణి ప్రదర్శిస్తున్నారు. టీవీ 9, ఎన్‌టీవీ, సాక్షి తదితర చానెళ్లను ఎంఎస్‌వోల నుంచి తొలగిస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిణామాలు చూస్తుంటే ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందన్న భావన కలుగుతోంది. ఏపీలో రాజ్యాంగం కుప్పకూలిపోయింది. రాష్ట్రపతి, ప్రధాని, హోంమంత్రిని మరోసారి నేరుగా కలిసి రాష్ట్రంలో పరిస్థితులపై ఫిర్యాదు చేస్తాం.

రాష్ట్రం, దేశ ప్రయోజనాలే లక్ష్యం

పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులకు సంబంధించి రాష్ట్రం, దేశ ప్రయోజనాలే పరమావధిగా వైఎస్సార్‌సీపీ వ్యవహరిస్తుందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. గతంలోనూ అదే రీతిలో బిల్లులకు మద్దతు ఇచ్చామని మీడియా ప్రశ్నలకు సమాధానంగా పేర్కొన్నారు. ప్రస్తుతం ఉభయ సభల్లో టీడీపీకి 16 మంది ఎంపీలుండగా వైఎస్సార్‌సీపీకి 15 మంది సభ్యులున్నారని చెప్పారు. రాజ్యసభలో బిల్లులు ఆమోదం పొందాలంటే ఎన్డీఏ ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ అవసరం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వానికి అటు టీడీపీ, ఇటు వైఎస్సార్‌సీపీ అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయినప్పటికీ పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీదే బలమెక్కువ అని తెలిపారు. ఎన్డీఏ కూటమా? ఇండియా కూటమా? అనేది కాకుండా రాష్ట్రం, దేశ ప్రయోజనాలే లక్ష్యంగా బిల్లులకు తమ మద్దతు ఉంటుందన్నారు. ఎన్డీఏ సంఖ్యాబలం ఆధారంగా కొద్ది మెజారిటీతోనైనా లోక్‌సభ స్పీకర్ ఎంపిక జరిగిపోతుందని చెప్పారు. ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫైడ్ సివిల్ కోడ్)కి తాము మద్దతు ఇవ్వబోమన్నారు. ఒకే దేశం – ఒకే ఎన్నికలపై తమ పార్టీ అధినేత సూచనలు తీసుకొని ముందుకెళ్తామని విజయసాయిరెడ్డి తెలిపారు. ఎన్నికల ఫలితాలపై నియోజకవర్గాల వారీగా సమీక్ష చేపడతామని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్, వామపక్షాలు, టీఆర్ఎస్.. ఇలా దేశంలో అన్ని పార్టీలతోనూ జత కట్టిన మహానాయకుడు చంద్రబాబు మినహా మరెవరూ లేరని వ్యాఖ్యానించారు.

నూతన ప్రభుత్వానిదే బాధ్యత

రాష్ట్రంలో కొద్ది రోజులుగా చెలరేగుతున్న హింసాత్మక ఘటనలకు నూతన ప్రభుత్వమే బాధ్యత వహించాలి. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం. ఎన్నికల తర్వాత కూడా రాజకీయాలు చేయడం సరికాదు. ప్రజాతీర్పును గౌరవిస్తూ హామీలను నెరవేర్చి చిత్తశుద్ధి చాటుకోవాలి. వైఎస్సార్‌సీపీకి 40 శాతం మంది ఓటర్లు మద్దతు పలికారు. కొత్త ప్రభుత్వం అందరినీ సమాన దృష్టితో చూడాలి. – మిథున్‌రెడ్డి, ఎంపీ

న్యాయ పోరాటం చేస్తాం

రాష్ట్రంలో శాంతి భద్రతల దారుణ వైఫల్యంపై రాష్ట్రపతి, ప్రధాని, హోంశాఖ, ఎన్‌హెచ్ఆర్సీలకు ఫిర్యాదు చేశాం. తగిన స్పందన లేకుంటే న్యాయ పోరాటం చేస్తాం. టీడీపీ గూండాయిజం భరించలేక ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు నెలకొన్నాయి. కుట్రపూరితంగా ప్రమాణ స్వీకారం కంటే ముందే కార్యకర్తల్ని టీడీపీ అధినేత చంద్రబాబు ఉసిగొల్పారు. మా కార్యకర్తల్ని కాపాడుకుంటాం. బాధిత కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటాం. అల్లరి మూకలు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నా పోలీసులు చోద్యం చూస్తూ ఊరుకున్నారు. ఏపీలో జరిగిన హింసాత్మక ఘటనలను పార్లమెంట్ దృష్టికి తెస్తాం. – వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ

రణధీరపురం సర్పంచ్ భర్తపై టీడీపీ కార్యకర్తల దాడి



గాయపడిన లక్ష్మీనారాయణ

మంగళం: తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై టీడీపీ కార్యకర్తల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తిరుపతి రూరల్ మండలం రణధీరపురం పంచాయతీ సర్పంచ్ లీలావతి భర్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణపై బుధవారం అదే పంచాయతీకి చెందిన టీడీపీ కార్యకర్తలు కర్రలతో దాడిచేశారు. తీవ్రంగా కొట్టారు. తీవ్రంగా గాయపడి స్పృహ తప్పిన ఆయన్ని కుటుంబసభ్యులు రుయా ఆస్పత్రికి తరలించారు. తిరుపతి నుంచి రణధీరపురానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా డీమార్ట్ సమీపంలో తన వాహనానికి కారు అడ్డుపెట్టి అందులో నుంచి దిగిన ఇద్దరు వ్యక్తులు కర్రలతో కొట్టినట్లు లక్ష్మీనారాయణ తెలిపారు. భుజాలు, చేతులు, కాళ్లకు తీవ్రగాయాలై పడిపోయినట్లు చెప్పారు. రెండు రోజుల కిందట సప్తగిరి కాలనీ పంచాయతీ ఉప సర్పంచ్ అశోక్‌రెడ్డి ఇంటిపై దాడిచేసి కారును ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్తలే తనపై దాడి చేసినట్లుగా తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీనారాయణను మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

49 కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం... మంది దుర్మరణం

మృతుల్లో 42 మంది భారతీయులే! ● 50 మందికి గాయాలు



అగ్నిప్రమాదం జరిగిన భవనం నుంచి దట్టంగా వెలువడుతున్న పొగ

దుబాయ్: గల్ఫ్ దేశం కువైట్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఏకంగా 49 మంది మరణించారు. వీరిలో ఏకంగా 42 మంది భారతీయులేనని సమాచారం. మరో 50 మందికిపైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం కనిపిస్తోంది. బాధితుల్లో ఎక్కువమంది కేరళకు చెందినవారని సమాచారం. తమిళనాడు, ఉత్తరాది రాష్ట్రాలకు చెందినవారు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఉపాధి కోసం వలస వచ్చి ప్రాణాలు పోగొట్టుకోవడం తీవ్ర విషాదానికి గురిచేసింది. కువైట్ దక్షిణ అహ్మదీ గవర్నరేట్‌లో మాంగాఫ్ ప్రాంతంలోని ఆరు అంతస్థుల భవనంలో బుధవారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఈ ప్రమాదం జరిగినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. తొలుత వంటగది నుంచి మంటలు వ్యాపించినట్లు తెలియజేశారు. ఈ భవనంలో 200 మందికిపైగా భవన నిర్మాణ కార్మికులు నివసిస్తున్నారు. వివిధ దేశాల నుంచి వలస వచ్చిన వీరంతా ఎన్‌బీటీసీ గ్రూప్ అనే నిర్మాణ సంస్థలో పని చేస్తున్నారు. కార్మికుల వసతి కోసం ఈ సంస్థ సదరు భవనాన్ని అద్దెకు తీసుకుంది. మృతులు 20 నుంచి 50 ఏళ్ల లోపు వారేనని అరబ్ టైమ్స్ పత్రిక వెల్లడించింది. అగ్నిమాపక సిబ్బంది చాలాసేపు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాద సమయంలో కార్మికులు నిద్రలో ఉన్నారు. దట్టమైన పొగ వ్యాపించింది. దాన్ని పీల్చడం వల్లే ఎక్కువ మంది మరణించారు.

క్షతగాత్రులకు ఆసుపత్రిలో చికిత్స

అగ్నిప్రమాదంలో చాలామంది భారతీయులు మరణించడంపై కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ నెంబర్ +965-65505246 ఏర్పాటు చేసింది. సహాయం, సమాచారం అవసరమైన వారు తమను సంప్రదించాలని సూచించింది. బాధితులకు అవసరమైన సాయం అందిస్తామని ప్రకటించింది. కువైట్ మొత్తం జనాభాలో భారతీయులు 21 శాతం(10 లక్షలు) ఉంటారు. కువైట్‌లోని మొత్తం కార్మికుల్లో 30 శాతం మంది(దాదాపు 9 లక్షలు) భారతీయులే కావడం విశేషం. అగ్నిప్రమాదంలో మరణించినవారికి భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మాంగాఫ్ ప్రాంతంలోని ఘటనాస్థలాన్ని భారత రాయబారి ఆదర్శ్ స్వాయికా సందర్శించారు. గాయపడి వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న భారతీయులను పరామర్శించారు. తగిన సాయం అందిస్తామని భరోసా కల్పించారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించే విషయంలో కువైట్ అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. బాధితుల్లో కొందరి ఆరోగ్య పరిస్థితి విషమంగా, మరికొందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వివరించారు.

యాజమాన్యం దురాశకు అమాయకులు బలి

మాంగాఫ్ భవన యజమానిని తక్షణమే అరెస్టు చేయాలని కువైట్ ఉప ప్రధానమంత్రి షేక్ ఫహద్ అల్-యూసుఫ్ అల్-సబా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్మికులకు తగిన భద్రత కల్పించని భవన నిర్మాణ కంపెనీ యజమానికి సైతం అరెస్టు చేయాలన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కంపెనీ యాజమాన్యంతోపాటు భవన యజమాని దురాశ వల్ల అమాయకులు బలయ్యారని ఆయన విమర్శించారు. ఒకే భవనంలో పెద్ద సంఖ్యలో కార్మికులు నివసించడం నిబంధనలకు విరుద్ధమేనని చెప్పారు. ఇలాంటి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అగ్నిప్రమాదానికి బాధ్యులుగా గుర్తించి పలువురు అధికారులను కువైట్ ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి

హుటాహుటిన కువైట్‌కు మంత్రి రాజవర్ధన్ సింగ్

కువైట్ అగ్నిప్రమాదం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రమాదంలో ఆప్తులను కోల్పోయిన వారికి సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. కువైట్ భారత రాయబార కార్యాలయం సహాయక చర్యల్లో నిమగ్నమైందని 'ఎక్స్'లో మోదీ పోస్టు చేశారు. ఈ ఉదంతంపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష జరిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ప్రధాని ఆదేశాల మేరకు విదేశాంగ శాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్ సింగ్ కువైట్‌కు బయలుదేరారు. సహాయ చర్యలను ఆయన స్వయంగా పర్యవేక్షిస్తారు. మృతుల్లో మలయాళీలు ఎక్కువగా ఉన్నారన్న వార్తల నేపథ్యంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అప్రమత్తమయ్యారు. కేంద్రం వెంటనే తగిన సాయం అందించాలని, బాధితులను ఆదుకోవాలని కోరుతూ విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌కు లేఖ రాశారు.

పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలు

పార్టీలకు కేంద్రం వినతి ● 24 నుంచి జూలై 3 దాకా సమావేశాలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో నిర్మాణాత్మక చర్చలు సాగిద్దామని పార్టీలకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విజ్ఞప్తి చేశారు. సభలో అర్థవంతమైన చర్చలు, సంవాదాలు జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. 18వ లోక్‌సభ సమావేశాలు ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు. 'టీమ్ ఇండియా'గా మనమంతా కలిసి పని చేద్దామని ఎంపీలకు పిలుపునిచ్చారు. కిరణ్ రిజిజు బుధవారం మీడియాతో మాట్లాడారు. దేశానికి మంచి జరగాలంటే చట్టసభల్లో నాణ్యమైన చర్చలు జరగాలన్నారు. పార్లమెంట్ సజావుగా సాగడానికి అన్ని పార్టీల సహకారం కోరుకుంటున్నామని వివరించారు. చర్చల్లో ఎంపీలంతా భాగస్వాములు కావాలన్నారు. లోక్‌సభలో విపక్ష ఎంపీలు అధికంగా ఉండడం ఒక సవాలేనని అభిప్రాయపడ్డారు. ఈ నెల 24న ప్రారంభమయ్యే లోక్‌సభ సమావేశాలు వచ్చే నెల 3న ముగుస్తాయన్నారు. మొదటి మూడు రోజులపాటు కొత్తగా ఎన్నికైన ఎంపీల ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. ఈ నెల 27న పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారని తెలిపారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

ఇద్దరు ఉగ్రవాదుల హతం ● అమరుడైన జవాను

జమ్మూ/భదర్వా: కశ్మీర్‌లో మళ్లీ ఉగ్ర ఘటనలు పెచ్చరిల్లుతున్నాయి. కథువా జిల్లాలో ఇద్దరు ఉగ్రవాదులను సైన్యం హతమారిస్తే, దోడా జిల్లాలో చెక్‌పోస్ట్‌పై ఉగ్రవాదులు బుల్లెట్ల వర్షం కురిపించి పారిపోయారు. శివ్‌ఖోరీ నుంచి కాత్రా వెళ్తున్న యాత్రికుల బస్సుపై ఉగ్రదాడి జరిగి 9 మంది మరణించిన ఘటన మరువకముందే మళ్లీ కశ్మీర్‌లో కాల్పుల మోత మోగింది. వివరాలను జమ్మూ జోన్ అదనపు డీజీపీ ఆనంద్ బుధవారం వెల్లడించారు. ''మంగళవారం రాత్రి సరిహద్దు దాటి వచ్చిన ఉగ్రవాదులు సైదా సుఖాల్ గ్రామంలో చొరబడి ఒక ఇంట్లో తాగేందుకు నీళ్లు అడగడంతో గ్రామస్థులు భయపడి మాకు సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన సీఆర్‌పీఎఫ్, ఆర్మీ, పోలీసు బృందాలు ముమ్మర గాలింపు చేపట్టాయి. ఈ గాలింపు సందర్భంగా ఉగ్రవాది విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో మధ్యప్రదేశ్‌కు చెందిన కబీర్ దాస్ అనే సీఆర్‌పీఎఫ్ జవాను తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ సందర్భంగా ఆర్మీ జరిపిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఘటనాస్థలి నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలు, ఐఈడీలు, గ్రనేడ్లను స్వాధీనం చేసుకున్నాం'' అని ఆయన చెప్పారు. ఈ ఘటనలో ఒక పౌరునికి సైతం గాయాలయ్యాయి.

చెక్‌పోస్ట్‌పై గుళ్ల వర్షం

దోడా జిల్లాలోని భదర్వా-పఠాన్‌కోట్ రోడ్డులోని ఛత్తర్‌గల్లా ప్రాంతంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నారనే సమాచారంతో తాత్కాలిక సంయుక్త చెక్‌పోస్ట్‌ను ఆర్మీ, పోలీసులు ఏర్పాటుచేశారు. మంగళవారం రాత్రి ఆ చెక్‌పోస్ట్ దాటేందుకు వచ్చిన నలుగురు ఉగ్రవాదులు చెక్‌పోస్ట్‌పై బుల్లెట్ల వర్షం కురిపించారు. ఈ దాడిలో రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన ఐదుగురు, స్పెషల్ పోలీస్ ఆఫీసర్ గాయపడ్డారు. పారిపోయిన ఉగ్రవాదుల కోసం వేట కొనసాగుతోంది.

అత్తను చంపిన కోడలికి మరణశిక్ష

రేవా(మధ్యప్రదేశ్): అత్తను అత్యంత పాశవికంగా హత్య చేసిన కేసులో కోడలికి మధ్యప్రదేశ్ న్యాయస్థానం మరణశిక్ష విధించింది. రేవా జిల్లా అత్రాలియాలో 2022లో ఈ దారుణం జరిగింది. 24 ఏళ్ల కోడలు కంచన్‌కు అత్త సరోజ్‌తో తీవ్ర వాగ్వాదం జరిగింది. పట్టరాని ఆవేశంతో కోడలు పదునైన కొడవలితో అత్తను నరికి చంపింది. ఈ కేసులో కంచన్‌కు మరణశిక్ష విధిస్తూ జిల్లా నాలుగో అదనపు సెషన్స్ జడ్జి బుధవారం తీర్పు ఇచ్చారు. సరోజ్‌ను కంచన్ 95 సార్లకు పైగా దారుణంగా నరికినట్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వికాస్ ద్వివేది మీడియాకు వెల్లడించారు.

86కు చేరిన కాంగో పడవ మృతులు

కిన్షాసా: కాంగోలో పడవ మునిగిన దుర్ఘటనలో మృతుల సంఖ్య 86కు పెరిగింది. 271 మంది ప్రయాణికులతో కిక్కిరిసిన నాటు పడవ ఇంజన్ వైఫల్యంతో మంగళవారం నీట మునగడం తెలిసిందే. 185 మంది ఈదుతూ ఒడ్డుకు చేరుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. దట్టమైన అటవులు, నదుల కారణంగా కాంగోలో రోడ్డు వ్యవస్థ సరిగా లేదు. జనం పడవ ప్రయాణాలకే మొగ్గుచూపుతారు. పడవ ప్రమాదాలు అక్కడ సర్వసాధారణం. ఫిబ్రవరిలోనూ నాటు పడవ మునిగి డజన్లకొద్దీ చనిపోయారు.

ఢిల్లీలో ఉత్తుత్తి బాంబు బెదిరింపులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానికి బాంబు బెదిరింపుల బెడద ఎక్కువైంది. ఢిల్లీలోని మ్యూజియాలు, ఆస్పత్రులను బాంబులతో పేల్చేస్తున్నట్లు ఆగంతకులు పంపిన ఈ మెయిల్స్ బుధవారం పోలీసులను ఉరుకులు పరుగులు పెట్టించాయి. ముమ్మర తనిఖీలు చేసి అవన్నీ ఉత్తుత్తి బెదిరింపులేనని లేదని తేల్చారు. నేషనల్ మ్యూజియం, రైల్వే మ్యూజియం, ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ బిహేవియర్, విద్యాసాగర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, న్యూరో, అలైడ్ సైన్సెస్ మానసిక వైద్యాలయాలకు బాంబు బెదిరింపు ఈమెయిల్స్ వచ్చాయి. ఢిల్లీలో ఎయిర్‌పోర్టులు, స్కూళ్లు, ఆస్పత్రులు, ఆఫీసులకు నెల రోజులుగా బెదిరింపు మెయిల్స్ వస్తున్నాయి.

నేడు ఇటలీకి మోదీ

జీ-7 సదస్సులో పాల్గొననున్న ప్రధాని

న్యూఢిల్లీ: జీ7 అత్యాధునిక ఆర్థిక వ్యవస్థల శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ఇందుకోసం జీ7 సదస్సుకు ఆతిథ్యమిస్తున్న ఇటలీకి గురువారం ప్రధాని మోదీ బయల్దేరనున్నారు. మూడోసారి ప్రధానిగా పగ్గాలు స్వీకరించాక మోదీ మొట్టమొదటి విదేశీ పర్యటన ఇదేకావడం విశేషం. గత ఏడాది భారత సారథ్యంలో ముగిసిన జీ20 శిఖరాగ్ర సమావేశాల తర్వాత జరుగుతున్న సదస్సు కావడంతో ఈ భేటీలో తీసుకునే నిర్ణయాలపై ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఇటలీలోని అపూలియో ప్రాంతంలోని విలాసవంత బోర్గో ఎగ్నాజియా రిసార్ట్‌లో జీ7 శిఖరాగ్ర సదస్సు జూన్ 13వ తేదీ నుంచి 15వ తేదీదాకా జరగనుంది. ఉక్రెయిన్ యుద్ధంతోపాటు ఇజ్రాయెల్ దాడులతో శిథిలమవుతున్న గాజా స్ట్రిప్‌ను ఆదుకునేందుకు, యుద్ధాలను ఆపేందుకు అధినేతలు సమాలోచనలు జరపనున్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్, జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ఇటలీ మహిళా ప్రధాని జార్జియా మెలానీ తదితర అగ్రనేతలు ఈ భేటీకి హాజరవుతున్నారు. రష్యా భీకర దాడులను ఎదుర్కొంటున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ సైతం ఒక సెషన్‌లో పాల్గొని రష్యాపై విమర్శల వర్షం కురిపించనున్నారు. మోదీ విదేశీ పర్యటన వివరాలను భారత విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ ఖ్వాత్రా వెల్లడించారు. ''చర్చలు, సంప్రతింపుల ప్రక్రియ ద్వారా ఉక్రెయిన్, హమాస్-ఇజ్రాయెల్ యుద్ధాలకు ముగింపు పలికేందుకు భారత్ ఎప్పటిలాగే సదా సిద్ధంగా ఉంది' అని ఖ్వాత్రా చెప్పారు. స్విట్జర్లాండ్‌లో జరగబోయే శాంతి సదస్సులోనూ భారత్ ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. అయితే భారత్ తరఫున ఎవరు హాజరవుతారనే వివరాలను ఆయన వెల్లడించలేదు.

గాంధీజీ ప్రతిమ వద్ద ఖలిస్తానీ రాతలు



గాంధీ ప్రతిమపై రాసిన వేర్పాటువాద నినాదాలు

ఇటలీలో మోదీ గురువారం పర్యటన మొదలుకానున్న ఒక్క రోజు ముందే అక్కడి గాంధీజీ ప్రతిమ వద్ద ఖలిస్తానీ మద్దతుదారులు వేర్పాటువాద రాతలు రాశారు. కెనడాలో హత్యకు గురైన ఖలిస్తానీ వేర్పాటువాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ అనుకూల నినాదాలనూ ప్రతిమ పీఠం వద్ద నలుపురంగుతో రాశారు. ప్రతిమను ఆవిష్కరించిన కొద్దిసేపటికే వేర్పాటువాదులు ఈ చర్యలకు తెగబడ్డారు. వేర్పాటువాదుల దుశ్చర్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. తగిన చర్యలు తీసుకోవాలని ఇటలీ అధికారులకు సూచించామని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ ఖ్వాత్రా చెప్పారు. వెంటనే స్థానిక యంత్రాంగం ఘటనాస్థలికి చేరుకుని ఖలిస్తానీ రాతలను తుడిచేసింది.

బెల్ట్‌తో కొట్టి.. చితకబాది... పొట్టన పెట్టుకున్నాడు!

కన్నడ నటుడు దర్శన్ నిర్వాకం

బెంగళూరు: కర్ణాటకలో సంచలనం సృష్టించిన ఫార్మసీ ఉద్యోగి రేణుస్వామి హత్య కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం కన్నడ నటుడు దర్శన్, అతని అభిమానులు రేణుస్వామిని దారుణంగా కొట్టి చంపారు! రేణుస్వామికి తగిన 'బుద్ధి' చెప్పాలంటూ నటి పవిత్ర దర్శన్‌ను ఉసిగొల్పిందని తెలుస్తోంది. తన అభిమాన సంఘాల సమన్వయకర్త రాఘవేంద్రను ఈ పనికి దర్శన్ పురమాయించారు. రాఘవేంద్ర తన భర్తను ఇంటి సమీపంలో వాహనం ఎక్కించుకుని తీసుకెళ్లాడని రేణుస్వామి భార్య చెప్పారు. అతన్ని బెంగళూరు సమీపంలో ఒక షెడ్డులో దర్శన్ బెల్ట్‌తో చితకబాదారు. అభిమానులు కర్రలతో కొట్టారు. ఎముకలు విరిగి, సున్నిత ప్రాంతాల్లో అంతర్గత గాయాలై రేణుస్వామి అక్కడికక్కడే మరణించారు. మృతదేహాన్ని మురికి కాలువలో పడేశారు. దాన్ని వీధి కుక్కలు తినడం చూసి ఫుడ్ డెలివరీ బాయ్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ కేసులో దర్శన్, పవిత్రతో పాటు 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారందరినీ బుధవారం ఘటనా స్థలికి తీసుకెళ్లి సీన్ రీ కన్‌స్ట్రక్ట్ చేశారు.

వయనాడ్.. రాయ్‌బరేలీ... తేల్చుకోలేకపోతున్నా: రాహుల్

కేంద్రంలో బలహీన ప్రభుత్వం ● కేరళ పర్యటనలో వ్యాఖ్యలు



చిన్నారితో సరదాగా మాట్లాడుతున్న రాహుల్

మలప్పురం/వయనాడ్: వయనాడ్, రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానాల్లో ఏది వదులుకోవాలో ఎటూ తేల్చుకోలేకపోతున్నానని, ప్రస్తుతం డైలమాలో ఉన్నానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. తాను ఎలాంటి నిర్ణయం తీసుకున్నప్పటికీ రెండు నియోజకవర్గాల ప్రజలు సంతోషిస్తారని అన్నారు. తనను వరుసగా రెండోసారి గెలిపించిన వయనాడ్ ప్రజలకు రాహుల్ కృతజ్ఞతలు తెలియజేశారు. రాహుల్ గాంధీ బుధవారం కేరళలో పర్యటించారు. మలప్పురం, వయనాడ్ జిల్లాల్లో బహిరంగ సభల్లో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆయన కేరళకు రావడం ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. మోదీకి వచ్చినట్లుగా తనకు భగవంతుడి నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పారు. దేశంలోని ఎయిర్‌పోర్టులను, విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను అదానీకి అప్పగించాలంటూ మోదీని దేవుడి ఆదేశించాడని ఎద్దేవా చేశారు. ''నేను ఒక సాధారణ మనిషిని. పేద ప్రజలే నాకు దేవుళ్లు. జనంతో మాట్లాడుతుంటా. నేనేం చేయాలో వారు చెబుతుంటారు'' అంటూ ఎన్నికల ప్రచారంలో మోదీ చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి ఎద్దేవా చేశారు.

మోదీ ఇకనైనా తీరు మార్చుకోవాలి

ఈ ఎన్నికల్లో ప్రేమ, ఆప్యాయత ముందు విద్వేషం, మానవత్వం ముందు అహంకారం ఓడిపోయాయని రాహుల్ అన్నారు. ''ఇప్పుడున్న మోదీ ఎన్నికల ముందు నాటి మోదీ కాదు. మోదీకి దేశ ప్రజలు స్పష్టమైన సందేశం ఇచ్చారు. ఆయన ఇకనైనా ప్రవర్తన, దృక్పథం మార్చుకోవాలి'' అని సూచించారు. ''కేంద్రంలో మోదీ నేతృత్వంలో బలహీన ప్రభుత్వం ఏర్పాటైంది. ఎన్నికల్లో ఇండియా కూటమి దెబ్బకొట్టిన దెబ్బకు సరిగ్గా నడవలేని స్థితికి చేరుకుంది. దేశానికి సమర్థమైన సారథ్యం అందించే స్థితిలో లేదు'' అన్నారు. రాహుల్ వయనాడ్ స్థానమే వదులుకోబోతున్నట్లు కేరళ పీసీసీ చీఫ్ కె.సుధాకరన్ సంకేతాలిచ్చారు. దేశాన్ని ముందుకు నడిపించాల్సిన రాహుల్ వయనాడ్‌కే పరిమితం కావాలని ఆశించవద్దని చెప్పారు. వయనాడ్‌ను వదిలివెళ్లినా ప్రజలు బాధపడొద్దని సూచించారు. పరిస్థితిని అందరూ అర్థం చేసుకోవాలని, రాహుల్‌ను ఆశీర్వదించాలని, ఆయనకు మద్దతివ్వాలని కోరారు.



సీఎంగా ప్రమాణంచేసిన మాఝీని అభినందిస్తున్న మోదీ

ఒడిశా సీఎంగా మాఝీ ప్రమాణం

భువనేశ్వర్: నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గిరిజన బీజేపీ నేత మోహన్ చరణ్ మాఝీ బుధవారం ఒడిశా రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో మాఝీ చేత రాష్ట్ర గవర్నర్ రఘువర్ దాస్ సీఎంగా ప్రమాణం చేయించారు. సీనియర్ బీజేపీ నేత, పట్నాగఢ్ ఎమ్మెల్యే కనక్ వర్ధన్ సింగ్ దేవ్, నిమాపార మహిళా ఎమ్మెల్యే ప్రవతి పరిదా ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణంచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, భూపేందర్ యాదవ్, ధర్మేంద్ర ప్రధాన్, జుయల్ ఓరం, అశ్వనీ వైష్ణవ్‌లతోపాటు బీజేపీపాలిత ఉత్తరప్రదేశ్, గోవా, రాజస్తాన్, మధ్యప్రదేశ్, అస్సాం, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. 24 ఏళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సైతం ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం ఇదే తొలిసారి. సురేశ్ పూజారి, రవినారాయణ్ నాయక్, నిత్యానంద గోండ్, కృష్ణచంద్ర పాత్ర తదితరులు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. 147 సీట్లున్న రాష్ట్ర అసెంబ్లీలో తాజా ఎన్నికల్లో బీజేపీ 78 చోట్ల గెలిచి మెజారిటీ సాధించడం తెల్సిందే. పట్నాయక్ సారథ్యంలోని బిజూ జనతాదళ్ 51 స్థానాలకు పరిమితమైంది.

స్పీకర్ ఎవరో?!



కీలక పదవిపై టీడీపీ, జేడీ(యూ) ఆసక్తి

బీజేపీని వెంటాడుతున్న '1999' అనుభవం ● నాడు ఎన్డీఏ సర్కారును కూల్చింది 'టీడీపీ' స్పీకరే

హోరాహోరీ సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసింది. అంతా ఊహించినట్టే నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం కూడా చేశారు. మోదీ 3.0 మంత్రివర్గమూ కొలువుదీరింది. కానీ గత రెండు ఎన్నికల మాదిరిగా సొంతంగా మెజారిటీ సాధించడంలో బీజేపీ ఈసారి విఫలమైంది. దాంతో ఎన్డీఏ సంకీర్ణ సర్కారు మనుగడలో భాగస్వామ్య పక్షాల పాత్ర కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో అందరి కళ్లూ అతి కీలకమైన లోక్‌సభ స్పీకర్ పదవిపైనే నెలకొన్నాయి. ఎన్డీఏ కీలక భాగస్వామి టీడీపీ ఆ పదవిపై ఆసక్తిగా ఉందంటూ ముందునుంచీ వార్తలొస్తున్నాయి. తాజాగా జేడీ(యూ) పేరూ విన్పిస్తోంది. అవి నాలుగైదు కేబినెట్ బెర్తులు కోరినా ఎన్డీఏ పెద్దన్న బీజేపీ మాత్రం చెరో రెండింటితో సరిపెట్టింది. కనుక స్పీకర్ పోస్టుపై ఆ పార్టీలు పట్టుదలగా ఉన్నట్టు చెబుతున్నారు. కానీ అపారమైన విచక్షణాధికారాలుండే స్పీకర్ పాత్ర కీలక సమయాల్లో అత్యంత నిర్ణాయకంగా మారుతుంటుంది. మరీ ముఖ్యంగా సంకీర్ణ ప్రభుత్వాల్లో లోక్‌సభ స్పీకర్ పాత్రకుండే ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. పైగా గతంలో టీడీపీకి స్పీకర్ పోస్టు ఇచ్చి సర్కారును కుప్పకూల్చుకున్న అనుభవమూ బీజేపీకి ఉంది. ఈ నేపథ్యంలో కీలక పదవిని మిత్రపక్షాల చేతిలో పెట్టే రిస్కుకు బీజేపీ పెద్దలు మరోసారి సిద్ధపడతారా అన్నది సర్వత్రా ఆసక్తి రేపుతోంది...

అది 1999. రాజకీయ అస్థిరతకు చెక్ పెట్టే ఉద్దేశంతో వాజ్‌పేయి సారథ్యంలోని ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వం లోక్‌సభలో బలపరీక్షకు సిద్ధపడింది. మద్దతిస్తామన్న పలు ఇతర పార్టీలు తీరా అసలు సమయానికి అడ్డం తిరగడంతో ఒకే ఒక్క ఓటు తేడాతో ప్రభుత్వం కుప్పకూలింది. నాడు స్పీకర్‌గా ఉన్న టీడీపీ నేత జీఎంసీ బాలయోగి తీసుకున్న నిర్ణయమే అందుకు కారణంగా మారడం విశేషం! అంతకు కొద్ది రోజుల ముందే ఒడిశా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కాంగ్రెస్ ఎంపీ గిరిధర్ గమాంగ్‌ను ఓటింగ్‌కు అనుమతించాలా, లేదా అన్న ధర్మసందేహం తలెత్తింది. స్పీకర్‌గా తన విచక్షణాధికారాలను ఉపయోగించి గమాంగ్‌ను ఓటింగ్‌కు అనుమతిస్తూ బాలయోగి నిర్ణయం తీసుకున్నారు. చివరికి విశ్వాస తీర్మానానికి అనుకూలంగా 269 ఓట్లు రాగా వ్యతిరేకంగా 270 వచ్చాయి. అలా గమాంగ్ వేసిన ఒక్క ఓటు ప్రభుత్వాన్ని పడగొట్టింది. ఎన్డీఏ సర్కారుకు బయటినుంచి మద్దతిచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు కోరిక మేరకు స్పీకర్ పదవిని ఆ పార్టీకిస్తూ నాటి ప్రధాని వాజ్‌పేయి నిర్ణయం తీసుకున్నారు. పాతికేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు బాబు మరోసారి టీడీపీకి స్పీకర్ పదవి కోరుతున్నట్టు వార్తలొస్తుండటం విశేషం!

జిస్కా స్పీకర్, ఉస్కీ సర్కార్!

మోదీ 3.0 ప్రభుత్వం కొలువుదీరినా బీజేపీకి సొంతంగా మెజారిటీ రాని విషయం తెలిసిందే. లోక్‌సభలో మెజారిటీ మార్కు 272 కాగా బీజేపీకి 240 మంది ఎంపీలే ఉన్నారు. ఎన్డీఏ భాగస్వాముల్లో 16 ఎంపీలున్న టీడీపీ, 12 మంది ఉన్న జేడీ(యూ) ప్రభుత్వ మనుగడకు కీలకంగా మారాయి. సంకీర్ణ ప్రభుత్వాల మనుగడలో స్పీకర్ పదవి ఎంత కీలకమో 1999 నాటి వాజ్‌పేయి ప్రభుత్వ ఉదంతం నిరూపించింది. పైగా 'జిస్కా స్పీకర్, ఉస్కీ సర్కార్ (స్పీకర్ పదవి దక్కిన వారిదే సర్కారు)' అన్నానుడి హస్తిన రాజకీయ వర్గాల్లో బాగా ఫేమస్ కూడా. అలాంటి కీలకమైన స్పీకర్ పదవిని ఈసారి టీడీపీ కోరుతోంది. మోదీ అందుకు అంగీకరించే సాహసం చేస్తారా అన్నదానిపై రకరకాల విశ్లేషణలు వెలువడుతున్నాయి. 2014, 2019ల్లో బీజేపీ సొంతగానే మెజారిటీ సాధించడంతో ఆయనకు ఇలాంటి పరీక్ష ఎదురవలేదు. అయితే మంత్రివర్గ కూర్పులో భాగస్వాముల డిమాండ్లకు మోదీ పెద్దగా తలొగ్గలేదు. టీడీపీ ఐదారు, జేడీ(యూ) నాలుగైదు బెర్తులు అడిగినా వాటికి చెరో రెండు పదవులతో సరిపెట్టారు. పైగా కీలకమైన శాఖలన్నింటినీ బీజేపీకే కేటాయించారు. కనుక స్పీకర్ పదవిని కూడా బీజేపీయే అట్టిపెట్టుకోవచ్చన్న అభిప్రాయం విన్పిస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

లోక్‌సభ స్పీకర్‌కు సాధారణ అధికారాలతో పాటు అత్యంత కీలకమైన విచక్షణాధికారాలు కూడా ఉంటాయి. సభా నిబంధనలను తన విచక్షణ మేరకు నిర్వచించగలుగుతారు. అందుకే స్పీకర్ పదవిని పాలక పక్ష బలానికి, ఆధిపత్యానికి ప్రతీకగా భావిస్తుంటారు. లోక్‌సభను అజమాయిషీ చేస్తూ కార్యకలాపాలను సజావుగా నడిపించేది స్పీకరే. కనుక ఆ పదవి దక్కే పార్టీ సహజంగానే లోక్‌సభ కార్యకలాపాల అజెండా తదితరాలను ప్రభావితం చేయగలుగుతుంది. నిర్ణాయక సందర్భాల్లో ఇది కీలకంగా మారుతుంది. సభలో ప్రవేశపెట్టే బిల్లులు ద్రవ్య బిల్లా, సాధారణ బిల్లా అన్నది స్పీకరే నిర్ధారిస్తారు. సభా సంఘాలను ఏర్పాటు చేస్తారు. వాటి చైర్‌పర్సన్లు, సభ్యులను నియమిస్తారు. సభ్యుల సస్పెన్షన్ వంటి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సింది స్పీకరే. పార్లమెంటు సంయుక్త సమావేశాలకు సారథ్యం వహిస్తారు. అన్నింటికీ మించి ఏ అంశంపై అయినా సభలో ఓటింగ్ జరిగి రెండు పక్షాలకూ సమానంగా ఓట్లొస్తే స్పీకర్ పాత్ర మరింత కీలకంగా మారుతుంది. ఆయన నిర్ణాయక ఓటు ఎవరికి వేస్తే వారే నెగ్గుతారు!

పవర్స్ అన్నీ ఇన్నీ కావు

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

గురువారం : 13 : జూన్ : 2024

బడికి పంపండి

బాల కార్మిక వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం బెంగళూరు స్వతంత్ర ఉద్యానం లో బాలల ప్రదర్శన. పిల్లలను పనికి కాదు, బడికి పంపండి అని నినాదాలు చేశారు



న్యూస్‌రీల్

ప్రాణదాత ఆ పోలీస్



కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తుమకూరు: బస్సు డ్రైవర్‌కు హఠాత్తుగా గుండెపోటు రావడంతో స్టీరింగ్ నియంత్రణ తప్పింది, ఆ సమయంలో బస్సును అదుపుచేసి ఎంతో మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ రాఘవేంద్ర క్షత్రిని జిల్లా ఎస్పీ సన్మానించారు. మే 4న గదగ జిల్లాకు ఎన్నికల బందోబస్తు కోసం తుమకూరు నగర ట్రాఫిక్ పోలీసు కానిస్టేబుల్ రాఘవేంద్ర క్షత్రి, సిబ్బంది కేఎస్ఆర్టీసీ బస్సులో వెళ్తున్నారు. అర్ధరాత్రిలో చిత్రదుర్గ సమీపంలో బస్సు డ్రైవర్‌కు హఠాత్తుగా గుండెపోటు రావడంతో బస్సు మీద నియంత్రణ తప్పి అడ్డదిడ్డంగా నడుపుతున్నాడు. దీన్ని గమనించి రాఘవేంద్ర క్షత్రి తక్షణమే బస్సును అదుపులోకి తీసుకుని రోడ్డు పక్కగా నిలిపి, 108 ద్వారా డ్రైవర్‌ని ఆస్పత్రికి తరలించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. జిల్లా ఎస్పీ అశోక్ కేవీ అభినందించి ప్రశంసాపత్రాన్ని బహూకరించారు.

అడవిలో పులి మృత్యువాత

మైసూరు: జిల్లాలోని హుణసూరు తాలూకా నాగరహొళె అటవీ ప్రాంతంలో ఐదేళ్ల మగ పులి కళేబరం కనిపించింది. అటవీ అధికారులు గస్తీ కాస్తున్న సమయంలో కండి వద్ద గుర్తించారు. రెండు పులులు భీకరంగా గొడవ పడిన సమయంలో ఈ పులి మరణించి ఉన్నట్లు అనుమానిస్తున్నారు. పులి కళేబరానికి నిబంధనల ప్రకారం పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.

నటుడు వినోద్‌రాజ్‌కు అస్వస్థత



ఆస్పత్రిలో వినోద్ రాజ్

యశవంతపుర: కన్నడ నటుడు, దివంగత లీలావతి తనయుడు వినోద్‌రాజ్ అనారోగ్యానికి గురయ్యారు. నెలమంగళ సమీపంలోని ఆస్పత్రిలో చేరారు. ఆయనకు కడుపులో ఆపరేషన్ చేయగా కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. వినోద్‌రాజ్ గతంలో నుంచి గుండె జబ్బుతో బాధపడుతున్నారు. 11 ఏళ్ల క్రితం హృదయ శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు. స్టెంట్ వేయగా అప్పుడప్పుడు సమస్యలు వచ్చేవి. రెండు రోజుల కిందట వినోద్ ఆస్పత్రిలో చేరారు.

18 వరకు ప్రజ్వల్‌కు సిట్ కస్టడీ

బనశంకరి: అత్యాచారం, అశ్లీల వీడియోల కేసులో అరెస్టయిన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు ఈనెల 18వ తేదీ వరకు సిట్ కస్టడీకి కోర్టు ఆదేశాలిచ్చింది. బుధవారం బెంగళూరు నగర ఏసీఎంఎం కోర్టులో ఈ కేసులో సిట్, ప్రజ్వల్ న్యాయవాదుల వాదనలు సాగాయి. మరింతగా విచారించాల్సి ఉన్నందున కస్టడీ గడువును పెంచాలని సిట్ వకీళ్లు కోరారు. ఇరు వర్గాల వాదనల తరువాత ఈ నెల 18వ తేదీ వరకు సిట్ కస్టడీకి జడ్జి ఆదేశించారు. దీంతో అప్పటివరకు ప్రజ్వల్‌ను సిట్ విచారిస్తుంది.

వర్మ ఖాతాల్లోకి కోట్లాది నిధులు

- వాల్మీకి మండలి స్కాంలో హైదరాబాద్‌లో నిందితుడు అరెస్టు

బనశంకరి: వందలాది కోట్ల రూపాయల వాల్మీకి అభివృద్ధి మండలి నిధుల స్వాహా కుంభకోణానికి సంబంధించి నకిలీ అకౌంట్లు తెరిచిన వ్యక్తిని సిట్ అధికారులు అరెస్టుచేశారు. నకిలీ అకౌంట్ తెరిచిన సత్యనారాయణ వర్మ అనే వంచకున్ని హైదరాబాద్‌లో అరెస్టుచేసి నగరానికి తీసుకొచ్చి తీవ్ర విచారణ ప్రారంభించారు. ఇతడు వివిధ కంపెనీల పేరుతో 18 బ్యాంకు అకౌంట్లు తెరిచి ఆ ఖాతాలలోకి వాల్మీకి మండలి నుంచి నగదును తరలించారు. సిట్ విచారణలో ఈ ఖాతాలు కనిపించగా గాలించి నిందితున్ని అరెస్ట్ చేశారు.


16 కేజీల బంగారు, రూ.10 కోట్లు సీజ్

వర్మ వద్ద నుంచి 16 కిలోల బంగారం, రూ.10 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలికి చెందిన రూ.94.73 కోట్లను ఈ 18 అకౌంట్లలోకి అక్రమంగా బదిలీ చేశారు. బెంగళూరు ఎంజీ.రోడ్డులోని యూనియన్ బ్యాంక్ బ్రాంచి నుంచి ఈ బదిలీ తతంగం జరిగింది. ఇప్పటికే ఈ స్కాంలో మండలి మాజీ ఎండీ పద్మనాభ, అకౌంటెంట్ పరశురామ్, మాజీ మంత్రి బీ.నాగేంద్ర ఆప్తుడు నాగరాజ్ , నాగేశ్వరావ్‌ను ఇప్పటికే సిట్ అధికారులు అరెస్టుచేసి విచారణ చేపడుతున్నారు. దర్యాప్తు ఓ కొలిక్కి వస్తే మొత్తం ఎంత డబ్బు పోయిందో వెల్లడి కానుంది.

సినిమా కష్టాల్లో...

లక్షలాది మందికి అభిమాన హీరో, సినిమాలలో దుర్మార్గులను చెండాడే పాత్రల్లో మెప్పించే దర్శన్ నిజ జీవితంలో సాధారణ మనిషి కంటే తక్కువగా ఆలోచించి ఇబ్బందుల్లో పడ్డాడు. పోలీస్ ఠాణాలో ఖైదీగా మారాడు. దర్శన్ ఇలా చేశాడా.. అని ఇప్పటికీ నమ్మలేకపోతున్నట్లు అభిమానులు వాపోతున్నారు.

- అభిమాని హత్య కేసులో ప్రముఖ నటుడు దర్శన్..
- వ్యతిరేకంగా చిత్రదుర్గలో నిరసనలు
- హతుని తల్లిదండ్రుల శాపనార్థాలు
- హత్యాస్థలిలో విచారణ



ఓ సినిమాలో దర్శన్ పోజు

దొడ్డబళ్లాపురం: చిత్రదుర్గ ప్రముఖ నటుడు దర్శన్‌కు వ్యతిరేకంగా బుధవారంనాడు ప్రజల ధర్నాలతో అట్టుడికింది. అభిమాని రేణుకాస్వామి హత్య కేసు సీబీఐకి అప్పగించాలని కోరుతూ వందలాదిమంది ర్యాలీలు చేపట్టారు. కలెక్టర్ కార్యాలయం ముందు చేరి దర్శన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దర్శన్ ఫోటోకు చెప్పుల హారం వేసి ఊరేగించి దగ్ధం చేశారు. ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి మాట్లాడుతూ సినిమాలలో అనేక మంచి పాత్రలు చేసిన దర్శన్ నిజ జీవితంలో విలన్ గా మారడం విషాదనీయమన్నారు. రేణుకాస్వామితో ఇబ్బందిగా ఉంటే తల్లిదండ్రులకు, పోలీసులకు తెలియజేయాల్సింది అని, ఇలా అమానుషంగా హత్య చేయడం సబబు కాదన్నారు. ఈ హత్యలో ఎవరెవరి పాత్ర ఉందో వారందరినీ కఠినంగా శిక్షించాలన్నారు.

అతన్నీ ఇలాగే చంపాలి

తన పుత్రున్ని ఎంత దారుణంగా చంపారో అదేరీతిలో ఆ హీరోని కూడా చంపాలి అంటూ రేణుకాస్వామి తల్లిదండ్రులు విలపించారు. గత శనివారం బెంగళూరులో హత్యకు గురైన చిత్రదుర్గవాసి రేణుకాస్వామి కుటుంబీకులు ఘోరాన్ని తలచుకుని శోక సంద్రంలో మునిగిపోయారు. భర్త మృతదేహాన్ని చూసి అతని భార్య సహన రోదిస్తుంటే ఓదార్చడం ఎవరితరం కాలేదు. చిత్రదుర్గలో బుధవారం కుటుంబ సభ్యులు,బంధువులు అంత్యక్రియలు జరిపారు. సహన ఇప్పుడు మూడో నెల గర్భంతో ఉంది. బిడ్డ పుట్టకముందే తండ్రి చనిపోవడంతో ధారగా విలపిస్తోంది. దర్శన్‌ని కూడా ఇలాగే చంపాలని కుటుంబ సభ్యులు శాపనార్థాలు పెట్టారు.

రూ. 30 లక్షలు డీల్

హత్య కేసులో హీరో దర్శన్‌ని రెండవ నిందితునిగా చేర్చారు. హత్యా నేరాన్ని వారి మీద వేసుకోవడానికి ముగ్గురికి రూ.30 లక్షలు ఇచ్చినట్టు పోలీసుల విచారణలో తేలింది. 8వ తేదీన రేణుకాస్వామిని చిత్రదుర్గ నుంచి బెంగళూరుకు తీసుకువచ్చి కామాక్షిపాళ్యలో షెడ్‌లో బంధించి హింసించి చంపారు. శవాన్ని ఎలా తరలించాలనేది చర్చించారు. ప్లాన్ ప్రకారం ఒక గ్యాంగ్‌కు చెందిన ముగ్గురిని పిలిపించి రూ.30 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. శవాన్ని పారవేసి, ఒకవేళ పోలీసులు కనిపెట్టి విచారణ చేపడితే లొంగిపోయేలా ఒప్పందం చేసుకున్నారు. అనుకున్నట్టుగానే శవం లభించాక పోలీసులు విచారణ చేపట్టారు. వారి ప్రవర్తనలో తేడా ఉండడంతో పోలీసులు వారిని విడివిడిగా విచారించగా అసలు విషయం వెలుగు చూసింది. దర్శన్ అనుచరులతో ముగ్గురు నిందితులూ రాత్రంతా ఫోన్‌లో మాట్లాడిన కాల్ రికార్డులు ఆధారంగా మారాయి.

దొన్నె బిరియాని వద్దని ఇడ్లీలు..

దర్శన్ మంగళవారం రాత్రి కామాక్షిపాళ్య పోలీస్‌స్టేషన్‌లో నిద్రలేని రాత్రి గడిపాడు. పండ్ల జ్యూస్, ఇడ్లీలు తిని నిద్రపోకుండా మేలుకునే ఉన్నట్లు సమాచారం. దొన్నె బిరియాని ఇవ్వగా వద్దన్నారు. పవిత్ర, మిగతా నిందితులు బిరియాని ఆరగించారు. పోలీసులు 6 రోజులపాటు కస్టడీకి తీసుకుని స్టేషన్‌కు తీసుకువచ్చి 12 మంది నిందితులతో పాటు నిద్రపోవడానికి అవకాశమిచ్చారు. దర్శన్ సెలబ్రిటీ కావడం వల్ల ప్రత్యేకంగా కార్పెట్, దిండు ఇచ్చినా నిద్రపోలేదు.

ఒక్క సిగరెట్ ఇవ్వండి ప్లీజ్

సినీ హీరోగా, సంపన్నుడిగా ఎంతో విలాసవంతమైన జీవితం గడిపే దర్శన్ ఠాణాలో దిగులుగా కూర్చున్నారు. ఒక్క సిగరెట్ ఇవ్వాలని పోలీసులను వేడుకున్నట్టు సమాచారం. సిగరెట్ లేక చేతులు వణుకుతున్నాయని వాపోయాడు. కానీ పోలీసులు సిగరెట్ ఇవ్వలేదు. ఈ హత్యకు తనకు ఎలాంటి సంబంధం లేదని, హత్య చేయమని తాను చెప్పలేదని పదేపదే చెబుతున్నాడని తెలిసింది.



నటి పవిత్ర గౌడతో దర్శన్ (ఫైల్)

దర్శన్ మహజరు

దర్శన్, ఇతర నిందితులను పోలీసులు బుధవారంనాడు హత్య జరిగిన ఆర్ఆర్ నగరలోని షెడ్ వద్దకు తీసికెళ్లారు. ఎలా బంధించారు? ఎంతమంది ఎన్ని రకాలుగా హింసించారు? దాడి మీ సమక్షంలోనే జరిగిందా? మీరు అడ్డుకోలేదా? అనే ప్రశ్నలు పోలీసులు వేశారు. అక్కడ పెద్దసంఖ్యలో అభిమానులు, స్థానికులు చేరారు.



ఘటనాస్థలికి దర్శన్‌ను తీసుకెళ్తున్న దృశ్యం



విజయలక్ష్మి

ఇన్‌స్టాలో భార్య అన్‌ఫాలో

గతంలో హీరో దర్శన్- భార్య విజయలక్ష్మి మధ్య తరచూ గొడవలు రేగి పోలీస్ స్టేషన్ వరకూ వెళ్లడం తెలిసిందే. ఆ కేసుల్లోనూ దర్శన్ జైలుపాలయ్యాడు. అయితే దివంగత రెబల్‌స్టార్ అంబరీష్, కొందరు సినీ పెద్దల సర్దుబాటుతో ఇద్దరూ కలిసిపోయారు. అయితే ఈసారి హత్య కేసుతో వారి సంసారంలో పెద్ద అగాథమే ఏర్పడిందని చెప్పవచ్చు. ఎక్కువగా పవిత్రగౌడ తోనే దర్శన్ ఉండిపోవడంతో వారి కాపురం కలహాలమయంగా మారింది. ప్రియురాలు పవిత్ర గౌడ కోసం ఇటువంటి కేసులో తలదూర్చడాన్ని భార్య సహించలేకపోతోంది. బహిరంగంగా తన ఆగ్రహాన్ని వ్యక్తపరచకపోయినా ఇన్‌స్టాలో భర్త దర్శన్ ను అన్‌ఫాలో చేయడంతో పాటు డీపీని కూడా తొలగించారు.

పవిత్ర, దర్శన్ కార్లు సీజ్

దర్శన్, పవిత్రల కార్లను పోలీసులు సీజ్ చేయడంతో పాటు వాటిలో ఉన్న మద్యం బాటిళ్లు, ఇతర సాక్ష్యాధారాలను స్వాధీనం చేసుకున్నారు. రేణుకాస్వామిని బంధించి, హింసించి హత్య చేసిన షెడ్‌లోకి దర్శన్‌కు చెందిన స్కార్పియో, పవిత్ర వాడే జీప్ ర్యాంగ్లర్ వెళ్లినట్లు సీసీ కెమెరా చిత్రాల్లో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఆ రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జీప్‌లో పవిత్ర వ్యానిటీ బ్యాగ్, ఇతర వస్తువులు లభించాయి.

అభిమానుల హంగామా

హత్య కేసులో అరెస్టైన దర్శన్‌ను విచారిస్తున్న బెంగళూరు అన్నపూర్ణేశ్వరి నగర పోలీస్‌స్టేషన్ ముందు దర్శన్ ఫ్యాన్స్ హల్‌చల్ చేసారు. భారీగా చేరి నినాదాలు చేస్తూ స్టేషన్ ముందు గందరగోళం సృష్టిస్తుండడంతో పోలీసులు వారిని చెదరగొట్టడానికి లాఠీ చార్జ్ చేశారు. దీంతో అందరూ తలోదిక్కుకు పరుగులు తీశారు. ఈ గొడవలతో స్థానికులకు ఇబ్బందులు కలిగాయి.



పవిత్ర వర్సెస్ రేణుకాస్వామి

తన అభిమాన హీరో భార్యా పిల్లలతో సంతోషంగా ఉండాలి, చెడు తిరుగుళ్లు తిరగరాదని భావించిన ఆ అభిమాని రేణుకాస్వామి.. అందుకోసమే ప్రాణత్యాగం చేశాడు. ప్రముఖ నటుడు దర్శన్, నటి, ప్రియురాలు పవిత్రగౌడపై వాట్సాప్, ఇన్‌స్టా తదితర సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ప్రాణం మీదకు తెచ్చుకున్నాడు. దర్శన్ భార్య విజయలక్ష్మిని పట్టించుకోకుండా పవిత్రగౌడతో సహ జీవనంపై రేణుకాస్వామి కోపం తెచ్చుకున్నాడు. ఈ ద్వేషంతో పవిత్రకు అసభ్యంగా మెసేజ్‌లు పెట్టడం ప్రారంభించాడు. ఇది తారాస్థాయికి చేరింది, తన మర్మాంగాన్ని ఫోటో తీసి పవిత్రకు పంపించి.. నేను దర్శన్ కంటే తక్కువ కాదు, నా వద్దకు కూడా రా అంటూ హేళనగా మెసేజ్ పంపాడు. దీంతో ఆమె దర్శన్‌కు గట్టిగా ఫిర్యాదు చేయడం, ఆయన అగ్గిమీద గుగ్గిలమైనట్లు తెలిసింది. పవిత్ర, రేణుకాస్వామి అకౌంట్‌ని బ్లాక్ చేసినా అతడు మరో కొత్త ఖాతాతో మెసేజ్‌లు పంపించేవాడు.



ప్రాణాలు తీసిన అతి చొరవ.. రేణుకాస్వామి

రాష్ట్రంలో నకిలీ వైద్యులకు చెక్ పెడతాం

- వైద్య విద్యా మంత్రి వెల్లడి

శివాజీనగర: రాష్ట్రంలో రోజు రోజుకు పెరిగిపోతున్న నకిలీ వైద్యుల కార్యకలాపాలను ప్రభుత్వం కట్టుదిట్టంగా అరికడుతుందని వైద్యవిద్యా మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్ చెప్పారు. బుధవారం బీ.ఆర్.అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన ప్రపంచ హోమియోపతి దినాచరణలో ఆయన మాట్లాడారు. ఇటీవల రోజుల్లో నకిలీ వైద్యుల కార్యకలాపాలు అధికంగా వినిపిస్తున్నాయి. ఎలాంటి వైద్య కోర్సు చేయనివారు ఎక్కడపడితే అక్కడ క్లినికల్‌లను తెరిచి చేసి చికిత్సనిస్తున్నారు. దీనిపై ప్రభుత్వానికి అనేక ఫిర్యాదు వచ్చాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల అమాయకత్వాన్ని కొందరు దుర్వినియోగం చేసుకొని నకిలీ చికిత్సను అందిస్తున్నారు. ఇది చట్ట వ్యతిరేకమని తెలిసినా పట్టించుకోవడం లేదు. ఇకపై ఇది శాశ్వతంగా బంద్ అవుతుందని చెప్పారు. నకిలీ వైద్యుల వల్ల అమాయకుల ప్రాణాలు కోల్పోతున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాత్రమే నకిలీ వైద్యులను అడ్డుకోలేదు, ఇందుకు హోమియోపతిక్ వైద్య విద్యాలయాల సంఘం సహకారం కూడా కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ యూ.టీ.ఖాదర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దినేశ్ గుండురావు, వైద్య నిపుణులు పాల్గొన్నారు.



నేరగాని నోట పాక్ నినాదాలు

- కోర్టు వద్దే దేహశుద్ధి

యశవంతపుర: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి, ఎడిజిపి అలోక్‌కుమార్‌ను చంపుతానని బెదిరించిన కేసులో జైల్లో ఉన్న నిందితున్ని బుధవారం బెళగావి కోర్టుకు తీసుకెళ్లగా పాకిస్తాన్ జిందాబాద్ అని నినాదాలు చేశాడు. అనేక నేరాలతో సంబంధముండి హిండలగా కేంద్ర కారాగారంలో నిందితుడు జయేశ్ పూజారి ఖైదులో ఉన్నాడు. జైల్లోనే మొబైల్‌ను సంపాదించి దాంతో పలువురికి ఫోన్లు చేస్తూ హత్యా బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ కేసుల్లో విచారణ కోసం బెళగావి కోర్టుకు తీసుకెళ్లగా అందరి ముందు పాక్ జిందాబాద్ అని నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న న్యాయవాదులు అతన్ని చితకబాదారు. తరువాత అతన్ని పోలీసులు ఎపిఎంసీ స్టేషన్‌కు తరలించారు. తనపై అనవసరంగా రాజద్రోహం కేసును పెట్టారని, కాబట్టి అలా నినాదాలు చేయడంతో తప్పు లేదని నిందితుడు చెప్పాడు.

పోక్సో కేసులో హాజరుకండి

- యడ్డికి సీఐడీ నోటీసులు

బనశంకరి: పోక్సో కేసులో బుధవారం విచారణకు హాజరు కావాలని బీజేపీ మాజీ సీఎం బీఎస్.యడియూరప్పకు సీఐడీ గతంలో నోటీస్ జారీచేసింది. కానీ యడియూరప్ప గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో మరోసారి నోటీసులు పంపింది. కొన్నినెలల కిందట బెంగళూరు డాలర్స్‌కాలనీలోని యడియూరప్ప నివాసంలో తాను, కుమార్తెతో కలిసి సాయం కోసం వెళ్తే, కుమార్తెపై యడియూరప్ప అసభ్యంగా ప్రవర్తించారని ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించింది. సీఐడీ బాధిత బాలిక నుంచి వాంగ్మూలం నమోదుచేసింది. అయితే ఫిర్యాదు చేసిన మహిళ కొన్నిరోజుల కిందట చనిపోయింది.

కేసు కొట్టివేతకు హైకోర్టుకు యడ్డి

తనపై నమోదైన పోక్సో కేసు రద్దుచేయాలని బుధవారం యడియూరప్ప హైకోర్టును ఆశ్రయించారు. తనపై ఓ మహిళ ఫిర్యాదు చేయడం హాస్యాస్పదంగా ఉందని, నేను ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణలో పోలీసులు తన వాంగ్మూలం నమోదు చేసుకోకుండా వాయిస్ నమూనాల తరహాలో రికార్డు చేశారని ఆరోపించారు.

సెక్యూరిటీ నంబరు ప్లేట్ల గడువు పెంపు

శివాజీనగర: రాష్ట్రంలో వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్‌ప్లేట్ (హెచ్ఎస్ఆర్‌పీ)ను అమర్చుకోని వాహనదారులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని గతంలో ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు జూలై 4 వరకు విస్తరించింది. దీనిపై దాఖలైన కేసులను జడ్జిలు జస్టిస్ ఎన్.వీ.అంజారియా, కే.వీ.అరవిండ్‌ల ధర్మాసనం విచారించింది. గడువును పొడిగించాలని అర్జీదారు న్యాయవాదులు కోరారు. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ హెచ్ఎస్ఆర్‌పీ నంబర్ ప్లేట్‌ల గడువును ఆగస్టు లేదా సెప్టెంబర్ వరకు పొడిగించాలని ప్రభుత్వం యోచించింది. దీనిపై ఒక వారంలో ఉత్తర్వులు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

బీజేపీ పక్ష నేతకు బంగళా లేదా?

బనశంకరి: విధానసభలో బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్‌కు బెంగళూరులో ప్రభుత్వం బంగళాను కేటాయించలేదు. దీనిపై నాలుగుసార్లు ప్రభుత్వానికి లేఖ రాసినప్పటికీ పట్టించుకోలేదని అశోక్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బుదవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శికి ప్రభుత్వ బంగళా కోసం పలుమార్లు మనవిచేశానని, కానీ ఎలాంటి స్పందన లేదని మండిపడ్డారు. ప్రభుత్వం నేతల హోదాను బట్టి బంగళా నివాసాన్ని కేటాయించాలి, కానీ ప్రోటోకాల్‌ను పాటించడం లేదని వాపోయారు.

బీబీఎంపీ 'పొడి చెత్త' బాదుడు?

- ఇంటికి నెలకు రూ. 100 వసూలు
- త్వరలోనే అమలుకు సన్నాహాలు



బనశంకరి: రాష్ట్ర ప్రభుత్వ గ్యారంటీ సంక్షేమ పథకాలతో నిధుల కోసం కటకటలాడుతోంది, ఈ తరుణంలో ఆదాయం కోసం నగర ప్రజలపై బీబీఎంపీ ద్వారా భారం వేయడానికి సిద్ధమైంది. రాజధాని నగరంలో ప్రతి ఇంటికి నెలకు పొడిచెత్త పన్ను విధించాలని ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో పాలికె అధికారులు చడీచప్పుడు లేకుండా పన్నును బాదనున్నారు. ఏడాదికి రూ.850 కోట్లు ఆదాయం సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకుంది.

ఆ సంస్థ భారం ప్రజలపై

రాష్ట్ర ప్రభుత్వం గత వారం క్రితం బెంగళూరు పొడి చెత్త నిర్వహణ సంస్థను ఏర్పాటు చేసింది. ఈ సంస్థ నగరంలో చెత్త సేకరణ, తరలింపు తదితర కార్యక్రమాలను చేపడుతుంది. ఈ సంస్థ నిర్వహణ కోసం అయ్యే ఖర్చును ప్రజల నుంచే పన్ను రూపేణా వసూలు చేయనుంది. గత నాలుగేళ్ల నుంచి పొడిచెత్త పన్ను విధించాలని చర్చ జరుగుతోంది. కానీ నగర ప్రజలనుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో పక్కన పెట్టారు. ప్రస్తుతం పొడి చెత్త నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో నెలకు రూ.100 పన్ను వసూలు చేయాలని నిర్ణయించింది. దేశంలోని ఇతర కొన్ని నగరాల్లో పొడిచెత్త శుల్కాన్ని ఎలా వసూలు చేస్తున్నారో అధ్యయనం చేసి అందించిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. గతంలో విద్యుత్ బిల్లుపై అదనంగా రూ.100 చెత్త సేవా రుసుం వసూలు చేయాలనుకున్నారు. కానీ ప్రస్తుతం గృహ జ్యోతి పథకం రావడంతో ఎక్కువమంది కరెంటు బిల్లులు కట్టడం లేదు. దీంతో పొడిచెత్తపై సర్కారు దృష్టి పెట్టింది. ప్రస్తుతం ఇళ్లు, అపార్టుమెంట్లకు ఇంటికి నెలకు రూ.100, షాపులు, వాణిజ్యకట్టడాలకు రూ.200గా నిర్ణయించారు. ఈ డబ్బును చెత్త సమస్య పరిష్కారానికి ఉపయోగిస్తామని ప్రభుత్వం తెలిపింది. రుసుము వసూలుపై నగరంలో వసతి, వాణిజ్య కట్టడాలు సర్వే చేపట్టారు.



బెంగళూరులో చెత్త సేకరణ ఖరీదైన వ్యవహారంగా మారింది

దాడుల నుంచి మహిళలను కాపాడాలి

- నగరంలో ప్రజాసంఘాల ధర్నా

శివాజీనగర: రాష్ట్రంలో యువతులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని పోరాట నాయకులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఫ్రీడం పార్కులో మౌనం వీడకుంటే ఈ దాడులు ఆగవు అనే నినాదంతో ధర్నా నిర్వహించారు. స్త్రీలపై దాడులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. మహిళలు, విద్యార్థినులు వివక్ష, లైంగిక వేధింపులు, హింసకు గురవుతున్నారు. ప్రజ్వల్ రేవణ్ణ కేసులో వందలాది మంది మహిళల అసహాయత, కన్నీటి గాథలున్నాయి. ఇటువంటి కామాంధులు హాసన్‌లో మాత్రమే కాకుండా అన్ని గ్రామాల్లో ఉన్నారు. భారతదేశంలో గంటకు 26 మంది మహిళలపై దాడులు జరుగుతున్నాయి. మండ్య జిల్లాలో ఉపాధ్యాయుడే బాలికపై అత్యాచారం చేశాడు, విద్యార్థినులపై కామాంధులు హత్యలకు తెగబడుతున్నారు. వీటన్నిటిని అరికట్టేందుకు ఉన్నత స్థాయి కమిటీని తక్షణమే నియమించాలని పోరాట నాయకులు డిమాండ్ చేశారు. నాగలక్ష్మీ, బీ.టీ.లలితా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో నినాదాలు చేస్తున్న మహిళలు

క్లుప్తంగా

హోంగార్డు కమాండెంట్‌కు అవార్డు


అవార్డును అందుకున్న జావిద్ పాషా

రాయచూరు రూరల్: రాయచూరు హోంగార్డు కమాండెంట్‌కు ముఖ్యమంత్రి బంగారు అవార్డును జిల్లా సీనియర్ ప్లాటూన్ కమాండెంట్ జావిద్ పాషా అందుకున్నారు. మంగళవారం సాయంత్రం బెంగళూరులో పోలీస్ క్రీడా మైదానంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి పరమేశ్వర్ చేతుల మీదుగా 2023వ సంవత్సరానికి ముఖ్యమంత్రి సేవా పతకం బంగారు అవార్డులను అందుకున్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


సెమినార్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ టీ.సుబ్రమణ్యంనాయుడు, డాక్టర్ ఎం.రుక్మాంగదనాయుడు, డాక్టర్ బోజ్జణ్ణ

బనశంకరి: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. సాంకేతిక ద్వారా విద్యను అందించే అంశంపై బనశంకరి మూడోస్టేజ్ ఐటీఐ లేఔట్‌లోని శ్రీకృష్ణ విద్యా సంస్థ సభాంగణంలో గురువారం ఏర్పాటుచేసిన అంతర్జాతీయ సెమినార్‌లో పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీ అధ్యక్షుడు, డైరెక్టర్ డాక్టర్ టీ.సుబ్రమణ్యంనాయుడు పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో దేశంలో విద్యాభివృద్ధికి గోపాలకృష్ణగోఖలే అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు. మాజీ ప్రధానులు పీవీ.నరసింహారావు, రాజీవ్‌గాంధీ, మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాం సాంకేతికతను అభివృద్ధి చేశారన్నారు. డాక్టర్ బోజ్జణ్ణ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను, నవీ ఆవిష్కరణలను విద్యార్థులకు పరిచయం చేయాలన్నారు. విద్యాసంస్థ సంస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎం.రుక్మాంగదనాయుడు మాట్లాడుతూ సెమినార్‌లోని అంశాలపై అవగాహన పెంచుకొని జీవితంలో ఉజ్వలభవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. డాక్టర్ పార్కవి, నాగరాజ్ శ్రీనివాసన్, గంగాధర్ ఆర్.గాజీగర్, ప్రొఫెసర్ వేణుగోపాల్, ప్రొఫెసర్ పీ.మనోహర్, డాక్టర్ ఎన్.ఉషాకుమారి పాల్గొన్నారు.

కేఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు రూ.కోటి బీమా పంపిణీ

శివాజీనగర: కేఎస్ఆర్‌టీసీ ఉద్యోగులకు ప్రమాద బీమా కింద రూ.కోటి మొత్తాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ప్రమాదాల్లో మృతి చెందిన నలుగురు ఉద్యోగులకు సంబంధించి రూ.కోటి చొప్పున మొత్తాన్ని బాధితుల కుటుంబాలకు పంపిణీ చేశారు. అంతేకాకుండగా కుటుంబ సంక్షేమ పథకం కింద మరో 23 మంది మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం అందజేసినట్లు కేఎస్ఆర్‌టీసీ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. మండలి ద్వారా కార్మికుల సంక్షేమం కోసం, ప్రయాణీకుల కోసం పలు కార్యక్రమాలను రూపొందించి అమలురుస్తున్నట్లు మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. ఎంతో విలువైన ప్రాణాలు పోయిన తర్వాత ఆ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా బీమా మొత్తం ఉపయోగపడుతుందన్నారు. పిల్లల విద్యాభ్యాసం, ఇల్లు నిర్మించుకోవటానికి ఉపయోగించుకోవాలన్నారు. కేఎస్ఆర్‌టీసీ అధ్యక్షుడు శ్రీనివాస్ గుబ్బి, మేనేజింగ్ డైరెక్టర్ వీ.అనుప్‌కుమార్, కార్మిక సంఘాల నాయకులు అనంతసుబ్బరావు, విజయభాస్కర్, రేవప్ప, మంజునాథ్, చంద్రశేఖర్, నాగరాజు, వెంకటరమణప్ప, జయరాజ అరసు పాల్గొన్నారు.

సరైన చికిత్సతో ఆరోగ్యం పదిలం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు: కిడ్నీ, గుండెపోటు, మెదడు స్ట్రోక్, కంటి పొర వంటి సమస్యలతో బాధపడుతున్న వారు సకాలంలో సరైన చికిత్స పొందడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండడానికి సాధ్యమని వైద్యుడు డాక్టర్ బీజీ మనోహర్ గౌడ తెలిపారు. బుధవారం తాలూకాలోని తన స్వగ్రామం బ్యాలహళ్లిలో కోలారు జయనగర స్పెషాలిటీ క్లినిక్ వైద్యులతో నిర్వహించిన ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉత్తమ జీవిత శైలితో ఆరోగ్యవంతులుగా ఉండవచ్చన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు అవగాహన లోపంతో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సంజన తదితరులు పాల్గొన్నారు.

వణికించిన వర్షం.. రోడ్లు జలమయం

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- బురదమయంగా కాలనీలు
- విద్యుత్ కోతతో జనం విలవిల

సాక్షి,బళ్లారి: నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. ప్రధాన రోడ్లలోని తారు రోడ్డు, సిమెంటు రోడ్లు మినహా మురికివాడల కాలనీలతో పాటు పలు మట్టి రోడ్లు బురదమయమై రోడ్లలో ఎక్కడబడితే అక్కడ నీరు నిలిచిపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. డ్రైనేజీల్లో చెత్తా చెదారం ఎక్కడబడితే అక్కడ పేరుకు పోయి ఉండటంతో పలు డ్రైనేజీల్లో వాననీరు పొంగిపొర్లడంతో నగర వాసులు నరకయాతన అనుభవిస్తున్నారు.

జోరు వర్షం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో జనం ఇబ్బంది పడ్డారు. నగరంలోని తహసీల్దార్, వ్యవసాయ అధికారి కార్యాలయాలు ఉన్న ఆవరణ వర్షం నీటితో నిండిపోయింది. నిత్యం కూరగాయల అమ్మకాలు సాగించే ఏపీఎంసీ, చిన్న మార్కెట్ వద్ద వర్షం నీటితో రోడ్లు నిండిపోవడంతో బురదమయంగా మారిపోయాయి. పెద్ద మార్కెట్ పక్కన కూడా పెద్ద ఎత్తున నీరు ప్రవహించింది.


బళ్లారిలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిలిచిన వాననీరు

వర్షంలో తడుస్తూ నానాపాట్లు

కణేకల్లు బస్టాండు వద్ద జనం నిలబడేందుకు కూడా చోటు లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడు ప్రయాణికులు వర్షంలో తడుస్తూ ఇబ్బందులు పడ్డారు. రెండు రోజుల క్రితం కూడా ఇదే విధంగా భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. మళ్లీ అంతకన్నా పెద్ద వర్షమే కురవడంతో వాతావరణం చల్లబడి ఎటు చూసినా రోడ్లలో నీరు ప్రవహించడంతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రోడ్లలో తడుస్తూ గమ్యానికి చేరుకోవడానికి తీవ్ర అవస్థలు పడ్డారు. నగరంలో లోతట్టులో నిర్మించుకున్న ఇళ్లలోకి నీరు ప్రవహించడంతో వాటిని బయటకు తీసేందుకు ఆయా గృహ యజమానులు పడుతున్న అవస్థలు వర్ణించలేని విధంగా ఉన్నాయి. డ్రైనేజీల్లో నీటికి వర్షం నీరు తోడు కావడంతో దుర్వాసన వెదజల్లడంతో డ్రైనేజీల పక్కనే నివసిస్తున్న కాలనీల వాసులు నరకయాతన అనుభవించారు.


హొసపేటెలోని బస్టాండ్ రోడ్డులో వాన నీటితో ప్రయాణికుల పాట్లు

జలమయంగా బస్టాండ్ రోడ్డు

హొసపేటె: నగరంలో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచి జలమయంగా మారాయి. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని రోడ్లు, కాల్వలు పొంగిపొర్లుతుండటంతో పాటు ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో డ్రైనేజీ నిండి బయటకు ప్రవహించడంతో ప్రయాణికులకు, వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. సుమారు రెండు అడుగులకు పైగా నీరు రోడ్డుపై ప్రవహించడంతో ఇరువైపులా వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి.

భారీ వర్షానికి జలమయంగా వీధులు

నగరంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతమైన రాణిపేటెలో పలు వీధుల్లో వర్షం నీరు నిలబడి జలమయంగా మారాయి. వర్షం నీరు కాలనీలోని ఇళ్లలోకి చొరబడటంతో కాలనీ వాసులు ఇబ్బందులకు గురయ్యారు.

నగలు, నగదు చోరీ

మైసూరు: తాళం చెవిని దాచే రహస్య స్థలాన్ని దొంగలు గుర్తించి నగలు, నగదు చోరీ చేశారు. ఈఘటన టి.నరసీపుర తాలూకా తుంబల గ్రామంలో జరిగింది. సుమ అనే మహిళ ఇంటినుంచి బయటకు వెళ్లే సమయంలో తాళం చెవిని భర్త, పిల్లల అనుకూలత కోసం ఒక రహస్య స్థలంలో ఉంచేది. ఈ విషయాన్ని దొంగలు పసిగట్టారు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం చెవిని తీసుకుని లోపలికి ప్రవేశించి రూ. 1.80 లక్షల విలువ చేసే 40 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 80 వేల నగదు దోచుకుని పరారయ్యారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఈతకోలనులో మునిగి బాలిక మృతి

యశవంతపుర: ఈతకోలనులో మునిగి ఏడేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన బెంగళూరు ఉత్తర తాలూకా యలహంక సమీపంలో జరిగింది. ఇక్కడి అవలహళ్లిలోని రామ్కిఒన్ నార్త్ అపార్ట్‌మెంట్‌లో ఉన్న కొలనులో ఈత కొట్టేందుకు వెళ్లిన బాలిక సరైన రక్షణ ఏర్పాట్లులేని కారణంగా నీటిలో మునిగిపోయింది. ఆ సమయంలో అపార్ట్‌మెంట్ భద్రతా సిబ్బంది కూడా అక్కడ లేరు. దీంతో బాలిక ప్రాణాలు విడిచింది. ఈ విషయాలను అపార్ట్‌మెంట్ సహకార సంఘం అధ్యక్షుడు విద్యాధర్ సీఎం, హోంమంత్రి, డీసీఎం దృష్టికి లేఖ ద్వారా తీసుకెళ్లారు. అపార్ట్‌మెంట్‌కు కేటాయించిన భద్రతా సిబ్బందిని ఇతర అవసరాలను ఉపయోగిమచుకోవటంతో బిల్డర్ అనేక తప్పులు చేసినట్లు లేఖలో ప్రస్తావించారు.

నేత్రపర్వంగా ఎర్రితాత మహారథోత్సవం

- ఎర్రితాత సమాధి దర్శనం కోసం భక్తుల బారులు
- శివనామస్మరణతో మార్మోగిపోయిన ఎర్రితాత మఠం

సాక్షి,బళ్లారి: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో వెలిసిన చేళ్లగుర్కి ఎర్రితాత మహారథోత్సవం భక్తిశ్రద్ధలతో, కన్నులపండువగా జరిగింది. బుధవారం సాయంత్రం తాలూకాలోని చేళ్లగుర్కిలో ఎర్రితాత మఠంలో మహారథోత్సవాన్ని వర్షాన్ని సైతం లెక్కచేయక భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జాతర సందర్భంగా వారం రోజుల నుంచి శివనామంతో ఎర్రితాత మఠంలో మార్మోగిపోతోంది. చేళ్లగుర్కి ఎర్రితాత మహారథోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అద్భుతంగా అలంకరించిన చేళ్లగుర్కి ఎర్రితాత మహారథోత్సవాన్ని ఉరవకొండ గవిమఠం కరిబసవ రాజేంద్ర స్వామి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, లాగిన తర్వాత భక్తులు కూడా తేరుకు కట్టిన తాడును లాగుతూ, ఓంనమఃశివాయ, జై ఎర్రితాత, జైజై ఎర్రితాత అనే నామ జపం చేస్తూ తేరును ముందుకు లాగారు.

వర్షంతో భక్తులకు ఇబ్బందులు

మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురవడంతో చేళ్లగుర్కిలో జాతర మహోత్సవాలకు కొంత ఆటంకం కలిగినప్పటికీ స్వామిపై ఉన్న భక్తితో వర్షంలో తడుస్తూ తేరును ముందుకు లాగుతూ చేళ్లగుర్కి ఎర్రితాత మహారథోత్సవాన్ని విజయంగా ఆచరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో చేళ్లగుర్కి గ్రామం పులకించిపోయింది. మఠంలో ఎర్రితాత మహాసమాధిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. జాతర సందర్భంగా మఠంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, భజనలు చేస్తూ ఆలయంలో భక్తిభావంతో భక్తులు పరవశించిపోతున్నారు. రథోత్సవాలు లాగడం చూస్తే మంచిదవుతుందని భక్తుల్లో నమ్మకం ఉంది. అందులో సాక్షాత్తు శివ స్వరూపుడు, దైవాంశ సంభూతుడుగా పేరు ప్రఖ్యాతులు పొంది, ఎర్రితాత మహిమలను కళ్లారా చూసిన భక్తులు, స్వామీజీ జాతర, మహారథోత్సవంలో పాల్గొని తరించాలనే ఉద్దేశ్యంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.


చేళ్లగుర్కి ఎర్రితాత మడితేరు లాగుతున్న దృశ్యం

భారీగా తరలివచ్చిన భక్తజనం

పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. మహారథోత్సవంలో పాల్గొన్న భక్తులు తేరుకు అరటి పండ్లు విసురుతూ తమ భక్తిని చాటుకున్నారు. ఆలయం నుంచి కొద్దిదూరం మేరకు తాడుతోనే తేరును ముందుకు లాగారు. వర్షం వల్ల కొంత ఇబ్బందులు తలెత్తినప్పటికీ, అపారమైన భక్తిశ్రద్ధలతో మహారథోత్సవంలో భక్తులు పాల్గొని చేళ్లగుర్కి ఎర్రితాత జాతరలో భాగంగా మహారథోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో విజయవంతంగా ఆచరించారు. జాతర సందర్భంగా వ్యాపారాలతో రోడ్లు భర్తీ అయ్యాయి. అయితే వర్షం కురవడంతో రోడ్లలో వ్యాపారం చేసుకుంటున్న చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొత్తం మీద చేళ్లగుర్కి ఎర్రితాత మహారథోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో వర్షంలో తడుస్తూనే పాల్గొనడం విశేషం.

ఫాంహౌస్‌లో అరుదైన బాతులు

- నటుడు దర్శన్‌పై మరో కేసు

మైసూరు: చిత్రదుర్గ అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టు అయిన చాలెంజింగ్ స్టార్ దర్శన్ మరో ఇబ్బందుల్లో చిక్కుకున్నాడు. మైసూరు టి.నరసిపురలోని తన ఫాంహౌస్‌లో నాలుగు అరుదైన బార్ హెడెడ్ గూస్ జాతి బాతులను పెంచుతున్నాడనే విషయం తెలిసింది. దీంతో వన్యజీవి సంరక్షణ చట్టం కింద దర్శన్, అతని సతీమణి విజయలక్ష్మి, ఫాంహౌస్ మేనేజర్ నాగరాజ్‌లపై అటవీ శాఖ కేసు నమోదు చేసింది. గతంలోనే కేసు నమోదైన విషయం తాజాగా హత్య కేసులో ఫాంహౌస్‌లో సోదాలు చేసినప్పుడు వెల్లడైంది. దర్శన్‌కు నోటీసులు జారీ చేసినా విచారణకు రాలేదు. ప్రస్తుతం విధుల్లో ఉన్న అధికారులు కూడా నిర్లక్ష్యం వహించారని అటవీ శాఖాధికారి ఒకరు తెలిపారు. మరోవైపు 2021లో కర్ణాటక అటవీ శాఖ బ్రాండ్ అంబాసిడర్‌గా చిత్ర నటుడు దర్శన్ ఉన్నారని, మరోసారి ఆయనను ఎంపిక చేసే ఆలోచన



లేదని తెలిపారు. ఇటీవలే పులి గోరు కేసులోనూ దర్శన్ పేరు వినిపించింది. బెంగళూరు సర్కిల్ అధికారులు దర్శన్‌కు నోటీసులు ఇచ్చి ఆయన ఇంటిని కూడా పరిశీలించారు. ఈ సమయంలో న 8 పులి గోరు పెండెంట్‌లు దర్శన్ ఇంటిలో దొరికాయి. అయితే అవన్నీ నిజమైనవా లేక నకిలీవా అనేది పరీక్షలకు పంపించారు.


కథక్ నృత్య ప్రదర్శనలోని ఘట్టం

సత్యసాయికి నృత్యాంజలి

ప్రశాంతి నిలయం: భక్తులు సత్యసాయికి నృత్యాంజలి సమర్పించారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన హరియాణా, చండీఘడ్ భక్తులు ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 'శ్రీ సత్యసాయి శరణం మమ' పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ పాడిన పాటలు భక్తులను అలరించాయి. సాయంత్రం కురుక్షేత్రలోని నటరాజ్ సంగీత నృత్య విద్యాలయ విద్యార్థులు 'నృత్యాంజలి' పేరుతో కథక్ నృత్య ప్రదర్శన నిర్వహించారు. చక్కటి నృత్య భంగిమలతో నిర్వహించిన నృత్య ప్రదర్శన చూసి భక్తులు మైమరచిపోయారు.

విద్యతో ఏదైనా సాధ్యం


ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీ

కోలారు: విద్య ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చని, విద్యే అన్నింటికంటే పెద్ద ఆస్తి అని, విద్యార్థులు తమ విద్యార్థి జీవితంలో క్రమశిక్షణతో మెలిగి విద్యాభ్యాసం పూర్తి చేసి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆదిచుంచనగిరి మఠం డాక్టర్ నిర్మలానంద స్వామీజీ తెలిపారు. బుధవారం తాలూకాలోని గాండ్లహళ్లి గ్రామంలోని వేణుగోపాల స్వామి, కరగదమ్మ దేవి ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలయ పునర్నిర్మాణ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో పిల్లలకు విద్యాభ్యాసం అందించడంలో ఎలాంటి అసౌకర్యం కలిగించరాదన్నారు. తద్వారా సమాజానికి ఉత్తమ యువతను అందించాల్సి ఉందన్నారు. ధర్మద్రోహానికి ఎన్నడూ పాల్పడరాదన్నారు. ఉన్నత విద్యా శాఖా మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాల పునరుద్ధరణ ద్వారా శాంతియుత వాతావరణం నెలకొంటుందన్నారు. నేడు గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలు జోరుగా సాగుతుండడం ఉత్తమ పరిణామమన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతన ఆస్పత్రి, పాల డెయిరీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, రామేగౌడ పాల్గొన్నారు.

భోజన ప్లేట్ల పంపిణీ


విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందించిన దృశ్యం

కోలారు: తాలూకాలోని అరాభికొత్తనూరు ఉన్నత పాఠశాలలో బుధవారం దాత జ్యూస్ నారాయణ స్వామి విద్యార్థులకు ఉచితంగా భోజనం ప్లేట్లను అందించారు. దాత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. ప్రధానోపాధ్యాయిని తాహేరా నుస్రిన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావంతులు కావాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సిద్దేశ్వరి, ఎంఆర్ గోపాలకృష్ణ, భవాని, వెంకటరెడ్డి, శ్వేత, సీఎల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బృహత్ బీబీఎంపీ విభజన వద్దే వద్దు

- పాలికెను విభజన చేస్తే ఆర్థిక అసమానతలు
- హెచ్చరిస్తున్న కన్నడ సంఘాలు, మాజీ మేయర్లు

బనశంకరి: నాడప్రభు కెంపేగౌడ నిర్మించిన బృహత్ బెంగళూరు మహానగర పాలికెను 5 భాగాలుగా విభజన చేయాలనే ప్రభుత్వ నిర్ణయంపై కన్నడ సంఘాలు, మాజీమేయర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విజయనగర సామ్రాజ్య అరసు అచ్యుతరాయలు నాడప్రభు కెంపేగౌడకు బెంగళూరు మహానగరం నిర్మాణానికి 12 హోబళిలు ఉత్తరహళ్లి, వర్తూరు, యలహంక, బేగూరు, హలసూరు, కెంగేరి, తలఘట్టపుర, జిగణి, కుంభలగూడు, కాగ్లి, బాణవార, హెసరఘట్టలను జాగీర్లుగా ఇచ్చినట్లు రికార్డుల్లో ఉంది. అలాంటి మహానగరాన్ని ఐదు విభాగాలుగా విభజన చేయాలనే ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. నగరాన్ని విభజించవద్దని బీబీఎంపీ మాజీ పాలనా విభాగంనేత ఎన్ ఆర్.రమేశ్ గురువారం సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్‌కు లేఖరాశారు. ఇప్పటికే ఢిల్లీ మహానగర పాలికెను పాలనా అవసరాల కోసం మూడు విభాగాలుగా విభజించడంతో అనేకస సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఆర్థిక అసమానతలు తలెత్తాయి. చివరకు ఢిల్లీ నగరాన్ని ఒకటిగా చేశారు. ఢిల్లీ ఉదంతంతో మేల్కొని నగర విభజనకు స్వస్తి చెప్పాలని కన్నడ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. బెంగళూరు మహానగర పశ్చిమ భాగంలో చాలాప్రాంతాల్లో ఆదాయ వనరులు తక్కువ. తూర్పు భాగంలో ఆదాయ పన్నుతో పాటు ఆదాయ వనరులు ఎక్కువ. ఈ పరిస్థితుల్లో నగరాన్ని విభజన చేస్తే మహాదేవపుర వలయం, తూర్పువలయాలతో కూడిన పాలికె శ్రీమంత పాలికె అవుతుంది. దాసరహళ్లి వలయ పశ్చిమవలయాలతో కూడిన పాలికె ఆర్థికంగా వెనుకబడుతుంది. ప్రాదేశిక ఆర్థిక అసమానతలకు దారితీసేలా మహానగరాన్ని విభజిస్తే ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని ఎస్ఆర్.రమేశ్ గుర్తుచేశారు. కెంపేగౌడ నిర్మించిన మహానగరాన్ని విభజనచేస్తే ఉగ్రపోరాటం తప్పదని కన్నడ సంఘాలు, మాజీ మేయర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కోలారు వార్తలు...

పిల్లలకు పని వద్దు.. బడి ముద్దు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: పిల్లలను పనులకు కాకుండా పాఠశాలకు పంపాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి ముజఫర్ ఎ మాంజరి తెలిపారు. బుధవారం నగరంలోని ఉరిగాం పేట ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన విశ్వ బాల కార్మిక దినోత్సవంలో పాల్గొని ఆయన మాట్లాడారు. నిరక్షరాస్యులు, పేదలు సామాజిక పరిస్థితుల కారణంగా తమ పిల్లలను బాల కార్మికులను చేస్తున్నారన్నారు. ప్రభుత్వం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అనేక చట్టాలను తెచ్చిందన్నారు. ఈ చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయడం ద్వారా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రధాన సివిల్ జడ్జి వినోద్‌కుమార్ మాట్లాడుతూ బాల కార్మిక పద్ధతి నిర్మూలనకు కేవలం బాల కార్మిక దినోత్సవ నిర్వహణకే పరిమితం కాకుండా ప్రతి నిత్యం కృషి చేయాలన్నారు. సమాజంలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రాజగోపాలగౌడ, ,న్యాయమూర్తి శమీనా, బీఈఓ మునివెంకటాచారి, విద్యా సమన్వయ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్పేట్ అడ్డాపై పోలీసు దాడి

- తప్పించుకోబోయి చెరువులో దూకి వ్యక్తి మృతి


చెరువు వద్ద మృతదేహం కోసం గాలిస్తున్న పోలీసులు

శ్రీనివాసపురం: పేకాట అడ్డాపై దాడి చేసిన పోలీసుల బారి నుంచి తప్పించుకోబోయి చెరువులో దూకి ఓ వ్యక్తి మరణించిన ఘటన తాలూకాలోని రాయల్పాడు ఫిర్కా గుడిసవారిపల్లె గ్రామంలో జరిగింది. గుడిసవారిపల్లె వద్ద పేకాట ఆడుతున్నట్లు ఖచ్చితమైన సమాచారం అందుకున్న పోలీసులు దాడి జరపగా నలుగురు జూదరులు పక్కనే ఉన్న చెరువులో దూకి తప్పించుకోబోయారు. అయితే ముగ్గురు తప్పించుకుని పారిపోగా మరో వ్యక్తి బయటకు రాలేదు. అయితే పోలీసులు అందరూ తప్పించుకున్నారని అనుకుని అక్కడి నుంచి తిరిగి వచ్చేశారు. అయితే ఈత రాని గురవల్లోళ్లగడ్డ గ్రామానికి చెందిన సరసింహ (45) చెరువులో మునిగి మరణించాడు. మరుసటి రోజు విషయం తెలిసిన పోలీసులు చెరువు వద్దకు వెళ్లి మృతదేహం కోసం గాలించారు. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని వెలికి తీసి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం కుటుంబ సభ్యులకు అందించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. తమకు న్యాయం చేయాలని మృతుడి భార్య లక్ష్మి కోరుతోంది. ఘటనపై ఎస్పీ నారాయణ మాట్లాడుతూ పేకాట అడ్డాపై పోలీసుల దాడితో ఓ వ్యక్తి చెరువులో దూకి మరణించిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని తెలిపారు.

వృత్తి పవిత్రత కాపాడండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనాథ్

శ్రీనివాసపుర: వృత్తికి భంగం కలుగకుండా ఉపాధ్యాయులు విధులు నిర్వహించాలని జేడీఎస్ నాయకుడు సీఎంఆర్ శ్రీనాథ్ తెలిపారు. బుధవారం నగరంలోని స్కౌట్స్ భవనంలో నిర్వహించిన సంఘం మాజీ అధ్యక్షుడు అశ్వర్థ నారాయణకు వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్య నేడు వ్యాపారం కావడం విచారకరమన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలన్నారు. జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి సురేష్‌బాబు, జిల్లా ఉపాధ్యాయ బళగ అధ్యక్షుడు నారాయణస్వామి, బీఈఓ ఎస్ఎన్ కన్నయ్య పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందించండి..


వినతిపత్రం సమర్పించిన దృశ్యం

కోలారు: టిప్పర్ల రాకపోకలతో వెలువడుతున్న ధూళితో నష్టపోయిన రైతుల పంటలకు పరిహారం అందించాలని కోరుతూ రైతు సంఘం పదాధికారులు బుధవారం డీబీఎల్ క్యాంపస్ గేట్ ఎదుట ధర్నా నిర్వహించి బంగారుపేటె డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. అంతకు ముందు వారు మాట్లాడుతూ చెన్నై కారిడార్ రహదారి నిర్మాణ పనుల కోసం టిప్పర్లలో మట్టిని తరలిస్తుండడం వల్ల దుమ్ము, ధూళి పంటలపై పడుతున్నందున పంటలు సరిగా పండడం లేదన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లా యంత్రాంగం ఈ సమస్యను తీవ్రంగా పరిగణించి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి రైతులకు తగిన పంట నష్టపరిహారం అందించాలని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ, మరగల్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వాహన చోదకుల వెంట దాఖలాలు తప్పనిసరి


దాఖలాలు పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

మాలూరు: వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ సరైన దాఖలాలను దగ్గర ఉంచుకోవాలని పోలీస్ ఇన్‌స్పెక్టర్ వసంతకుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ముందు వాహనాల్లో వెళ్లే వారి వద్ద నుంచి దాఖలాలను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ప్రతి నిత్యం పట్టణానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి వెళుతుంటారు. వాహనాల్లో వచ్చే వారు డ్రైవింగ్ లైసెన్సు, వాహనాల రికార్డులు తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలన్నారు. సంచార నియమాలను తూచ తప్పకుండా పాటించాలన్నారు. నిబంధనలు పాటించని వారికి, సరైన స్థలంలో వాహనాలను నిలపకపోతే తగిన జరిమానా విధిస్తారన్నారు. వాహనచోదకులు రోడ్డు నియమాల గురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏఎస్ఐలు నాగరాజ్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

నెత్తురోడ్డుతున్న ఎక్స్‌ప్రెస్‌వే

- బెంగళూరు-మైసూరు రహదారిలో తరచూ ప్రమాదాలు
- ఆరు నెలల్లో 513 ఘటనలు
- 120 మంది మృత్యువాత
- ప్రశ్నార్థకంగా రహదారి భద్రత

బనశంకరి: రోడ్లు నాగరికతకు చిహ్నాలని చెప్పడం పరిపాటి. అయితే అవి యమపురికి దారులని చెప్పడంలో అతిశయోక్తి లేదు. బెంగళూరు-మైసూరు ఎక్స్‌ప్రెస్‌వేనే ఇందుకు నిదర్శనం. ఈ రోడ్డులో నిత్యం మరణమృదంగం మోగుతోంది. ప్రతినెల సరాసరి 20 మందికి పైగా అసువులుబాస్తున్నారు. వందలాది మంది క్షతగాత్రులువుతున్నారు. రవాణా రంగాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో బెంగళూరు-మైసూరు మధ్య 117 కిలోమీటర్ల మేర దూరాన్ని కేవలం రెండు గంటల్లో అధిగమించేలా పదిలేన్ల రహదారిని వేల కోట్ల రూపాయలతో నిర్మించారు. రహదారి డిజైన్ లోపాలు ఉండటంతో ఈ రోడ్డును ప్రారంభించిన అనంతరం పెద్ద సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. దీనిపై కమిటీ వేసి బ్లాక్‌స్పాట్లను గుర్తించి కొన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. తర్వాత కొంత కాలం ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. అయితే ఆరు నెలలుగా రోడ్డు ప్రమాదాలు మళ్లీ పెరుగుతున్నాయి. ఎక్స్‌ప్రెస్‌వేలో ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య మొత్తం 512 ప్రమాదాలు సంభవించాయి. వీటిలో 245 ప్రమాదాలు బెంగళూరు నుంచి నిడఘట్ట ప్రాంత రహదారిలో జరిగాయి. నిడఘట్ట నుంచి మైసూరు విభాగంలో 267 ప్రమాదాలు సంభవించినట్లు నమోదైంది. ఈ ప్రమాదాల్లో మొత్తం 123 మంది మృతి చెందారు. ఒకేనెలలో 110 ప్రమాదాలు సంభవించగా మేనెలలో గరిష్టసంఖ్యలో ప్రమాదాలు సంభవించాయి. నిడఘట్ట నుంచి మైసూరు మధ్య మార్గం చాలా ప్రమాదకరంగా ఉంది. జనవరి నుంచి మూడు నెలల్లో 267 ప్రమాదాలు సంభవించగా 66 మంది మృతిచెందారు. 304 మంది తీవ్రంగా గాయపడ్డారు. ట్రాఫిక్ పోలీస్‌శాఖ తెలిపిన సమాచారం మేరకు వాహనదారులు వంద కిలోమీటర్ల వేగానికి మించి వాహనాలు నడపటంతో ఇలాంటి ప్రమాదానికి కారణమని చెబుతున్నారు. రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ ఎక్స్‌ప్రెస్‌వేలో ద్విచక్రవాహనాలు, త్రిచక్రవాహనాలు నిషేధించాలని నిర్ణయించగా ప్రజలనుంచి అభ్యంతరం వ్యక్తం కావడంతో ఈ చర్యను విరమించుకున్నారు.



బెంగళూరు-మైసూరు పదిలేన్ల జాతీయ రహదారి



రోడ్డు ప్రమాద దృశ్యం(ఫైల్)

ప్రమాదాలకు కారణం ఇవే...

అశాస్త్రీయంగా వాహనాల డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలో నిర్లక్ష్యధోరణి ప్రమాదాలకు కారణమని చెబుతున్నారు. ఇటీవల అమర్చిన సిగ్నల్స్ చిహ్నాలు వాహనదారులకు సరిగా కనిపించడం లేదు. బిడది, రామనగర తాత్కాలిక ఎంట్రీ ఎక్జిట్‌ల వద్ద సూచికల బోర్డులు లేవు. దీనికితోడు జయపుర గేట్‌తో పాలు ప్రాంతాల్లో రోడ్డు సమాంతరంగా నిర్మించలేదు. జయపుర బ్రిడ్జి వద్ద ఒక్కసారిగా ఎత్తులో ఉండే రోడ్డు 300 మీటర్ల అనంతరం చాలా డౌన్‌లో ఉంది. రోడ్డు డౌన్‌లో ఉన్న ప్రాంతంలో రోడ్డు హంప్స్ నిర్మించకపోవడం ప్రమాదాలకు కారణమని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

బోర్లు, ఆర్‌ఓ ప్లాంట్లలో ప్రమాదకర బ్యాక్టీరియా

- ల్యాబ్‌లనుంచి నివేదిక
- ఆయా వనరులనుంచి నీటి సరఫరా నిలిపివేతకు ఆదేశాలు

బనశంకరి: బెంగళూరు నగరంలోని కొన్ని తాగునీటి బోర్లు, ఆర్‌ఓ ప్లాంట్లలో ప్రమాదకర బ్యాక్టీరియా లభ్యమైంది. దీంతో ఆ బోరుబావులు, తాగునీటి కేంద్రాలనుంచి నీటి సరఫరా నిలిపివేశారు. దీనిపై బీబీఎంపీ ఆరోగ్య విభాగ ప్రత్యేక కమిషనర్ సురల్కర్‌వికాస్‌కిశోర్ మాట్లాడుతూ బెంగళూరు నగరంలో 1,696 తాగునీటి బోర్లు, 1,384 తాగు నీటి కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటిలో నీరు శుభ్రంగా లేదని ఫిర్యాదులు అందాయన్నారు. 217 బోర్లు, 1,218 తాగు నీటికేంద్రల్లో శాంపిల్స్ సేకరించి నాణ్యత పరిశీలన కోసం ల్యాబ్‌కు పంపగా 10 బోరు బావులు, తాగునీటి కేంద్రాల్లో ప్రమాదకర బ్యాక్టీరియా ఉన్నట్లు నివేదిక అందిందని తెలిపారు. ఆయా బోర్లు, ఆర్‌ఓ ప్లాంట్లనుంచి ప్రజలకు నీరు సరఫరాను నిలిపివేశామన్నారు. మిగిలిన 805 ఆర్‌ఓ ప్లాంటల్లో నీటి పరీక్షలు త్వరితగతిన చేపట్టాలని సూచించామన్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందిలేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్ అధికారులకు సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో నీటిలో బ్యాక్టీరియా లాంటి ప్రమాదకర అంశాలు చేరే ప్రమాదం ఉందని, నీటిని వేడిచేసి తాగాలని సలహా ఇచ్చారు.

సంగీత దిగ్గజం తారానాథ్ కన్నుమూత





పండిత్ రాజీవ్ తారానాథ్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి (ఇన్‌సెట్‌లో) పండిత్ రాజీవ్ తారానాథ్(ఫైల్)

మైసూరు: సంగీత లోక ధ్రువ తార.. సరోద్ వాద్యంలో విశిష్టుడిగా పేరుగాంచిన పండిత్ రాజీవ్ తారానాథ్(92) మంగళవారం రాత్రి కన్నుమూశారు. వయోభారం, అనారోగ్యంతో కొన్ని రోజులుగా తారానాథ్ మైసూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మైసూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ మహదేవప్ప ఆస్పత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిపై వివరాలు సేకరించారు. అంతలోనే పండిత్ రాజీవ్ తారానాథ్ ఈ లోకాన్ని వీడి వెళ్లిపోయారు. పార్థివదేహాన్ని మైసూరు కువెంపు నగరలోని జ్ఞాన గంగా పాఠశాల వద్ద ఉన్న ఆయన ఇంటిలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. బుధవారం మధ్యాహ్నంచాముండిబెట్టలోని చితాగారంలో తారానాథ్ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. మంత్రి మహదేవప్ప ప్రభుత్వం తరపున నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన సంతాపాన్ని వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

వక్కతోటలో గంజాయి సాగు



గంజాయి మొక్కలను పరిశీలిస్తున్న పోలీసులు

శివమొగ్గ: తీర్థహళ్లి పోలీసులు వక్క తోటపై దాడి చేసి అక్కడ సాగు చేస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. హుత్తళ్లి గ్రామానికి చెందిన గురుమూర్తి తన వక్క తోటలో గంజాయి పంట సాగు చేస్తున్నారని కచ్చితమైన సమాచారంతో మంగళవారం మధ్యాహ్నం పోలీసులు దాడి చేశారు. వక్క మొక్కల మధ్య సాగు చేసిన సుమారు రూ. 2.50 లక్షల విలువ చేసే 9.524 కేజీల 14 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

రాష్ట్రంలో పక్షి జ్వరం భయం

బనశంకరి: కేరళ సరిహద్దు ప్రాంతాల్లో పక్షి జ్వరంతో పలు పక్షులు మృత్యువాతపడుతున్నాయి. రాష్ట్రంలో పక్షి జ్వరం భయంతో అనేక ముందు జాగ్రత్తచర్యలు తీసుకున్నారు. బెంగళూరు శివారులోని బన్నేరుఘట్ట పార్కు ఉద్యానవనంలో పక్షి పంజరాల చుట్టూ రసాయనాలు పిచికారీచేశారు.

బాలలను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార

మండ్య: బాలలను పనుల్లో పెట్టుకుంటే కఠినంగా శిక్షిస్తామని జిల్లాధికారి డాక్టర్ కుమార హెచ్చరించారు. జిల్లా పాలన విభాగం, న్యాయ సేవల ప్రాధికార, కార్మిక శాఖ, బాల కార్మిక యోజన సొసైటీ, న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నగరంలోని కేవీ శంకరగౌడ శతమానోత్సవం భవనంలో ఏర్పాటు చేసిన ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంలో జిల్లాధికారి పాల్గొని మాట్లాడారు. నిరక్షరాస్యత, కుటుంబ ఆర్థిక పరిస్థితి, సామాజిక స్థితిగతులు తదితర కారణాలరీత్యా పిల్లలను బాల కార్మికులుగా మారుస్తున్నారన్నారు. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రభుత్వం ఎన్నో కఠిన చట్టాలను తీసుకొచ్చిందని చెప్పారు. పిల్లలు చదువుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాల ఏర్పాట్లు చేస్తోందన్నారు. పిల్లలను పనుల్లో చేర్పించకుండా బడి బాట పట్టించాలని సూచించారు.

కుక్కేలో క్రికెటర్ పూజలు

యశవంతపుర: టీం ఇండియా క్రికెట్ ఆటగాడు మయాంక్ అగర్వాల్, ఐపీఎల్ మ్యాచ్‌లు ముగియగానే భార్యతో కలిసి ఆలయాలకు వెళ్తున్నారు. అందులో భాగంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కుక్కే సుబ్రమణ్యం స్వామి ఆలయాన్ని దర్శించుకొని సర్పదోష నివారణ పూజలు చేశారు. మంగళూరులో కటీలు దుర్గా పరమేశ్వరి అమ్మవారిని దంపతులిద్దరూ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దొంగ అరెస్ట్, 19 బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

మైసూరు: బైక్ చోరీలకు పాల్పడుతున్న దొంగను నంజనగూడు పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ. 15 లక్షల విలువ చేసే 19 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని చామరాజనగర కరినంజనపుర గ్రామానికి చెందిన శంకరప్ప (56)గా గుర్తించారు. కంఠేశ్వర ఆలయం దాసోహ భవనం ఎదుట నిలిపి ఉన్న వాహనాలను చోరీ చేసి చామరాజనగర, సరిహద్దు గ్రామాలకు విక్రయించేవాడు. బైక్ చోరీలు పెరిగిపోవడంతో పోలీసులు బృందంగా ఏర్పడి గాలింపు చేపట్టారు. ఓ వ్యక్తి దాసోహ భవనం వద్ద పార్కింగ్‌లో ఉన్న బైక్‌ల హ్యాండిల్లను అటుఇటు ఊపుతుండగా అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారణ చేపట్టగా చోరీ ఘటనలు వెలుగు చూశాయి.

రోడ్డు విస్తరణలో ఎవరికీ అన్యాయం జరగదు

గౌరిబిదనూరు: శిరా నుంచి ముళబాగిలు మీదుగా చేపట్టిన జాతీయ రహదారి పట్టణం మీదుగా వెళ్లే సమయంలో రోడ్డు విస్తరణలో భాగంగా కొన్ని భవనాలను తొలగిస్తారని, ఇందులో ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తామని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తాలూకాలో రూ.228 కోట్లతో రోడ్డు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణంలో 28 అడుగుల రోడ్డు వెడల్పు చేస్తామన్నారు. అక్కడక్కడ హైమాస్క్ విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. అనంతరం జాతీయ రహదారి అధికారులు తారు రోడ్డు నాణ్యతకు సంబంధించి తెచ్చిన శాంపుల్స్‌ను ఎమ్మెల్యేకు చూపించారు. సమావేశంలో ఏఈఈ మల్లికార్జున, ఇంజినీర్ శివణ్ణ పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



పుస్తకాలను వితరణ చేస్తున్న కోటి భాస్కర్

గౌరిబిదనూరు: ధనమున్నవారు ధనవంతులు కాదని, దానగుణం ఉన్నవారే ధనవంతులని కన్నడ సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు డీజె చంద్రమోహన్ అన్నారు. జేడీఎస్ నాయకుడు కోటి భాస్కర్ జన్మదినం సందర్భంగా జి.బొమ్మసంద్రలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఉచితంగా నోటు పుస్తకాలు వితరణ చేశారు.అనంతరం కోటి భాస్కర్‌ను సన్మానించారు. పారిశ్రామిక వేత్త రాఘవేంద్ర, గిరి, మాజీ జీపీ అధ్యక్షుడు శ్రీధర్ పాల్గొన్నారు.

బయలు సీమకు నీరివ్వడమే లక్ష్యం



స్వామీజీ నుంచి ఆశీస్సులు అందుకుంటున్న ఎంపీ గోవింద కారజోళ

తుమకూరు: అప్పర్ భద్రా ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తి చేసి బయలు సీమకు నీరు ఇవ్వడమే తన తొలి ప్రాధాన్యమని చిత్రదుర్గ ఎంపీ గోవింద కారజోళ తెలిపారు. శిరా తాలూకా పట్టనాయకనహళ్లి చారిత్రక ప్రసిద్ధ శ్రీ గురుగండ బ్రహ్మేశ్వర స్వామి మఠం శాఖ అయిన స్ఫటికపురి మహాసంస్థాన్ మఠంలో శ్రీ నంజావధూత మహాస్వామిజీని గోవింద కారజోళ కలుసుకుని ఆశీస్సులు అందుకున్నారు., అనంతరం మాట్లాడుతూ అప్పర్ భద్ర జలవనరుల ప్రాజెక్టును జాతీయప్రాజెక్టుల జాబితాలో చేర్చి రూ. 5,300 కోట్లు నిధులను విడుదల చేయాలని కేంద్రానికి మనవి చేసినట్లు తెలిపారు.

బీబీఎంపీ నూతన పాలనాధికారి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఆర్.ఉమాశంకర్

బనశంకరి: నగరాభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎస్‌ఆర్.ఉమాశంకర్ బృహత్ బెంగళూరు మహానగర పాలికె పాలనాధికారిగా బుధవారం బీబీఎంపీ కేంద్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పాలనాధికారి ఎస్‌ఆర్. ఉమాశంకర్‌కు బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్ పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. పాలికె ప్రత్యేక కమిషనర్లు మునీశ్‌మౌద్గిల్, సురల్కర్‌వికాస్‌కిశోర్, డాక్టర్ కే.హరీశ్‌కుమార్, శివానంద్‌కల్కరే, వలయ కమిషనర్లు స్నేహల్, ఆర్‌ఎల్.దీపక్, కరిగౌడ, రమేశ్, ప్రీతిగెహ్లాట్ పాల్గొన్నారు.

జూలై నాటికి పనులు పూర్తి చేయండి



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

మండ్య: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు జూలై చివరి నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులకు జిల్లాధికారి డాక్టర్ కుమార ఆదేశించారు. నగరంలోని రైల్వే అండర్‌పాస్ వంతెన, కూరగాయల మార్కెట్ పనులను ఎమ్మెల్యే పి.రవికుమార్, అధికారులతో కలసి సమీక్షించిన అనంతరం జిల్లాధికారి మీడియాతో మాట్లాడారు. రైల్వే అండర్‌పాస్ వంతెన నిర్మాణం తుది దశలో ఉందని, పనులు వేగవంతం చేయాలని సూచించినట్లు చెప్పారు. అలాగే మార్కెట్ నిర్మాణం కూడా త్వరగా పూర్తి చేసి వ్యాపారులకు దుకాణాలను అప్పగిస్తామన్నారు.

తల్లి చెంతకు గున్న ఏనుగు



గున్న ఏనుగుకు చెరకుగడలు అందిస్తున్న దృశ్యం

మైసూరు: అస్వస్థతకు గురైన పిల్ల ఏనుగుకు చికిత్స అందించి కోలుకున్నాక తల్లి ఏనుగు వద్దకు చేర్చారు. బేతాళకట్టె గస్తీ గంజిగట్టె అటవీ ప్రాంతంలో ఈనెల 10న గస్తీలో ఉన్న అటవీ సిబ్బంది జయణ్ణ పిల్ల ఏనుగు పడి ఉండడాన్ని గుర్తించాడు. బండీపుర అటవీ అధికారులు, పశు వైద్యాధికారులు చేరుకుని చికిత్స అందించారు. అంతలోనే పిల్ల ఏనుగు కేకలు విన్న తల్లి ఏనుగు అక్కడికి చేరుకుని చికిత్స అందిస్తున్న అధికారులపై దాడి చేసేందుకు యత్నించింది. అయినా ధైర్యం తెచ్చుకుని పిల్ల ఏనుగుకు చికిత్స కొనసాగించారు. సాయంత్రం వరకు తీవ్రంగా శ్రమించి పిల్ల ఏనుగు కొంచెం కోలుకున్నాక తల్లి ఏనుగు చెంతకు చేర్చారు. 24 గంటల పాటు పిల్ల ఏనుగు ఆరోగ్యంపై నిఘా ఉంచేందుకు కూడా అధికారులు చర్యలు తీసుకున్నారు.

బాలమందిరం నుంచి బాలికల అదృశ్యం

శివమొగ్గ: నగరంలోని ఆల్కోళ సర్కిల్ వద్ద ఉన్న బాల మందిరం నుంచి ఆరు మంది బాలికలు తప్పించుకుని పోయారని ప్రిన్సిపాల్ వినోబనగర పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలమందిరంలో వార్డెన్లు నిద్రించిన తర్వాత గేటు తాళాలు చోరీ చేసి తలుపులు తెరుచుకుని పారిపోయినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వార్డెన్ మొబైల్‌కూడా తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. వీరందరికి 15 నుంచి 17 ఏళ్ల వయసు ఉంటుందని తెలిపారు.

హోసూరు వార్తలు..

బాలలతో పని చేయించరాదు



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

హోసూరు: బాల కార్మిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో కలెక్టర్ శరయు కార్యాలయ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ మాట్లాడుతూ 14 ఏళ్లలోపు ఉన్న బాలురను పనిలో ఉంచడం విరుద్ధమని, జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు అధికార్లు సహకరించాలని తెలిపారు. 14 ఏళ్లలోపు ఉన్న బాలురను పనిలో ఉంచుకొన్న యాజమానులపై కఠిన చర్యలు చేపట్టాలని, కార్మిక సంక్షేమ శాఖాధికార్లు జిల్లా వ్యాప్తంగా పర్యటించి బాలకార్మికులుగా పనిచేస్తున్న వారిని గుర్తించి విముక్తి కల్పించి పాఠశాలల్లో చేర్పించి పిల్లలకు మెరుగైన విద్యను అందజేయాలని, తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాత్రికులకు రక్షణ కల్పించాలి

హోసూరు: దేశంలోని నలుమూలల నుంచి జమ్ము కశ్మీర్ తీర్థయాత్ర వెళ్లే హిందువులకు రక్షణ కల్పించాలని బుధవారం హోసూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దేవరాజ్, కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. ఉగ్రవాదుల దాడుల్లో యాత్రికులు హత్యకు గురవుతున్నారని తెలిపారు.

బాలల దాడిలో కూలీ హతం

కెలమంగలం: ఇద్దరు బాలలు దాడి చేసి భవన నిర్మాణ కూలీ కార్మికున్ని హత్య చేసిన ఘటన డెంకణీకోట వద్ద జరిగింది. వివరాల మేరకు డెంకణీకోట సమీపంలోని పుదూర్ గ్రామానికి చెందిన తంబిదురై (23) మంగళవారం సాయంత్రం మద్యం మత్తులో వెళుతూ ఆ ప్రాంతంలో క్రికెట్ ఆడుకొంటున్న బాలలను దూషించాడు. దీంతో ఆవేశానికి గురైన ఇద్దరు బాలలు అతనిపై తిరగబడి దాడి చేశారు. తంబిదురై తలకు తీవ్ర గాయాలేర్పడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. డెంకణీకోట పోలీసులు హత్య కేసు నమోదు చేసుకొని 16, 17 ఏళ్ల బాలలను అరెస్ట్ చేశారు. ఈ సంఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది.

రాహుల్‌ను కలిసిన ఎంపీ



రాహుల్, ప్రియాంకతో ఎంపీ తదితరులు

హోసూరు: క్రిష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గంలో గెలిచిన డీఎంకే- కాంగ్రెస్ ఎంపీ కే.గోపినాథ్ ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీని కలిశారు. తరువాత మీడియాతో మాట్లాడుతూ క్రిష్ణగిరి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని, జిల్లాలో ప్రజల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

ఫారంపాండ్‌లోకి పడి బాలుడు..

క్రిష్ణగిరి: సూళగిరి సమీపంలో నీటి గుంటలోకి జారి పడిన బాలుడు మృతి చెందిన ఘటన సూళగిరి వద్ద చోటు చేసుకొంది. వివరాల మేరకు వివరాల మేరకు సూళగిరి సమీపంలోని చిన్నమట్టారంపల్లి కి చెందిన శంకరప్ప కొడుకు కార్తీక్ (15), మంగళవారం సాయంత్రం సింపల్‌ద్రాడి ప్రాంతానికెళ్లాడు. ఓ పొలంలోని ఫారంపాండ్‌లోకి జారిపడడంతో మరణించాడు. సూళగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

ప్రైవేటు ఉద్యోగి దుర్మరణం



ఘటనా స్థలంలో అనికుమార్ మృతదేహం

హోసూరు: రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ ఉద్యోగి ఘటనా స్థలంలోనే మృతి చెందిన ఘటన పట్టణంలో జరిగింది. వివరాల మేరకు హోసూరు నరసింహకాలనీకి చెందిన అనిల్‌కుమార్ (48) రెండవ సిఫ్‌కాట్ ప్రాంతంలోని ప్రైవేట్ గ్రానైట్ పరిశ్రమలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం పనిపై బైక్‌లో బెంగళూరుకెళ్లిన ఇతను సాయంత్రం తిరిగి వస్తుండగా బస్టాండు సమీపంలోని జీఆర్‌టీ ఫ్లైఓవర్‌పై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలతో అక్కడే మరణించాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తీగ చోరీ

కెలమంగలం: డెంకణీకోట సమీపంలో రైతు పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు బద్దలగొట్టి రాగి తీగను ఎత్తుకెళ్లారు. మేడుముత్తుకోటలో రైతు క్రిష్ణప్ప పొలంలో విద్యుత్ శాఖ ద్వారా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా చుట్టుప్రక్కల రైతుల బోరుబావులకు, స్థానిక ఇళ్లకు విద్యుత్ సరఫరా జరుగుతుండేది. మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ద్వసం చేసి కాపర్ వైరును దోచుకెళ్లారు. విద్యుత్, పోలీసు అధికారులు పరిశీలించి కేసు నమోదు చేశారు. దొంగల నిర్వాకం వల్ల చుట్టుపక్కల విద్యుత్ సమస్య ఏర్పడింది.

ఉల్లంఘనకు పాల్పడితే ఇంటికే నోటీసులు



లేజర్ స్పీడ్‌గన్ కెమెరాతో వాహన వేగాన్ని అంచనా వేస్తున్న దృశ్యం

చింతామణి: అతి వేగం ప్రమాదకరమని సూచిక బోర్డులు ఏర్పాటు చేసినా వాహనదదారులు హైస్పీడ్‌తో ప్రయాణిస్తున్నారు. ఈక్రమంలో తాలుకాలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతుండటంతో వాటిని అరికట్టడానికి జిల్లా పోలీసు యంత్రాంగం నడుం బిగించింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఉల్లంఘనులకు చెక్ పెడుతోంది. లేజర్ స్పీడ్‌గన్‌తో వాహనాల వేగాన్ని అంచనా వేసి అతి వేగంతో వాహనం నడిపి ఉంటే ఆ వాహనం నంబర్ ఆధారంగా ఇంటికే నోటీసు పంపనున్నారు. ఇందులో భాగంగా బుధవారం పట్టణంలో లేజర్ స్పీడ్ గన్‌తో వాహనాల తనిఖీ చేపట్టారు.

క్యాన్సర్‌తో వ్యక్తి మృతి

- మృతదేహాన్ని ఇంటిలోకి అనుమతించని కుటుంబ సభ్యులు
- బాగల్‌కోటెలో విషాద ఘటన

యశవంతపుర: ఓ వ్యక్తి క్యాన్సర్‌తో మృతి చెందగా మృతదేహాన్ని ఇంటిలోకి తీసుకురానివ్వకుండా కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. ఈ అమానుష ఘటన బాగలకోటె జిల్లా బనహట్టి నగరం సోమవారపేటలో జరిగింది. సోమవారపేటకు చెందిన గురుకిత్తూరు(51) కేన్సర్‌కు గురవ్వడంతో ఇల్లు వదలి వెళ్లిపోయాడు. బయటే తిరుగుతూ అక్కడక్కడ ఆశ్రయం పొందేవాడు. వ్యాధి తీవ్రతరం కావడంతో బనహట్టి పట్టణంలోని వైభవ చిత్రమందిరం సమీపంలో రోడ్డు పక్కలో ఈ నెల 11న మృతి చెందాడు. స్థానికులు గమనించి మృతిదేహాన్ని తీసుకొని ఇంటివద్దకు వెళ్లారు. అయితే కుటుంబ సభ్యులు గురుకిత్తూరు మృతదేహాన్ని ఇంటిలోకి తీసుకురావటానికి నిరాకరించారు. దీంతో స్థానికులు ఇంటి బయటే వీధి దీపాల మధ్య అంతిమ, విధి విధానాలను పూర్తి చేసి అంత్యక్రియలకు తరలించారు.

పోలీసులమంటూ ఫోన్లు చేసి బెదిరింపులు

యశవంతపుర: మీ పిల్లలను అరెస్ట్ చేశాం. విడుదల కావాలంటే డబ్బు ఇవ్వాలని గుర్తు తెలియని వ్యక్తులు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి బెదిరించారు. ఈఘటనలు మంగళూరులో జరిగాయి. సోమ, మంగళవారం అనేక మంది విద్యార్థుల తల్లిదండ్రులకు ఇలా బెదిరింపు కాల్స్ వచ్చాయని మంగళూరు నగర పోలీసు కమిషనర్ అనుపమ్ అగర్వాల్ తెలిపారు. ఎక్కువగా పోలెండ్, పాకిస్థాన్ నుంచి కాల్స్ వచ్చినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఫోన్ చేసిన వ్యక్తులు తాము పోలీసులమని పరిచయం చేస్తుకోని బెదిరించి డబ్బు డిమాండ్ చేసినట్లు విచారణలో బయట పడిందన్నారు.

ముందస్తు బెయిలు అర్జీ కొట్టివేత

యశవంతపుర: నటి హర్షికా పూణచ్చ, భర్త భవన్‌తో అసభ్యంగా ప్రవర్తించి, దాడి చేసిన కేసుకు సంబంధించి నలుగురు నిందితులు పెట్టుకున్న ముందస్తు బెయిల్ అర్జీని హైకోర్టు రద్దు చేసింది. బెంగళూరు ఫ్రేజర్‌టౌన్ ప్రాంతంలోని పులకేశినగర రోడ్డులో వీరు ప్రయాణిస్తున్న కారును నలుగురు దుండగులు అడ్డగించి అసభ్యంగా తిట్టి, దాడి చేశారు. దీంతో నగరంలో భద్రత కరువైందంటూ హర్షిక సోషల్ మీడియాలో ఆవేదన వెళ్లగక్కారు. ఈ ఘటనలో ఫవేజ్ అలీ, ఫహిమ్, షాబాజ్‌ఖాన్, దనీశ్ అలీ అనే వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

టౌన్‌షిప్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి బీఎస్ సురేశ్

తుమకూరు: తుమకూరు జిల్లా వసంతనరసాపుర పారిశ్రామికవాడకు సమీపంలో సమీకృత టౌన్‌షిప్ నిర్మాణం చేపట్టాలని నగరాభివృద్ధి శాఖకు మంత్రి బీఎస్ సురేశ్ సూచించారు. విధానసౌధలోని తన కార్యాలయంలో నగరాభివృద్ధి శాఖ పరిధిలోకి వచ్చే అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మూడు నెలల క్రితం చేపట్టిన పనులు, వాటి అభివృద్ధిపై సమీక్షించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వసంతనరసాపుర వద్ద సుమారు 500 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణం చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ ఎత్తివేసిన కారణంగా నిర్మాణంపై దృష్టి సారించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మైసూరు: తెగిపడిన విద్యుత్ తీగ తగిలి రైతు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా గట్టవాడిపుర గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బసవశెట్టి (60) పొలానికి వెళ్లి అప్పటికే తెగిపడిన కరెంటు తీగాపై కాలు మోపాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. బెస్కాం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఈ ఘటన జరిగిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

పాడేరు ఘాట్‌లో లారీ బోల్తా

ముగ్గురి మృతి.. 12 మందికి గాయాలు



సాక్షి, పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు నుంచి లైటింగ్ సామగ్రితో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం బయలుదేరిన లారీ అదుపుతప్పి బోల్తా కొట్టింది. బ్రేక్ ఫెయిల్ కావడంతో జరిగిన ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. 12 మంది తీవ్రంగా స్వల్పంగా గాయపడ్డారు. వీరిని పాడేరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో 8 మంది పరిస్థితి విషమంగా ఉంది. వివరాలిలా ఉన్నాయి. పెదబయలులో మూడు రోజుల పాటు నిర్వహించిన మోదకొండమ్మ ఉత్సవాలకు అచ్యుతాపురానికి చెందిన ఎస్ఎస్‌వీ లైటింగ్ సంస్థ విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేసింది. ఉత్సవాలు మంగళవారం ముగియడంతో లైటింగ్ సామగ్రి లోడుతో బుధవారం మధ్యాహ్నం లారీలో 15 మంది కార్మికులు బయలుదేరారు. వీరంతా లైటింగ్ సామాన్లపై కూర్చున్నారు. పాడేరు ఘాట్‌లోని 12వ మైలు రాయి సమీపంలోకి వచ్చేసరికి లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో 15 మంది లోయలో పడిపోయారు. వారిమీద లైటింగ్ సామగ్రి పడిపోవడంతో బోడవరం మండలానికి చెందిన హరీష్, అచ్యుతాపురం మండలానికి చెందిన లక్ష్మణ్, అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన 13 మందిలో కొందరికి తీవ్రంగా, మిగతా వారికి స్వల్పంగా గాయాలయ్యాయి. వీరిని పాడేరులోని జిల్లా ఆస్పత్రికి తరలించగా.. యలమంచిలి మండలం షేక్‌పాలేనికి చెందిన రాయి అశోక్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగతా 12 మందిలో 8 మంది పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న కలెక్టర్ విజయసునీత జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి రాజీనామా

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి బుధవారం రాజీనామా చేసింది. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు బుల్లెట్ జయశ్యామ్, ప్రకాశం పంతులు, పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఆవులపాటి శ్రీనివాసులు, కొండూరు సునీత, రమాప్రభ, పసల సుమతి, లక్ష్మి, జయమ్మ, ప్రత్యేక ఆహ్వానితులు కంతా ఉదయ్, పాండు, జూలుగంటి సుబ్బారావు, శోభ గౌడ్, సుశీల తమ రాజీనామా పత్రాలను ఈవో ఎస్వీ నాగేశ్వరరావుకు అందజేశారు.

అలసత్వంతో అరాచకం

- మైనారిటీలు, వైఎస్సార్ సీపీ మద్దతుదారులపై యథేచ్ఛగా అల్లరిమూకల దాడులు
- హైకోర్టులో వైవీ సుబ్బారెడ్డి 'పిల్'పై నేడు ధర్మాసనం విచారణ

సాక్షి, అమరావతి: ఎన్నికల ఫలితాల అనంతరం ఓ రాజకీయ పార్టీకి చెందిన వారిని లక్ష్యంగా చేసుకుని అల్లరి మూకలు సాగిస్తున్న విధ్వంసం, హింసాకాండపై రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. లక్షిత దాడులకు పాల్పడుతున్న వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. హింసను సత్వరమే కఠినంగా అణిచి వేసేలా కేంద్ర హోంశాఖ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీని ఆదేశించాలని కోరారు. బాధితులు, వారి కుటుంబ సభ్యుల ప్రాణాలకు, ఆస్తులకు ముప్పు తలపెడుతున్న వ్యక్తులు, సమూహాలను నియంత్రించేందుకు చట్ట ప్రకారం గట్టి చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోర్టును అభ్యర్థించారు. లక్షిత హింసపై ఫిర్యాదులు అందిన వెంటనే బాధ్యులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. హింసకు కారకులను గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని విన్నవించారు. బాధితులు, వారి కుటుంబ సభ్యులకు తగిన రక్షణ కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. హింసకు దారి తీసిన పరిస్థితులను తేల్చేందుకు ఇద్దరు విశ్రాంత న్యాయమూర్తులతో ఓ కమిటీని నియమించేలా ఆదేశించాలని వైవీ సుబ్బారెడ్డి తన



వ్యాజ్యంలో కోర్టును అభ్యర్థించారు. న్యాయమూర్తులు జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ న్యాపతి విజయ్ ధర్మాసనం ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై గురువారం విచారణ జరపనుంది.

పరిహారం బాధ్యత ప్రభుత్వానిదే..

రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తక్షణమే కేంద్ర పారా మిలటరీ బలగాలను రప్పించాల్సిన అవసరం ఉందని సుబ్బారెడ్డి కోర్టుకు నివేదించారు. లక్షిత దాడుల్లో ప్రాణాలు, ఆస్తులు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఈ బాధ్యత నుంచి ప్రభుత్వాలు తప్పించుకోజాలవని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో పేర్కొందని గుర్తు చేశారు. మరో ప్రత్యామ్నాయం లేనందున పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను పరిరక్షించి సత్వర న్యాయం అందించేందుకు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసినట్లు సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఓటర్లే లక్ష్యంగా...

ప్రజల ప్రాణాలు, స్వేచ్ఛ, ఆస్తులను కాపాడే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యత నుంచి పారిపోవడానికి వీల్లేదని సుబ్బారెడ్డి తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మారుమూల గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వారిని లక్ష్యంగా చేసుకుని చేస్తున్న దాడులు, హింసాకాండకు తాజాగా అధికారం చేపట్టిన పార్టీ ఆమోదం ఉందన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలను పరిశీలించాలని కోర్టుకు విన్నవించారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను నిరాశ్రయులను చేయడం, వారిపై రాళ్లతో దాడులు చేయడం లాంటి ఘటనలు ఆ వీడియోలో స్పష్టంగా ఉన్నాయని తెలిపారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, అదనపు డీజీ బాగ్చీ, పల్నాడు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి టీడీపీ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ అధికారులు హింసను నిరోధించకుండా తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులపైనే తప్పుడు కేసులు బనాయిస్తున్నారని తెలిపారు.

గంటల వ్యవధిలో దాడులు మొదలు..

ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది గంటలకే రాష్ట్రంలో దాడులు, హింసాకాండ మొదలయ్యాయని, ఉద్దేశపూర్వకంగా కొందరిని లక్ష్యంగా చేసుకుని అల్లరి మూకలు దాడులకు తెగబడ్డాయని సుబ్బారెడ్డి తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరేందుకు కొంత సమయం ఉండటంతో దీన్ని ఆసరాగా చేసుకుని దాడులకు, హింసకు తెర తీశారని నివేదించారు. ఇళ్లు, గ్రామాలను వదిలేసి వెళ్లకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదిరింపులకు దిగారన్నారు. ఈ హింస, దాడులపై తమ పార్టీ రాజ్యసభ సభ్యుడు ఎస్.నిరంజన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేస్తూ తక్షణ జోక్యానికి రాష్ట్రపతి, గవర్నర్, డీజీపీకి లేఖలు రాశారని తెలిపారు. నిర్దిష్ట రాజకీయ పార్టీతో సంబంధాలున్న వారినే లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. పౌరుల ప్రాణాలు, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు దారుణంగా విఫలమయ్యారన్నారు. విధ్వంసకారులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నా, మైనారిటీలపై యథేచ్ఛగా దాడులకు పాల్పడుతున్నా పోలీసులు చోద్యం చూస్తూ ఉండిపోయారన్నారు.

దళిత నేత ఇంటిపై టీడీపీ దాష్టీకం

ఇంటి ముందు ఉన్న షెడ్ దహనం



టీడీపీ కార్యకర్తల దాడిలో తగలబడుతున్న షెడ్డు

గుంటూరు ఈస్ట్: టీడీపీ నేతల దాష్టీకాలకు అడ్డుకట్ట పడటం లేదు. అధికార గర్వంతో బడుగులపై దాడులకు దిగుతున్నారు. తాజాగా గుంటూరుకు చెందిన దళిత నాయకుడు, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు బోరుగడ్డ అనిల్‌కుమార్ ఇంటి ముందున్న షెడ్‌ను బుధవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు తగులబెట్టారు. దీంతో అందులోని సామగ్రి మొత్తం కాలిపోయింది. ఈ మేరకు బోరుగడ్డ అనిల్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. గతంలోనూ ఆయన ఇంటి ముందున్న షెడ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు.

ముందస్తు బెయిల్ మంజూరు చేయండి

- రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే నాపై కేసు
- అరెస్ట్ చేసి కస్టోడియల్ విచారణ పేరుతో హింసించొచ్చు
- హైకోర్టులో ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి పిటిషన్
- నేడు విచారణ జరపనున్న హైకోర్టు

సాక్షి, అమరావతి: సీఐడీ నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఏపీ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) మాజీ ఎండీ వాసుదేవరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కొత్త ప్రభుత్వ ప్రోద్బలంతో తనపై ఈ కేసును నమోదు చేశారని పేర్కొన్నారు. తనను అరెస్టు చేసి కస్టడీలో విచారణ పేరుతో హింసించే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ వ్యాజ్యం తేలేంత వరకు తనకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు గురువారం విచారణ జరపనుంది. ఏపీఎస్‌బీసీఎల్ కార్యాలయం నుంచి ఆ సంస్థకు చెందిన ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, ఇతర కీలక పత్రాలను వాసుదేవరెడ్డి తీసుకెళ్లారని, ఇవన్నీ ఆయన తన కారులో తరలిస్తుండగా చూశానంటూ ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లకు చెందిన గద్దె శివకృష్ణ సీఐడీకి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీని ఆధారంగా సీఐడీ అధికారులు ఈ నెల 6న వాసుదేవరెడ్డిపై కేసు నమోదు చేశారు. ఆధారాల ధ్వంసం, చోరీ, నేరపూరిత కుట్ర తదితర సెక్షన్ల కింద కేసు పెట్టారు. అనంతరం హైదరాబాద్‌లోని ఆయన ఇంటిలో సోదాలు నిర్వహించారు. ఐఆర్‌టీఎస్ అధికారి అయిన తనపై ఇప్పటివరకు ఎలాంటి ఆరోపణలు లేవని వాసుదేవరెడ్డి తన పిటిషన్‌లో తెలిపారు. కక్షపూరిత రాజకీయాల్లో భాగంగానే తనపై సీఐడీ ఈ కేసు నమోదు చేసిందన్నారు. తనకు ఎలాంటి నేర చరిత్ర లేదని, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లతో తనకు గట్టి బంధం ఉందని, అందువల్ల పారిపోయే అవకాశం కూడా లేదని చెప్పారు. బెయిల్ మంజూరు సందర్భంగా ఎలాంటి షరతులు విధించినా వాటికి కట్టుబడి ఉంటానన్నారు.

కుట్రపూరితంగా ఇరికించారు..

సీఐడీ అధికారులు తనను మాత్రమే నిందితుడిగా చేర్చారని, ఇతరుల పాత్ర గురించి మౌనంగా ఉన్నారని వాసుదేవరెడ్డి ఆరోపించారు. ఇదే సమయంలో నేరపూరిత కుట్రకు పాల్పడ్డానని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారని, ఇతర వ్యక్తుల ప్రమేయం ఉంటేనే ఈ సెక్షన్ కింద కేసు పెట్టడం జరుగుతుందన్నారు. ఇలా చేయడం ద్వారా పోలీసులు ఉద్దేశపూర్వకంగా ఘోర తప్పిదానికి పాల్పడ్డారన్నారు. అలాగే కుట్రపూరితంగా తనను ఈ కేసులో ఇరికించారనే విషయం ప్రస్ఫుటమవుతోందన్నారు. ఏ డాక్యుమెంట్లనైతే తాను దొంగలించానని పోలీసులు ఆరోపిస్తున్నారో వాటిని అధికారులు తన నివాసం నుంచి స్వాధీనం చేసుకోలేదని తెలిపారు. తనకు, తన కుటుంబానికి చెందిన వ్యక్తిగత డాక్యుమెంట్లను మాత్రమే స్వాధీనం చేసుకున్నారన్నారు. దీన్నిబట్టి తాను ఎలాంటి తప్పు చేయలేదని రుజువవుతోందన్నారు. రాత్రి 11.30 గంటలకు ఫిర్యాదు చేశారని, కొద్ది నిమిషాలకే ఐజీ తనపై కేసు నమోదు చేయాలని సీఐడీ డీఎస్పీని ఆదేశించారని ఆరోపించారు. దీన్నిబట్టి ముందస్తు ప్రణాళికలో భాగంగానే ఇదంతా జరిగినట్లు అర్థమవుతోందన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని తనకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోర్టును అభ్యర్థించారు.

శంకరనగరం సర్పంచ్‌పై మారణాయుధాలతో టీడీపీ దాడి

సోమశిల: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం శంకరనగరం సర్పంచ్ వరలక్ష్మిపై బుధవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు మారణాయుధాలతో దాడిచేశారు. ఆరుగురిని తీవ్రంగా గాయపరిచారు. సర్పంచ్ ఇంట్లో సామగ్రిని ధ్వంసం చేశారు. చంద్రబాబు ప్రమాణస్వీకారం నేపథ్యంలో విజయోత్సవర్యాలీ పేరిట బుధవారం రాత్రి మారణాయుధాలతో టీడీపీ కార్యకర్తలు వీరంగం చేశారు. వైఎస్సార్‌సీపీ వారిని కవ్విస్తూ ఇష్టారీతిన ప్రవర్తించారు. సర్పంచ్ నివాసం వద్ద డీజే, బాణసంచా కాలుస్తూ రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించారు. ఈ విషయమై వైఎస్సార్‌సీపీ నాయకులైన సర్పంచ్ కుటుంబసభ్యులు వారిని ప్రశ్నించారు. దీంతో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. సర్పంచ్ వరలక్ష్మి ఇంట్లోకి చొరబడి మారణాయుధాలతో సర్పంచ్‌పై దాడిచేశారు. ఇంట్లో టీవీ, ఫ్రిజ్, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. పక్కింట్లో ఉన్న సర్పంచ్ బంధువులు రవికుమార్ రెడ్డి, నాగసునీల్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి అడ్డుకోబోగా గొడ్డలితో దాడిచేశారు. నాగసునీల్‌రెడ్డి కనుబొమ్మ వద్ద, రామసుబ్బారెడ్డి, రవికుమార్‌రెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. ఇంట్లో ఉన్న ఇద్దరు వృద్ధ మహిళలపై దాడిచేసి గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన రవికుమార్‌రెడ్డి, నాగసునీల్ రెడ్డి, రామసుబ్బారెడ్డిలను ఆత్మకూరులోని జిల్లా ఆస్పత్రికి, సర్పంచ్‌తో సహా గాయపడిన ఇద్దరు మహిళల్ని అనంతసాగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారిస్తున్నారు. టీడీపీ వర్గీయులు విజయోత్సవ సంబరాల్లో మారణాయుధాలతో రావడం చూస్తే దాడి చేయాలనే ముందస్తు వ్యూహంతోనే వచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయమై పోలీసులను అడగగా.. విచారణలో అన్నీ తేలతాయని పేర్కొన్నారు.



సర్పంచ్ ఇంట్లో ధ్వంసమైన వస్తువులు

అరాచకాలకు ఆధారాలివిగో

రాజ్యాంగ వ్యవస్థలకు అందచేసిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు
టీడీపీ - జనసేన హింసాకాండపై సాక్ష్యాధారాలతో ఫిర్యాదు
రాజకీయ ప్రత్యర్థులపై విచ్చలవిడిగా దాడులు
జేసీబీలతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఇళ్ల కూల్చివేతలు

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల అనంతరం రాజకీయ ప్రత్యర్థులను అంతమొందించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌లో యథేచ్ఛగా చెలరేగిన హింసాకాండపై వైఎస్సార్ సీపీ స్పష్టమైన ఆధారాలను రాజ్యాంగ వ్యవస్థలకు అందచేసింది. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు, మహిళలు, మైనార్టీలపై టీడీపీ –జనసేన గూండాలు సాగించిన అకృత్యాలతోపాటు ప్రభుత్వ ఆస్తులైన సచివాలయాలు, పార్కులు, విగ్రహాలు, శిలా ఫలకాలు, భవనాల విధ్వంసాలకు సంబంధించి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని, హోంమంత్రి, జాతీయ మానవ హక్కుల కమిషన్ కార్యాలయాలకు లిఖితపూర్వకంగా వీడియో సహిత ఆధారాలతో పార్టీ ఎంపీలు బుధవారం ఫిర్యాదులు సమర్పించారు.

- ఏలూరు జిల్లా నూజివీడు వద్ద వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ నడకుదురు గిరీష్‌పై టీడీపీ కార్యకర్త నూకల సాయి ఆధ్వర్యంలో కత్తితో దాడి చేసి హత్యాయత్నం.
- గుంటూరు లక్ష్మీపురంలో ఓ ప్రైవేట్ హాస్టల్‌లో చొరబడి యజమానితో కాళ్లు పట్టించుకున్న జనసేన కార్యకర్తలు
- తెనాలి బోస్ రోడ్డులో వైఎస్సార్ సీపీ నాయకుడు కాళిదాసు సత్యంపై పట్ట పగలే హత్యాయత్నం. తొమ్మిది కత్తిపోట్లుతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు.
- పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో అర్ధరాత్రి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై హత్యాయత్నం. సీసీ టీవీలో ఘటన రికార్డు.
- గుంటూరు పశ్చిమ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విడదల రజని కార్యాలయంపై రాళ్లు రువ్వి అద్దాలు ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్తలు. పార్టీ నేత ముస్తఫా సోదరుడు కర్ణుమా కుటుంబ సభ్యులపై దాడి చేసి కారు అద్దాల ధ్వంసం. వైఎస్సార్‌సీపీ మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి కార్యాలయంలోకి చొరబడి ఫర్నిచర్, కంప్యూటర్ ధ్వంసం. తాడికొండ మండలం మోతడకలో మాజీ సీఎం వైఎస్సార్ విగ్రహం ధ్వంసం.
- పల్నాడు జిల్లా కొచ్చర్ల సచివాలయంపై టీడీపీ, జనసేన కార్యకర్తల దాడితో ఫర్నీచర్, సామగ్రి ధ్వంసం. పల్నాడు జిల్లా కొండూరు ఎస్సీ కాలనీలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై రాళ్లతో దాడి. వినుకొండ కారంపూడి రోడ్డులో బొల్లా బ్రహ్మనాయుడు కల్యాణ మండపంపై రాళ్ల దాడి. చిలకలూరిపేట నియోజకవర్గం ఎండుగుపాలెం బీసీ కాలనీలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం.
- విజయవాడ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ నేమ్ ప్లేట్‌పై వైఎస్సార్ పేరు తొలగించిన దుండగులు. మచిలీపట్నం వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద రాళ్లతో దాడి.
- చిత్తూరులో రాఘవ కన్‌స్ట్రక్షన్ కార్యాలయాన్ని ధ్వంసం చేసి దగ్ధం చేసిన అల్లరిమూకలు. హరి అనే వ్యక్తికి చెందిన రూ.కోటి విలువైన సిగరెట్ల గోదాం దగ్ధం. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కన్నన్ నాయక్, మామిడి ప్రభాకర్‌రెడ్డి, ప్రసన్నలకు చెందిన హోటళ్లు, బేకరీలు ధ్వంసం. బంగారుపాళ్యం మండలం మొగిలివారిపల్లెలో దళితుల ఇళ్లను ముట్టడించడంతో పలువురికి గాయాలు. పూతలపట్టు నాయనం పల్లెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కిరణ్‌కు చెందిన ట్రాక్టర్‌కు నిప్పు అంటించి తవణం పల్లె తెల్లగుండ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటి గోడలు ధ్వంసం చేసిన దుండగులు.
- తిరుపతి జిల్లా చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్‌పై కత్తులు, రాడ్లతో దాడి చేసిన టీడీపీ మూకలు. చంద్రగిరి మండలం ఐతేపల్లిలో దాబాలో చొరబడి విధ్వంసం. వార్డు సభ్యుడు సక్కూర్ వంశీపై దాడి చేయడంతో తీవ్ర గాయాలు.
- కారులో ప్రయాణిస్తున్న ఏలూరు రూరల్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరాజు, రాష్ట్ర వడ్డి కుల కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, గార్లమడుగు వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణలపై దెందులూరు నియోజకవర్గం విజయరాయి వద్ద టీడీపీ కార్యకర్తల దాడి.
- పులివెందులలో యూట్యూబర్ సుంకేసుల ఆదిశేషు ఇంటిపై కొడవళ్లతో టీడీపీ మూకల దాడి. ప్రకాశం జిల్లా దొనకొండలో సింహం లలిత, ఆమె తండ్రి చొప్పరపు బాలస్వామిలపై టీడీపీ కార్యకర్తల దాడి.
- టీడీపీ కార్యకర్తల వేధింపులు భరించలేక చెట్టుకు ఉరి పోసుకున్న ఏలూరు జిల్లా పెదవేగి మండలం గార్లమడుగు పంచాయతీ సూర్యారావు పేటకు చెందిన సోషల్ మీడియా కన్వీనర్ యలమంచిలి ప్రవీణ్.
- ఏలూరు జిల్లా గార్లమడుగులో హెల్త్ క్లినిక్ ఆవరణలోని శిలాఫలకాలు ధ్వంసం. ఉంగుటూరు మండలం కైకరంలో బొర్రా నారాయణరావు చికెన్ దుకాణం ధ్వంసం.
- అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో వైఎస్సార్‌సీపీ నేత ఉమామహేశ్వరనాయుడు ఇంటిపై టీడీపీ నేతల దాడి. అన్నమయ్య జిల్లా రాయచోటి రూరల్ మండలం మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి ఇంటిపై టీడీపీ ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో టీడీపీ మూకల దాడి.
- చిలకలూరిపేట నియోజకవర్గంలో సచివాలయం బోర్డులు, శిలాఫలకాలు ధ్వంసం చేసి ట్రాక్టర్లతో కూల్చిన అల్లరి మూకలు. చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం బైరెడ్డి మండలంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రాలను ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్తలు.
- శ్రీకాళహస్తి మండలం వాగివేడులో మహిళా వలంటీర్‌పై టీడీపీ నేతల దాడి.
- చిత్తూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఖాదర్‌ను కిడ్నాప్ చేసి ఇంట్లోకి చొరబడి విధ్వంసం.
- విజయవాడలో వల్లభనేని వంశీ నివాసముంటున్న అపార్ట్‌మెంట్‌లో టీడీపీ మూకల విధ్వంసకాండ. దాడిలో గవర్నర్ కార్యాలయం ఉద్యోగి కారు కూడా ధ్వంసం. చంద్రబాబు ఆదేశాల మేరకే దాడులకు పాల్పడ్డామన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.
- తిరుపతి ఎస్వీ వర్సిటీలో కర్రలు, రాడ్లతో వీసీ శ్రీకాంత్‌రెడ్డి ఛాంబర్‌లోకి చొరబడి టీడీపీ మూకల విధ్వంసకాండ.
- ఎస్కే వర్సిటీలో బెదిరించి వైఎస్సార్ విగ్రహం తొలగింపు.
- రాజమహేంద్రవరం మోరంపూడి ఫ్లైఓవర్ బ్రిడ్జి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమక్షంలో ధ్వంసం చేసిన టీడీపీ మూకలు.
- పల్నాడు జిల్లా బొప్పూడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజ్‌కుమార్‌ను కిడ్నాప్ చేసి హింసకు తెగబడ్డ టీడీపీ మూకలు.
- కృష్ణా జిల్లా బాపులపాడు మండలం పెరికీడులో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షురాలు పాండు రాణి, మాజీ ఉప సర్పంచ్ పాండు నాగార్జున నివాసంపై టీడీపీ కార్యకర్తల దాడి. పెనమలూరు మండలం వణుకూరులో మైనారిటీ వ్యక్తి ఇంటిపై రాళ్లు రువ్విన అల్లరిమూకలు.
- శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం కౌలేపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు హిదాయతుల్లాపై దాడి.
- కావలిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ నివాసం వద్ద టీడీపీ మూకల కవ్వింపు చర్యలు. దగదర్తిలో వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త సి.శ్రీనివాసులు ఇల్లు జేసీబీతో కూల్చివేత. ఆత్మకూరు వైఎస్ఆర్‌సీపీ సర్పంచ్ గిరినాయుడిపై దాడి.
- పల్నాడు జిల్లా జంగమహేశ్వరపురంలో వైఎస్ఆర్‌సీపీ సానుభూతిపరులకు చెందిన రెండు ఇళ్లు జేసీబీలు, బుల్డోజర్‌తో కూల్చివేత.
- వెల్దుర్తి మండలం గొట్టిపాడుతోపాటు మాచర్ల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు చెందిన నాలుగు ఇళ్లు జేసీబీలతో ధ్వంసం.
- గురజాల నియోజకవర్గం చెన్నాయపాలెంలో టీడీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వడంతో ఇద్దరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలు.
- విశాఖ జోడుగుళ్లపాలెంలో వైఎస్ఆర్‌సీపీకి చెందిన ఉమ్మడి రమణపై టీడీపీ గూండాల హత్యాయత్నం. 9వ వార్డుకు చెందిన కార్పొరేటర్ స్వాతిదాస్‌పై టీడీపీ కార్యకర్తల రాళ్ల దాడి.



దాడులపై ఉప రాష్ట్రపతికి వివరిస్తున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

ప్రసవానంతరమే మాతృ మరణాలెక్కువ..

- 73 శాతం ఆ సమయంలో సంభవిస్తున్నవే..
- 26 శాతం ప్రసవానికి ముందు.. ఒక శాతం ప్రసవం సమయంలోనే..
- 2023–24లో సంభవించిన 362 మరణాలపై వైద్యశాఖ ఆడిట్
- 2/3 మరణాలు తొలి 48 గంటల్లోనే నమోదు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మాతృ మరణాలు ఎక్కువగా ప్రసవానంతరం చోటు చేసుకుంటున్నాయి. గర్భంతో ఉన్నప్పుడు లేదా ప్రసవ సమయంలో లేదా ప్రసవానంతరం 42 రోజుల్లో మహిళ ప్రాణాలు కోల్పోతే ప్రసూతి మరణంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) పరిగణిస్తుంది. 2023–24లో రాష్ట్రంలో 362 మాతృ మరణాలు సంభవించాయి. వీటిపై వైద్యశాఖ ఆడిట్ నిర్వహించింది. ఈ క్రమంలో 265 మరణాలు (73 శాతం) ప్రసవానంతరం చోటుచేసుకున్నట్లు తేలింది. మరో 26 శాతం అంటే 94 మరణాలు ప్రసవానికి ముందు, మరో ఇద్దరి మరణం ప్రసవం సమయంలో సంభవించింది.

30 వారాలు దాటాక 45 మరణాలు..

ఇక ప్రసవానికి ముందు సంభవించిన 94 మరణాల్లో 30 వారాలు దాటాక అత్యధికంగా 45 మరణాలున్నాయి. 25–29 వారాల్లో 18 మంది, 16 వారాల్లోపు 14 మంది, 7–20 వారాల మధ్య 11 మంది, 21–24 మధ్య ఆరు మంది గర్భిణులు మృతిచెందారు. ఇక ప్రసవానంతరం చోటుచేసుకున్న మొత్తం మరణాల్లో 2/3వంతు తొలి 48 గంటల్లోనే ఉన్నాయి.

మూడు ప్రధాన కారణాలు..

గర్భ ధారణ మహిళకు పరీక్షా సమయం అనే చెప్పొచ్చు. ఈ సమయంలో వారి శరీరంలో అనేక మార్పులు వస్తాయి. వీటిల్లో అధిక రక్తపోటు, ప్రసవానంతర రక్తస్రావం, సెప్టిసీమియా.. ఈ మూడు మాతృ మరణాలకు ప్రధాన కారణంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. గర్భం ధరించిన తర్వాత మహిళలు అనేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తనతో పాటు, తన కడుపులో పెరుగుతున్న బిడ్డపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ గర్భిణి క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి, ప్రీ కన్‌సెప్షన్ కౌన్సెలింగ్ తీసుకోవాలి. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలు సరిపడా ఉండేలా చూసుకోవాలి. తీవ్ర ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్తపడాలి. పౌష్టికాహారం తీసుకోవాలి.

జిల్లాల వారీగా కార్యాచరణ..

ఇక రాష్ట్రంలో మాతృ మరణాల నియంత్రణకు జిల్లాల వారీగా వైద్యశాఖ కార్యాచరణను సిద్ధంచేస్తోంది. దీనిని రూపొందించి పంపమని ఉన్నతాధికారులు డీఎంహెచ్ఓలను ఆదేశించారు. జిల్లాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా పూర్తిస్థాయిలో మాతృ మరణాల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ అదనపు డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులపై సస్పెన్షన్ తొలగించాలి

ఆర్టీసీ ఎండీకి వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ఎన్నికల నియమావళి ఉల్లంఘించారనే అభియోగాలతో ఆర్టీసీ ఉద్యోగులపై విధించిన సస్పెన్షన్‌ను తొలగించాలని వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్ కోరింది. అవగాహన లేకపోవడంతో దాదాపు 50 మంది ఉద్యోగులు నియమావళిని ఉల్లంఘించారని పేర్కొంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్‌ను తొలగించినందున ఆ ఉద్యోగులపై 'వన్ టైమ్ మెజర్‌మెంట్' కింద సస్పెన్షన్లు తొలగించాలని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావుకు విజ్ఞప్తి చేసినట్లు వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నెడ్‌క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ రాజీనామా

తాడేపల్లి రూరల్: ఏపీ స్టేట్ నెడ్‌క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్ తన పదవికి రాజీనామా చేశారు. బుధవారం తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్‌సీపీలో పనిచేసిన మంత్రులపైన, వారి ఇళ్లపైన, ఎమ్మెల్యేల ఇళ్లపై, నేతలు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతుండటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

స్ఫూర్తి

చిగుళ్ల వ్యాధి వల్ల 35 ఏళ్ల వయసులో పళ్లు కోల్పోయింది అభా శర్మ. 45 ఏళ్ల వయసులో ఆమెకు అవయవాలు కంపించే అరుదైన వ్యాధి వచ్చింది. అయినా నటి కావాలన్న కోరికను ఆమె చంపుకోలేదు. నాటకాల్లో పాత్రలు వేయసాగింది. ఇప్పుడు 'పంచాయత్ 3' వెబ్ సిరీస్‌లో పల్లెటూరి అమ్మగా నటించి దేశం మొత్తానికి అభిమాన నటి అయ్యింది. 75 ఏళ్ల వయసులో విజయాన్ని చూసిన అభా శర్మ పరిచయం.

పెద్ద వయసులో గుర్తింపు


అభా శర్మ

ఉత్తర ప్రదేశ్‌లోని 'ఫుల్వారా' అనే పల్లెటూళ్లో ఒక ముసలామె పంచాయతీ ఆఫీస్‌కు వచ్చి– 'నా కొడుకు నన్ను ఇంట్లోంచి తరిమి కొట్టాడు. నాకో ఇల్లు మంజూరు చేయి నాయనా' అని పంచాయతీ ఆఫీసర్‌ని ప్రాధేయపడుతుంది.

ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన ప్రకారం ఊరికి 11 ఇళ్లు మంజూరై ఉంటాయి. వాటిని ఎవరెవరికి ఇవ్వాలనేది సర్పంచ్, పంచాయతీ ఆఫీసర్ నిర్ణయించాలి. ఈ ముసలామెకు ఇల్లు మంజూరు చేద్దామా అనుకుంటాడు ఆఫీసర్. కాని పల్లెల్లో అదంత సులభం కాదు. 'నిజంగానే ముసలామెను కొడుకు తరిమి కొట్టాడా లేదా' అనే ఎంక్వయిరీ జరుగుతుంది. ఊరి జనం కూడా ముసలామె ఇంటి మీద నిఘా పెడతారు. కొడుకు కాపురం ఒక గదిలో ఉంటే ముసలామె వేరొక గుడిసెలో అవస్థలు పడుతూ ఉంటుంది. ఇదంతా నిజమని భావించిన ఆఫీసర్ ముసలామెకు ఇల్లు మంజూరు చేస్తాడు. కాని ఇదంతా అబద్ధమని తేలుతుంది. 'పేదవాడైన నా కొడుక్కి ఒక ఇల్లు ఇచ్చి వెళితే వాడు సుఖపడతాడని ఈ నాటకం అంతా ఆడాను' అంటుంది ముసలామె. కాని 'ఇంటి కోసమని నా కొడుకు, కోడలు, మనవణ్ణి వదిలి వేరే కుంపటి పెట్టి ఎలా బతకగలను' అని బాధ పడుతుంది.

ఒక వైపు పేదరికపు దీనత్వం, మరోవైపు బాంధవ్యాల దృఢత్వం... ఇవి 'పంచాయత్ 3' సిరీస్‌లోని 'ఘర్' అనే ఎపిసోడ్‌లో కనిపిస్తాయి. ఈ ఎపిసోడ్‌లోని 'అమ్మాజీ'గా నటించిన అభా శర్మ ఇప్పుడు దేశంలో చాలా మందికి అభిమాన నటిగా మారింది.

75 ఏళ్ల వయసులో...

అభా శర్మది లక్నో. ఇప్పుడామె వయసు 75 సంవత్సరాలు. ఈ వయసులో ఆమె ఎర్రటి ఎండల్లో మధ్య ప్రదేశ్‌లో ఔట్‌డోర్‌కు వెళ్లి షూట్ చేయడమే కాదు అద్భుతంగా నటించి అందరినీ ఆకట్టుకుంది. 'నాకు చిన్నప్పటి నుంచి నటించాలనే కోరిక ఉంది. కాని మా అమ్మ పడనివ్వలేదు. నేను టీచర్‌గా పని చేస్తూ ఆ కోరికను మనసులోనే అదిమేశాను. కాని మా అమ్మ చనిపోయాక నా 47వ ఏట నటన మొదలెట్టాను. లక్నోలోని నాటక బృందాలతో నాటకాలు ఆడాను. నాకు



54 ఏళ్ల వయసున్నప్పుడు మొదటిసారి ఒక అడ్వర్‌టైజ్‌మెంట్‌లో నటించే అవకాశం వచ్చింది. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో చిన్న చిన్న వేషాలు వేశాను. కాని ఇప్పుడు పంచాయత్ 3లో నేను చేసిన వేషం ప్రపంచమంతా చూసింది. నాకు ఎక్కడెక్కడి నుంచో ఫోన్లు వస్తున్నాయి. ఎంతో ఆనందంగా ఉంది. 75 ఏళ్ల వయసులో నేను ఇంత గుర్తింపు పొందడం చూశాక– ఎవరైనా సరే తమ కలలను చివరి వరకూ నెరవేర్చుకోవడానికి ప్రయత్నించాలని చెప్పాలనిపించింది' అని చెప్పింది అభా శర్మ.

జీవితంలో సవాళ్లు

తండ్రి చనిపోయాక అభా శర్మకు తల్లిని చూసుకునే బాధ్యత వచ్చింది. ఆమె కోసం అభా శర్మ వివాహం చేసుకోలేదు. కాని 35వ ఏట ఆమెకు చిగుళ్ల వ్యాధి వచ్చి పళ్లు ఊడిపోయాయి. అంటే కాలక్రమంలో కృత్రిమ పళ్లు పెట్టడానికి కూడా వీలు కాని స్థితి. సాధారణంగా స్త్రీలు ఇలాంటి స్థితిలో నలుగురి ముందుకు రావడానికి ఇష్టపడరు. కాని అభా ఒక వైపు ఉద్యోగం చేస్తూనే మరో వైపు తల్లిని చూసుకుంది. ఆమె మరణించాక నాటకాల్లోకి వచ్చింది. అయితే ఆమెకు శరీర అవయవాలు కంపించే అరుదైన వ్యాధి కూడా వచ్చింది. దాని వల్ల ఆమె మాట్లాడే విధానం చాలా స్లో అయిపోయింది. ఇన్ని పరిమితులు ఉన్నప్పటికీ నటించాలనే పట్టుదలతో నటించి విజయం సాధించింది అభా శర్మ.

పంచాయత్ అంటే...

టి.వి.ఎఫ్. నిర్మాణ సంస్థ అమేజాన్ కోసం తీసిన కామెడీ వెబ్ సిరీస్ 'పంచాయత్'. ఇప్పటికి రెండు సిరీస్‌లు ఘన విజయం సాధించి ఇప్పుడు మూడో సిరీస్ స్ట్రీమ్ అవుతోంది. భారతదేశంలోని చిన్న ఊళ్లలో మనుషుల అమాయకత్వం, వారి చిన్న చిన్న ఆకాంక్షలు, రాజకీయాలు, ప్రభుత్వ వ్యవస్థల ద్వారా వారికి అందాల్సిన సాయాల్లో వచ్చే ఆటంకాలు... ఇవన్నీ ఈ సిరిస్‌లో సహజంగా చూపించడంతో సూపర్ హిట్ అయ్యింది. రఘువీర్ యాదవ్, నీనా గుప్తా, జితేంద్ర కుమార్ ప్రధాన తారాగణం.

మహిళా శక్తి



ఇంట్లో ముగ్గురు ఆడవాళ్లు జలజ, దేవిక, సూర్య హెవీ వెహికిల్ డ్రైవింగ్ నేర్చుకొని, లైసెన్స్ పొందారు. లారీలో ప్లైవుడ్, ఉల్లి, అల్లం లోడ్‌ను తీసుకెళుతూ దేశంలోని 22 రాష్ట్రాలలో ప్రయాణించారు. జలజ, దేవిక తల్లీకూతుళ్లు. జలజ తోడికోడలు సూర్య. ఈ ముగ్గురూ ఆసక్తితో నేర్చుకున్న ట్రక్కు డ్రైవింగ్‌తో తమ ప్రయాణ విశేషాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ దేశవిదేశాల్లో అభిమానులను సంపాదించుకున్నారు. కేరళవాసులైన ఈ ముగ్గురు మహిళలు చేస్తున్న సాహస ప్రయాణం చాలామందిలో కొత్త ఉత్సాహం నింపుతోంది.

లారీలో దేశాన్ని చుట్టేస్తున్నారు!





కేరళలోని ఎట్టుమనూరుకు చెందిన రతీష్ పుథెట్ లారీ ట్రాన్స్‌పోర్ట్ యజమాని. అతని ట్రాన్స్‌పోర్ట్ సంస్థలో 30 లారీలు ఉన్నాయి. రతీష్ 19వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా భార్య జలజకు తన ట్రక్కు తాళాలను ఇచ్చాడు. రెండేళ్ల క్రితం ఫిబ్రవరిలో ఆమె రతీష్‌తో కలిసి ట్రక్కులో కాశ్మీర్‌కు బయల్దేరింది. ఆ సమయంలోనే తనకూ డ్రైవింగ్ చేయాలనే ఆసక్తి కలిగింది. 2014లో ఫోర్ వీలర్ లైసెన్స్ తీసుకున్నా ఆ తర్వాత నాలుగేళ్లకు 2018లోనే జలజ హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందింది. మొదటిసారి పెరుంబవూరు నుండి ప్లైవుడ్ తీసుకొని లారీలో పుణేకి మొదటి ప్రయాణం చేసింది. అక్కడ నుంచి కశ్మీరుకు ఉల్లిపాయల లోడు తీసుకెళ్లింది. 'ఈ ప్రయాణాలు నాలో ధైర్యాన్ని నింపాయి. ఒక మహిళ డ్రైవింగ్ సీట్లో ఉండటంతో ఇతర డ్రైవర్లు, పోలీసు అధికారులు గౌరవంగా చూసేవారు. స్థానికులు కూడా ఆసక్తిగా చూసేవారు. కాశ్మీర్ ప్రయాణానికి ఆరు రోజులు వెళ్లడానికి, మరో ఆరు రోజులు తిరిగి రావడానికి సమయం పట్టింది. మధ్యలో కొండచరియలు విరిగిపడటంతో లారీలు వెళ్లేందుకు వీలు కాలేదు. లారీలన్నింటికీ ఇతర రాష్ట్రాల డ్రైవర్లు ఉన్నారు. ఏ సమస్యా రాలేదు. దేశవ్యాప్తంగా వివిధ రకాల వ్యక్తులు, వారి జీవనశైలి, ఆహారపుటలవాట్లు... ఇలా ప్రతిదానినీ అర్థం చేసుకోవడానికి ఈ ప్రయాణాలు నాకు బాగా తోడ్పడుతున్నాయి. వివిధ రాష్ట్రాల భాష ముఖ్యంగా హిందీ నేర్చుకుంటున్నాను' అని చెబుతోంది జలజ. కాశ్మీర్ వరకు జలజ ట్రక్ డ్రైవింగ్ చేయడంతో ఇంట్లో మరో ఇద్దరు మహిళలు డ్రైవింగ్ పట్ల ఆసక్తి చూపారు. జలజ కూతురు దేవిక డిగ్రీ చదువుతోంది. రతీష్ తమ్ముడి భార్య సూర్య. వీళ్లూ హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందారు. దీంతో రతీష్ కూడా చాలా ఆనందించాడు. వీరు ముగ్గురూ కలిసి పుథెట్ ట్రాన్స్‌పోర్ట్ వ్లాగ్‌ను ప్రారంభించారు. ముగ్గురు మహిళలూ తాము చేసే లారీ ప్రయాణాల వివరాలను అందులో ఉంచుతున్నారు. దేవిక లడఖ్ ప్రయాణంలో 5,900 కిలోమీటర్లు ట్రక్కును నడిపింది.

•••

లారీ డ్రైవింగ్‌తో కేరళ నుంచి కాశ్మీర్ ప్రయాణం చేసిన జలజ ఆ తర్వాత మహారాష్ట్ర, నేపాల్‌కు వెళ్లింది. హరిద్వార్, రిషికేశ్‌లో పర్యటిస్తున్నప్పుడు రతీష్ తల్లి లీలాను వెంట తీసుకెళ్లింది. దేవిక ఎర్నాకులం రాజగిరి కాలేజీలో హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ పొందిన ఏకైక స్టూడెంట్‌గా పేరొందింది. కోడలు గోపికి లైసెన్స్ కోసం ఎదురుచూస్తోంది. రతీష్, జలజ లది ఉమ్మడి కుటుంబం. పాతికేళ్లక్రితమే ఎట్టుమనూరుకు వలస వచ్చారు. ఒకే ఇంట్లో ఉంటున్న జలజ, సూర్య, దేవిక కిందటి మే నెలలో లక్నో, షిల్లాంగ్ ట్రిప్పులలో డ్రైవర్లుగా ఉన్నారు. వీరికి తోడుగా సూర్య పిల్లలు గోపిక, మరో ముగ్గురు పిల్లలూ చేరారు. లారీ క్యాబిన్‌లో ఏసీని అమర్చారు. పడుకోవడానికి, కూర్చోవడానికి, రోడ్డు పక్కన వంట చేసుకోవడానికి అవసరమైన వస్తువులను తీసుకెళతారు. 'ఎక్కడా ఇబ్బంది కలగకుండా లారీని ఇల్లులా తయారు చేసుకున్నాం' అని చెబుతారు ఈ ముగ్గురు మహిళలు. ట్రక్కులలో లోడ్లను గమ్యస్థానాలకు తరలించడమే కాదు, కుటుంబం అంతా కలిసి యాత్రలు చేస్తుంటారు. ఈ యాత్రలో జలజ, సూర్యల కుటుంబసభ్యులు ఉంటారు. తమ యాత్ర వీడియోలను, ఫొటోలను సోషల్‌మీడియా ద్వారా పోస్ట్ చేస్తుంటారు. వీరికి దాదాపు మూడున్నర లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఈ మహిళా లారీ డ్రైవర్లకు ఉన్న అభిమానుల్లో విదేశీయులూ ఉన్నారు.

చైతన్య పథం

ఐక్యరాజ్య సమితి 'గర్ల్ అప్' మూవ్‌మెంట్‌కు ఇండియా కంట్రీ మేనేజర్ అయిన అదితి అరోరా ఆ సంస్థ ద్వారా మహిళల మానసిక ఆరోగ్యం నుంచి ఉపాధి అవకాశాల వరకు ఎన్నో అంశాలపై పని చేస్తోంది. 'స్టోరీ టెల్లింగ్'లో శిక్షణ ఇస్తోంది. మహిళలపై జరిగే హింసకు వ్యతిరేకంగా పోరాడుతోంది. 'పీరియడ్ పావర్టీ'ని దృష్టిలో పెట్టుకొని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మహిళా సాధికారత, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన అంశాలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న అమెరికాకు చెందిన 'జస్ట్ ఏ గర్ల్ ఇంక్' స్వచ్ఛంద సంస్థతో కలిసి పనిచేస్తోంది....



ప్రపంచవ్యాప్తంగా 130 దేశాలలో ఎంతోమంది మహిళలను నాయకులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించింది 'గర్ల్ అప్'.

'ప్రపంచాన్ని మార్చే అద్భుత శక్తి అమ్మాయిలకు ఉంది' అంటున్న అదితి అరోరా వారి హక్కుల గురించి అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కొత్త అవకాశాల ప్రపంచంలోకి తీసుకు వెళుతోంది.

'గర్ల్ అప్ ఇండియా' ద్వారా దేశవ్యాప్తంగా లింగ సమానత్వం, సామాజిక మార్పుపై ఎన్నో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది అదితి.

యువతలో ఎంతోమందిని చేంజ్‌మేకర్స్‌గా తీర్చిదిద్దింది.

పొలిటికల్ సైన్స్ చదువుకున్న అదితి కాలేజీ రోజుల నుంచి మహిళా హక్కులు, స్త్రీ సాధికారతకు సంబంధించిన అంశాలపై పని చేస్తోంది. జెనీవాలో చదువుతున్నప్పుడు 'జెండర్ అండ్ మైన్ యాక్షన్' ప్రోగ్రాంలో భాగంగా మందుపాతర బాధిత దేశాలలో మహిళల భద్రత కోసం పనిచేసింది.

'గర్ల్ అప్' పనితీరు విషయానికి వస్తే సంస్థలో సిబ్బంది, కన్సల్టెంట్‌ల సంఖ్య చాలా తక్కువగా ఉన్నప్పటికీ దేశవ్యాప్తంగా వేగంగా విస్తరించడానికి అదేమీ అడ్డంకి కాలేదు. 'ఓపెన్ టు ఎవ్రీ వన్' అంటున్న 'గర్ల్ అప్' దేశంలోని వివిధ ప్రాంతాలలోని వాలంటీర్‌లతో కలిసి పనిచేస్తోంది.

తమలోని శక్తిని అమ్మాయిలు గుర్తించేలా కార్యక్రమాలు రూపొందిస్తోంది.

విధాన నిర్ణయాలలో వారి అభిప్రాయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది.

'లింగ సమానత్వం' విషయంలో క్రియాశీలంగా పనిచేస్తోంది గర్ల్ అప్.

'అబ్బాయిలను ఒకరకంగా, అమ్మాయిలను ఒకరకంగా చూసే విధానంలో మార్పు రావాలి. లింగ సమానత్వానికి ఇదే తొలిమెట్టు. అమ్మాయిలు చదువులో తమ ప్రతిభను నిరూపించుకొని శక్తిమంతులు కావాలి. ఎవరికీ తీసిపోము అని నిరూపించాలి. లింగ సమానత్వం విషయంలో పౌర సమాజం, విధాన నిర్ణేతలు, విద్యావేత్తల పాత్ర కీలకం' అంటుంది అదితి.

మనకు తెలియకుండానే పురుషాధిపత్య భావజాలం మనలో లీనమై ఉంటుంది. రకరకాల సందర్భాలలో అది వ్యక్తం అవుతుంటుంది. 'ఇలాంటివి నివారించాలంటే ఏం చేయాలి?' అనేదానిపై కూడా తన అభిప్రాయాలను ప్రకటించింది అదితి.

'శరీరం నుంచి దుస్తుల ఎంపిక వరకు మహిళలు ఏదో ఒక సందర్భంలో కామెంట్స్ రూపంలో హింసను ఎదుర్కొంటున్నారు' అంటున్న అదితి తాను కూడా అలాంటి హింస బాధితురాలే. 'కామెంట్స్ విని బాధపడడం కాకుండా అలాంటి కామెంట్స్ మళ్లీ వినిపించకుండా చేయాలి' అంటుంది అదితి.

'మార్పు సాధ్యపడదు' అనేది నిరాశావాదం.

'తప్పకుండా సాధ్యపడుతుంది' అనేది శాస్త్రీయ ప్రాతిపదికపై ఏర్పడిన ఆశావాదం.

మార్పు రావడానికి కొంత సమయం పడుతుంది. ఆ సమయం త్వరగా రావడానికి 'గర్ల్ అప్'లాంటి సంస్థలు, అదితిలాంటి వ్యక్తులు క్షేత్రస్థాయిలో చేస్తున్న కార్యక్రమాలు కీలకం అవుతాయి.

'నిన్న నువ్వు ఏమిటో తెలుసుకొనే జ్ఞాపకం నీలో ఉన్నట్లే
రేపు నువ్వు ఏమిటో నిరూపించుకునే జ్ఞానం, శక్తి నీలో ఉన్నాయి' అంటుంది అదితి అరోరా.



దిశానిర్దేశం

లింగ సమానత్వం, స్త్రీవాదం గురించి మాట్లాడడానికి స్కూల్స్, కాలేజీలకు వెళుతుంటుంది అదితి అరోరా. విద్యార్థుల మనసుల్లో దాగున్న ఎన్నో సందేహాలు ఆ సమయంలో బయటికి వస్తాయి. వాటికి సమాధానం ఇవ్వడమే కాదు దిశానిర్దేశం కూడా చేస్తుంది అదితి అరోరా. ఎన్నో బడులు, కాలేజీలలో గర్ల్ అప్ క్లబ్‌లను ఏర్పాటు చేసింది. ప్రతి క్లబ్‌లో అయిదుగురు సభ్యులతో పాటు ప్రెసిడెంట్, వైస్–ప్రెసిడెంట్, సెక్రెటరీలు ఉంటారు. నిర్దిష్టమైన అంశాలపై ఈ క్లబ్‌ల కోసం వర్క్‌షాప్‌లు కూడా నిర్వహించింది. అయితే కొన్ని విద్యాసంస్థలు మాత్రం 'ఇలాంటి విషయాలు అమ్మాయిలకు ఎందుకు' అన్నట్లుగానే వ్యవహరించాయి. వారి ధోరణితో ఎప్పుడూ నిరాశపడలేదు అదితి.

'ఆర్థికాంశాలు మహిళలకు అంత త్వరగా అర్థం కావు' అనే దురభిప్రాయం ఒకటి మన సమాజంలో స్థిరపడిపోయింది. ఆర్థిక మంత్రిగా మహిళలు సమర్థంగా బాధ్యతలు నిర్వహించడాన్ని చూస్తూ కూడా తాము పెంచి పోషించుకుంటున్న అపోహను వీడడానికి ఇష్టపడదు సమాజం. చార్టెడ్ అకౌంటెన్సీలో ఎంత మంది మహిళలు ఉన్నప్పటికీ సమాజం మాత్రం తన కళ్లకు కట్టుకున్న గంతలు విప్పడానికి సుముఖంగా ఉండదు. వీటన్నింటినీ పటాపంచలు చేయడానికి కంకణం కట్టుకుంది సాక్షి జైన్. జార్ఖండ్ రాష్ట్రం, రాంచీకి చెందిన సాక్షి సీఏ పూర్తి చేసి ఒక సంస్థలో ఉద్యోగంలో చేరింది. తన జ్ఞానాన్ని తన ఎదుగుదలకే పరిమితం చేసుకోకుండా మహిళాసమాజాన్ని చైతన్యవంతం చేయడానికి ఉపయోగించాలనుకుందామె.

ఆర్థిక అక్షరాస్యత


సాక్షి జైన్

ఫాలోవర్స్ ఫాలోమన్నారు!

''కొత్తతరం విద్యార్థులకు ఆర్థికాంశాల్లో మెళకువలు నేర్పించే క్రమంలో నాలో ఎన్నో కొత్త ఆలోచనలు వచ్చాయి. మనదేశంలో మహిళలకు అక్షరాస్యత ఉంది, కానీ ఆర్థిక అక్షరాస్యత తగినంతగా లేదనిపించింది. అయితే వారిలో ఆర్థికాంశాల పట్ల అనేకానేక సందేహాలున్నాయి. ఆ సందేహాలను నివృత్తి చేయగలిగితే ప్రతి ఇంట్లో ఒక ఆర్థిక వేత్త తయారవుతారనిపించింది. అప్పుడు మొదలు పెట్టిన ప్రయత్నమే @ca.sakchijain ఇన్‌స్టాగామ్‌కి నాలుగు నెలల్లోనే పదిహేడు లక్షల ఫాలోవర్లు వచ్చారు. ఫిన్‌ఫ్లూయెన్సర్ (ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లూయెన్సర్)గా సోషల్ మీడియాతో నేను గుర్తింపు పొందాను. నా పరిజ్ఞానంతో వేలాది మహిళలు తమ ఆర్థికాంశాలపై స్వయంగా నిర్ణయాలు తీసుకోగలిగిన స్థితికి చేరారు.

కంటెంట్ క్రియేటర్‌నయ్యాను!

నేను అకౌంటెన్సీలో లోతుగా పాఠాలు చెప్పే ప్రయత్నమేదీ చేయలేదు. తమ దగ్గర ఉన్న కొద్దిపాటి మొత్తాన్ని ఎన్ని రకాలుగా మదుపు చేయవచ్చో వివరించాను. జీవిత బీమా పథకాల గురించి చెప్పాను. ఫైనాన్షియల్ పాలసీలతోపాటు రుణాలు ఎలా తీసుకోవాలి, ఎలాంటి అవసరాలకు తీసుకోవాలి, తీసుకున్న రుణాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి... అనే మెళకువలు నేర్పించాను. భారీ పదజాలాన్ని ఉపయోగిస్తే ఇది మనకు అర్థమయ్యే విషయం కాదని తెలుసుకోవడం మానేస్తారు. అందుకే నేను సామాన్య మహిళ మేధస్థాయికి దిగి అలతి అలతి పదాలతో, వారి దైనందిన జీవితంలో ఎదురయ్యే సంఘటనలతో పోలుస్తూ వివరించాను. మా రాష్ట్రంలోని గ్రామాల్లో చదువుకున్న మహిళలంటే స్కూల్ ఫైనల్ పూర్తి చేసిన మహిళలే. వాళ్లను దృష్టిలో పెట్టుకుని వీడియోలు చేయడం మొదలుపెట్టాను. ఆశ్చర్యకరంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన మహిళలు కూడా నా వీడియోలను చూస్తూ అనేక సందేహాలను వ్యక్తం చేసేవారు. ఒక విధంగా చెప్పాలంటే నా వీక్షకుల నుంచి వచ్చే కామెంట్స్ నాకు దిశానిర్దేశం చేశాయంటే అతిశయోక్తి కాదు. వీక్షకుల కామెంట్స్ చూసి వారు ఏమి కోరుకుంటున్నారో తెలుసుకుని ఆ వివరాలతో వీడియోలు చేశాను. నా వీక్షకులకు అవసరమైన సమాచారాన్ని ఆర్థిక నియమాల చట్రంలో వివరించడానికి నేను చేసిన ప్రయత్నం నన్ను కంటెంట్ క్రియేటర్‌ని చేసింది. ఇప్పుడిది నా ఫుల్ టైమ్ జాబ్‌గా మారింది. మొదట్లో రోజుకో వీడియో పోస్ట్ చేశాను. కామెంట్ బాక్స్‌లో వస్తున్న రిక్వెస్ట్‌లను చేరాలంటే ఒకటి సరిపోవడం లేదని ఇప్పుడు రోజుకు రెండు వీడియోలు పోస్ట్ చేస్తున్నాను. నేను చెప్తున్న విషయాలు మరీ భారీస్థాయిలో ఉండకూడదని, పెద్ద పెట్టుబడులు పెట్టే వారికి సలహాలనివ్వడానికి ఆర్థిక నిపుణులు ఎందరో ఉన్నారు. మహిళలను చైతన్యవంతం చేయాలంటే వారు సులువుగా అందుకోగలిగిన మెళకువలతో మొదలు పెట్టాను.

ఒక చిన్న ఆసరా లేకపోవడం వల్లనే ఆర్థికాంశాల్లో మహిళలు ఒక అడుగు వెనుకగా ఉండిపోయారు. సందేహాల రూపంలో వాళ్ల ఆసక్తులు, ఆలోచనలు, లక్ష్యాలు పెద్ద వ్యాపారులకు ఏ మాత్రం తీసిపోని స్థాయిలో ఉంటున్నాయి.

లక్ష్యాలు ఉన్నతంగా ఉంటున్నాయి

నేటి రోజుల్లో దాదాపుగా మహిళలందరూ తమకంటూ ఒక ఉపాధిమార్గాన్ని వెతుక్కుంటున్నారు. డబ్బు సంపాదిస్తున్నారు. మరికొందరు గృహిణిగా భర్త సంపాదనతో కుటుంబాన్ని ప్రణాళికబద్ధంగా నిర్వహించగలుగుతున్నారు. సరాసరిన చూస్తే గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉంటున్నారు. వారికి ఆర్థిక అక్షరాస్యత తెలిస్తే డబ్బును ఎలా పొదుపు చేయాలి, ఎలా మదుపు పెట్టాలి అనే విషయాలు అర్థమవుతాయి. దాంతో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగలుగుతారు. ఆరు నెలల అనుభవంలో నాకు అర్థమైనదేమిటంటే... ఒక చిన్న ఆసరా లేకపోవడం వల్లనే ఆర్థికాంశాల్లో మహిళలు ఒక అడుగు వెనుకగా ఉండిపోయారని! సందేహాల రూపంలో వాళ్ల ఆసక్తులు, ఆలోచనలు, లక్ష్యాలు పెద్ద వ్యాపారులకు ఏ మాత్రం తీసిపోని స్థాయిలో ఉంటున్నాయి. తాము, తమ కుటుంబం ఆర్థికంగా మెరుగుపడాలనే ఆలోచనతోపాటు సమాజంలో మరికొందరికి ఉపయోగపడే పరస్పర సహకార ధోరణి కనిపిస్తోంది. నా ప్రయత్నం మంచి ఫలితాలనిస్తోందని నాకూ సంతోషంగా ఉంది'' అని వివరించారు సాక్షి జైన్.



సెమీఫైనల్లో యూకీ బాంబ్రీ జోడీ

బాస్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. స్టుట్‌గార్ట్‌లో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో యూకీ–ఒలివెట్టి ద్వయం 6–3, 6–2తో థియో అరిబెజ్–సాదియో (ఫ్రాన్స్) జంటపై గెలిచింది. 55 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ–ఒలివెట్టి జోడీ ఎనిమిది ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోకుండా ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.



స్వర్ణ పతకం నెగ్గిన జ్యోతిక శ్రీ

ఇండియన్ గ్రాండ్‌ప్రి–3 అథ్లెటిక్స్ మీట్‌లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ దండి జ్యోతిక శ్రీ తన అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శనను నమోదు చేసింది. బెంగళూరులో బుధవారం జరిగిన ఈ మీట్‌లో జ్యోతిక శ్రీ మహిళల 400 మీటర్ల రేసులో విజేతగా నిలిచింది. జ్యోతిక శ్రీ 400 మీటర్లను అందరికంటే వేగంగా 51.53 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. శుభా వెంకటేశ్ (తమిళనాడు: 52.34 సెకన్లు) రెండో స్థానంలో, పూవమ్మ రాజు (కర్ణాటక: 52.62 సెకన్లు) మూడో స్థానంలో నిలిచారు.

శ్రీలంక అవుట్!

నేపాల్‌తో మ్యాచ్ వర్షార్పణం



లాడెర్‌హిల్ (ఫ్లోరిడా): మాజీ చాంపియన్ శ్రీలంక జట్టు టి20 ప్రపంచకప్ నుంచి లీగ్ దశలోనే నిష్క్రమించడం దాదాపు ఖాయమైంది. శ్రీలంక, నేపాల్ జట్ల మధ్య బుధవారం జరగాల్సిన గ్రూప్ 'డి' లీగ్ మ్యాచ్ భారీ వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దు అయింది. దాంతో ఇరు జట్లకు ఒక్కోపాయింట్ కేటాయించారు. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన శ్రీలంక ప్రస్తుతం ఒక్క పాయింట్‌తో గ్రూప్ 'డి'లో చివరిదైన ఐదో స్థానంలో ఉంది. గ్రూప్ 'డి' నుంచి ఇప్పటికే దక్షిణాఫ్రికా 'సూపర్–8' దశకు అర్హత సాధించింది. రెండో బెర్త్ కోసం బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, నేపాల్ జట్లు రేసులో ఉన్నాయి. ఈనెల 17న తమ చివరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో శ్రీలంక తలపడుతుంది. నేడు కింగ్స్‌టౌన్‌లో బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లో ఫలితం వస్తే మాత్రం శ్రీలంక అధికారికంగా టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

టి20 ప్రపంచకప్‌లో నేడు

వెస్టిండీస్ X న్యూజిలాండ్
వేదిక: ట్రినిడాడ్, ఉదయం గం. 6 నుంచి

బంగ్లాదేశ్ X నెదర్లాండ్స్
వేదిక: కింగ్స్‌టౌన్, రాత్రి గం. 8 నుంచి

ఇంగ్లండ్ X ఒమన్
వేదిక: నార్త్‌సౌండ్, అర్ధరాత్రి గం. 12:30 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఆధిక్యంలో దివ్య దేశ్‌ముఖ్



గాంధీనగర్: ప్రపంచ జూనియర్ మహిళల చెస్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి దివ్య దేశ్‌ముఖ్ టైటిల్‌కు చేరువైంది. బుధవారం పదో రౌండ్ ముగిశాక 18 ఏళ్ల దివ్య తొమ్మిది పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలో ఉంది. 8.5 పాయింట్లతో క్రవ్యన్ మరియం (అర్మేనియా) రెండో స్థానంలో ఉంది.

'సూపర్–8'కు భారత్

- 7 వికెట్లతో అమెరికాపై గెలుపు
- రాణించిన అర్ష్‌దీప్, సూర్యకుమార్
- శనివారం కెనడాతో టీమిండియా 'ఢీ'

బ్యాటింగ్‌కు బద్ధ విరోధిలా నిలిచిన న్యూయార్క్ పిచ్‌పై భారత్ మరోసారి తమ స్థాయి ఆటను చూపించింది. వరుసగా మూడో విజయంతో టి20 ప్రపంచకప్‌లో 'సూపర్–8' దశకు చేరి తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. పట్టుదలగా పోరాడి అమెరికా కొంత ఇబ్బంది పెట్టినా... చివరకు టీమిండియా ముందు తలవంచక తప్పలేదు. అర్ష్‌దీప్‌తో పాటు ఇతర బౌలర్ల పదును ముందు యూఎస్ అతి కష్టమ్మీద 100 పరుగులు దాటింది. ఛేదనలో భారత బ్యాటింగ్ కాస్త తడబడి ఉత్కంఠను పెంచినా... సూర్యకుమార్, శివమ్ దూబే జోడీ మరో 10 బంతులు మిగిలి ఉండగా జట్టును గెలుపు తీరం చేర్చింది.

న్యూయార్క్: టి20 వరల్డ్ కప్ వేటలో 'హ్యాట్రిక్' విజయాన్ని అందుకున్న భారత్ సూపర్–8లోకి అడుగు పెట్టింది. బుధవారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో యూఎస్‌ఏపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యూఎస్‌ఏ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. నితీశ్ కుమార్ (23 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్), స్టీవెన్ టేలర్ (30 బంతుల్లో 24; 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అర్ష్‌దీప్ (4/9) ప్రత్యర్థిని దెబ్బ తీయగా... హార్దిక్ పాండ్యాకు 2 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ 18.2 ఓవర్లలో 3 వికెట్లకు 111 పరుగులు చేసి గెలిచింది. సూర్యకుమార్ యాదవ్ (49 బంతుల్లో 50 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), శివమ్ దూబే (35 బంతుల్లో 31 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) నాలుగో వికెట్‌కు 65 బంతుల్లో అభేద్యంగా 67 పరుగులు జోడించారు. భారత్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో శనివారం లాడర్‌హిల్‌లో కెనడాతో తలపడుతుంది.

తలా ఓ చేయి..

గత రెండు మ్యాచ్‌లలో ఆకట్టుకున్న అమెరికాకు ఈసారి సరైన ఆరంభం లభించలేదు. అర్ష్‌దీప్ వేసిన ఓవర్లో మొదటి బంతికే జహంగీర్ (0) వికెట్ల ముందు దొరికిపోగా, చివరి బంతికి గూస్ (2) అవుటయ్యాడు. పవర్‌ప్లేలో యూఎస్ 18 పరుగులు చేసింది. ఆ తర్వాత కూడా ఇన్నింగ్స్ తడబడుతూనే సాగినా... చిన్న చిన్న భాగస్వామ్యాలు ఇన్నింగ్స్‌ను నడిపించాయి. ఫామ్‌లో ఉన్న జోన్స్ (11)ను పాండ్యా వెనక్కి పంపించగా, దూకుడుగా ఆడబోయిన టేలర్‌ను అక్షర్ బౌల్డ్ చేశాడు. పాండ్యా ఓవర్లో సిక్స్, ఫోర్‌తో కొంత ధాటిని ప్రదర్శించిన నితీశ్ ఇన్నింగ్స్ బౌండరీ వద్ద సిరాజ్ అద్భుత క్యాచ్‌తో ముగిసింది. ఆ తర్వాత ఐదు బంతుల వ్యవధిలో అండర్సన్ (15), హర్మీత్ (10) వెనుదిరిగారు. 18వ ఓవర్ ఐదో బంతికి యూఎస్ స్కోరు వంద పరుగులకు చేరింది.

కోహ్లి మళ్లీ విఫలం...

లెఫ్టార్మ్ పేసర్ సౌరభ్ నేత్రావల్కర్ పదునైన బౌలింగ్‌తో భారత్‌ను ఇబ్బంది పెట్టాడు. గత రెండు మ్యాచ్‌లలో 1, 4 పరుగులే చేసిన కోహ్లి (0) ఈసారి తొలి బంతికే వెనుదిరిగి టి20 వరల్డ్ కప్‌లో తొలిసారి డకౌట్ నమోదు చేశాడు. ఆ తర్వాత నేత్రావల్కర్ బౌలింగ్‌లోనే రోహిత్ శర్మ (3) కూడా అవుట్ కాగా, కుదురుకుంటున్నట్లు అనిపించిన రిషభ్ పంత్ (18; 1 ఫోర్, 1 సిక్స్)ను చక్కటి బంతితో అలీఖాన్ క్లీన్ బౌల్డ్ చేశాడు. ఈ దశలో సూర్య, దూబే కలిసి జట్టును ఆదుకున్నారు. మరీ ధాటిగా ఆడకపోయినా పిచ్‌ను బట్టి సింగిల్స్‌తో పరుగులు రాబట్టారు. 22 పరుగుల వద్ద సూర్య ఇచ్చిన క్యాచ్‌ను నేత్రావల్కర్ వదిలేయడం కూడా కలిసొచ్చింది. ఆ తర్వాత మరో అవకాశం ఇవ్వకుండా భారత ద్వయం ఆటను ముగించింది.


అర్ష్‌దీప్


నేత్రావల్కర్

అమెరికాకు పెనాల్టీ...

తొలి వరల్డ్ కప్ ఆడుతున్న అమెరికా ఓవర్‌రేట్ నిబంధనల అమలు విషయంలో ఇంకా పరిణతి చెందలేదు. అనూహ్య రీతిలో మ్యాచ్‌లో ఆ జట్టుకు అంపైర్లు 5 పరుగులు పెనాల్టీగా విధించారు. ఓవర్ల మధ్యలో ఆ జట్టు ఒక నిమిషంకంటే ఎక్కువ సమయం తీసుకోవడం మూడుసార్లు జరిగింది. దాంతో కేవలం హెచ్చరికతో వదిలి పెట్టకుండా శిక్ష వేయడంతో భారత్‌కు 5 అదనపు పరుగులు వచ్చాయి.

స్కోరు వివరాలు

అమెరికా ఇన్నింగ్స్: జహంగీర్ (ఎల్బీ) (బి) అర్ష్‌దీప్ 0; టేలర్ (బి) అక్షర్ 24; గూస్ (సి) పాండ్యా (బి) అర్ష్‌దీప్ 2; జోన్స్ (సి) సిరాజ్ (బి) 11; నితీశ్ (సి) సిరాజ్ (బి) అర్ష్‌దీప్ 27; అండర్సన్ (సి) పంత్ (బి) పాండ్యా 15; హర్మీత్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 10; షాడ్లీ (నాటౌట్) 11; జస్‌దీప్ (రనౌట్) 2; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 110. వికెట్ల పతనం:** 1–0, 2–3, 3–25, 4–56, 5–81, 6–96, 7–98, 8–110. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–9–4, సిరాజ్ 4–0–25–0, బుమ్రా 4–0–25–0, పాండ్యా 4–1–14–2, దూబే 1–0–11–0, అక్షర్ 3–0–25–1.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) హర్మీత్ (బి) నేత్రావల్కర్ 3; కోహ్లి (సి) గూస్ (బి) నేత్రావల్కర్ 0; పంత్ (బి) ఖాన్ 18; సూర్యకుమార్ (నాటౌట్) 50; దూబే (నాటౌట్) 31; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (18.2 ఓవర్లలో 3 వికెట్లకు) 111. వికెట్ల పతనం:** 1–1, 2–10, 3–39. **బౌలింగ్:** సౌరభ్ నేత్రావల్కర్ 4–0–18–2, అలీ ఖాన్ 3.2–0–21–1, జస్‌దీప్ సింగ్ 4–0–24–0, షాడ్లీ 4–0–25–0, అండర్సన్ 3–0–17–0.

ఆస్ట్రేలియా 'హ్యాట్రిక్' గెలుపు

నమీబియాపై 9 వికెట్లతో విజయం ● 'సూపర్–8'దశకు అర్హత


ఆడమ్ జంపా

నార్త్ సౌండ్ (అంటిగ్వా): ఆద్యంతం పూర్తి ఆధిపత్యం కనబరిచిన ఆస్ట్రేలియా జట్టు టి20 ప్రపంచకప్‌లో 'సూపర్–8' దశకు అర్హత సాధించింది. నమీబియా జట్టుతో బుధవారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా తొమ్మిది వికెట్ల తేడాతో నెగ్గింది. నమీబియా నిర్దేశించిన 73 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 34 బంతుల్లోనే ఛేదించింది. వరుసగా మూడో విజయంతో ఆస్ట్రేలియా ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన నమీబియా 17 ఓవర్లలో 72 పరుగులకే కుప్పకూలింది. ఆసీస్ లెగ్ స్పిన్నర్ ఆడమ్ జంపా 4 ఓవర్లలో 12 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా... పేసర్లు హాజల్‌వుడ్, స్టొయినిస్ రెండు వికెట్ల చొప్పున తీశారు. కమిన్స్, ఎలిస్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. నమీబియా జట్టులో కెప్టెన్ గెరార్డ్ ఎరాస్మస్ (43 బంతుల్లో 36; 4 ఫోర్లు, 1 సిక్స్), మైకేల్ వాన్ లింగెన్ (10 బంతుల్లో 10; 2 ఫోర్లు) మినహా ఇతర బ్యాటర్లు రెండంకెల స్కోరు దాటలేకపోయారు. అనంతరం ఆస్ట్రేలియా జట్టు 5.4 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 74 పరుగులు చేసి గెలిచింది. డేవిడ్ వార్నర్ (8 బంతుల్లో 20; 3 ఫోర్లు, 1 సిక్స్) అవుటవ్వగా... ట్రావిస్ హెడ్ (17 బంతుల్లో 34 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), మార్ష్ (9 బంతుల్లో 18 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడారు. జంపాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఈనెల 16న జరిగే తమ చివరి లీగ్ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో ఆస్ట్రేలియా తలపడుతుంది.

సిక్కి–సుమీత్ జోడీ శుభారంభం



సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి (భారత్) జోడీ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో తెలంగాణకు చెందిన సిక్కి–సుమీత్ ద్వయం 21–17, 21–19తో హోంగ్ టియెన్ సి–లిమ్ చియెవ్ సియెన్ (మలేసియా) జంటపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రీకృష్ణప్రియ–కోన తరుణ్ (భారత్) జంట 6–21, 11–21తో హూ పాంగ్ రోన్–చెంగ్ సు యెన్ (మలేసియా) ద్వయం చేతిలో ఓడిపోయింది.

ప్రణయ్, సమీర్ ముందంజ

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్లు హెచ్‌ఎస్ ప్రణయ్, సమీర్ వర్మ, కిరణ్ జార్జి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రణయ్ 21–10, 23–21తో యోగర్ కోల్హో (బ్రెజిల్)పై, సమీర్ వర్మ 21–10, 21–10తో రికీ టాంగ్ (ఆస్ట్రేలియా)పై, కిరణ్ 21–17, 21–10తో జియోడాంగ్ షాంగ్ (కెనడా)పై గెలిచారు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో మిథున్ మంజునాథ్ (భారత్) 17–21, 17–21తో అల్వి ఫర్హాన్ (ఇండోనేసియా) చేతిలో, శంకర్ ముత్తుస్వామి (భారత్) 16–21, 21–18, 10–21తో లీ జి జియా (మలేసియా) చేతిలో, అభిషేక్ (భారత్) 9–21, 15–21తో మిషా జిల్బెర్‌మన్ (ఇజ్రాయెల్) చేతిలో ఓడిపోయారు.

పోరాడి ఓడిన సామియా

మహిళల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్లు ఆకర్షి కశ్యప్, మాళవిక, అనుపమ ఉపాధ్యాయ్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి చేరారు. హైదరాబాద్ అమ్మాయి సామియా ఫారూఖీ తొలి రౌండ్‌లో 23–21, 13–21, 22–24తో టాప్ సీడ్ పాయ్ యు పో (చైనీస్ తైపీ) చేతిలో పోరాడి ఓడిపోయింది. ఆకర్షి 21–14, 21–11తో పాలీనా బురోవా (ఉక్రెయిన్)పై, మాళవిక 21–10, 21–8తో మోపాటి కెయురాపై, అనుపమ 21–14, 23–21తో వోంగ్ లింగ్ చింగ్ (మలేసియా)పై గెలిచారు.

సినిమా


● గోపీచంద్

స్టైలిష్ యాక్షన్

గోపీచంద్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వం'. బుధవారం (మే 12) గోపీచంద్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి ఆయన స్పెషల్ పోస్టర్‌ని విడుదల చేశారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో 'విశ్వం' తెరకెక్కుతోంది. దోనేపూడి చక్రపాణి సమర్పణలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం స్టూడియోస్‌పై టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి ఈ సినిమా నిర్మిస్తున్నారు. ''హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'విశ్వం'. తన హీరోలను స్టైలిష్‌గా చూపించడంలో దర్శకుడు శ్రీను వైట్ల దిట్ట. ఈ మూవీలో గోపీచంద్‌ని కూడా అలాగే చూపించనున్నారాయన. ప్రస్తుతం 'విశ్వం' షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సినిమాలో హీరోయిన్, ఇతర నటీనటుల వివరాలు త్వరలో తెలియజేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: కేవీ గుహన్, సంగీతం: చేతన్ భరద్వాజ్.

నమ్మకం ఉంది కాబట్టే ముందే షో వేశారు

- హీరో అడివి శేష్


● సుబ్రహ్మణ్యం, విశ్వక్ సేన్, సుధీర్‌బాబు, అడివి శేష్, జ్ఞాన శేఖర్, సుమంత్ జి. నాయుడు

''హరోం హర' ట్రైలర్ చాలా నచ్చింది. సుధీర్‌బాబు మంచి సినిమా చేశాడని తెలిసి, ఈ వేడుకకి వచ్చాను. ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉంది. సినిమా విడుదలకు నాలుగైదు రోజుల ముందే డిస్ట్రిబ్యూటర్స్‌ని పిలిచి షో వేశారంటే సినిమాపై యూనిట్‌కి ఎంత నమ్మకం ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సినిమా తప్పకుండా ప్రేక్షకులకు కొత్త అనుభూతి ఇస్తుంది'' అని హీరో అడివి శేష్ అన్నారు. సుధీర్‌బాబు హీరోగా జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించిన చిత్రం 'హరోం హర'. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్‌పై సుమంత్ జి. నాయుడు నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హీరోలు అడివి శేష్, విశ్వక్ సేన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి కంటెంట్ (టీజర్, ట్రైలర్, పాటలు...) ప్రామిసింగ్‌గా ఉంది. సుబ్రహ్మణ్యం, సుమంత్ లాంటి ప్యాషన్ ఉన్న నిర్మాతలు ఇండస్ట్రీకి కావాలి. ఈ సినిమాని థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయండి'' అన్నారు. సుధీర్‌బాబు మాట్లాడుతూ– ''ఇప్పటివరకూ తెలుగు ఇండస్ట్రీలో 'హరోం హర' లాంటి నేపథ్యంలో సినిమా రాలేదు. నాతో ఇంత మంచి సినిమా తీసిన జ్ఞానసాగర్‌కి థ్యాంక్స్. ఈ సినిమా చూశాక ఫ్యాన్స్ కాలర్ ఎగరేస్తారు'' అన్నారు. ''ఈ సినిమా కోసం రెండేళ్లు కష్టపడ్డాం'' అన్నారు నిర్మాత సుమంత్. ''హరోం హర'లోని తండ్రీ కొడుకుల ఎమోషన్ నాకు చాలా కనెక్ట్ అయ్యింది'' అన్నారు సుబ్రహ్మణ్యం. ఈ వేడుకలో నిర్మాతలు దామోదర్ ప్రసాద్, బెక్కం వేణుగోపాల్, డైరెక్టర్ మారుతి, డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి తదితరులు మాట్లాడారు.



''మహారాజ' నా కెరీర్‌లో 50వ సినిమా. ఈ యాభై చిత్రాల ప్రయాణంలో దాదాపు 500 వందలకు పైగా కథలు విన్నాను. ఎంతోమందిని కలిశాను. హిట్స్, ఫ్లాప్స్ చూశాను. ఫలితం ఏదైనా అది గొప్ప అనుభవాన్ని ఇచ్చింది. నేనిప్పటివరకూ చాలా పాత్రలు చేశాను. అయితే 'మహారాజ'లో నా పాత్ర నా గత సినిమాలకి వైవిధ్యంగా ఉంటుంది. ఈ స్టోరీ, స్క్రీన్ ప్లే చాలా స్పెషల్‌గా ఉంటాయి'' అని హీరో విజయ్ సేతుపతి అన్నారు. నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించిన చిత్రం 'మహారాజ'. మమతా మోహన్‌దాస్, అనురాగ్ కశ్యప్, అభిరామి ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. సుధన్ సుందరం, జగదీష్ పళనిసామి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ మూవీని ఏపీ, తెలంగాణలో ఎన్వీఆర్ సినిమా విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ– ''మహారాజ' కథ చాలా ఆసక్తిగా ఉంటుంది. అందుకే నా 50వ సినిమాగా ఈ కథ బాగుంటుందని చేశాను. నితిలన్ ఈ సినిమాని తీర్చిదిద్దిన విధానం చాలా బాగుంది. 'కాంతార'కు సంగీతం అందించిన అజనీష్ లోకనాథ్ మా మూవీకి అద్భుతమైన మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు. 'మహారాజ'ని ఎన్వీఆర్ సినిమా వాళ్లు తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు. నేను క్యారెక్టర్ రోల్స్ తక్కువే చేశాను. అది కూడా ఫ్రెండ్స్ కోసం చేశాను. 'ఉప్పెన'లో చాలా బలమైన పాత్ర నాది. దర్శకుడు రంజిత్ కోసమే 'మైఖేల్'లో ఓ క్యారెక్టర్ చేశాను. చిరంజీవిగారిపై ఉన్న ఇష్టంతో 'సైరా' చేశాను. అలాగే రజనీకాంత్ సార్, విజయ్, షారుక్ ఖాన్‌గార్లపై నాకున్న ఇష్టంతో వారి సినిమాల్లో చేశాను. మంచి కథ కుదిరితే తప్పకుండా దర్శకత్వం వహిస్తాను. తెలుగులో స్ట్రయిట్ సినిమాకి కథలు వింటున్నాను. ప్రస్తుతం తమిళ్‌లో మూడు సినిమాలు, హిందీలో ఓ చిత్రం చేస్తున్నాను'' అన్నారు.

స్నేహం కోసమే ఆ పాత్రలు చేశాను

- విజయ్ సేతుపతి

బంగారం లాంటి అవకాశం

- ఆస్కార్ గోల్డ్ రైజింగ్ ప్రోగ్రామ్‌కి నేత్ర



నేత్ర గురురాజ్ పేరు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పాపులర్ అయింది. బెంగళూరుకు చెందిన ఆమెకు అరుదైన అవకాశం దక్కింది. డైరెక్టర్‌గా, రైటర్‌గా, ఆర్టిస్ట్‌గా, సినిమాటోగ్రాఫర్‌గా... ఇలా పలు విభాగాల్లో తన ప్రతిభను నిరూపించుకోవడానికి 'చాప్టర్ 1, ఆల్ఫా 27, ఆస్ట్రాలజర్స్ లక్కీ డే, జాస్మిన్ ఫ్లవర్స్' వంటి నాలుగు షార్ట్ ఫిలింస్‌కి పని చేశారు నేత్ర. 'జాస్మిన్ ఫ్లవర్స్'కి కథ అందించడంతో పాటు ఛాయాగ్రాహకురాలిగా చేశారు. 'చాప్టర్ 1'లో విద్యార్థినిగా నటించారు. 'ఆల్ఫా 27'కి కెమెరా, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో పని చేశారు. 'ఆస్ట్రాలజర్స్ లక్కీ డే'కి దర్శకత్వం వహించడంతో పాటు ఛాయాగ్రాహకురాలిగానూ వ్యవహరించారు. ఈ చిత్రానికి మంచి పేరు తెచ్చుకున్నారు. అలాగే 'జాస్మిన్ ఫ్లవర్స్'కి పలు చలన చిత్రోత్సవాల్లో అవార్డులు దక్కాయి. ఇలా ఒక్కో మెట్టు ఎక్కుతూ నిరూపించుకుంటున్న నేత్ర గురురాజ్ తాజాగా ఆస్కార్ అకాడమీ తరఫున గోల్డ్ రైజింగ్ ప్రోగ్రామ్‌కి ఎంపిక య్యారు. ఈ ప్రోగ్రామ్‌కి అవకాశం దక్కడం చిన్న విషయం కాదు. ప్రపంచ దేశాల్లో సినిమా రంగానికి చెందిన ప్రతిభ గల యువ ఛాయాగ్రాహకులను ఎంపిక చేసి, రెండు నెలల పాటు అకాడమీ ఆధ్వర్యంలో నిపుణుల దగ్గర మెళకువలు నేర్చుకునే అవకాశం కల్పిస్తారు. కొన్ని నెలల క్రితం సినిమాటోగ్రఫీలో మాస్టర్స్ చేయడానికి లాస్ ఏంజిల్స్ వెళ్లిన నేత్ర 'జాస్మిన్ ఫ్లవర్స్'తో తన కెమెరా పనితనాన్ని చాటుకున్నారు. అదే ఆమెకు ఆస్కార్ అకాడమీ గోల్డ్ రైజింగ్ ప్రోగ్రామ్‌కి అవకాశం దక్కేలా చేసింది. బంగారంలాంటి ఈ అవకాశం దక్కించుకున్న నేత్రకు పలువురు సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రణయ గోదారి

ప్రముఖ నటుడు అలీ సోదరుడు బాబా కుమారుడు సదన్ హీరోగా నటించిన చిత్రం 'ప్రణయ గోదారి'. పీఎల్ విఘ్నేష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటించారు. పీఎల్‌వీ క్రియేషన్స్‌పై పారమళ్ల లింగయ్య నిర్మించిన ఈ మూవీ టైటిల్ ఫస్ట్ లుక్‌ను అంబర్‌పేట్ శంకర్ రిలీజ్ చేశారు. ''ప్రణయ గోదారి' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం. మా మూవీని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు చిత్ర నిర్మాత పారమళ్ల లింగయ్య. సాయికుమార్, 'జబర్దస్త్' రాజమౌళి, సునీల్ రావినూతల నటించిన ఈ చిత్రానికి సంగీతం: మార్కండేయ, కెమెరా: ఈదర ప్రసాద్.


● ప్రియాంక

అతిథి పాత్రకు సై?

అందం, అభినయం పరంగా తెలుగు ప్రేక్షకుల్లోనూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న మలయాళ బ్యూటీ నిత్యా మీనన్ తెలుగు సినిమా అంగీకరించి దాదాపు రెండేళ్లయింది. ప్రస్తుతం తమిళంలో 'కాదలిక్క నేరమిల్లయ్, డియర్ ఎక్సెస్' సినిమాలు చేస్తున్నారు. ఇవి తెలుగులోనూ విడుదలయ్యే అవకాశం ఉంది. మరి... నిత్యా మీనన్ స్ట్రయిట్ తెలుగు సినిమా సంగతి ఏంటి? అంటే... ఆమె ఓ తెలుగు సినిమా అంగీకరించారనే ప్రచారం జరుగుతోంది. నితిన్ హీరోగా వేణు శ్రీరామ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'తమ్ముడు' సినిమాలో అతిథి పాత్రకు సై అన్నారట నిత్య. గతంలో నితిన్, నిత్యా మీనన్ జంటగా నటించిన 'ఇష్క్, గుండెజారి గల్లంతయ్యిందే' చిత్రాలు మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. అలా హిట్ పెయిర్ అనిపించుకున్నారు. తాజాగా నితిన్ హీరోగా రూపొందుతున్న 'తమ్ముడు'లో సప్తమీ గౌడ కథానాయికగా నటిస్తున్నారు. నటి లయ ఓ కీలక పాత్ర చేస్తున్నారు. ఇందులో ఉన్న కీలకమైన అతిథి పాత్రకు నిత్యా మీనన్‌ని తీసుకున్నారని సమాచారం.


● నిత్యా మీనన్

ప్రేమ మాక్‌టైల్ రెడీ


● రచల్ డేవిడ్

డార్లింగ్ కృష్ణ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'లవ్ మాక్‌టైల్ 2'. మిలిన నాగరాజ్, అమృతా అయ్యంగార్, రచల్ డేవిడ్, నకుల్ అభయాన్కర్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. కన్నడలో ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ పతాకంపై ఎంవీఆర్ కృష్ణ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 14న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఎంవీఆర్ కృష్ణ మాట్లాడుతూ– ''కన్నడలో బ్లాక్ బస్టర్‌గా నిలిచిన 'లవ్ మాక్‌టైల్ 2' సినిమాని తెలుగులో అనువదించి విడుదల చేస్తున్నాం. డిస్ట్రిబ్యూటర్లు ఈ సినిమాని చూశారు. వారికి బాగా నచ్చడంతో రిలీజ్ చేయడానికి సంతోషంతో ముందుకొచ్చారు. తెలుగు ప్రేక్షకులు కూడా ఈ సినిమాని ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు.

రాయలసీమ నేపథ్యంలో...


● శశికా టిక్కో

ప్రవీణ్ రాజ్‌కుమార్, శశికా టిక్కో, అషు రెడ్డి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'పద్మవ్యూహంలో చక్రధారి'. సంజయ్‌రెడ్డి బంగారపు దర్శకత్వంలో వీసీ క్రియేషన్స్‌పై కేఓ రామరాజు నిర్మించారు. ఈ నెల 21న విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్‌ని హీరో విశ్వక్ సేన్ విడుదల చేసి, ''యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు. ''రాయలసీమ నేపథ్యంలో వస్తున్న ఈ లవ్ ఎంటర్‌టైనర్ మూవీ మంచి విజయం సాధిస్తుంది అనే నమ్మకం ఉంది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య, కెమెరా: జి. అమర్.

సాక్షి బిజినెస్
గురువారం
13-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	150	76,607
నిఫ్టీ ▲	58	23,323

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ		
నాస్‌డాక్	17,637	▲ 294
డోజోన్స్	38,710	▼ 37
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,215	▲ 68
డాక్స్	18,631	▲ 261
షాంఘై	3,037	▲ 9
నికాయ్	38,877	▼ 258

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,580	▲ 135
బంగారం (99.5 స్వచ్ఛత)	71,293	▲ 134
వెండి (కేజీ)	88,192	▲ 484

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	83.10	84.12
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	105.27	107.83
€	యూరో	భారతీయ	88.64	90.99
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	52.61	53.77
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	54.36	56.29
S$	సింగపూర్ డాలర్	భారతీయ	61.09	62.54
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.38	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	21.86	23.64
¥	చైనా యువాన్	భారతీయ	10.40	12.47

ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ.. భళా



- సరికొత్త గరిష్టం వద్ద ముగింపు
- 58 పాయింట్లు అప్
- 23,323కు చేరిక
- సెన్సెక్స్150 పాయింట్లు ప్లస్
- తొలుత 594 పాయింట్లు దూకుడు
- బీఎస్‌ఈ మార్కెట్ విలువ రికార్డ్

మరోసారి దేశీ స్టాక్ మార్కెట్లు దూకుడు ప్రదర్శించాయి. ఎన్‌ఎస్‌ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ 58 పాయింట్లు బలపడి 23,323 వద్ద నిలిచింది. ఇది చరిత్రాత్మక గరిష్టంకాగా.. ఇంట్రాడేలోనూ 177 పాయింట్లు పురోగమించి 23,442 వద్ద సరికొత్త రికార్డును సాధించింది. ఇక ఇన్వెస్టర్ల కొనుగోళ్లతో తొలి సెషన్‌లో సెన్సెక్స్ 594 పాయింట్లు జంప్ చేసింది. ఇంట్రాడే రికార్డ్ 77,079కు చేరువగా 77,050ను అధిగమించింది. చివరికి 150 పాయింట్లు జమ చేసుకుని 76,607 వద్ద ముగిసింది.

ముంబై: ఎంపిక చేసిన బ్లూచిప్ షేర్లకు డిమాండ్ నెలకొనడంతో స్టాక్ మార్కెట్లు మళ్లీ జోరందుకున్నాయి. రోజంతా ఇన్వెస్టర్లు పెట్టుబడులకే ఆసక్తి చూపడంతో లాభాలమధ్యే కదిలాయి. ఫలితంగా బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్(విలువ) మరోసారి కొత్త రికార్డును లిఖించింది. రూ. 429.32 లక్షల కోట్లను(5.14 ట్రిలియన్ డాలర్లు) అధిగమించింది. కాగా.. ఎన్‌ఎస్‌ఈలో మీడియా, పీఎస్‌యూ బ్యాంక్స్, హెల్త్‌కేర్ రంగాలు 2-1 శాతం మధ్య పుంజుకున్నాయి.

చిన్న షేర్లు జూమ్

బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 1 శాతానికిపైగా బలపడ్డాయి. ట్రేడైన షేర్లలో 2,518 లాభపడితే.. 1,376 మాత్రమే డీలాపడ్డాయి. నగదు విభాగంలో ఎఫ్‌పీఐలు రూ. 427 కోట్లు, దేశీ ఫండ్స్ రూ. 234 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేశాయి.

ఫెడ్‌పై దృష్టి

దేశీయంగా జీడీపీ పురోగతిపై ఆర్‌బీఐ ఆశావహ అంచనాలు సెంటిమెంటుకు బలాన్నిచ్చినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకురానున్న తుది బడ్జెట్ వృద్ధికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అభిప్రాయపడ్డారు. ఇవికాకుండా యూఎస్ ద్రవ్యోల్బణ గణాంకాలు, ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమీక్షపై ఇన్వెస్టర్లు దృష్టిపెట్టనున్నట్లు తెలియజేశారు. ఫెడ్ వడ్డీ రేట్ల కోత అంచనాలు బలహీనపడినట్లు తెలియజేశారు. విదేశీ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 83 డాలర్లకు చేరగా, డాలరుతో మారకంలో రూపాయి నామమాత్రంగా 3 పైసలు బలపడి 83.56(ప్రొవిజినల్) వద్ద ముగిసింది.

ఇక్సిగో ఐపీవో బంపర్ సక్సెస్

ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ ఇక్సిగో మాతృ సంస్థలే ట్రావెన్యూస్ టెక్నాలజీ చేపట్టిన పబ్లిక్ ఇష్యూ సూపర్ సక్సెస్‌ను సాధించింది. షేరుకి రూ. 88-93 ధరలో బుధవారం ముగిసిన ఇష్యూ 98 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్‌ను అందుకుంది. ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 740 కోట్లు సమీకరించింది.

డీ డెవలప్‌మెంట్ @ రూ. 193-203

పైపింగ్ సొల్యూషన్స్ కంపెనీ డీ డెవలప్‌మెంట్ ఇంజనీర్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 193-203 ధరల శ్రేణి ప్రకటించింది. ఐపీవో ఈ నెల 19న ప్రారంభమై 21న ముగియనుంది. ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ. 418 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. రుణ చెల్లింపులు, వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు ఈ నిధులను వినియోగించుకోవాలన్నది సంస్థ ప్రణాళిక.

సంస్కరణలు కొనసాగుతాయ్: సీతారామన్



ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సీతారామన్

న్యూఢిల్లీ: గత పదేళ్లుగా చేపట్టిన సంస్కరణలు ఇకపైనా కొనసాగుతాయని మరోసారి కేంద్ర ఆర్థిక మంత్రిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. వికసిత్ భారత్ లక్ష్యసాధనను వేగవంతం చేసే దిశగా చర్యలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు, జీవనాన్ని సులభతరం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి చెప్పారు. ఇందుకోసం తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అంతర్జాతీయంగా సవాళ్లతో కూడుకున్న పరిస్థితులు ఉన్నప్పటికీ భారత్ ప్రశంసించతగ్గ స్థాయిలో వృద్ధి సాధించగలిగిందన్నారు. నిర్మలా సీతారామన్ ఆర్థిక మంత్రిగా బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, ఫైనాన్స్ సెక్రటరీ టీవీ సోమనాథన్ తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తి బడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ వచ్చే నెల ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. దీనితో ఆరు పూర్తి స్థాయి బడ్జెట్‌లను, వరుసగా ఏడో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత ఆమెకు దక్కనుంది.

ఇంజీనస్‌తో రెడ్డీస్ లైసెన్సింగ్ ఒప్పందం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యూఎస్ కంపెనీ ఇంజీనస్ ఫార్మాస్యూటికల్స్‌తో లైసెన్సింగ్ ఒప్పందం చేసుకున్నట్టు డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ తెలిపింది. ఇందులో భాగంగా క్యాన్సర్ చికిత్సలో వాడే సైక్లోఫాస్ఫామైడ్ ఇంజెక్షన్‌ను యూఎస్ మార్కెట్లో రెడ్డీస్ విక్రయించనుంది. అమ్మకాల ద్వారా వచ్చే లాభాల్లో 50% ఇంజీనస్‌కు చెల్లిస్తుంది. ఐక్వియా గణాంకాల ప్రకారం 2024 మార్చితో ముగిసిన 12 నెలల్లో ఇంజీనస్ తయారీ సైక్లోఫాస్ఫామైడ్ ఇంజెక్షన్ అమ్మకాల విలువ యూఎస్‌లో 51.8 మిలియన్ డాలర్లు నమోదైంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-6-2024

విశాఖ	530-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	530-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	530-00
వరంగల్	532-00
రిటైల్ ధర	5.90

ఆహార ధరలు దారుణం పరిశ్రమ పేలవం..

- రిటైల్ ద్రవ్యోల్బణం మేలో 4.75 %
- ఆహార ధరల తీవ్రత ఏకంగా 8.69%
- ఏప్రిల్ పారిశ్రామిక ఉత్పత్తి పురోగతి 5%
- మూడు నెలల కనిష్టం





న్యూఢిల్లీ: భారత తాజా కీలక ఆర్థిక గణాంకాలు కొంత ఆందోళన కలిగిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య, పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం మేలో 4.75 శాతంగా నమోదయ్యింది. ఇది ఏడాది కనిష్టం అయినప్పటికీ, ఆర్‌బీఐ లక్ష్యం కన్నా 75 బేసిస్ పాయింట్లు అధికం. 2024 ఏప్రిల్‌లో ఈ రేటు 4.83 శాతంకాగా, 2023 మేనెల్లో ఈ రేటు 4.31 శాతంగా ఉంది. రిటైల్ ద్రవ్యోల్బణం ప్లస్ 2 లేదా మైనస్ 2తో 4 శాతంగా ఉండాలి. దీని ప్రకారం 6 శాతం వరకూ రిటైల్ ద్రవ్యోల్బణం ఉండవచ్చు. అయితే తమ లక్ష్యం ఎప్పుడూ 4 శాతం వద్ద రిటైల్ ద్రవ్యోల్బణం కట్టడి అని ఆర్‌బీఐ స్పష్టం చేస్తున్న సంగతి తెలిసిందే. జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. రిటైల్ ద్రవ్యోల్బణంలో కీలక విభాగం- ఆహార ద్రవ్యోల్బణం మాత్రం మేలో తీవ్ర స్థాయిలో 8.69 శాతంగా నమోదైంది. ఏప్రిల్‌లో సైతం ఈ రేటు 8.70 శాతంగా ఉంది. ద్రవ్యోల్బణం తీవ్రత అటు సామాన్యులకు, ఇటు వృద్ధి పురోగతికి అడ్డంకి కలిగించే అంశం. సమీక్షా నెల్లో పట్టణ ప్రాంతాల్లో 4.15% ద్రవ్యోల్బణం ఉంటే, గ్రామీణ ప్రాంతాల్లో ఇది సగటు 4.75 శాతం కన్నా అధికంగా 5.28 శాతంగా నమోదయ్యింది.

పరిశ్రమ పేలవం

మరోవైపు పరిశ్రమల పురోగతికి సంబంధించి పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) పెరుగుదల ఏప్రిల్‌లో 5 శాతంగా నమోదయ్యింది. గత 3 నెలల్లో ఇంత తక్కువ స్థాయి ఇదే తొలిసారి. సూచీలో దాదాపు 70% వాటా కలిగిన తయారీ రంగం సమీక్షా నెల్లో పేలవ పనితనాన్ని ప్రదర్శించింది. ఎకానమీలో వ్యవసాయ రంగం వాటా దాదాపు 18.4%. పారిశ్రామిక రంగం వాటా 28.3 %. సేవల రంగం వాటా 53.3%. పారిశ్రామిక రంగంలో ఒక్క తయారీ రంగం వాటా దాదాపు 70%.

రంగాల వారీగా..(శాతాల్లో)

విభాగం	2024 ఏప్రిల్	2024 మార్చి	2023 ఏప్రిల్
తయారీ	3.9	5.2	5.5
మైనింగ్	6.7	1.2	5.1
విద్యుత్ ఉత్పత్తి	10.2	8.6	-1.1
క్యాపిటల్ గూడ్స్	3.1	6.1	4.4
కన్జూమర్ డ్యూరబుల్స్	9.8	9.5	-2.3
కన్జూమర్ నాన్ డ్యూరబుల్స్	-2.4	4.9	11.4
ఇన్‌ఫ్రా/నిర్మాణం	8.0	6.9	13.4
ప్రైమరీ గూడ్స్	7.0	2.5	1.9
ఇంటర్మీడియట్ గూడ్స్	3.2	5.1	1.7

ఇంధన డిమాండ్‌కు భారత్ దన్ను

న్యూఢిల్లీ: ఈ దశాబ్దం ద్వితీయార్థంలో అంతర్జాతీయంగా ముడిచమురు డిమాండ్‌కు భారత్ చోదకంగా ఉండగలదని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఈఏ)నివేదిక తెలిపింది. 2023-2030 మధ్య కాలంలో భారత్‌లో చమురు వినియోగం చైనాను మినహాయించి మిగతా అన్ని దేశాలకన్నా అధికంగా ఉంటుందని పేర్కొంది. ఇది ఏకంగా రోజుకు 13 లక్షల బ్యారెళ్ల (బీపీడీ) మేర పెరిగే అవకాశం ఉందని ఆయిల్ 2024 రిపోర్టులో పేర్కొంది. 2023లో రోజుకు 54 లక్షల బ్యారెళ్లుగా (బీపీడీ) ఉన్న చమురు డిమాండ్ 2030 నాటికి 3.2 శాతం పెరిగి (రోజుకు 13 లక్షల బ్యారెళ్లు) 67 లక్షల బీపీడీకి చేరగలదని అంచనా వేస్తున్నట్లు ఐఈఏ వివరించింది. 2025-2030 మధ్య కాలంలో భారత్‌లో చమురుకు డిమాండ్ 9,00,000 బీపీడీ మేర పెరగనుండగా, చైనాలో ఇది 5,70,000 బీపీడీగా ఉండనుంది. అంతర్జాతీయంగా చూస్తే 2029 నాటికి ఆయిల్ డిమాండ్ తారస్థాయికి చేరుకోగలదని ఐఈఏ తెలిపింది.



డిపాజిట్ రేట్లు తగ్గుతాయ్

ఎస్‌బీఐ చీఫ్ దినేష్ కుమార్ ఖారా



న్యూఢిల్లీ: డిపాజిట్ రేట్లు గరిష్ట స్థాయికి చేరుకున్నాయని, మధ్య కాలికంగా తగ్గే అవకాశం ఉందని ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ కుమార్ ఖారా విశ్లేషించారు. ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తే... ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ త్రైమాసికం నుంచి ఆర్‌బీఐ కూడా తన వడ్డీ రేట్ల వ్యవస్థను వెనక్కు మళ్లించడం ప్రారంభించవచ్చని ఖారా అంచనావేశారు. స్విట్జర్లాండ్, స్వీడన్, కెనడా, యూరో ఏరియా వంటి అభివృద్ధి చెందిన దేశాల సెంట్రల్ బ్యాంకులు 2024లో తమ రేటు సడలింపు ప్రక్రియను ప్రారంభించాయి. అయితే, ద్రవ్యోల్బణం నిలకడ నేపథ్యంలో అమెరికా సెంట్రల్ బ్యాంక్ -ఫెడ్ ఫండ్ రేటు తగ్గింపు ప్రణాళికలను వెనక్కి తీసుకునే అవకాశం ఉందన్న విశ్లేషణలు ఉన్నాయి.

కాగా, బుధవారం ఫెడ్ తన యథాతథ వడ్డీ రేటును (5.25%-5.5%) కొనసాగిస్తూ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సగం కూడా దక్కలేదు

సాక్షి, అమరావతి: జనాభాపరంగా అత్యధికంగా ఉన్న బీసీలకు 24 మందితో కొలువుదీరిన సీఎం చంద్రబాబు మంత్రివర్గంలో కనీసం సగం కూడా స్థానం దక్కకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. బీసీలకు కేవలం 8 మంత్రి పదవులు ఇవ్వగా అతి తక్కువ జనాభా ఉన్న సీఎం చంద్రబాబు సొంత సామాజిక వర్గానికి మాత్రం ఐదు పదవులు (బాబుతో కలిపి) దక్కడం గమనార్హం. ఎక్కువ స్థానాల్లో విజయం సాధించిన రెడ్డి సామాజిక వర్గానికి సైతం చంద్రబాబు నిరాశే మిగిల్చారు. వైఎస్సార్ సీపీ పాలనలో ఒక్క బీసీలకే పది మంత్రి పదవులు ఇవ్వగా, ఎస్సీలకు ఐదు, ఎస్టీలకు ఒకటి, మైనారిటీలకు ఒక మంత్రి పదవి చొప్పున దక్కాయి. మొత్తం మంత్రివర్గంలో వైఎస్ జగన్ ఆయా వర్గాలకు ఇచ్చిన పదవుల శాతం 68 కాగా ఇప్పుడు చంద్రబాబు మంత్రివర్గంలో వారికిచ్చిన పదవులు 45 శాతం మాత్రమే కావడం గమనార్హం.

- సీఎం చంద్రబాబు మంత్రి పదవుల్లో బీసీలకు 8, కాపులకు 4, రెడ్డి వర్గానికి కేవలం మూడు మాత్రమే ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వైశ్య సామాజిక వర్గాలకు ఒక్కొక్కటి చొప్పున మంత్రి పదవులు దక్కాయి. వైఎస్ జగన్ తన మంత్రివర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పెద్దపీట వేశారు. ఆయా వర్గాలకు ఆయన ఏకంగా 17 మంత్రి పదవులు ఇవ్వడం గమనార్హం. ఇప్పుడు చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 12 పదవులు మాత్రమే ఇచ్చారు.
- వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు వర్గాలకు ఒక్కో ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారు. ఇప్పుడు చంద్రబాబు మంత్రివర్గంలో కాపు వర్గానికి మాత్రమే ఉప ముఖ్యమంత్రి పదవి లభించింది. రెడ్డి సామాజిక వర్గానికి వైఎస్ జగన్ హయాంలో ఆయనతో కలిపి ఐదు పదవులు దక్కగా చంద్రబాబు ప్రభుత్వంలో ముగ్గురికే అవకాశం లభించింది.
- వైఎస్ జగన్ ప్రతి అడుగులో సామాజిక న్యాయాన్ని పాటించారు. మంత్రివర్గం నుంచి స్థానిక సంస్థలు, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు లాంటి అన్ని పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 శాతానికిపైగా ఇచ్చి రాజకీయ సాధికారతకు బాటలు వేశారు. చంద్రబాబు తొలి అడుగులోనే సొంత సామాజిక వర్గంపై మక్కువ ప్రదర్శించి దళిత, మైనారిటీ, బీసీ వర్గాలను చిన్నచూపు చూశారు.

సీనియర్లకు నిరాశే

- గంటా, కళా, అయ్యన్న, గోరంట్ల, జ్యోతులకు మంత్రివర్గంలో దక్కని చోటు
- ప్రత్తిపాటి, సోమిరెడ్డి, కోట్ల, పరిటాలకు నో ఛాన్స్
- జూనియర్లు, కొత్త వారి వైపు మొగ్గు చూపిన చంద్రబాబు
- 24 మందిలో తొలిసారి మంత్రులుగా 17 మంది
- ఎన్నికలకు ముందు పార్టీలో చేరి మంత్రి అయిన కేపీ సారథి
- ఎమ్మెల్యేగా గెలిచినా సుజనా చౌదరికి మొండి చేయే

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతలకు చంద్రబాబు తీవ్ర నిరాశ కలిగించారు. రాష్ట్ర మంత్రివర్గంలో సీనియర్ నాయకులను కాదని కొత్త వారికి చోటు కల్పించారు. తొలి నుంచి పార్టీ కోసం పని చేసిన వారు, గతంలో మంత్రులుగా పని చేసి, పార్టీలో, జిల్లాల్లో కీలకంగా ఉన్న వారికి కాకుండా కొత్త వారికి అవకాశం ఇవ్వడంపై ఆ పార్టీలో పెద్ద చర్చే జరుగుతోంది. 24 మంది మంత్రుల్లో 17 మంది తొలిసారిగా మంత్రి పదవులు చేపడుతున్నారు. 2014-2019 మధ్య కాలంలో మంత్రులుగా పనిచేసి ఇప్పుడు గెలిచిన వారికీ అవకాశం ఇవ్వలేదు. అప్పట్లో మంత్రులుగా పనిచేసిన వారిలో అచ్చెన్నాయుడు, నారాయణ, లోకేశ్‌కు మాత్రమే మళ్లీ మంత్రి పదవులు వచ్చాయి. మిగతా వారికి పదవులు దక్కలేదు.

గంటా, అయ్యన్నకు దక్కని పదవులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో సూపర్ సీనియర్లయిన అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, బండారు సత్యన్నారాయణమూర్తిని పక్కనపెట్టి జూనియర్ అయిన వంగలపూడి అనితకు మంత్రి పదవి ఇచ్చారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో కళా వెంకట్రావు, అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజును కాదని తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన కొండపల్లి శ్రీనివాస్, మరో నేత సంధ్యారాణిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలో అచ్చెన్నాయుడికి మాత్రమే మంత్రి పదవి దక్కగా కూన రవికుమార్, కొండ్రు మురళీమోహన్‌లకు మొండిచేయి చూపారు.

తూర్పులో జనసేనకు ప్రాధాన్యం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జనసేనకు ప్రాధాన్యత లభించింది. ఆ జిల్లా నుంచి జనసేన తరఫున పవన్ కళ్యాణ్, కందుల దుర్గేష్ మంత్రులయ్యారు. టీడీపీ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వాసంశెట్టి సుభాష్‌కి అనూహ్యంగా మంత్రి పదవి లభించింది. ఈ జిల్లకే చెందిన సీనియర్లు జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్యచౌదరిలకు మంత్రి పదవులు ఇవ్వకపోవడంపై టీడీపీలోనే ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ముందుగా అనుకున్నట్లుగానే నిమ్మల రామానాయుడికి కేబినెట్ బెర్త్ దక్కింది. ఈ జిల్లాలో సీనియర్ నేతలు చింతమనేని ప్రభాకర్, పితాని సత్యనారాయణ, రఘురామకృష్ణరాజుకు నిరాశే ఎదురైంది.

ఎన్నికలకు ముందు పార్టీలోకొచ్చి మంత్రి అయిన పార్థసారథి

ఉమ్మడి కృష్ణా జిల్లాలో గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, శ్రీరాం తాతయ్య వంటి వారికి కాకుండా ఎన్నికలకు ముందు టీడీపీలో చేరి నూజివీడు నుంచి గెలిచిన కె. పార్థసారథికి మంత్రి పదవి ఇవ్వడం గమనార్హం. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రత్తిపాటి పుల్లారావు, యరపతినేని శ్రీనివాసరావు, ధూళిపాళ్ల నరేంద్ర, కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనంద్‌బాబుకు నిరాశ తప్పలేదు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఏలూరి సాంబశివరావు, నెల్లూరు జిల్లాలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికీ అవకాశం రాలేదు.

సీమలో సీనియర్లకు మొండి చేయి

చిత్తూరు జిల్లా నుంచి ఒక్కరికీ్కూడా మంత్రి పదవి దక్కలేదు. దీంతో ఈ జిల్లాకు చెందిన అమర్‌నాథ్‌రెడ్డి, పులివర్తి నాని నిరాశకు లోనయ్యారు. కడప జిల్లా నుంచి రెడ్డప్పగారి మాధవి, వరదరాజుల రెడ్డి మంత్రి పదవులు ఆశించగా, మండిపల్లి రామప్రసాద్‌రెడ్డికి పదవి ఇచ్చారు. కర్నూలు జిల్లా నుంచి సీనియర్ నాయకుడు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి మొండిచేయి చూపారు. అనంతపురం జిల్లాలో పరిటాల సునీత, కాల్వ శ్రీనివాసులును పరిగణనలోకి తీసుకోకుండా కొత్తగా వచ్చిన సవితకు మంత్రి పదవి ఇచ్చారు.

సుజనా చౌదరికి ఎదురు దెబ్బ

చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు సుజనా చౌదరికి మంత్రివర్గంలో చోటు దక్కకపోవడం విశేషం. బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు మంత్రి పదవి ఖాయమని అందరూ భావించారు. గతంలో చంద్రబాబు కోటరీలో కీలక నేతగా ఉండి, కేంద్ర మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న ఆయన్ని చంద్రబాబు కాదనలేరనే చర్చ జరిగింది. కానీ బీజేపీలోని ప్రధాన వర్గం, టీడీపీలోని మరో వర్గం ఆయన్ని వ్యతిరేకించడంతో మంత్రి పదవి దక్కలేదు. ఎమ్మెల్యేగా గెలిచినా మంత్రి పదవి పొందలేకపోవడం సుజనాకు తీవ్ర నిరాశ కలిగించే విషయమే.

ఉత్తరాంధ్రకు తగ్గిన ప్రాధాన్యం

మంత్రి పదవుల్లో ఉత్తరాంధ్రకు సరైన ప్రాధాన్యం లభించలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 24 మంత్రి పదవుల్లో ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాలకు కలిపి నాలుగు పదవులే దక్కాయి. ఆర్థిక రాజధానిగా భావించే విశాఖ జిల్లాకు ఒకే మంత్రి పదవి ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లాలోనూ ఒక్కరికే అవకాశం రాగా, విజయనగరం జిల్లాలో మాత్రం ఇద్దరికి అవకాశం లభించింది. ఉమ్మడి తూర్పు గోదావరి, గుంటూరు, కర్నూలు, అనంతపురం జిల్లాలకు మూడు చొప్పున మంత్రి పదవులు లభించాయి. విజయనగరం, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు రెండేసి చొప్పున పదవులు ఇచ్చారు. శ్రీకాకుళం, విశాఖ, పశ్చిమగోదావరి, కడప, చిత్తూరు జిల్లాలకు ఒకటి చొప్పున మంత్రి పదవులు దక్కాయి.

జనసేనకు మూడే

జనసేన తరఫున నలుగురైదుగురికి మంత్రి పదవులు లభిస్తాయని ఆ పార్టీ నేతలు ఆశించారు. కానీ మూడు మాత్రమే దక్కాయి. జనసేన నుంచి అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌కు మాత్రమే అవకాశం దక్కింది. దీంతో మంత్రి పదవులు ఆశించిన కొణతాల రామకృష్ణ, పంతం నానాజీ, పులపర్తి రామాంజనేయులు అసంతృప్తిలో ఉన్నారు.

దక్షిణాది రాష్ట్రాల్లో యువ జనాభా క్షీణత!

- పెరుగుతున్న వృద్ధులు
- ఫలితంగా యువ శ్రామిక శక్తికి డిమాండ్
- ఏపీలో 2021లో మొత్తం జనాభాలో 25.1 యువ జనాభా
- అదే 2031లో యువత 21 శాతానికి తగ్గుదల
- 2036 నాటికి 19.6 శాతానికి తగ్గే అవకాశం
- ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లో యువ జనాభా ఎక్కువ
- ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్-2024

సాక్షి, అమరావతి: దేశంలో దక్షిణాది రాష్ట్రాల్లో 15 ఏళ్ల నుంచి 29 ఏళ్ల వయసు గల యువ జనాభా అంతకంతకూ క్షీణిస్తోంది. అదే సమయంలో వృద్ధుల జనాభా పెరుగుతోంది. ఈ విషయాన్ని ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్-2024 వెల్లడించింది. దీంతో దక్షిణాది రాష్ట్రాల్లో యువ శ్రామిక శక్తికి డిమాండ్ పెరుగుతుందని నివేదిక అంచనా వేసింది. యువ జనాభా క్షీణతతో దక్షిణాది రాష్ట్రాల్లో యువ శ్రామిక శక్తికి తీవ్ర కొరత ఏర్పడుతుందని పేర్కొంది. ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో యువ జనాభా ఎక్కువ స్థిరంగా ఉంటుందని అంచనా వేసింది. ఈ మేరకు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 2021 నుంచి 2036 వరకు యువ జనాభా, ఉపాధి అవకాశాల స్థితిగతులపై నివేదిక వెలువరించింది. ఆంధ్రప్రదేశ్‌లో 2021లో మొత్తం జనాభాలో 15 ఏళ్ల నుంచి 29 ఏళ్ల మధ్యగల యువ జనాభా 25.1 శాతం ఉండగా 2031 నాటికి మొత్తం జనాభాలో యువ జనాభా 21 శాతానికి తగ్గుతుందని నివేదిక పేర్కొంది. అదే 2036లో మొత్తం జనాభాలో యువ జనాభా 19.6 శాతానికి పరిమితమవుతుందని వెల్లడించింది. మొత్తం దేశ జనాభాలో ఆంధ్రప్రదేశ్‌లో యువ జనాభా శాతం 2021లో 3.6 శాతంగా, 2031లో 3.2 శాతంగా, 2036లో 3.1 శాతంగా ఉంటుందని తెలిపింది.



ప్రధాని మోదీకి ఘనస్వాగతం

- ఉదయం 10.55కు గన్నవరం చేరుకున్న ప్రధాని.. స్వాగతం పలికిన చంద్రబాబు, ఇతర నేతలు
- మధ్యాహ్నం 1 గంటకు భువనేశ్వర్‌కు వెళ్లిన ప్రధాని



ప్రధానికి స్వాగతం పలుకుతున్న చంద్రబాబు

విమానాశ్రయం (గన్నవరం): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి బుధవారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం)లో ఘన స్వాగతం లభించింది. కేసరపల్లి ఐటీ పార్కు సమీపంలో జరిగిన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన న్యూఢిల్లీ నుంచి భారత వాయుసేన విమానంలో ఉదయం 10.55 గంటలకు ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ప్రధాని మోదీకి టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అద్నాన్‌నయీం అస్మీ, బీజేపీ నాయకులు సోము వీర్రాజు, పాతూరి నాగభూషణం, గుత్తికొండ రాజబాబు, చిగురుపాటి కుమారస్వామి, పలువురు టీడీపీ, జనసేన నేతలు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ప్రధాన మంత్రి రోడ్డు మార్గం ద్వారా ప్రమాణ స్వీకార వేదిక వద్దకు చేరుకున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం తర్వాత ప్రధాన మంత్రి మోదీ మధ్యాహ్నం ఒంటి గంటకు విమానంలో భువనేశ్వర్‌కు వెళ్లారు. ప్రధానికి సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, పలువురు బీజేపీ, టీడీపీ నేతలు వీడ్కోలు పలికారు. ప్రధాని రాక సందర్భంగా ఎయిర్‌పోర్ట్‌తో పాటు ప్రమాణ స్వీకార వేదిక వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

నేడు సీఎంగా బాధ్యతలు చేపట్టనున్న చంద్రబాబు

- సమర్థతనుబట్టి మంత్రులకు శాఖలు
- నేటి సాయంత్రంలోగా శాఖల కేటాయింపు పూర్తి
- శాఖలవారీగా శ్వేతపత్రాల విడుదల

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు. వెలగపూడి సచివాలయంలో సాయంత్రం 4.41 గంటలకు సీఎం ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరిస్తారు. అనంతరం మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు ఫైల్‌పై రెండో సంతకం, పింఛన్లు రూ.4 వేలకు పెంపు ఫైల్‌పై మూడో సంతకం చేస్తారని సమాచారం. స్కిల్ సెన్సెస్ ప్రక్రియ చేపట్టడం, అన్న క్యాంటీన్ల ఏర్పాటు ఫైళ్లపైనా ఆయన సంతకం చేస్తారని చెబుతున్నారు.

తెలంగాణ

తెలంగాణలో ప్రభుత్వ స్కూళ్లన్నీ ఇంగ్లిష్ మీడియంలోకి

- సీరియస్‌గా ఆలోచన చేస్తోన్న ప్రభుత్వం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం/ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను ఇంగ్లిష్ మీడియంలోకి మార్చాలని ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచన చేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. విద్య కోసం ఎన్ని నిధులైనా కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. ఖమ్మంలోని ఎన్నెస్పీ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఆయన విద్యార్థులకు యూనిఫామ్ అందజేశారు. అనంతరం మీడియాతో భట్టి మాట్లాడారు. ఏడాదిలోగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ శాఖల ద్వారా అందిస్తున్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్ సంఖ్య మరో వంద పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు భట్టి వెల్లడించారు.

మీడియాపై ఆంక్షలు దారుణం

పలు ఛానెళ్ల ప్రసారాలు పునరుద్ధరించాలని డీజేఎఫ్ డిమాండ్

సాక్షి, అమరావతి: ప్రభుత్వాలు మారిన ప్రతిసారి మీడియా రంగంపై ఆంక్షలు పెట్టాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్యంలో హితం కాదని డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యరమల కిషోర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ కుర్రె రాజేంద్రరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజాపక్షంగా ప్రసారాలు చేస్తున్న ఎన్టీవీ, 10టీవీ, టీవీ9, సాక్షి ఛానెళ్ల ప్రసారాలను నిలుపుదలకు కేబుల్ ఆపరేటర్లపై ఒత్తిడి తీసుకురావడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. ఇది ప్రజల హక్కులను కచ్చితంగా కాలరాయడమేనని, ఈ చర్యలను ఆంధ్రప్రదేశ్ డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఇలాంటి చర్యలు ప్రత్యక్షంగా భావ ప్రకటన స్వేచ్ఛపై జరిగిన దాడిగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ప్రచార మాధ్యమాలు ప్రజల వద్దకు తీసుకెళ్లకుండా నివారించే ప్రయత్నంలో భాగంగానే పలు టీవీ ఛానెళ్లను అడ్డుకున్నట్లు డీజేఎఫ్ భావిస్తుందని, తక్షణమే నిలిపివేసిన టీవీ ఛానళ్ల ప్రచారాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఎంటీఎస్ టీచర్ల నియామకానికి మార్గదర్శకాలు జారీ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా నియమితులైన 1998, 2008 డీఎస్సీ అభ్యర్థులకు పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. వీరి సర్వీసును వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు (11 నెలల పాటు) పునరుద్ధరిస్తూ ఈ నెల 10న ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే. కాగా, వీరిని కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలల్లో నియమించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఫౌండేషన్/ఫౌండేషనల్ స్కూల్ ప్లస్‌లో ఉపాధ్యాయులు ఉండి వారికి ప్రత్యామ్నాయం లేనిచోట, ఏకోపాధ్యాయ పాఠశాలల్లోను, 98 కంటే తక్కువ నమోదు ఉన్న ప్రీ-హై స్కూల్స్‌లోను, 21-30 మధ్య ఎన్‌రోల్‌మెంట్ ఉన్న ఫౌండేషన్/ ఫౌండేషనల్ స్కూల్‌లో ఒకరు చొప్పున ఎంటీఎస్ ఉపాధ్యాయుడిని నియమించాలని పేర్కొన్నారు. పాఠశాల అవసరాన్ని బట్టి వీరిని నియమించడంతో పాటు ఏ పాఠశాలకు ఒక్కరి కంటే ఎక్కువ మంది ఎంటీఎస్ టీచర్‌ను నియమించరాదని ఆదేశించారు.

ఏపీ అభివృద్ధికి సీఐఐ సహకారం

సాక్షి, అమరావతి: రాష్ట్రాన్ని వికసిత్ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడంలో కొత్త ప్రభుత్వంతో కలిసి పని చేస్తామని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఏపీ చాప్టర్ చైర్మన్ వి. మురళీ కృష్ణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, ఇతర కేబినెట్ మంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంలో తమ సహకారం ఉంటుందని సీఐఐ ఏపీ వైస్ చైర్మన్ జి.మురళీ కృష్ణ అన్నారు.

మామిడి చెట్ల నరికివేత

- రూ.14 లక్షలకు పైగా నష్టం
- వైఎస్సార్ జిల్లాలో ఘటన



గుర్తు తెలియని వ్యక్తులు నరికేసిన మామిడి తోట

చక్రాయపేట: వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలం మారెళ్లమడకలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కాపునకు వచ్చిన మామిడి చెట్లను నరికేశారు. గత నెల 20న బొజ్జా యోగీశ్వర రెడ్డి, బొజ్జా పార్థ సారథిరెడ్డి (మాజీ సర్పంచ్), బొజ్జా వాసుదేవరెడ్డిలకు చెందిన 106 మామిడి చెట్లను నరికివేసిన సంగతి తెలిసిందే. మళ్లీ మంగళవారం వాసుదేవ రెడ్డి తోటలో 42 మామిడి చెట్లను నరికేయడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో రూ.10 లక్షలకు పైగా నష్టం సంభవించగా ప్రస్తుతం సుమారు రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాసుదేవరెడ్డి వాపోయాడు. దీనిపై ఆర్కే వ్యాలీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రంగారావు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా, ఈ చర్యకు ఎవరు పాల్పడ్డారో తెలియడం లేదని మాజీ సర్పంచ్ బొజ్జా పార్థసారథిరెడ్డి తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కేంద్ర మంత్రి కుమారస్వామిని కలిసిన స్టీల్ ప్లాంట్ సీఎండీ

ఉక్కునగరం:కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని న్యూఢిల్లీలో విశాఖ స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి స్టీల్‌ప్లాంట్ గురించి వివరించారు.

15 నుంచి విస్తారంగా వర్షాలు!

- నేడు, రేపు తేలికపాటి వానలు
- 2-3 రోజుల్లో మరింత విస్తరించనున్న రుతుపవనాలు



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో కొద్ది రోజుల నుంచి నైరుతి రుతుపవనాలు స్తబ్దుగా ఉన్నాయి. ప్రస్తుతం షీర్ జోన్, గాలుల కోత కారణంగా అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అయితే ఈ నెల 15 నుంచి రుతుపవనాలు చురుకుదనాన్ని సంతరించుకోనున్నాయి. అదే సమయంలో ఇవి కోస్తాంధ్రలోని మిగిలిన ప్రాంతాలకు, ఒడిశా, వాయవ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. ఫలితంగా ఈ నెల 15 నుంచి రాష్ట్రంలో విస్తారంగా వానలు కురవనున్నాయి. కొన్నిచోట్ల భారీ వర్షాలకు ఆస్కారం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. కాగా గురు, శుక్రవారాల్లో విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, గుంటూరు, బాపట్ల, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. అదే సమయంలో గంటకు 30-40 కి.మీల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతోపాటు అక్కడక్కడ పిడుగులు పడతాయని వివరించింది. బుధవారం రాయలసీమలో కొన్నిచోట్ల భారీగా, పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిశాయి. సిద్దాపురం (కర్నూలు) 5.1, వ్యాసపురం (అనంతపురం) 5.0, కూచినపూడి (బాపట్ల) 3.8, మారాల (శ్రీసత్యసాయి) 2.0 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది.

విరగ్గాసిన చైనీస్ చెర్రీ

అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానంలోని యాంటీడెస్మా బునియస్ (చైనీస్ చెర్రీ) చెట్లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతి రెమ్మకు గుత్తులు గుత్తులుగా కాసిన చెర్రీ పండ్లు తెలుపు, ఎరుపు, నలుపు వర్ణాలతో కనుల విందు చేస్తున్నాయి. ఈ పండ్లను జామ్, జెల్లీ, వైన్ తయారీలో ఉపయోగిస్తారని వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు.

– రైల్వేకోడూరు



త్వరలో పోలవరం తొలి దశ నిధులు విడుదల!

- తొలి దశ పూర్తికి రూ.14,237.04 కోట్లు ఇవ్వాల్సి ఉన్న కేంద్రం
- ఈ నిధుల విడుదల కోసం మార్చి 6నే కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదన
- ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈ ప్రతిపాదనపై చర్చించని కేబినెట్
- వచ్చే కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు తొలి దశ పూర్తికి రూ.14,237.04 కోట్లు విడుదలపై వచ్చే మంత్రివర్గ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. వాస్తవానికి ఈ నిధులను విడుదల చేయాలని కోరుతూ ఈ ఏడాది కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ మార్చి 6వ తేదీనే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. అంతలోనే ఎన్నికల షెడ్యూలు వెలువడటం, నియమావళి అమల్లోకి రావడంతో కేంద్ర కేబినెట్ సమావేశం కాలేదు. ఎన్నికల్లో ఎన్డీఏ విజయం సాధించడంతో ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో ఈ నిధుల విడుదలపై వచ్చే సమావేశంలో కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవచ్చని అధికారవర్గాలు తెలిపాయి. పోలవరం భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం వ్యయమే రూ.33,168.23 కోట్లని, 2013-14 ధరల ప్రకారం ప్రాజెక్టును పూర్తి చేయడం అసాధ్యమని 2019 నుంచి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి చెబుతూ వచ్చింది. తాజా ధరల ప్రకారం నిధులిచ్చి ప్రాజెక్టును పూర్తి చేయడానికి సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. ప్రాజెక్టు తొలి దశ (41.15 మీటర్ల కాంటూర్ వరకూ) పనులు పూర్తి, నిర్వాసితుల పునరావాసం కల్పనకు రూ.10,911.15 కోట్లు, దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్ పునరుద్ధరణ, ఇతర పనులకు రూ.2 వేల కోట్లు.. వెరసి రూ.12,911.15 కోట్లు మంజూరు చేస్తూ గతేడాది జూన్ 5న నాటి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నోట్ జారీ చేశారు. లైడార్ సర్వేలో తొలి దశలో మరో 36 గ్రామాలు ముంపునకు గురవుతాయని, ఆ గ్రామాల్లోని నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. తొలి దశ పూర్తికి అవసరమైన నిధులను మదింపు చేసి ప్రతిపాదన పంపాలని జల్ శక్తి శాఖను కేంద్రం ఆదేశించింది.

పీపీఏ, రాష్ట్ర అధికారులతో సీడబ్ల్యూసీ కసరత్తు

పోలవరం తొలి దశ పూర్తికి అవసరమైన నిధులపై కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్ సింగ్ వోరా పలుమార్లు పీపీఏ, రాష్ట్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌తో సమావేశమయ్యారు. తొలి దశ పూర్తికి అవసరమైన నిధులపై 2023 అక్టోబర్ 10న కేంద్ర జల్ శక్తి శాఖకు నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ప్రకారం పోలవరం తొలి దశ పనుల అంచనా వ్యయం రూ.31,625.47 కోట్లు. దీన్ని పరిశీలించిన కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ కొన్ని అంశాలను లేవనెత్తారు. ఆయన చేసిన సూచనలను అనుసరించి తొలి దశ అంచనా వ్యయాన్ని రూ.30,490.29 కోట్లుగా తేల్చారు. ఆమేరకు నివేదిక ఇచ్చారు. దీనిని ఆమోదించేందుకు మార్చి 6న పీఐబీ సమావేశమైంది. అంచనా వ్యయ ప్రతిపాదనలపై సుదీర్ఘంగా చర్చించాక, ప్రాజెక్టు తొలి దశ అంచనా వ్యయం రూ.30,436.94 కోట్లుగా పీఐబీ తేల్చింది. అందులో ఇప్పటికే రూ.16,199.9 కోట్లు ఖర్చు చేశారు. మిగతా రూ.14,237.04 కోట్లను కేంద్రం విడుదల చేయాలని తేల్చింది. ఈ నిధుల విడుదలకు కేంద్ర కేబినెట్‌కు జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ప్రతిపాదన పంపారు.

వ్యవసాయ రంగానికి సవాల్‌గా వాతావరణ మార్పులు

- ఏడీబీ క్లైమేట్ చేంజ్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎ.శ్రీనివాసన్
- ఘనంగా ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ 60వ వ్యవస్థాపక వేడుకలు



గోల్డ్ మెడల్ అందుకుంటున్న ఆదర్శ రైతు జే. సంజీవరెడ్డి

సాక్షి, అమరావతి: వాతావరణంలో వేగంగా వస్తున్న మార్పులు వ్యవసాయ రంగానికి పెను సవాల్‌గా మారుతున్నాయని ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రిన్సిపల్ క్లైమేట్ చేంజ్ స్పెషలిస్ట్ డాక్టర్ ఏ.శ్రీనివాసన్ అన్నారు. ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడి 60 ఏళ్ల పూర్తయిన సందర్భంగా గుంటూరులోని లాంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసన్ మాట్లాడుతూ.. 'వాతావరణ మార్పులతో ఉత్పన్నమయ్యే ప్రతికూల పరిస్థితుల వల్ల భవిష్యత్ తరాల ఆహార భద్రతకు పెనుముప్పు ఏర్పడుతోంది. వాతావరణ మార్పులపై విస్తృత పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉంది. వాటి ఫలితాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలను, రైతులను అప్రమత్తం చేయాలి. 2030 నాటికి గ్రీన్ హౌస్ ఉద్గారాలను భారీగా తగ్గించాలి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార భద్రత కోసం 2050కల్లా తృణధాన్యాల ఉత్పత్తి 40 శాతం, పాలు, డెయిరీ ఉత్పత్తులను 65 శాతం వరకు పెంచాలి' అని సూచించారు. నాబార్డు డీజీఎం ఎంఎస్ఆర్ చంద్రమూర్తి మాట్లాడుతూ.. 'వ్యవసాయ రంగ అభివృద్ధికి అవసరమైన ఆర్థిక చేయూతను నాబార్డు అందిస్తోంది. విశ్వవిద్యాలయాలు ల్యాబ్స్, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అధిక దిగుబడులు, సుస్థిరాభివృద్ధికి అవసరమైన సాంకేతికతను సమకూర్చుకునేందుకు కూడా తోడ్పాటునందిస్తున్నాం' అని చెప్పారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ డైరెక్టర్ ఎంఏజీ వినోద్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిపుచ్చుకోవాలని సూచించారు. వీసీ శారద జయలక్ష్మి మాట్లాడుతూ వర్సిటీ విజయాలను వివరించారు. 2022-23లో జాతీయ స్థాయిలో 16 అవార్డులు సాధించినట్లు చెప్పారు. అనంతరం శాస్త్రవేత్తలు డాక్టర్ టీఎం.హేమలత, డాక్టర్ బీఎస్‌వీఎస్ఆర్ రవికుమార్, డాక్టర్ సీహెచ్ఎస్ రామలక్ష్మి, డాక్టర్ ఎడ్లపల్లి సతీష్, డాక్టర్ పీ శ్రీదేవి, డాక్టర్ పి.కిశోర్ వర్మతోపాటు ఆదర్శ రైతులు వరద దుర్గారావు, జంగా సంజీవ్‌రెడ్డి, కంతేటి పిచ్చయ్య, పాశాల కృష్ణలకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు.

మార్కెట్‌లోకి సెంచురీ ప్లైబోర్డ్స్ ఉత్పత్తులు



మార్కెట్‌లోకి పీవీసీ అండ్ డబ్ల్యూపీసీ ఉత్పత్తులను విడుదల చేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్: సెంచురీ ప్లై బోర్డ్స్ సంస్థ ఉత్పత్తులు మార్కెట్‌లోకి విడుదలయ్యాయి. ఇదివరకు హై ప్రెజర్ లామినేటెడ్ బోర్డ్స్ (హెచ్‌పీఎల్), మీడియం డెన్సిటీ ఫైబర్ బోర్డ్స్ (ఎండీఎఫ్) మార్కెట్‌లోకి వచ్చాయి. తాజాగా బుధవారం పీవీసీ అండ్ డబ్ల్యూపీసీ ఉత్పత్తులను సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేశవ్ బజాంక విడుదల చేశారు. వైఎస్సార్ జిల్లా బద్వేలు సమీపంలో రూ.1,000 కోట్ల పెట్టుబడితో నిర్మించిన సెంచురీ ప్లై బోర్డ్స్ పరిశ్రమ గతేడాది డిసెంబర్ 23న ప్రారంభమైన సంగతి తెలిసిందే. మరో రూ.700 కోట్లతో రెండో దశ పనులు పూర్తి చేసి ఎండీఎఫ్ ఉత్పత్తులను ఈ ఏడాది మార్చి 27న మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. సెంచురీ ప్లై బోర్డ్స్ రాష్ట్రంలోనే అత్యాధునిక పీవీసీ/డబ్ల్యూపీసీ ఉత్పత్తుల తయారీ పరిశ్రమగా గుర్తింపు పొందింది. ఉడ్ ప్యానెల్, డెకరేటివ్ ఇండస్ట్రీలో సెంచురీ దేశంలోనే అతి భారీ ఉత్పత్తి కొనసాగిస్తోంది. ఈ ఉత్పత్తుల్లో 50-60 శాతం వృద్ధి సాధించగలమని బజాంక వెల్లడించారు. సంస్థ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ రాజేంద్రషా మాట్లాడుతూ పీవీసీ మెటీరియల్ డోర్స్, విండోస్, ఫర్నిచర్, వాల్ ప్యానల్స్, సీలింగ్, ఫ్లోరింగ్ తదితర విభాగాలను అత్యధికంగా వినియోగిస్తున్నారని తెలిపారు.

సీఎం ప్రమాణస్వీకారానికి వచ్చి వెళ్తూ వ్యక్తి మృతి

ఉంగుటూరు: చంద్రబాబు ప్రమాణస్వీకార మహోత్సవానికి వచ్చి తిరుగు ప్రయాణంలో ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన ఘటన కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలో బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఏలూరు జిల్లా నూజివీడు మండలం తుక్కులూరు గ్రామానికి చెందిన నాయుడు దేవ అలియాస్ ఏసురత్నం (44) కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో సీఎం ప్రమాణస్వీకారానికి బైక్‌పై వచ్చాడు. తిరుగు ప్రయాణంలో పొట్టిపాడు టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో అకస్మాత్తుగా ఛాతి నొప్పి రావడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వడ దెబ్బకు మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు ఆత్కూరు ఎస్ఐ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోగనున్న బడిగంట

నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

- రాష్ట్రంలో మొత్తం 62 వేలకుపైగా పాఠశాలలు
- 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న ప్రవేశాలు
- ఈ నెల 20 తర్వాతే పుస్తకాలు, స్టూడెంట్ కిట్ల పంపిణీ!
- వారంలో విద్యా కేలండర్‌పై స్పష్టత

సాక్షి, అమరావతి: వేసవి సెలవుల అనంతరం రాష్ట్రంలోని పాఠశాలలు గురువారం తెరుచుకోనున్నాయి. దీంతో 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. రాష్ట్రంలో మొత్తం 62,023 పాఠశాలలు ఉండగా.. వీటిలో ప్రభుత్వ యాజమాన్యంలో 44,954 పాఠశాలలు, ప్రైవేటు యాజమాన్యంలో 15,784, ఎయిడెడ్‌లో మరో 1,225 పాఠశాలలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో మరో 60 పాఠశాలలు ఉన్నాయి. కేంద్ర పాఠశాలలు మినహా మిగిలినవి నేడు (గురువారం) ప్రారంభమవుతాయి. ఇక కేంద్రీయ విద్యాలయాలు ఈ నెల 21న, నవోదయ విద్యాలయాలు 30న ప్రారంభం కానున్నాయి. వాస్తవానికి బుధవారమే బడులు తెరుచుకోవాల్సి ఉండగా.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తుండటంతో పాఠశాలల పునఃప్రారంభం షెడ్యూల్‌ను అధికారులు గురువారానికి మార్చారు. బడులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పీఎం-పోషణ్ గోరుముద్ద (మధ్యాహ్న భోజనం)ను సైతం అదే రోజు విద్యార్థులకు అందించాలన్నారు. ప్రస్తుతానికి గతేడాది వరకు అనుసరించిన విధానంలోనే విద్యార్థులకు భోజనం అందించనున్నారు. కొత్త విద్యాశాఖ మంత్రి బాధ్యతలు తీసుకున్నాక తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులు యోచిస్తున్నారు. కాగా, ఇప్పటికే ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు పూర్తవగా, ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్నాయి.



20 తర్వాతే విద్యార్థులకు పుస్తకాలు, కిట్లు

రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గత విద్యా సంవత్సరం వరకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు విద్యా కానుక కిట్లను పాఠశాల తెరిచిన మొదటిరోజే అందజేశారు. ప్రతి విద్యార్థికి ఉచితంగా ద్విభాషా పాఠ్య పుస్తకాలు (ఇంగ్లిష్-తెలుగు) నోట్ బుక్స్, వర్క్ బుక్స్, కుట్టు కూలితో 3 జతల యూనిఫామ్ క్లాత్, జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగుతో పాటు ఆరో తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్-తెలుగు డిక్షనరీ, ఒకటో తరగతి పిల్లలకు పిక్టోరియల్ డిక్షనరీతో కూడిన కిట్‌ను ఇచ్చేవారు. 2024-25 విద్యా సంవత్సరానికి కూడా 36 లక్షల మంది విద్యార్థులకు గతేడాది మాదిరిగానే రూ.1,042.53 కోట్ల ఖర్చుతో స్టూడెంట్ కిట్లను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే, సరఫరాదార్ల నుంచి పూర్తిస్థాయిలో వస్తువులు స్టాక్ పాయింట్లకు చేరలేదు. దీంతో వీటిని ఈనెల 20 తర్వాతే విద్యార్థులకు అందించే అవకాశం ఉంది. కాగా, ఏటా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు నూతన విద్యా సంవత్సరం కేలండర్‌ను పాఠశాల విద్యాశాఖ ప్రకటించేది. అయితే, ఈసారి 1,000 ప్రభుత్వ సీబీఎస్ఈ స్కూళ్లు కూడా ఉండడంతో ఈ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా సీబీఎస్ఈ అధికారులతో కలిసి రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్టీ) అధికారులు నూతన కేలండర్‌ను రూపొందిస్తున్నారు. దీంతో మరో వారం రోజుల్లో విద్యా కేలండర్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

రైల్వే సిగ్నల్స్ ట్యాంపర్.. రెండు రైళ్లలో దోపిడీ

మహిళల మెడల్లోని బంగారు ఆభరణాలు.. బ్యాగులు అపహరణ

బిట్రగుంట: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని కావలి-శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు రెండు రైళ్లలో దోపిడీకి పాల్పడ్డారు. రైల్వే సిగ్నల్స్‌ను ట్యాంపర్ చేయడం ద్వారా రెడ్ సిగ్నల్ వేసి రైళ్లను నిలిపి దొంగలు దోపిడీకి పాల్పడ్డారు. రైల్వే జీఆర్పీ అధికారుల సమాచారం మేరకు.. కావలి-శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్ల మధ్య నెల్లూరు వైపు వెళ్లే మార్గంలో తెల్లవారుజామున 1.50 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు సిగ్నలింగ్ వ్యవస్థను ట్యాంపర్ చేసి రెడ్ సిగ్నల్ పడేలా చేశారు. ఆ సమయంలో నరసాపురం నుంచి ధర్మవరం వెళుతున్న ధర్మవరం ఎక్స్‌ప్రెస్ (నంబరు 17247)ను నిలిపివేసి ఎస్-11, ఎస్-13 బోగీల్లోకి ప్రవేశించారు. ఇద్దరు మహిళా ప్రయాణికుల మెడల్లోని బంగారు గొలుసులు, బ్యాగులు చోరీ చేసి పారిపోయారు. ఈ ఘటన జరిగిన 20 నిమిషాల తర్వాత అదే మార్గంలో వచ్చిన షిర్డిసాయినగర్ నుంచి తిరుపతికి వెళ్తున్న తిరుపతి స్పెషల్ (07638) ట్రైన్‌ను ఇదే తరహాలో నిలిపి ఎస్-3, ఎస్-5 కోచ్‌ల్లోకి ప్రవేశించారు. ఇద్దరు మహిళా ప్రయాణికుల మెడల్లోని 38 గ్రాముల బంగారు గొలుసులు, బ్యాగులు అపహరించారు. ఈ క్రమంలో దోపిడీని అడ్డుకునేందుకు ఓ ప్రయాణికుడు ప్రయత్నించగా రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. అనంతరం పక్కనే ఉన్న కొండబిట్రగుంట అటవీ ప్రాంతంలోకి పారిపోయారు. రైల్వే పోలీసులు దుండగుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

ధాన్యం సేకరణ పూర్తి

- రబీలో 12.63 లక్షల టన్నుల ధాన్యం సేకరణ
- లక్ష్యం25 లక్షల టన్నులుగా నిర్ణయం
- మార్కెట్‌లో ధర ఉండటంతో తగ్గిన సేకరణ
- 1.32 లక్షల మంది రైతుల నుంచి రూ.2,761.90 కోట్లు విలువైన ధాన్యం సేకరణ
- 49,894 మంది రైతులకు 1,104.46 కోట్ల చెల్లింపు
- 82 వేల మంది రైతులకు 1,657.44 కోట్ల బకాయి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం సేకరణ దాదాపు ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ధర అందించడంతో పాటు దేశంలోనే తొలిసారిగా గన్నీ, హమాలీ, రవాణా (జీఎల్టీ) చార్జీల కింద టన్నుకు రూ.2,523 అదనంగా చెల్లిస్తూ రైతులకు ఆర్థికంగా అండగా నిలిచింది. ఫలితంగా రైతులు ఆర్బీకేల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వైపే మొగ్గు చూపారు. దీంతో దళారులు, కొంతమంది మిల్లర్ల దోపిడీకి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడింది. ప్రైవేటు వ్యాపారులు తమకు గతంలో మాదిరిగా ధాన్యం అమ్మకానికి రాకపోవడంతో చేసేదేమీ లేక రైతులకు పూర్తి మద్దతు ధర ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది. 2023-24 రబీలో 25 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని పౌర సరఫరాల సంస్థ ప్రాథమికంగా అంచనా వేసింది. అయితే.. మార్కెట్‌లో డిమాండ్ బాగుండటంతో ఎక్కువ భాగం వ్యాపారులే రైతులకు మంచి ధర చెల్లించి కొనుగోలు చేయడంతో ఆర్బీకేల్లో అనుకున్న స్థాయి కంటే ధాన్యం సేకరణ తక్కువగా ఉంది.

రబీ ధాన్యం సేకరణ ఇలా..

జిల్లా	సేకరించిన ధాన్యం (టన్నుల్లో)	రైతుల సంఖ్య	చెల్లించిన మొత్తం (రూ.కోట్లలో)	చెల్లించాల్సింది (రూ.కోట్లలో)
పశ్చిమ గోదావరి	6,40,378.36	69,236	461.72	937.57
తూర్పు గోదావరి	2,28,497.72	22,704	296.31	202.51
ఏలూరు	2,01,281.72	17,339	241.59	199.04
అంబేడ్కర్ కోనసీమ	1,62,934.60	19,641	84.47	271.22
కాకినాడ	25,975.36	3,061	20.37	36.36
బాపట్ల	4,879.88	738	0	10.74
మొత్తం	12,63,947.04	1,32,719	1,104.46	1,657.44

డబ్బుల కోసం ఎదురుచూపు: రబీ సీజన్‌లో ఇప్పటివరకు 1.32 లక్షల మంది రైతుల నుంచి రూ.2,767.90 కోట్ల విలువైన 12.63 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. రైతులు ధాన్యం విక్రయించిన తర్వాత డబ్బుల కోసం అవస్థలు పడకూడదనే ఉద్దేశంతో 21 రోజుల్లో తప్పనిసరిగా చెల్లింపుల చేసేలా వ్యవస్థను తీసుకొచ్చింది. చాలా సందర్భాల్లో ఒక్క రెండు రోజుల్లోనే రైతులకు డబ్బులు జమ య్యాయి కూడా. ఈ రబీలో ఎన్నికల హడావుడిలోనూ రైతులకు సకాలంలో చెల్లింపులు చేసింది. మే 12న 45,468 మంది రైతుల ఖాతాల్లో రూ.1,008.93 కోట్లు జమ చేసింది. ఆ తర్వాత చెల్లింపులు నెమ్మదించాయి. ఇప్పటివరకు 49,894 మంది రైతులకు రూ.1,104.46 కోట్లు మాత్రమే అందాయి. ఇంకా 82,825 మంది రైతులకు రూ.1,657.44 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇందులో ధాన్యం సేకరణ తర్వాత నిర్ణీత గడువు ముగిసిన రైతులు చాలామంది ఉండటం.. ఖరీఫ్ సాగు కోసం సమాయత్తం కావడానికి చేతిలో డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు.

పెనమలూరులో సచివాలయాల భవనాలపై టీడీపీ దాడి

శిలాఫలకాలు ధ్వంసం



ధ్వంసమైన సచివాలయం శిలాఫలకం

పెనమలూరు: కృష్ణాజిల్లా పెనమలూరులో బుధవారం రాత్రి టీడీపీ నేతలు మూడు సచివాలయ భవనాలపై దాడులు చేశారు. సచివాలయాలు 1, 2, 3 భవనాలపై దాడిచేసి శిలాఫలకాలు ధ్వంసం చేశారు. గ్రామంలో గతంలో ఎన్ని వివాదాలున్నా ఇలా దాడులు చేసిన దాఖలాలు లేవు. ఈ ఘటనపై సర్పంచి లింగాల భాస్కరరావు మాట్లాడుతూ టీడీపీ నేతలు ఈ తరహా దాడులు చేయటం సబబుకాదన్నారు. ఈ దాడుల సంస్కృతి వల్ల గ్రామంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుందని చెప్పారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన గ్రామస్తులు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)

క్లుప్తంగా

హోంగార్డు కమాండెంట్‌కు అవార్డు బహూకరణ



అవార్డును అందుకుంటున్న జావిద్ పాషా

రాయచూరు రూరల్: రాయచూరు హోంగార్డు కమాండెంట్‌కు ముఖ్యమంత్రి బంగారు అవార్డును జిల్లా సీనియర్ ప్లాటూన్ కమాండెంట్ జావిద్ పాషా అందుకున్నారు. మంగళవారం సాయంత్రం బెంగళూరులో పోలీస్ క్రీడా మైదానంలో రాష్ట్ర హోం శాఖా మంత్రి పరమేశ్వర్ చేతుల మీదుగా 2023వ సంవత్సరానికి ముఖ్యమంత్రి సేవా పతకం బంగారు అవార్డులను అందుకున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

రాయచూరు రూరల్: ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి జిల్లాలో జరిగింది. సిరవార తాలూకా హిరేబాదరదిన్ని వద్ద పోత్నాళ బుడ్డాసాబ్(35) అనే వ్యక్తి పోత్నాళ నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను రవాణా చేస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్ మరణించాడు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కవితాళ పోలీసులు తెలిపారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై జాగృతి జాతా



జాతాను ప్రారంభిస్తున్న దురుగేష్

రాయచూరు రూరల్: జిల్లాలో బాల కార్మికత నియంత్రణకు ఆ శాఖాధికారులు నడుం బిగించాలని అదనపు జిల్లాధికారి దురుగేష్ సూచించారు. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద బాల కార్మికత నియంత్రణపై చేపట్టిన జాగృతి జాతాను ప్రారంభించి ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో బాలకార్మికత అధికంగా ఉందన్నారు. దాని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ శ్రమించాలన్నారు. జాతాలో బాలల సంరక్షణ మండలి అధికారి సుదర్శన్, జిల్లాధ్యక్షురాలు మంగళ, ఏఎస్పీ శివకుమార్, డీడీపీఐ బడిగేర్, బాల కార్మిక అధికారి హారతి, కార్మిక శాఖాధికారి మంజునాథ్‌రెడ్డిలున్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యకు డిమాండ్



మాట్లాడుతున్న రాము

రాయచూరు రూరల్: రిమ్స్ ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన 300 పడకల ఆస్పత్రి గదులు కారుతున్నాయని స్వాభిమాని కర్ణాటక రక్షణ వేదిక అధ్యక్షుడు రాము ఆరోపించారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.32 కోట్లతో నిర్మించిన ఆస్పత్రిని 2023 జనవరిలో ప్రారంభించారన్నారు. కాంట్రాక్ట్ పొందిన శాసన సభ్యుడు శివరాజ్ పాటిల్ సోదరుడు పంపనగౌడ నాసిరకంగా పనులు చేపట్టినందున భారీ వర్షానికి గదులు కారుతున్నాయన్నారు. సక్రమంగా క్యూరింగ్ చేయకపోవడంతో గోడలు బీటలు వారాయన్నారు. కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల గైర్హాజరుపై గ్రామస్తుల ధర్నా



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు

రాయచూరు రూరల్: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు కావస్తున్నా ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయులు సక్రమంగా రాకపోవడంతో గ్రామస్తులు ఆందోళన చేపట్టిన ఘటన బుధవారం జిల్లాలో చోటు చేసుకుంది. లింగసూగూరు తాలూకా నాగలాపురలోని ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయులు సక్రమంగా రాకపోవడాన్ని నిరసిస్తూ తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులపై చర్యలు చేపట్టాలని ఒత్తిడి చేశారు.

కొనుగోలు కేంద్రాలు పెంచాలని ఒత్తిడి

హుబ్లీ: తాము పండించిన ఆహార ధాన్యాలను కనీస మద్దతు ధరతో కొనుగోలు చేసే కేంద్రాలను పెంచాలని రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య, చెరుకు రైతుల సంఘం రాష్ట్రాధ్యక్షుడు కురుబూరు శాంతకుమార్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం నగరంలో విలేకరులతో మాట్లాడారు. రైతులు పండించిన ఆహార ధాన్యాల ఎంఎస్‌పీ కొనుగోలు ధరలో రాష్ట్రానికి ఇచ్చే ప్రమాణాన్ని పెంచాలని కేంద్ర ఆహార పౌర సరఫరాల శాఖా మంత్రి ప్రహ్లాద్‌జోషిని ఒత్తిడి చేశారు. కేంద్రం కొనుగోలు నిధులు ఇవ్వడంలో పక్షపాతం చూపుతోందన్నారు. దీంతో రాష్ట్ర రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు.

కుండపోత వర్షం.. రోడ్లు జలమయం

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- బురదమయంగా కాలనీలు
- విద్యుత్ కోతతో జనం అవస్థ

సాక్షి,బళ్లారి: నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. ప్రధాన రోడ్లలోని తారు రోడ్లు, సిమెంటు రోడ్లు మినహా మురికివాడల కాలనీలతో పాటు పలు మట్టి రోడ్లు బురదమయమై రోడ్లలో ఎక్కడబడితే అక్కడ నీరు నిలిచిపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. డ్రైనేజీల్లో చెత్తాచెదారం ఎక్కడబడితే అక్కడ పేరుకుపోయి ఉండటంతో పలు డ్రైనేజీల్లో వాననీరు పొంగిపొర్లడంతో నగర వాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. జోరు వర్షం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో జనం ఇబ్బంది పడ్డారు. నగరంలోని తహసీల్దార్, వ్యవసాయ అధికారి కార్యాలయాలు ఉన్న ఆవరణ వర్షం నీటితో నిండిపోయింది. నిత్యం కూరగాయల అమ్మకాలు సాగించే ఏపీఎంసీ, చిన్న మార్కెట్ వద్ద వర్షం నీటితో రోడ్లు నిండిపోవడంతో బురదమయంగా మారిపోయాయి. పెద్ద మార్కెట్ పక్కన కూడా పెద్ద ఎత్తున నీరు ప్రవహించింది.

వర్షంలో తడుస్తూ నానాపాట్లు

కణేకల్లు బస్టాండు వద్ద జనం నిలబడేందుకు కూడా చోటు లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడు ప్రయాణికులు వర్షంలో తడుస్తూ ఇబ్బందులు పడ్డారు. రెండు రోజుల క్రితం కూడా ఇదే విధంగా భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. మళ్లీ అంతకన్నా పెద్ద వర్షమే కురవడంతో వాతావరణం చల్లబడి ఎటు చూసినా రోడ్లలో నీరు ప్రవహించడంతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రోడ్లలో తడుస్తూ గమ్యానికి చేరుకోవడానికి తీవ్ర అవస్థలు పడ్డారు. నగరంలో లోతట్టులో నిర్మించుకున్న ఇళ్లలోకి నీరు ప్రవహించడంతో వాటిని బయటకు తీసేందుకు ఆయా గృహ యజమానులు పడుతున్న అవస్థలు వర్ణించలేని విధంగా ఉన్నాయి. డ్రైనేజీల్లో నీటికి వర్షం నీరు తోడు కావడంతో దుర్వాసన వెదజల్లడంతో డ్రైనేజీల పక్కనే నివసిస్తున్న కాలనీల వాసులు నరకయాతన అనుభవించారు.



బళ్లారిలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిలిచిన వాననీరు

జలమయంగా బస్టాండ్ రోడ్డు

హొసపేటె: నగరంలో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచి జలమయంగా మారాయి. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని రోడ్లు, కాల్వలు పొంగి పొర్లుతుండటంతో పాటు ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో డ్రైనేజీ నిండి బయటకు ప్రవహించడంతో ప్రయాణికులకు, వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. సుమారు రెండు అడుగులకు పైగా నీరు రోడ్డుపై ప్రవహించడంతో ఇరువైపులా వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి.



హొసపేటెలోని బస్టాండ్ రోడ్డులో వాన నీటితో ప్రయాణికుల పాట్లు

భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు

నగరంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతమైన రాణిపేటెలో పలు వీధుల్లో వర్షం నీరు నిలబడి జలమయంగా మారాయి. వర్షపు నీరు కాలనీలోని ఇళ్లలోకి చొరబడటంతో కాలనీ వాసులు ఇబ్బందులకు గురయ్యారు.



ఇళ్ల ముందు మోకాలి లోతున నిలిచిన వాన నీరు

తుంగా డ్యాం నుంచి త్వరలో నీరు విడుదల

హొసపేటె: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని పలు జిల్లాల ప్రజలకు, రైతులకు తాగు, సాగు నీరందించే ప్రధాన జలాశయం తుంగభద్ర డ్యాంకు త్వరలో శివమొగ్గ జిల్లాలోని తుంగా డ్యాం నుంచి భారీగా వరద నీరు వదలనున్నారు. ప్రస్తుతం తుంగా డ్యాం పూర్తిగా నిండడానికి ఒక టీఎంసీ మాత్రమే మిగిలి ఉన్నందున ఏ సమయంలోనైనా తుంగా డ్యాం నుంచి దిగువకు భారీగా నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల రాక కారణంగా డ్యాంకు ఎగువన కురుస్తున్న వర్షాలకు డ్యాంలోకి ఇన్‌ఫ్లో ప్రారంభం అయింది. డ్యాం ఎగువన శివమొగ్గ, భద్రావతి, తీర్థహళ్లి, ఆగుంబె, మోరాళు, శృంగేరి తదితర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో డ్యాంకు జలకళ రానుంది. ప్రస్తుతం తుంగభద్ర డ్యాంలో నీటి మట్టం 1581.59 అడుగులు, నీటినిల్వ 5.289 టీఎంసీలు, ఇన్‌ఫ్లో 4,266 క్యూసెక్కులు ఉందని మండలి అధికారులు తెలిపారు.

జిల్లాలో హమారె బారాహ్ చిత్ర ప్రదర్శనపై నిషేధం

బళ్లారిఅర్బన్: ముస్లింల మనోభావాలకు భంగం కల్గించేలా ఉన్న హమారె బారాహ్ చిత్ర ప్రదర్శనను జిల్లాలో నిషేధిస్తున్నట్లు జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ చట్టాల మేరకు ఈ సినిమా ట్రైలర్, పూర్తి నిడివిగల సినిమాను రెండు వారాలకు పైగా లేదా తరువాత ఆదేశం వెల్లడయ్యేదాకా జిల్లాలో ఎలాంటి ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా, సినిమా థియేటర్లు, ప్రైవేట్ టీవీ ఛానళ్ల తదితర మాధ్యమాల ద్వారా ప్రసారాన్ని నిషేధిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

నేత్రపర్వంగా ఎర్రితాత మహారథోత్సవం

- ఎర్రితాత సమాధి దర్శనం కోసం భక్తుల బారులు
- శివనామస్మరణతో మార్మోగిపోయిన ఎర్రితాత మఠం



చేళ్లగుర్కిలో ఎర్రితాత మడితేరు లాగుతున్న దృశ్యం, (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకరణలో ఎర్రితాత

సాక్షి,బళ్లారి: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో వెలిసిన చేళ్లగుర్కి ఎర్రితాత మహారథోత్సవం భక్తిశ్రద్ధలతో, కన్నులపండువగా జరిగింది. బుధవారం సాయంత్రం తాలూకాలోని చేళ్లగుర్కిలో ఎర్రితాత మఠంలో మహారథోత్సవాన్ని వర్షాన్ని సైతం లెక్కచేయక భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జాతర సందర్భంగా వారం రోజుల నుంచి శివనామంతో ఎర్రితాత మఠంలో మార్మోగిపోతోంది. చేళ్లగుర్కి ఎర్రితాత మహారథోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అద్భుతంగా అలంకరించిన చేళ్లగుర్కి ఎర్రితాత మహారథోత్సవాన్ని ఉరవకొండ గవిమఠం కరిబసవ రాజేంద్ర స్వామి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, లాగిన తర్వాత భక్తులు కూడా తేరుకు కట్టిన తాడును లాగుతూ, ఓంనమఃశివాయ, జై ఎర్రితాత, జైజై ఎర్రితాత అనే నామ జపం చేస్తూ తేరును ముందుకు లాగారు.

వర్షంతో భక్తులకు ఇబ్బందులు

మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురవడంతో చేళ్లగుర్కిలో జాతర మహోత్సవాలకు కొంత ఆటంకం కలిగినప్పటికీ స్వామిపై ఉన్న భక్తితో వర్షంలో తడుస్తూ తేరును ముందుకు లాగుతూ చేళ్లగుర్కి ఎర్రితాత మహారథోత్సవాన్ని విజయంగా ఆచరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో చేళ్లగుర్కి గ్రామం పులకించిపోయింది. మఠంలో ఎర్రితాత మహాసమాధిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. జాతర సందర్భంగా మఠంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, భజనలు చేస్తూ ఆలయంలో భక్తిభావంతో భక్తులు పరవశించిపోతున్నారు. రథోత్సవాలు లాగడం చూస్తే మంచిదవుతుందని భక్తుల్లో నమ్మకం ఉంది. అందులో సాక్షాత్తు శివ స్వరూపుడు, దైవాంశ సంభూతుడుగా పేరు ప్రఖ్యాతులు పొంది, ఎర్రితాత మహిమలను కళ్లారా చూసిన భక్తులు, స్వామీజీ జాతర, మహారథోత్సవంలో పాల్గొని తరించాలనే ఉద్దేశ్యంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

భారీగా తరలివచ్చిన భక్తజనం

పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. మహారథోత్సవంలో పాల్గొన్న భక్తులు తేరుకు అరటి పండ్లు విసురుతూ తమ భక్తిని చాటుకున్నారు. ఆలయం నుంచి కొద్దిదూరం మేరకు తాడుతోనే తేరును ముందుకు లాగారు. వర్షం వల్ల కొంత ఇబ్బందులు తలెత్తినప్పటికీ, అపారమైన భక్తిశ్రద్ధలతో మహారథోత్సవంలో భక్తులు పాల్గొని చేళ్లగుర్కి ఎర్రితాత జాతరలో భాగంగా మహారథోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో విజయవంతంగా ఆచరించారు. జాతర సందర్భంగా వ్యాపారాలతో రోడ్లు భర్తీ అయ్యాయి. అయితే వర్షం కురవడంతో రోడ్లలో వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొత్తం మీద చేళ్లగుర్కి ఎర్రితాత మహారథోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో వర్షంలో తడుస్తూనే పాల్గొనడం విశేషం.

బాలకార్మికత నిర్మూలనపై చైతన్యం అవసరం

బళ్లారిఅర్బన్: బాలకార్మిక పద్ధతి నిర్మూలనపై అందరిలో చైతన్యం కల్గించాలని ప్రధాన జిల్లా సెషన్స్ న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవా ప్రాధికార అధ్యక్షురాలు ఎస్‌హెచ్.పుష్పాంజలిదేవి పిలుపు నిచ్చారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం హోంగార్డ్స్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విశ్వ బాలకార్మిక పద్ధతి వ్యతిరేక జనజాగృతి కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను విద్యావంతులను చేయాలన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలను పనులకు పంపకుండా బడికి పంపించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. ఒక వేళ పిల్లలను పనుల్లో పెట్టుకుంటే బాధ్యులైన యజమానులతో పాటు తల్లిదండ్రులు కూడా చట్టపరంగా శిక్షార్హులవుతారని ఆమె హెచ్చరించారు. న్యాయమూర్తి రాజేష్ హొసమనె, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, అధికారిణి విజయలక్ష్మీ, జెడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప, ఏడీసీ మహమ్మద్ జుబేర్, మౌనేష్, కమల్‌షా అల్తాఫ్ అహ్మద్, విజయ్‌కుమార్, జలాలప్ప తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జాగృతి గీతాలను ఆలపించి జాతాను నిర్వహించి ప్రతిజ్ఞావిధిని బోధించారు.



జెండా ఊపి జాతాను ప్రారంభిస్తున్న పుష్పాంజలిదేవి

ఎత్తినబూదిహాళ్‌లో..

అలాగే తాలూకాలోని ఎత్తినబూదిహాళ్ హైస్కూల్‌లో మాతృ మహిళా మండలి ఆధ్వర్యంలో అధ్యక్షురాలు కే.పుష్పా చంద్రశేఖర్ నేతృత్వంలో బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలందరూ చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఎవరూ కూడా బాల్యంలో బాలకార్మికులుగా మారరాదన్నారు. వీరిని ఆ విధానంలోకి జారిపోకుండా ప్రతి ఒక్కరూ గురుతర బాధ్యతగా బాలకార్మిక పద్ధతిని నిర్మూలించాలని ఆమె కోరారు. పాఠశాల హెచ్‌ఎం మాధవి, నాగరాజ్, పంపాపతి, మహిళా మండలి సభ్యులు కళావతి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి రూ.3 లక్షల వంచన

హుబ్లీ: నగరంలో ఇద్దరు వ్యక్తులకు ఆన్‌లైన్ కేటుగాళ్లు రూ.3 లక్షల మేర వంచించిన ఘటనలు బుధవారం వెలుగు చూశాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. కొత్త ఆస్పత్రిని ప్రారంభించామని, అందులో డబ్బులు పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయంటూ గుర్తు తెలియని వ్యక్తులు హోటల్ సిబ్బంది సునీల్‌కుమార్‌ను నమ్మించి రూ.1,71,335లను వంచించిన ఘటన కొప్పళ జిల్లాలో చోటు చేసుకుంది. కిరణ్ బెటిగేరి, సుచిత్ర అనే కేటుగాళ్లు సునీల్‌ను మొదట వాట్సాప్‌లో పరిచయం చేసుకున్నారు. ఈ క్రమంలో ఫోన్ ద్వారా సంప్రదించి ఎక్కువ లాభాలు ఇస్తామని నమ్మించి విడతల వారీగా పైమేరకు నగదును బదలాయించుకొని వచించినట్లు బాధితుడు నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే స్టాక్ మార్కెట్‌లో డబ్బులు పెట్టుబడి ఎలా పెట్టాలో వివరిస్తామంటూ పరిచయం అయిన గుర్తు తెలియని మహిళ మారుతీ అనే వ్యక్తిని నమ్మించి రూ.1.20 లక్షలను వంచించిన ఘటనపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు దాఖలు చేసుకున్నారు. ఊర్వశి పాండే అనే ఆమె మారుతీకి పరిచయం అయింది. ఆ తర్వాత ఆనంద్ అనే వారిని పరిచయం చేసి ఆయన ద్వారా ఒక లింక్ పంపించి అందులో తన బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకుని ఆన్‌లైన్ ద్వారా నగదును బదలాయించుకున్నట్లు మారుతీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నీట్ పరీక్షల్లో అవినీతిపై ఆందోళన

బళ్లారిఅర్బన్: రాష్ట్ర స్థాయిలో సంయుక్త ప్రవేశ పరీక్షల్లో అవినీతి, నీట్ పరీక్షల్లో అవకతవకలను ఖండిస్తూ ఏఐడీఎస్ఓ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లాధికారి కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు. సంస్థ జిల్లా కార్యదర్శి కంబళి మంజునాథ్ మాట్లాడుతూ నీట్ ఫలితాల పారదర్శకతపై దేశ వ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనలో ఉన్నారన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం జిల్లాధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. సంస్థ ఉపాధ్యక్షురాలు ఎం.శాంతి, ఉమా, ప్రమోద్, కార్యాలయ కార్యదర్శి నిహారికతో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్ష రద్దు చేయండి

హొసపేటె: నీట్ పరీక్షలో జరిగిన అవినీతిపై న్యాయ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, నీట్‌కు బదులుగా గతంలో మాదిరిగా సీఈటీ నిర్వహించాలని ఏఐడీఎస్ఓ రాష్ట్ర కమిటీ సభ్యుడు రవికిరణ్ తెలిపారు. ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో బుధవారం విజయనగర జిల్లా విద్యార్థులు నగరంలోని తాలూకా కార్యాలయం ఎదుట నీట్ పరీక్షలో అవినీతిని నిరసిస్తూ తహసీల్దార్ ద్వారా ప్రధానమంత్రికి వినతిపత్రం సమర్పించారు. నిరసనను ఉద్దేశించి ఏఐడీఎస్ఓ రాష్ట్ర కమిటీ సభ్యుడు జేసీ రవికిరణ్ మాట్లాడుతూ కేంద్రంలో ఎన్ఎంసీ అమలుపై ఏఐడీఎస్ఓ తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసిందన్నారు. వైద్యులు, ప్రొఫెసర్లు, నిపుణులతో కూడిన హెచ్‌సీఎంఐని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఆరోగ్య వ్యవస్థతో సంబంధం లేని కార్పొరేట్ సంస్థల యజమానులతో కూడిన ఎన్ఎంసీ అనే కమిటీని అమలు చేసిందని, ఈ ఎన్ఎంసీ రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షల్లో అవినీతి సాకుతో అఖిల భారత ప్రవేశ పరీక్షను నిర్వహించిందన్నారు. అవినీతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు.



హొసపేటెలో ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులు

సమాజ సేవకులకు అవార్డుల ప్రదానం



అవార్డులు అందుకున్న సమాజ సేవకులు

రాయచూరు రూరల్: జిల్లాలోని సిరవారలో మంగళవారం రాత్రి ఉమాపతి చుక్కి 48వ వర్ధంతి సందర్భంగా చుక్కి ప్రతిష్టాన అవార్డులను అందజేశారు. రచయితలు సిద్దలింగప్ప, సుమలత, సమాజ సేవలో అయ్యనగౌడ, పరిసరాల సంరక్షణలో ఈరణ్ణలకు అవార్డులు అందించారు. సమావేశంలో నవల్‌కల్ అభినవ సోమనాథ శివాచార్య స్వామీజీ, బెట్టదప్పయ్య, చుక్కి ప్రతిష్టాన అధ్యక్షుడు శివానంద, సభ్యులు శివకుమార్, మల్లికార్జున, పరమేశ్వర సాలిమఠ ఉన్నారు.

ఆభరణాల దొంగ అరెస్ట్



ఇంటి దొంగ అరెస్ట్ చూపుతున్న పోలీస్ అధికారులు

బళ్లారిఅర్బన్: నగరంలోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంటిలో చోరీ చేసిన దొంగను బంధించి ఆమె నుంచి రూ.18,24,480 విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 9న రాత్రి సంగనకల్లు రోడ్డులో ఇంటికి వేసిన తాళాన్ని పగలగొట్టి 228 గ్రాముల బంగారు ఆభరణాలు, 42.81 గ్రాముల వెండి ఆభరణాలను చోరీ చేసుకొని పరారయ్యారు. ఈ కేసును సీఐ సిద్ధరామేశ్వర గడాద్ సారథ్యంలోని బృందం దర్యాప్తు చేపట్టి శ్రీరాంపుర కాలనీ నివాసి పెద్దక్కను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదైన 24 గంటల్లోనే మిస్టరీని విజయవంతంగా ఛేదించిన సీఐ సిద్ధరామేశ్వర గడాద్, ఎస్ఐ నారాయణస్వామి, సిబ్బందిని ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు అభినందించారు.

రోగులతో సర్కారీ ఆస్పత్రి కిటకిట



దేవదుర్గలోని ప్రభుత్వ ఆస్పత్రి ఇదే

- మూడు రోజుల క్రితం వైద్యుడిపై దాడి
- తాలూకాలోని ప్రైవేట్ ఆస్పత్రులు బంద్

రాయచూరు రూరల్: జిల్లాలోని దేవదుర్గలో మూడు రోజుల క్రితం ప్రైవేట్ ఆస్పత్రిలో రోగి తరపున బంధువులు వైద్యుడిపై దాడి చేసిన ఘటన జరిగింది. దాడిని నిరసిస్తూ తాలూకా వ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రులు, మందుల దుకాణదారులు దుకాణాలు బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దేవదుర్గ సర్కారీ ఆస్పత్రి రోగులతో కిటకిటలాడింది. ప్రతి రోజు 300 మంది రోగులు వచ్చేవారు కాగా నేడు 750 మందికి పైగా రోగులు వైద్య సేవలు పొందారు. వారం రోజుల క్రితం ప్రైవేట్ ఆస్పత్రిలో గర్భిణి మహిళకు సరైన చికిత్స అందించక పోవడంతో ఆమె మరణించడంతో రోగుల బంధువులు ఆక్రోశంతో ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడు, ఆస్పత్రిపై దాడి జరపడంతో సుమారు 100 ప్రైవేట్ క్లినిక్‌లు, 150 మందుల దుకాణాలను బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ప్రజలు సర్కారీ ఆస్పత్రిని ఆశ్రయించారు.



ఆస్పత్రిలో కిటకిటలాడుతున్న రోగులు

కమరిపేట పోలీస్ స్టేషన్ త్వరలో కూల్చివేత

- మురుగు కాలువపై గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న పోలీస్ స్టేషన్
- పేరుకున్న పూడిక, వానలు వస్తే ఆ ప్రాంతాలన్నీ మునగడమే కారణం

హుబ్లీ: సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించే పోలీస్ స్టేషనే పలు ప్రాంతం ప్రజలకు తలనొప్పిగా మారింది. మురుగు కాలువపై నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను కూల్చి ప్రజల సమస్యను నివారించేందుకు హుబ్లీ ధార్వాడ నగర పాలికె చురుగ్గా ముందుకు కదులుతోంది. నగరంలోని కమరిపేట పోలీస్ స్టేషన్‌ను ఈ కారణంతో త్వరలోనే కూల్చి వేయనున్నారు. సదరు స్టేషన్ కింద ఉన్న మురికి కాలువలో పేరుకు పోయిన పూడికను తీయడానికి త్వరలోనే ఆ కాలువపై నిర్మించిన కమరిపేట పోలీస్ స్టేషన్‌ను కూల్చివేసి ఆ స్టేషన్‌ను వేరే చోటుకు తరలించేందుకు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు సర్వే ప్రక్రియ కూడా పూర్తయింది. స్టేషన్ రోడ్డులో హర్ష కాంప్లెక్స్ నుంచి కమరిపేట వరకు సుమారు 2 కిమీ పరిధిలోని ఈ మురుగు కాలువలో పూడికను గత 30–40 ఏళ్ల నుంచి తీయని నేపథ్యంలో పూర్తిగా నిండి పోయింది. కాలువ ఉందా లేదా అన్న పరిస్థితి నెలకొంది. ఈ కాలువ హుబ్లీ ప్రముఖ మార్కెట్ ప్రాంతాల గుండా వెళుతుంది. దీనిపైనే 600 మీటర్లకు పైగా రోడ్డుని నిర్మించారు. మరి కొన్ని చోట్ల 20కు పైగా వాణిజ్య కట్టడాలు, కమరిపేట పోలీస్ స్టేషన్‌ను నిర్మించారు. ఈ విషయమై పాలికె కమిషనర్ ఈశ్వర్ ఉళ్లాగడ్డి విలేకరులతో మాట్లాడుతూ సదరు కాలువలో పూడిక తీయడానికి ఇప్పటికే డ్రోన్ ద్వారా సర్వే ప్రక్రియ నిర్వహించామన్నారు. ప్రణాళికా నివేదిక సిద్ధం చేశాం. మురుగు కాలువపై ఉన్న పోలీస్ స్టేషన్ వేరే చోటుకు తరలించేందుకు చర్చిస్తున్నాం. త్వరలోనే పోలీస్ కమిషనర్‌కు లేఖ రాస్తామన్నారు. కాగా ఈ పోలీస్ స్టేషన్‌ను ప్రత్యామ్నాయంగా రెండు చోట్ల కట్టడాలను గుర్తించారు. స్టేషన్ సమీపంలో ఉన్న జిగళూరు కళ్యాణ మంటపం, జయభారత సర్కిల్‌లోని పాలికె సముదాయ భవనం ఈ రెండింటిలో ఒకదాంట్లోకి స్టేషన్‌ను తరలించేందుకు జిల్లాధికారితో పాటు పోలీస్ కమిషనర్‌కు లేఖ రాస్తామని పాలికె కమిషనర్ ఈశ్వర్ ఉళ్లాగడ్డి విలేకరులకు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



మరణించిన ఎద్దు కళేబరం

హొసపేటె: వర్షం కారణంగా విద్యుత్ షాక్‌కు గురై ఓ ఎద్దు మృతి చెందిన ఘటన తాలూకాలోని కమలాపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతారామన తండాలో బుధవారం సాయంత్రం జరిగింది. తండా నివాసి రైతు హనుమానాయక్‌కు చెందిన ఎద్దు రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వెళుతుండగా షాక్‌కు గురై మృతి చెందింది. కాగా ఎద్దు విలువ సుమారు రూ.30 వేల వరకు ఉంటుందని అంచనా.

రూ.1.5 కోట్లతో వాల్మీకి సర్కిల్‌కు సొబగులు



రాయల్ సర్కిల్‌లో పనులను పరిశీలిస్తున్న నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారిఅర్బన్: నగరంలోని వాల్మీకి సర్కిల్‌ను రూ.1.5 కోట్ల వ్యయంతో సుందరంగా తీర్చిదిద్దుతామని నగర ఎమ్మెల్యే భరత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్ల క్రితం ఈ సర్కిల్‌ను అభివృద్ధి చేశారని, ప్రస్తుతం కొన్ని చోట్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. సర్కిల్‌ను తిరిగి కొత్తగా తీర్చిదిద్దేందుకు అవసరమైన పనులు ప్రారంభిస్తామన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆవరణలో రూ.5 కోట్లతో సుందరమైన పార్కును నిర్మిస్తామన్నారు. రాయల్ సర్కిల్‌లో ఆక్రమణల తొలగింపు తర్వాత చేపట్టిన పునరుద్ధరణ పనులను పరిశీలించారు. కాంగ్రెస్ నాయకుడు జగన్నాథ్ తదితరులున్నారు.